

మలబారు గ్రామదృశ్యము

చిత్రకారుడు : శ్రీ దేవీప్రసాదరాయచౌదరి.

భారతి

సంపుటము | సెప్టెంబరు, 1946 | సంచిక
23 | వ్యయ భాద్రపదము | 9

వైపరీత్యము

= శ్రీ చెఱుకుపల్లి జమదగ్ని శర్మ =

శివశివ ! చాలుచాలు ననజెల్లునె నీ విటు రామ! రామ! మ
చ్ఛ్రవణకుఠారమై హృదయదారకమై నిలువెల్ల చీల్చెడిన్ ;
ప్రవిమలనీలమేఘు మది వచ్చి సుశీతలవారి మాని హృ
త్కువలయమందు నగ్గిపిడుగుల్ నిగుడించె హాతోస్మి రాఘవా!

ఏమేమీ జనకాత్మజాహృదయసర్వేశుండె యీ పంచటల్
రామా! రామ! కృపన్ కృపాణనిహతిన్ ప్రాణమ్ములన్ గొన్మ లే
దా మన్నింపుము, అంతెగాని నను నీదాసున్ దయాహీనతన్
శ్రీమన్మాతృహృదబ్జపీడకవిధిన్ చెందింప కో రాఘవా!

పదునాల్గేండ్లుగ తా నొనర్చిన తపఃపారమ్యమా తేజు క
న్తుదలం జూడక మండుటగ్గిబడి నిర్దోషిత్వము, జాటుకో
గదవే యన్న నొకింతయున్ బదులుపల్కంజూడ కగ్నిన్ శుభా
స్పదమా తీర్థముబోలె జొచ్చి భువి మెచ్చన్ తల్లి రాలేదొకో!

అట్టి పవిత్రశీల నకటా! యెవడో యొక త్రాగుబోతు ప్రా
ల్గిట్టి యెదో వచించెనట! ఈవు తదర్థము పాటిసేసి పో
నెట్టెద వట్టి లోకజననిన్ గననేరను రామరామ! నా
కిట్టె యొసంగు మాజ్ఞ; ఇదియే కడతేర్చెద వాని నీయసిన్.

ప్రజల మనంబు గుర్తెరిగి వర్తిలువాడె నృపాలు డంచు న
క్కజముగ నిర్వచించెదవు కాని మహాప్రభు! ధర్మ మేమగున్?
ప్రజలొకవేళ రేపు రఘురాముడు జారుడటంచు బల్కుచో
నిజమని నీవునుం జని వనీస్థలి నుండెదవా? కొకా రాఘవా?

ఒక దుర్మార్గుడె లోకమైనయెడ నోహో ధర్మ మింకెట్లు! పా
లకు డన్నన్ సమబుద్ధితో గని ప్రజాలాభంబు గాంక్షించి ర
క్షకుడై యిష్ట మనిష్టముం దలప కాజ్ఞాచక్రముం ద్రిప్పి భా
వుకముల్ కూర్పగనౌనుగాక యిటు నోవ్వల్ కూర్పగా నౌనొకో!

రామా! ఏ మిక జూచెద-వా మానిసిరూప మెత్తు నసురుని యసువుల్
జామైన చనకమున్నగ - సేమముగా జముని యిల్లు సేరగవలయున్.

*   *   *   *   *

"నిలు మిక లక్ష్మణా! నిలుము, నేను ధరిత్రికి రాజనౌట త
ప్పులు వెలిబుచ్చు నాప్రజల బొట్టను బెట్టుకొనంగగాదు; కే
వల మిది రామచంద్రనరపాలకు నాజ్ఞ తిరస్కరించెదో
నలుపుదువో యెదోయది విచారణసేసి వచింపు మిచ్చటన్."

*   *   *   *   *

హాతవిధి! ఎంత వచ్చిన దయా రఘురాముని నోటినుండి, నీ
కితరులు కానిపింపరొకొ! ఎందుల కీయ మబాధ తండ్రి! కో
పితమతి వైనచో జనని ప్రేవు వదల్చిననాడె చెచ్చెరన్
హత మొనరింపవేమి? యిపుడైన వధింపుము సంతసించెదన్.

అంతటి భాగ్యమే కలుగునంతటి జాతక మ్ముండెనేని నీ
స్వాంతము నేరికిచ్చితివొ వారె యిటుల్ భవదీయ మానసా
భ్యంతరభావభిన్నపథవర్తనకున్ బలవంతపెట్టి పు
త్తెంతురె లక్ష్మణా! చను మిదేమి వినూతన మొకొ నీయెడన్.

నాడు మహాటవిన్ దితిజనాయక మాయలు చుట్టుముట్టి వెం
టాడెడి వేళ స్వర్ణమృగ మంచు భ్రమించిన తల్లి కోర్కకై
వాడి పృషత్కముల్ గొని జవమ్మున నేగిన రాము గొంతురా
వీడక నిల్చు నిన్ను త్వరపెట్టి తపింపదొ తల్లి లక్ష్మణా!

నీయెడ వెన్నముద్దయగు నీవు మహాత్తరసేవనాపయ
స్తోయధి వాదుకాని రిపుసూదన సోదర యేమి నైజమో
పాయదు జన్మజన్మలకు భ్రాతృవచఃపరిఘట్టనోగ్రతన్
నీ యెద యగ్నిగుండమయి నిల్వక క్రాగి విషమ్ము గ్రక్కుటల్.

ఏమని యేమి లాభ మిక నేగుము, వెన్కకు జూడబోకు, మా
భూమిజమోమునైన గనబోకుము, తోలుము సైంధవంబులన్
సీమను జేరుదాక, అట జేరి రథమ్మును డిగ్గి, యెట్టులో
రాముని మాటలన్ నుడివి, రమ్ము శవాకృతి దాల్చి లక్ష్మణా!



ప్ర భు ని రా క

•

శ్రీ కుమారరాఘవశాస్త్రి

ఏవో వేణువు లంతరాళమున స్పందింపంగ సంప్రాప్తము
గ్ధావేశంబున సంచలించెదను దుగ్ధాంభోధిలో నాట్యలీ
లావిభ్రాంతులు గ్రక్కు మంథరనగేంద్రంబట్లు, తద్గీతికా
భావౌఘం బొక రజ్జువై తిరిగి కవ్వంబట్లు నన్నూచినన్.

వట్టి యశ్రద్ధమనిషినై ప్రభుని రాక-ఎరుగలే కిట గూడిన యిన్నినాళ్ల
కుళ్లు కడుగలేనైతి కన్నీళ్లు గార్చి-మైన, రంగవల్లు లలంకరింప నైతి.

ఆ నవవేణునిక్వాణమునం దొక పిల్పది తీపిపాశమై
నా నవనాడులన్ పసితనంపు హుషారున పొంగులెత్తియున్,
ఛీ, నవయౌవనంపు చలచిత్తము చావదు, వేడికోరికల్
ప్రాణలతాలవిత్రముల వైఖరి చిందులుద్రొక్కెడిన్ గదే!

అది గుడిలో పరాత్పరుని యచ్ఛపుతేజ, మిదే వనాంతష
ట్పదనవరాగమంజుమృదుభావసువాసితపుష్పమంజరీ
హృదయము; దీని ద్రుంచుకొని యీశ్వరపూజకు బోవు నెట్టులో
పదములు రావు, నన్ను నొక పాపినిగా వచియించి రీప్రజల్.

ఏచిన పిచ్చిమోహమున స్వేచ్ఛమెయిన్ జరియించినట్టి నా
యీ చపలాత్మ నేడు వరణీయుని, ఆగతలోకమోహనున్,
నా చిరసుందరున్, ప్రణయసద్మముని పైకొనజాల దేలనో
కో! చెడనట్టివాని చెడగొట్టుట కోపని వేశ్యకైవడిన్.



'రొమాంటిక్' కవిత్వమంటే ఏమిటి?

కొన్ని నిర్వచనాలు

❀

'చతుర్వేది'

"రొమాంటిసిజమ్"అంటే ఏమిటి?

దీనికి సరియైన సమాధానం చెప్పటం కష్టసాధ్యం. అన్ని భాషల్లోనూ ఇటువంటివి కొన్ని మాట లుంటయ్. వీటిని అందరూ విరివిగా వాడుతూ వుంటారు. కాని వీటి స్పష్టమైన అర్థం ఎవరికీ తెలియదు. తెలియకుండా అస్పష్టంగానే వీటిని ఎవరికి తోచినట్లు వారు వాడుతూవుంటారు. కొన్నాళ్ళకి వీటికి రూఢియైన అర్థ మేదో తెలుసుకోటం కష్టమై పోతుంది. చివరికి వీటి అర్థం నిర్ణయించే భారం విమర్శకులమీద పడుతుంది.

మాటకి రూఢియైన అర్థం తెలియకపోవటంవల్లనే "రొమాంటిసిజమ్" అంటే యేమిటో స్పష్టంగా నిర్వచించటం కష్టం. యూరోపులో మధ్యయుగాలనాటి సారస్వతం రొమాన్సుతో నిండివుందని అంతా అంటారు. ఫ్రాన్సులో విప్లవం జరిగినతరువాత యూరోపులో ఒక నూతనచైతన్యం అంతటా వెల్లివిరిసింది. అప్పుడు జర్మనీలోనూ, ఫ్రాన్సులోనూ, ఇంగ్లండులోనూ సృష్టియైన సాహిత్యాన్ని "రొమాంటిక్" సాహిత్యమని అంతా అంటారు. వర్డ్సువర్తు, కోలరిజ్, షెల్లీ, కీట్సు లను అందరూ "రొమాంటిక్ కవులు" అంటున్నారు. వారు రచనలుచేసిన కాలాన్ని "రొమాంటిక్"యుగమని పిలుస్తున్నారు.

కాని అందరూ రొమాన్సు, రొమాంటిక్ అనే మాటలను ఒకే అర్థంతో వాడలేదు. ఒకే మాటను వాడినప్పటికీ ఒక్కొక్కరి మనస్సులో ఒక్కొక్క అర్థం ప్రధానంగా వుంటుంది. అందువల్లనే రొమాంటిసిజమ్ అంటే సమగ్రమైన నిర్వచనం ఎవరూ చేయలేక పోయారు.

సమగ్రమైన నిర్వచనంమాట అటుంచి, అసలు సతృప్తికరంగానైనా ఎవరూ నిర్వచించలేరు. ప్రజ్ఞావంతులైన విమర్శకు లెందరో "రొమాంటిసిజమ్"అంటే యేమిటో నిర్వచించాలని ప్రయత్నించారు. ప్రతిభాశాలులైన సాహిత్యవేత్త లెందరో ప్రయత్నించారు. వీరు తలోకరూ తలోకతీరుగా వ్యాఖ్యానించి నిర్వచించారు. రొమాంటిసిజమ్ అంటే ఏమిటో తెలియాలంటే వీరందరి నిర్వచనాలనూ శ్రద్ధగా పరిశీలించాలి. వీరిలోని ఏఒక్కరి నిర్వచనంలోనూ మనకి రొమాంటిసిజమ్ పూర్తిస్వరూపం గోచరించదు. ఒక్కొక్కరి నిర్వచనంలోనూ ఒక్కొక్క భిన్నమైన ఛాయ మాత్రమే కనబడుతుంది. వీరి నిర్వచనాలన్నీ చదివిన మీదట "రొమాంటిసిజమ్"లోని అస్పష్టమాధుర్యం కొంతవరకైనా స్పష్టమౌతుంది.

"రొమాంటిసిజమ్" అంటే కొంతవరకైనా స్పష్టంగా తెలుసుకోవాలి. అప్పటికిగాని మన భావకవులను రొమాంటిక్ కవులనటంలోని అర్థమూ, మన భావకవిత్వాన్ని రొమాంటిక్ కవిత్వమనటంలోని ఔచిత్యమూ పరిశీలించటానికి వీలుకలుగదు.

మొదటి నిర్వచనం జర్మన్ రచయిత హైనేది. "మధ్యయుగాలనాటి పాటలలోనూ, చిత్రాలలోనూ, శిల్పాలలోనూ అభివ్యక్తమైన కవితాశక్తిని నిద్రనుండి మేల్కొలపటమే రొమాంటిసిజమ్. గ్రీసురోములనాటి కవితాశక్తికి భిన్నమైనటువంటి విశిష్టస్వరూపం మధ్యయుగాలనాటి కవిత్వానికున్నది. ఈ భేదాన్నిబట్టి గ్రీసురోములనాటి కవిత్వాన్ని క్లాసిక్ అనీ, మధ్యయుగాల కవిత్వాన్ని "రొమాంటిక్"అనీ పిలుస్తాము."

ఈ నిర్వచనంలో హైనే "క్లాసిసిజం"కీ, "రొమాంటిసిజమ్"కీ వున్న భేదాన్ని నిరూపించి రొమాంటిసిజమ్‌స్వరూపం ఎటువంటిదో చెపుతున్నాడు. గ్రీసుకవులూ, రోమనుకవులూ క్లుప్తంగానూ, స్పష్టంగానూ రచించటం లక్ష్యంగా పెట్టుకున్నారు. వీరి వర్ణనలూ, పాత్రచిత్రణలూ అన్నీ స్ఫుటంగా చెక్కినట్లుగా వుంటయ్. ఇవి క్లాసిక్ కవుల లక్షణాలు. రొమాంటిక్ కవికి వ్యక్తంచేసుకోవటమే ముఖ్యలక్ష్యం. స్పష్టంగా చెక్కినట్లు చిత్రించాలని ప్రయత్నించడు. నిబంధనలకు లోబడివుండడు. అస్పష్టంగానూ, ధ్వనియుతంగానూ వుండే వర్ణనలతో అతని రచన నిండి వుంటుంది. రొమాంటిక్ కవిరచన ఒక్క మూసలో కరిగిపోసినట్లుగా వుండదు. ఇతని శిల్పం ఒక్కసూత్రంతో కట్టుబడివుండదు. రొమాంటిక్ కవి ఆత్మానుభవానికి ప్రాధాన్య మిస్తాడు. క్లాసిక్ కవి వీలయినంతవరకూ తన ఆత్మని విస్మరించి ఇతరుల అనుభవాలనే రచనలో ప్రతిబింబిస్తాడు.

తరవాత ప్రఖ్యాతజర్మన్‌కవి గతేనిర్వచనం. నిజానికి ఇది నిర్వచనం కాదు, అభిప్రాయంమాత్రమే. గతేకి గ్రీసురోముల కవిత్వంమీద అభిమానం ఎక్కువ. అందువల్లనే "రొమాంటిసిజమ్ అంటే జబ్బు. క్లాసిజం ఆరోగ్యం. ఒకరచన విశిష్టంగా వుండాలంటే అది తప్పనిసరిగా క్లాసికల్‌గా వుండాలి" అని క్లాసికల్ కవిత్వంమీద తనకున్న అభిమానాన్ని, రొమాంటిసిజమ్ మీది అగౌరవాన్ని వెల్లడించుకున్నాడు.

రొమాంటిసిజమ్‌నిగురించి ప్రముఖవిమర్శకుడూ, కవీ —లసెల్స్ ఏబర్‌క్రోంబీ ఇంకోవిధమైనఅభిప్రాయాన్ని వెల్లడిస్తున్నాడు. "రొమాంటిసిజమ్ క్లాసిసిజమ్‌కి శత్రువు కాదు; వాస్తవికతకి విరోధి. బాహ్యప్రపంచంనుంచి దృష్టిని మరలించి కవి అంతరంగంలోని అనుభవాల మీద కేంద్రీకరించటమే రొమాంటిసిజమ్" అంటాడు. రొమాంటిక్ కవి తన అనుభవమే వస్తువుగా కావ్యాన్ని సృష్టిస్తాడు. తన అంతర్యంలోని అనుభూతులను వ్యక్తంచేసుకునేందుకు బాహ్యప్రకృతిమీద ఆధారపడతాడు. పువ్వులను, మబ్బులను, సెలయేళ్లను, తోటలను, కొండలను తన మనోభావాలను చిత్రించే సాధనలుగా ఉపయోగిస్తాడు. వాస్తవజగత్తుకు దూరంగా వుంటాడు. వాస్తవికలోకానికి దూరమైన అతని మనస్సు తనదృష్టిని స్వీయమైన అనుభవాలమీదనే కేంద్రీకరిస్తుంది. ఇది రొమాంటిక్ కవిముఖ్యలక్షణం. వాస్తవికతకి రొమాంటిసిజమ్ విరోధి అన్నమాట సత్యం. కాని రొమాంటిసిజానికీ, క్లాసిసిజానికీ విరోధం లేదనటం అతిశయోక్తి.

పరాసుకవి విక్టర్‌హ్యూగో "రొమాంటిసిజమ్ వింతవిషయాలతోనూ, అల్పమైన విషయాలతోనూ నిండివుంటుంది. రొమాంటిసిజమ్ ఉదాత్తమైన విషయాలను అల్పమైన విషయాలతో కలిపివేస్తుంది. ఈ సమ్మేళనం క్లాసిసిజం ఒప్పుకోదు. కాని జీవితంలో ఇటువంటి కలయిక అంతటా కనిపిస్తుంది"అని రొమాంటిసిజమ్‌లోని మరొక లక్షణాన్ని వెల్లడించాడు. గ్రీసు నాటకాలలో విషాదంతో హాస్యాన్నీ, హాస్యంతో విషాదాన్నీ మేళవించటానికి వీలులేదు. కాని షేక్స్పియరువంటి రొమాంటిక్ నాటకకారుల రచనల్లో జీవితంలోలాగానే సుఖదుఃఖాలు అల్లిబిల్లిగా అల్లుకుపోయి వుంటయ్. విషాదాత్మకమైన నాటకాల్లో హాస్యం తొంగిచూస్తుంది హాస్యరసప్రధానమైన నాటకాల్లో కూడా విషాదచ్ఛాయలు కనబడతవి. "రొమాంటిసిజమ్ అనేది కేవలం రచనాశిల్పానికి సంబంధించింది"అని ఫ్రెంచిఏకాడమీ తీర్మానించింది. దీన్ని ఆధారం చేసుకునే నిశితవిమర్శకుడైన జార్జి సెయింట్స్‌బరీ "క్లాసిసిజం, రొమాంటిసిజమ్ అనేవి శిల్పానికి సంబంధించినవి. వస్తువుకి చెందవు. ఎప్పుడైతే భావాన్ని సూటిగా, స్పష్టంగా, ఉచితమైన మాటలతో వెల్లడిస్తారో, అప్పుడు రచనావిధానం క్లాసికల్ అవుతుంది. ఎప్పుడైతే భావాన్ని పాఠకుల భావనాశక్తికి వదిలేసి, ధ్వని, అలంకారం మొదలైన సహాకరణలవల్ల గ్రహించేట్లు చేస్తారో అప్పుడు రచనావిధానం రొమాంటిక్ అవుతుంది"అని నిర్వచించాడు. రొమాంటిక్ కవి విషయాన్ని సూటిగా చెప్పబూనుకోడు. ధ్వని అతని ముఖ్యసాధనం. భావాన్ని కొంత ధ్వనింపజేసి కొంత చదివేవారి ఊహకు వదిలేస్తాడు. రొమాంటిక్ రచన ధ్వనిప్రధానమైన చిత్రాలతో నిండివుంటుంది. కవి దేనిని చిత్రించినా ఆ చిత్రణ మరొక భావాన్ని సూచించి ధ్వనిస్తుంది. కవి పక్షులపాటలను వర్ణించినా,

పెలయేటిపరుగును వినిపించినా, ఏది చిత్రించినా వేరొక భావాన్ని ఆ వర్ణనలో ధ్వనింపజేస్తాడు. ఇది రొమాంటిక్ రచనాశిల్పంయొక్క ముఖ్యలక్షణం.

"రొమాంటిసిజమ్ సాహిత్యసంబంధమైన అహం భావం" అన్నాడు ఫర్దినాండు బ్రూనెటియర్. అహం భావం అనటంలో అతని ఉద్దేశం వేరు. అహంభావం అనే మాటని చెడ్డ అర్థంలో వాడలేదు. తన అనుభవాల మీదనే కవి కేంద్రీకరిస్తాడు. స్వానుభవమే రొమాంటిక్ కవిత్వానికి ప్రాణం. కవిఅంతరంగంలోని అనుభూతులను, భావాలను ప్రతిబింబించటమే రొమాంటిసిజమ్ ముఖ్యలక్షణం.

సుప్రసిద్ధకళావిమర్శకుడు వాల్టర్ పేటర్ రొమాంటిసిజమ్‌కీ, క్లాసిసిజమ్‌కీ వున్న మరొక ముఖ్యమైన భేదాన్ని ఈ విధంగా ఎత్తిచూపుతున్నాడు. "క్లాసికల్ కళ క్రమబద్ధమైన సౌందర్యాన్ని ఆరాధిస్తుంది. రొమాంటిక్ కళ సౌందర్యంతో అపరిచితమైన వింతస్వభావాన్ని మేళవించి ఆరాధిస్తుంది. రొమాంటిక్ తత్వంయొక్క ముఖ్యలక్షణాలు కుతూహలమూ, సౌందర్యోపాసనా. ఈ రెండులక్షణాల మూలంగానే రొమాంటిక్ కళ మధ్యయుగాల కళకోసం అన్వేషిస్తుంది" క్లాసికల్ కవులు నాగరికజాతుల జీవనంలోని గుణగణాల అందాన్ని వర్ణించి తృప్తిపడ్డారు. అనాగరికులైన ఆదిమనివాసుల జీవనంలోని సాహససౌందర్యాలని ఆరాధించితేకాని రొమాంటిక్ కవుల సౌందర్యపిపాస తీరదు. పరిణతి పొందిన మానవుని మనఃప్రవృత్తులను చిత్రించి క్లాసికల్ కవులు తృప్తిపడతారు. కాని రొమాంటిక్ కవులు స్థిరమైన రూపాన్ని పొందని శిశుప్రవృత్తినికూడా కవితావస్తువుగా గ్రహించారు. అందుకనే రొమాంటిక్ కవులు Strangenessతో కూడిన సౌందర్యాన్ని ఉపాసిస్తా"రన్నాడు పేటర్.

"రొమాంటిసిజమ్ అంటే ఈనాటి కళ. క్లాసిసిజమ్ నిన్నటికళ. ఉత్తమకళ ఎప్పుడూ మొదట "రొమాంటిక్"గా పరిగణింపబడి తరవాత క్లాసికల్ అవుతుంది" అని స్టెండాల్ మరొక అభిప్రాయాన్ని వెల్లడించాడు. కాలాన్ని బట్టి కళాస్వరూపం మారదు. ఎన్ని శతాబ్దాలు గడిచినా షెల్లీకీట్సులు రొమాంటిక్ కవులుగానే పరిగణింపబడతారు. స్టెండాల్ అభిప్రాయం సత్యదూరం. కళాస్వరూపం అది సృష్టియైన క్షణంలోనే నిర్ధారణచేయవచ్చు. అది ఆనాడు రొమాంటిక్‌గా వుండి మర్నాటికి అమాంతంగా క్లాసికల్ అయిపోదు.

"రొమాంటిసిజమ్ అంటే విస్తరణశక్తి" అన్నాడు హోర్ఫర్డు. వర్డ్సువర్తుకవి పేదరైతుల జీవితాలని కవితావస్తువులుగా స్వీకరించి కవిదృష్టిని విస్తరింపజేశాడు. కీట్సు గ్రీకుపురాణగాథలను వస్తువులుగా స్వీకరించి కవిత్వాన్ని మరొకరీతిగా విస్తరింపజేశాడు. నిజంగా రొమాంటిసిజమ్ కవిత్వానికి కొంత క్రొత్త విస్తీర్ణతను చేకూర్చింది.

ఈ ప్రముఖుల నిర్వచనాలను శ్రద్ధగా పరిశీలించినపిమ్మట "రొమాంటిసిజమ్" అంటే ఏమిటో చాలవరకు తెలుసుకోగలిగాం. ఇప్పుడు రొమాంటిసిజమ్ ముఖ్యలక్షణా లివి అని చెప్పగలం:

౧. ఆత్మానుభవపూర్వకమైనది, ఆత్మానుభవాన్నే ప్రాణంగా కలిగినది.

౨. భావాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పక, ధ్వనిచేత, ప్రకృతిచిత్రణలచేత స్ఫురింపజేస్తుంది.

౩. వాస్తవికతకు విరోధి. ఉన్నది ఉన్నట్లుగా ఫోటో దింపదు.

౪. సుఖదుఃఖాలను జీవితంలో వున్నట్లే కలగలిపి వేస్తుంది. ఉచ్చనీచము లనే భేదాన్ని పాటించదు. ఉదాత్తమైన విషయాలతో స్వల్పమైన హాస్యాస్పదమైనవాటిని మేళవించటానికి జంకదు.

౫. నాగరికజీవితాన్నిమాత్రమే చిత్రించదు. అనాగరికమైన ప్రజాజీవనాన్ని ప్రతిబింబిస్తుంది. అపరిచితమైన, అసాధారణమైన ప్రకృతిసౌందర్యాన్ని ఆరాధిస్తుంది.

౬. శిల్పం కేవలం విచ్చలవిడిగా లేకపోయినా ఊహాకి బంధాలువేసే ఏ నిబంధనకీ కట్టుబడదు.

ఈ ప్రధానలక్షణాలను అవగాహనచేసుకుంటే మన భావకవిత్వాన్ని రొమాంటిక్ కవిత్వ మనటమూ, మన రాయప్రోలూ, వేదులా, కృష్ణశాస్త్రిగార్లను రొమాంటిక్ కవు లనటమూ ఎంతవరకు సమంజసమో తేలికగా నిర్ణయించగలుగుతాము.

కాకన్ది

※

= శ్రీ సి. ఆర్. కృష్ణమాచార్యులు =

నెల్లూరుజిల్లా గూడూరుతాలూకాలోని రెడ్డిపాళెము గ్రామమున పండరంగేశ్వర మని యొక పురాతనదేవాలయ మున్నది. ఈ దేవాలయ మందు ప్రదేశమునకు "రెడ్డిపాళెం మజరా పంట్రంగం"అని పేరు. గ్రామము చాల పురాతన మనుటకు సందియము లేదు.

ఈ పండరంగేశ్వరాలయమున చోళరాజులవాటి కొన్ని శిలాశాసనము లున్నవి. వీనిలో నీదేవుడు 'కడలొక్కొండ పవిత్రకోట్టము'లోని కాకన్ది యను మహాపట్టణమున వెలసిన 'పండరంగేశ్వర'యని పేర్కొనబడియున్నాడు. దీనినిబట్టి కాకన్ది యను పట్టణము సముద్ర మాక్రమించిన (కడలొక్కొండ) పవిత్ర కోట్టము ప్రాంత్యములో నున్నట్లు సూచింపబడుచున్నది. కోట్టమంతయు కాకున్నను దానిలో కొంతభాగమైనను సముద్రగర్భమై యుండవలెను. ఇప్పటి శ్రీహరికోటయే పూర్వపు పవిత్రకోట్టమైయుండియుండవచ్చును.

ఈప్రాంత్యమున పురాతనచిహ్నములకై శ్రద్ధతో పరిశీలనచేసినచో పూర్వపు కట్టడములు, దేవాయతనములు మున్నగునవి వెలువడవచ్చును.

కాకన్ది యను పట్టణముయొక్క పేరు చారిత్రిక గ్రంథములలో నెచ్చటను కానరాదు. భారహుత్ స్తూపములోని బౌద్ధశాసనములలోమాత్రము 'కాకన్ది'నుండి వచ్చిన సోమా యను భిక్షుణి యొకతె యొక్క దానము చేసినట్లు చెప్పబడియున్నది. ఈ కాకన్ది మన నెల్లూరుజిల్లాలోని కాకన్దిగానే యుండినోపును. ఏలననగా కాకన్దిపురము మరే యేశాసనములలోను పేర్కొనబడ లేదు. పై యూహ సరియైనచో కాకన్దిపురము క్రీస్తుశకమునకు పూర్వమే వెలసియుండె ననియును, అందు బౌద్ధులు నుండిరనియును రూఢియగుచున్నది.

ఈ ప్రాంత్యమున బౌద్ధమతము తరువాయికాలమునకూడ కొంతవఱకు ఆచరణలో నుండె ననుటకు నిదర్శనము లున్నవి. గూడూరుతాలూకాలోని రట్టముల యను గ్రామమున ప్రసన్నకాలహస్తీశ్వరాలయము చెంత నున్న యొక శిలాశాసనమున బుద్ధదేవునికి వందనము లర్పింపబడియున్నవి. ఈ రట్టముల గ్రామము రెడ్డిపాళెమువలెనే పూర్వసముద్రతీరమున దానికి దక్షిణమున పదిమైళ్లదూరమున నున్నది. ఈ ప్రదేశము నంతటిని ఆర్కియలాజికల్ డిపార్టుమెంటువారు శ్రద్ధతో పరిశోధనచేయుట చాల అవసరము.

పైని చెప్పబడిన పండరంగేశ్వరనామోత్పత్తి కొంత విమర్శనీయము. తూర్పుచాళుక్యరాజులలో సుప్రసిద్ధుడైన గుణగవిజయాదిత్యునికి పండరంగుడను నొక్క గొప్ప సేనాని యుండెను. ఇతని శాసనములు నెల్లూరుజిల్లా కందుకూరుప్రాంత్యమున దొరకియున్నవి. గుణగవిజయాదిత్యుడు నెల్లూరుపురమును దహనముచేసినట్లు అతని శాసనములలో కొన్నిటియందు చెప్పబడియున్నది. ఈ విజయమున పండరంగుడును పాల్గొనియుండవలెను. బహుశః పండరంగుడు గూడూరుప్రాంత్యమువఱకును దండయాత్ర సలిపి యీ పురాతనపట్టణమైన కాకన్దిలో తన పేర నొక శివాలయమును స్థాపించియుండవచ్చును. ఆ దేవుని పేరును బట్టి యీ గ్రామమునకు 'పంట్రంగం' అను నామము సంక్రమించియుండవలెను. పండరంగమే పంట్రంగం అయినది.

నన్నయభట్టు రాజనరేంద్ర స్థాపనాచార్యుఁడు

= శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి =

నన్నయభట్టారకునిగుఱించియు, వాని భారతాంధ్రీకరణమునుగూర్చియు నాంధ్రదేశమునందు పెక్కు కథలు పారంపర్యముగా వచ్చుచున్నవి.

ఈతఁడు భారతము నాంధ్రీకరించుచుండఁగా అథర్వణాచార్యుఁ డను పండితుఁ డొకఁడు భారత మెల్ల నాంధ్రీకరించి రాజనరేంద్రునికడకు తెచ్చె ననియు, నన్నయభట్టు మాత్సర్యముచేత నాగ్రంథమును తగులఁబెట్టించెననియు ప్రతీతి. అట్లే కవిజీవితకారులు భారతాంధ్రీకరణము అసంపూర్తిగా నిలిచిపోవుట కొక కారణముగా మఱియొక కథను వ్రాసియున్నారు: "నన్నయభట్టారకుఁడు భారతమును దెనిఁగించుచు ఆరణ్యపర్వమునం దుండఁగా వేములవాడ భీమకవి కోపంబున 'నన్నయభట్టింకను నరణ్యంబునసే రోదనంబు చేయుచున్నాఁడా! ఇతఁ డెపుడును నట్లే యుండుఁగాక' అని శాప మిచ్చెననియు, దానిచే నాతని కప్పటి నుండియు మతిభ్రమణము గల్గెననియు నందురు" అని వ్రాసి ఇట్లు విమర్శించినారు. "కారణము లేకయే భీమన యాతనికి శాపంబిచ్చెననుట సహేతుకంబుగ నున్నది కాదు. గ్రంథంబులు మఱికొన్నిటింబట్టి చూడఁగా వీరలకు విరోధ మున్నట్లుగఁ గానరాదుగాని స్నేహిత మున్నట్లుగమాత్రము గానవచ్చుచున్నది." అని ఈకథను త్రోసిపుచ్చిరి. (కవి జీవి. పు. ౫౪)

పై రెండుకథలును విశ్వాసార్హములు కాక పోవుటయేకాక నన్నయ మూఁడవ పర్వమును అసంపూర్ణముగా వదలెననుటయు విశ్వాసార్హముగాఁ గన్పట్టుటలేదు. తిక్కనభారతాంధ్రీకరణమునాఁటికి నన్నయ మూఁడు పర్వములను సమగ్రముగా నుండినట్లే తెలియుచున్నది.

"ఆదరణీయసారవివి
ధార్థగతిస్ఫురణంబు గల్గి య
ష్టాదశపర్వనిర్వహణ
సంభృతిమై పెనుపొందియుండ నం
దాదిదొడంగి మూఁడు కృతు
లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహి
తాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్."

(తిక్కన ఆం. భార. విరాట. ౧-౬)

కావున నన్నయభట్టారకుఁడు ఆంధ్రమహాభారతమునందు మూఁడు పర్వములే రచించుటకు నాఁడు అవకాశ మేర్పడినదనియు, వాఁడు సమగ్రముగా 'నిర్వహింప' లేకపోవుటకు కారణము కవియొక్క వార్ధక్యమో, మరణమో, లేక రాజుయొక్క మరణమో, రాజ్యవిప్లవమో అయి యుండవచ్చు ననియు తలంపవలసియున్నది. నన్నయభట్టు తానే 'ఆంధ్రకవిత్వవిశారదుండై' యుండ, తన సహాధ్యాయి 'అభిమతంబుగ తోడయి నిర్వహించుట' కేల యొప్పుకొనెనో, ఈ నారాయణభట్టుచరిత్రమేమో, అతనికి రాజనరేంద్రుని యాస్థానమున ఎట్టి స్థానమో — ఈవిషయము లన్నియు నన్నయభట్ట నారాయణభట్ట రాజరాజనరేంద్రుల చరిత్రములు పరిశోధించిన విశదమగును. ఆంధ్రకర్నాటద్రావిడశాసనముల మూలమున నాఁటి రాజకీయచరిత్ర కొంత ఈక్రిందివిధమున తెలియవచ్చుచున్నది.

శక్తివర్మ విమలాదిత్యులు

రాజరాజనరేంద్రుఁడు 'విమలాదిత్యాగ్రతనూజుఁడు' (భారత ఆది. ౧ ఆశ్వా. ౨౬౩). విమలాదిత్యుఁడును, అతని యన్నయైన శక్తివర్మయును ద్రవిడాధీశులైన చోళరాజులతో సంబంధబాంధవ్యముల నంది నిరంతరము వారి సాయమును పొందుచుండిరి. ఇందుల కారణము నాఁటి రాజకీయకల్లోలములే. వాని నిచ్చట పరికించుట యుక్తము.

క్రీ. శ. ౯౫౫ వఱకును చోళరాజ్యమును పరాంతకుఁ డను రాజు పరిపాలించుచుండెను. ఈతని కాలమున చోళుల బలము కొంత సన్నగిల్లియుండినది. కర్నాటకదేశమును పరిపాలించుచుండిన రాష్ట్రకూట చక్రవర్తులలో ప్రసిద్ధుఁడైన ముమ్మడి కృష్ణరాజు చోళులమీఁదికి దండెత్తివచ్చి తొండైమండలమును సమగ్రముగా తన పరిపాలనలోనికి తెచ్చుకొనెను. అనఁగా నతని రాజ్యము నేఁటి మదరాసు చెంగల్పట్టు జిల్లాలవఱకు వ్యాపించియుండెను (Altekar 'Rashtra kutas'). పరాంతకచోళుని కాలమున ఈభాగమును చోళులు మరల స్వాధీనముచేసికొనలేకపోయిరి. కర్నాటకదేశమునందు ముమ్మడికృష్ణుని యనంతరము క్రీ. శ. ౯౭౨ ప్రాంతమున కొట్టిగుఁడును, వానివెనుక క్రీ. శ. ౯౭౩ లో కక్కలుఁడును చక్రవర్తులైనను వారు చాల బలహీనులైనందున తొంటి పశ్చిమచాళుక్యవంశీయుఁడైన ఇమ్మడి తైలపుఁడు క్రీ. శ. ౯౭౩ లో యుద్ధమున కక్కలుని జయించి కర్నాటకచక్రవర్తి యాయెను.

సరిగా నీకాలమునకు ఆంధ్రదేశమున విప్లవ మొకటి సంభవించెను. జటాచోడభీముఁ డను తెనుఁగు చోడుఁడు వేంగీప్రభువైన దానార్ణవుని యుద్ధరంగమున వధించి వేంగీసామ్రాజ్యమును క్రీ. శ. ౯౭౩ సం. లోనే ఆక్రమించెను. దానార్ణవుని కుమారులు శక్తివర్మవిమలాదిత్యులు దేశమును త్యజించి పాఱిపోయిరి ('Jatachoda Bhima' by Dr. N. Venkataramanayya. Indian History Congress, 1939 p. 605).

తత్క్షణమే ఈ యాంధ్రరాజసోదరులకు శరణమెవ్వఁ డొసఁగెనో తెలియరాదు. క్రీ. శ. ౯౮౫ నాఁటికి రాజరాజచోళుఁడు ద్రవిడాధీశుఁ డాయెను (Cholas I. p 198). ఈతఁడు రాజ్యమునకు వచ్చిన తత్క్షణమే చోళరాజ్యమును విస్తరించుటకు పూనుకొనెను. కర్నాటకు లపహరించిన రాజ్యభాగములను మరల సంపాదించుటకు పూనుకొనెను. మహాబలవంతుఁడును, అపార రాజ్యకాంక్ష గలవాఁడు నగుటచే సింహాసనమునకు వచ్చిన యచిరకాలముననే చాలవరకు ఉత్తమచోళుని స్వాధీనమైన తుండీరదేశమును మరల స్వాధీనము చేసికొనెను.

ఈకాలమున నాంధ్రసోదరులు చోళరాజు నాశ్రయించినట్లు అనంతరచరిత్రచే తెలియుచున్నది. వీరు ద్రావిడదేశ మేల ప్రవేశింపవలసివచ్చినదో, ద్రవిడుల యాశ్రయ మేల యపేక్షింపవలసివచ్చినదో అనంతర చరిత్ర చూచినఁగాని బోధపడదు. కర్నాటకులు చోళులకు నిరంతరశత్రువులు. కర్నాటకతైలపునికిని, తెనుఁగు చోళభీమునికి సఖ్య ముండినదో లేదో తెలియదుగాని పరాంతకుని మరణానంతరవిజయములచేత బహుశః వారు మిత్రులేమో యని తలంచుట కవకాశము కలుగుచున్నది. పైఁగా తైలపుఁడును, భీముఁడును తమ క్రొత్తరాజ్యములలో నప్పుడే కుదురుకొనుచుండిరి. అట్టి సందర్భమున నాంధ్రులకు అఱవదేశమే గతి యాయెను.

రాజరాజచోళుఁడు వేంగిని జయించుటకు ముందుగానే కర్నాటకదేశముపై దండెత్తి తైలపునితో యుద్ధమొనరించుటచేతను, తర్వాత రాజకీయరంగమున వేంగివిజయమున చోళులు ప్రవేశించినపుడెల్ల పశ్చిమచాళుక్యులు తాము నాంధ్రదావిడకర్నాటకముల నడిమియెల్లలలో పోరాడుచుండుటచేతను ఈకాలమున చోళులను, శక్తివర్మవిమలాదిత్యులను కర్నాటాంధ్రజటాచోడసమ్మేళనమునకు జంకుచుండిరని శంకింపవలసియున్నది. ఏది యెట్లున్నను పట్టాభిషేకమైన ఆఱు ఏడు సంవత్సరములలోపల గంగపాడి (అనఁగా నేఁటి మైసూరురాజ్యము), నొళంబపాడి (అనఁగా నేఁటి అనంతపురము, బళ్లారి, కడపూరు జిల్లాలు) రాజ్యములను జయించుటకు రాజరాజు దండెత్తెను (Cholas, I p 207).

క్రీ. శ. ౯౯౨ సం.రు ప్రాంతమునందు అనంతపురము జిల్లాలోని నల్లగొండతాలూకాకు చేరిన రొద్దము గ్రామముకడ జరిగిన మహాసంగ్రామమున చాళుక్యతైలపుఁడు రాజరాజును ఓడించి నూటయేఁబది యేనుఁగులను యుద్ధక్షేత్రమునుండి హరించెను (S. I. I. IX-I. 77). ఇందువలన ఆచోట చోళుల పురోగమనము భంగమొందినను నొలంబపాడిలోని దక్షిణభాగముమాత్రము వారి స్వాధీనమందే నిలిచెను. ఇందుచే వారికి వేంగి మీఁద దాడిచేయుట కనుకూలములు కలిగినట్లున్నది. ఏలయన కర్ణాటకులు వేంగివారికి సాయపడవలయుచేని వారు బళ్లారిమార్గముగా వచ్చి కృష్ణ కుత్తరముగా దాఁటి కొండవీటి సీమమార్గమున పోవలయును. ఇప్పుడు ఆ మధ్యభాగము చోళుల స్వాధీనమాయెను.

ఈవిధముగా సమకూర్చుకొని చోళులును, శక్తివర్మవిమలాదిత్యులును జటాచోడభీముని ఎదుర్కొని క్రీ. శ. ౯౯౯-౧౦౦౦ ప్రాంతమున కంచికి సమీపమున జరిగిన యొక యుద్ధమందు అతనిని చంపిరి. అనంతరము చోళబలములతో శక్తివర్మ వేంగీసామ్రాజ్యమునకు పట్టాభిషిక్తుఁడాయెను (Cholas I. P 217, 218, 219). బహుశః ఈ కాలమందే విమలాదిత్యుఁడు చోళాధిపుఁడైన రాజరాజుకుమార్తె కుందాదేవిని వివాహమాడి యుండును.

ఏది ఎట్లున్నను ఆంధ్రరాజకుటుంబమునకు అరవ పొత్తు తప్పదాయెను. ఇందువలన దాదాపు డెబ్బది సంవత్సరములు ఆంధ్రభూమి ద్రావిడకర్ణాటసైన్యముల సంకుల సమరములకు రంగభూమి యాయెను. ఆంధ్రభర్త పలుమార్లు తన స్థానమును వదలి దేశాంతరగతుఁడు కావలసివచ్చెను. కాని తుదకు ఆంధ్రద్రావిడములు రెండును చోళరాజదౌహిత్రుఁడైన యాంధ్రరాజన్య పాలనకు వచ్చుటచే నాంధ్రదేశమునకు శాంతి చేకూరినది.

విమలాదిత్యశక్తివర్మల కష్టపరంపరలు క్రీ. శ. ౧౦౦౦ లోని ఈ విజయముతో నూతనపరిణామము నందినవి. శక్తివర్మవిమలాదిత్యులు వేంగీసామ్రాజ్యమును వైకొన్నవెంటనే పశ్చిమచాళుక్యులు చోళులతో డీకొనిరి. క్రీ. శ. ౧౦౦౩ సంవత్సరపు చోళశాసనములు ఈ విషయమును ప్రస్తావించుచున్నవి (833 of 1927. Cholas I, P 210). క్రీ. శ. ౯౯౭ సం. నాఁటికి తైలపుఁడు గతించి సత్యాశ్రయుఁడు, అతని కుమారుఁడు కర్ణాటకచక్రవర్తి యాయెను. ఈతనికిని, చోళులకును జరిగిన సంగ్రామము గంగపాడినొళంబపాడిరాజ్యముల కొఱకు కనుకో కాదోగాని క్రీ. శ. ౧౦౦౬ లో నీతఁడు వేంగిపై దండెత్తివచ్చెను. దన్నాడయన్మదల యను ప్రదేశములలోని కోటలను ఈతని సేనాధిపతియైన బయల నంబి యనువాఁడు తగులఁబెట్టి కొన్ని దినములు చేబ్రోలునందు విడిసియుండెను (S. I. I. Vol VI- 102). ఈ దండయాత్ర వేంగిని స్వాధీనపఱచుకొనుట కన్న నక్కాలమున కర్ణాటకదేశమును ప్రవేశించిన చోళులను పాఱద్రోలుటకే యగును. ఏలన ౧౦౦౩ సం. మునను, ఆ తర్వాతను చోళులు చాళుక్యరాజ్యమున ప్రవేశించి బిజాపురజిల్లాలోని దోనూరువఱకును వ్యాపించి దేశమును కొల్లఁబెట్టిరి (E. I. XVI, P 74).

వేంగీరాజ్యమును శక్తివర్మ క్రీ. శ. ౧౦౧౧ వఱకు పరిపాలించెను. అతఁడు గతించినవెనుక వానిని సోదరుఁడు విమలాదిత్యుఁడు రాజాయెను. కాని ఏ కారణముచేతనో వెంటనే పట్టాభిషిక్తుఁడుగాక కొంత కాలము చోళదేశమున మామగారి యింట తిరువయ్యారులోనే యుండెను. ఈతని శాసన మొకటి క్రీ. శ. ౧౦౧౭ లో తిరువయ్యారులో కలదు (215 of 1894). ఈ కాలమున కర్ణాటకులు వేంగీరాజ్యము నాక్రమించియుండి రనుటకు ప్రబలనిదర్శనములు గలవు.

౧౦౧౫ లో రాజేంద్రచోళుఁడు వేంగిమీఁదుగా కర్ణాటకముపై దండెత్తివచ్చి జయసింహుని జయించి మరల వేంగియందు విమలాదిత్యుని ప్రతిష్ఠించెను.

విమలాదిత్యుఁడు ౧౦౧౮ వఱకును వేంగిని పాలించి చనిపోయెను.

రాజరాజనరేంద్రుని యవస్థలు

క్రీ. శ. ౧౦౧౮ తర్వాత, మరల వేంగీరాజ్యమున కలతలు ప్రారంభమైనవి. విమలాదిత్యుని మరణానంతరము తక్షణమే రాజరాజనరేంద్రుఁడు రాజ్యమునకు రాలేదు. ఆతని (సవతి)తమ్ముఁడైన విష్ణువర్ధనవిజయా

దిత్యుడు పశ్చిమచాళుక్యుల సాయమున అన్నను తఱిమి వైచి వేంగిసామ్రాజ్యమును నపహరించెను. రాజరాజనరేంద్రుడు చేయునది లేక చోళదేశమునకు మామకడకు పాఱిపోయెను (భారతి, వ్యభాను-వైశాఖ పు ౮౩౭). చోళదేశమున రాజరాజు గతించి అతని కుమారుడు రాజేంద్రచోళుడు చక్రవర్తి యాయెను. ఈతడును తండ్రివలెనే పరాక్రమశాలి. క్రీ. శ. ౧౦౨౧ ప్రాంతమున రెండుసైన్యములను - ఒకటి కర్నాటకమునకును, మఱియొకటి వేంగికిని పంపి చాళుక్యజయసింహుని ఓడించి వేంగిని మరల గ్రహించి, తాను కొంతకాలము వేంగియందుండి, స్వయముగా రాజరాజనరేంద్రునికి పట్టాభిషేకమొనరించి ద్రవిడదేశమునకు మరలిపోయెను (రాజేంద్రచోళచక్రవర్తి-వేంగి. భారతి. వ్యభాను - ఆశ్వయుజ). రాజరాజనరేంద్రుడు క్రీ. శ. ౧౦౩౦ వఱకును నిరాఘాటముగా రాజ్యమును పరిపాలించుచుండెను.

మరల చిక్కులు ప్రారంభమైనవి. క్రీ. శ. ౧౦౩౧ లో విజయాదిత్యుడు పశ్చిమచాళుక్యుల సాయము నందికొని, మరల అన్నను పాఱద్రోలి వేంగిసామ్రాజ్యమునకు మహావైభవమున పట్టాభిషేకము చేయించుకొనెను (J. A. H. R. S. II. P 277). రాజనరేంద్రుడు ఇంకొకసారి చోళదేశమునకు పోయి తిరుగ అటువైన్యమును చేకూర్చుకొని క్రీ. శ. ౧౦౩౫ ప్రాంతమున తిరుగ రాజ్యమును సంపాదించుకొనెను. ఈ కాలమున నీతనికి పశ్చిమచాళుక్యులు ప్రబలవిరోధులై ప్రతిఘటించిరి. ఈతని సైన్యము వచ్చుసరికి వేంగియందు చాళుక్యుల బల ముండినట్లును వారప్పటికే బెజవాడకోటను సాధించియుండినట్లును నిదర్శనములు గలవు. పశ్చిమచాళుక్యుల సైన్యములను ప్రతిఘటించిన ద్రవిడసేనాపతి బ్రాహ్మణుడును, అతని క్రింది సేనాపతులును కలిదిండి యను గ్రామమున జరిగిన రణరంగమున మడిసిరి. వీరికొఱకై రాజరాజనరేంద్రుడు శివాలయములను నిర్మించి వానికై భూదానములు గావించెను. (కలిదిండిశాసనమున తారీఖు పోయినది. అది బహుశః ౧౦౩౫, లేక ౧౦౩౬ ప్రాంతమేగాని ౧౦౪౫ కాజాలదని తోచుచున్నది.)

ఈ విజయానంతరము కొంతకాలము మరల శాంతి చేకూరెనుగాని యది కొంతకాలమే. క్రీ. శ ౧౦౪౨ ప్రాంతమున పశ్చిమచాళుక్యచక్రవర్తి జయసింహుడు మరణించెను. వాని కుమారుడు త్రైలోక్యమల్లాహవమల్ల బిరుదాంకితుడు మహాపరాక్రమశాలి మొదటి సోమేశ్వరుడు రాజ్యాధిరోహణ మొనరించెను. ఈతడు క్రీ. శ. ౧౦౪౪ కు ముందే వేంగిపై దండెత్తివచ్చి, వేంగిని జయించి, తన సేనానాయకుడైన కోధవరసు అనువానికి 'వేంగీపురవరేశ్వరుడ'ను బిరుదును, 'యువరాజ'లాంఛనములను ఒసంగి సమ్మానించెను (Local Records, Vol 25, P 90). తత్క్షణమే రాజేంద్రచోళుని కొమారుడైన రాజాధిరాజు దండువెడలి వేంగిదేశమందలి దన్నాడ యను ప్రదేశమున చాళుక్యుల బలములను ఓడించెను. ఈ దన్నాడ యనునది కృష్ణకు దక్షిణతీరమునందలి దన్నాడ; చరిత్రప్రసిద్ధమైన ధాన్యవాటి, దన్నాలకోట. కడపజిల్లా జమ్మలమడుగుతాలూకాలో నొక దన్నాడ కలదుగాని ఇది అది కాదనుటకు, ఎప్పుడు చోళచాళుక్యయుద్ధమేర్పడినను ఇరుపురకును ధాన్యవాటికడ పోరుపొసగుటయే నిదర్శనము. ఈ యుద్ధమునందు చాళుక్యుల దండనాయకులు గండపయ్య గంగాధరు లనువారు రంగమున మడిసిరి. విక్కి, విజయాదిత్యుడు, సంగమయ్య అనువారు పాఱిపోయిరి. ఈ విక్కి యనువాడు సోమేశ్వరుడు రెండవకుమారుడైన విక్రమాదిత్యుడని చరిత్రకారుల యభిప్రాయము. విజయాదిత్యుడు రాజనరేంద్రుని సోదరుడు విష్ణువర్ధనవిజయాదిత్యుడేగాని యన్యుడు కానేరడు. సంగమయ్య చాళుక్యదండనాయకులలో ప్రసిద్ధుడు. ఆ వెనుక చోళుల సైన్యములు చాళుక్యులను వెన్నాడి కొల్లిపాకనగరమువఱకును వచ్చి దానిని తగులబెట్టిరని చోళశాసనములు నుడువుచున్నవి (S. I. I. IV. 329).

కాని ఈ యుద్ధమునందు చోళుల కెంతమాత్రమును విజయము కలుగలేదనుటకు ప్రబలనిదర్శనము వేంగి వారి స్వాధీనము కాకపోవుటయే. ఏలయన, దన్నాడకడనుండి వారు కృష్ణను దాటి వేంగీనగరమునకు పోలేక పశ్చిమమునకు దారితీసిరి. బహుశః వారి యుద్దే

తము కొల్లిపాకకడనుండి అటు కృష్ణకు ఉత్తరతీరము మీఁదుగా నడిచి వేంగిని ప్రవేశింపవలయునని కావలయు. కాని కొల్లిపాకకడ్డసైతము వీరిని పైకిపోనీయక చాళుక్యదండనాయకుఁ డొకఁడు అడ్డుపడి ఆ నగరమును కాపాడి వారి పురోగమనమును నిరోధించెను. సింగణదేవర నమనతఁడు, బహుళః సింధువంశజుఁడు, 'కొల్లిపాకెయకావం, దక్షిణదిశాకవాటం' అను బిరుదులను ౧౦౪౫ క్రీ. శ. లో వహించియుండుటచే నీ విషయము తెలియుచున్నది. (E. C. VII S K 328.)

ఈదండయాత్ర యీవిధముగా నిష్ఫలమైనంతట క్రీ. శ. ౧౦౪౬ ప్రాంతమున మరల చోళులు దండెత్తి వచ్చిరి. మరల మునుపటివలెనే దన్నాడకడ యుద్ధమైనది. "గండర్ దివకరన్, నారణన్, గణపతి, మదుసూదనన్" అనువారిని తామెదిరించి ఓడించి తర్వాత కంపిలినగరము ప్రవేశించి అచ్చట రాజభవనమును తగులఁబెట్టినట్లు చోళులు చెప్పుకొనియున్నారు (S. I. I. V. 978). కాని ఎచ్చటను తాము వేంగిని ప్రవేశించినట్లు చెప్పుకొనలేదుకావున వేంగి వీరికి స్వాధీనము కాలేదని తెలియుచున్నది; పైఁగా వేంగిని ప్రవేశించుట కవకాశము సైతముఁ నేర్పడలేదని స్పష్టపడుచున్నది. పై నుదాహరింపఁబడిన గండర్ దివకరన్ అనునాతఁడు చాళుక్య దండనాయకుఁడైన గండరాదిత్యుఁడు. ఈతఁడు ౧౦౪౬ క్రీ. శ. లో సిందవాడినాడును పరిపాలించుచుండెను. మహామండలేశ్వరుఁడు. 'మండలంగావ, నాళిం మున్నిడెవ' యను బిరుదము గీకని కుండుటచే నీతఁడు ఆ మండలమును కాపాడుటకై చోళుల నెదిర్చినట్లు స్పష్టము (S. I. I. IX-I. 105). నారణన్ అనునతఁడు బ్రాహ్మణమంత్రి, మహాప్రచండదండనాయకుఁడు నారాయణయ్య యనువాఁతడు. గణపతి యనునాతఁడు గణపతి యనునాతఁడు గావలయు. మదుసూదనన్ అనునాతఁడు మఱియొక బ్రాహ్మణదండనాయకుఁడు, తర్వాత మహామంత్రియైనవాఁడు, వాణసవంశస్థుఁడు, పూర్వము జయసింహచక్రవర్తిని కాపాడిన కాళిదాస మంత్రికుమారుఁడు.

ఈ దండయాత్రచే తమ ప్రయత్నము లేమాత్రమును ఫలింపకపోఁగా చోళులు ఆ మఱుసంవత్సరము తుంగభద్రను దాఁటి పూండూరు ప్రవేశించిరి. పేరారను నదీతీరమున చాళుక్యులకును, చోళులకును గొప్ప సంగ్రామము జరిగెను. పలువురు చాళుక్యదండనాయకులు చెఱఁగొనిపోఁబడిరనియు, పూండూరునగరమును పాడుఁబెట్టి 'మన్నెందిబ్బె'అను నగరమును నాశమొనర్చి, అచ్చట జయస్తంభమును నాటినట్లు చోళులు చెప్పుకొనియున్నారు (6 of 1890; S. I. I. IV 329). ఈ పూండూరనునది హైదరాబాదు రాజ్యములోని మహబూబునగరుజిల్లాలో కృష్ణానదీతీరమున నున్నది. ఈనగరమును పుండ్రపురమని సంస్కృతమున వ్యవహరించుచుండిరని ఆఱవ చాళుక్యవిక్రమాదిత్యుని ౧౨-వ సంవత్సరపు(ప్రభవ)శాసనముచే తెలియుచున్నది. ఒకానొక మహామండలేశ్వరుఁడు హల్లకరసు అనునాతఁడు పూండూరులో భీమసముద్ర మను చెఱువుక్రింద ఒక జైనబసదికి భూదానము చేయుచు ఆయూరిని పూండూరనియు, పుండ్రపురమనియు పేర్కొనియున్నాఁడు (తెలింగానాశాసనములు, చాళుక్య. ౨౮). మన్నెందిబ్బ యనునది మాన్యఖేటనగరముగాక మరి యేదైనను సమీపప్రదేశము కావలయును.

కాని చోళు లేమి చెప్పుకొన్నను వేంగి కర్ణాటకుల స్వాధీనముతప్పలేదు; చోళుల స్వాధీనము కాలేదు. పైఁగా పశ్చిమచాళుక్యుల పట్టు గట్టిపడుచుండెను. చోళులను జయించినందుచేతనో, లేక వేంగిని శత్రువులకు లోఁజిక్కనీయక కాపాడినందుచేతనో తెలియదుగాని చాళుక్యసోమేశ్వరుని పెద్దకుమారుఁడు రెండవ సోమేశ్వరుఁడు ఈకాలమునకు సరిగా వేంగీపురవరేశ్వరుఁడని శాసనములలో వ్యవహరింపఁబడియున్నాఁడు (B. K. I-I. 84. క్రీ. శ. ౧౦౪౯). వేంగిని మరల సంపాదించి రాజనరేంద్రుని పునస్థాపితునిం జేయుటకు చోళులు చేసిన ఈ మూఁడవ ప్రయత్నము ఈవిధముగా భంగమైనది. పైఁగా చోళుల బలము క్రమముగా తగ్గుట కారంభమైనది. చాళుక్య చక్రవర్తి సోమేశ్వరుని కుమారులును, సామంతులును, మంత్రులును, దండనాయకులును మహాబలవంతు లుండిరి. సోమేశ్వరుఁడు అటువైపు కొంకణమాళవదాహళములను జయించి, ఇటువైపు వేంగీరాజ్యముమీఁద పట్టు

వదలక యుండెను. రాజరాజనరేంద్రునకును, అతని అనుయాయులకును చోళదేశమునందలి తిరువయ్యారు నగరమే గతిగా నుండెను. క్రీ. శ. ౧౦౫౦లో నీతఁడు తిరువయ్యారులోని శివాలయమునకు మూఁడువందల రాజరాజమాడలను దానమిచ్చి శాసనము వ్రాయించి యున్నాఁడు (S I. I. V 520). అహా! ఆంధ్ర భాషకు తొలిపోషకుఁ డని ప్రసిద్ధిచెందిన మహారాజెన్ని ఇడుముల ననుభవించెనో గదా! నేఁడు ద్రావిడుల పొత్తు మన కింత దుస్సహముగా నుండఁగా నాఁడు ఆమహారాజు ద్రవిడదేశమున నుండి ఎంత చింతించెనో. తల్లి అలవరాజుకొమార్తె; భార్యయు అలవతయే. ఎందఱు అయ్యలు, పిల్లలు, పెండలియార్లు కృష్ణాగోదావరీతీరముల నాక్రమించిరో గదా. పోనిండు, రాజనరేంద్రునికి మరల రాజ్యము చేకూరిన చాలును.

మరల చోళులు క్రీ. శ. ౧౦౫౧-రాజాధిరాజుయొక్క రాజ్యసంవత్సరములు ౩౩లో చాళుక్యుల మీఁదికి గొప్ప దండయాత్రను సాగించిరి. (S. I. I. VII 1048, 1049; E. C. IX Dr. 76.) రాజాధిరాజు మరల దన్నాడకడకు వచ్చి, పరణి యను కొల్లను సంకిలమంది, రట్టపాడిమీఁదికి నడచి పూండూరుకడ 'నిడువాడితెలుంగ విచ్చయ్యన్' అనునతనిని జయించి అతని తల్లిదండ్రులను చెఱఁగొని, ఆహవమల్లుని వేగులను అవమానపఱచి తఱిమి, శిరుతురై, పెరుందురై, దైవభీమకాశి యను నదులను దాఁటి, ఏతగిరిలో విజయస్తంభము నాటి తనకు శరణన్న రాజులతో చెండాడి, నొళంబన్, కాళిదాసన్, చాముండన్, కొమ్మయ్యన్, విల్లవరాయన్ అనువారు కయ్యమీయఁగా జయించి, ఉత్పలగూర్జరుని వంశీయుఁడు తన సాయ మపేక్షింపఁగా నభయమిచ్చి, పూర్వము తైలపుఁడు ఉత్పలుని జయించి ఆతని కిరీటము నపహరించి తన యుద్ధభేరికి కట్టికొంచినదానిని మరల ఉత్పలుని మనుమని కిచ్చి రట్టపాడిసప్తార్ధలక్షమును జయించెనని శాసనవిషయము.

ఇం దెంతమాత్రము నిజమో తెలియదు. కాని వేంగిమాత్రము స్వాధీనము కాలేదు. రాజరాజనరేంద్రునకు ఈ మాఱు ద్రవిడబలమునందు నమ్మకము సడలిపోయెను. ఇఁకను అలవవారు కర్ణాటకులను జయింపలేరు. తన తమ్ముఁడు తెనుఁగురాజు కాకతప్పదు. ఈ మాఱు యుద్ధమునకన్న నరేంద్రునకు నీతియే ఆశ్రయణీయమైనది. ఇట్టి విషమపరిస్థితులలో రాజునకు 'కులబ్రాహ్మణుఁ'డైన నన్నయభట్టే సాయముగావించినట్లు కనఁబడుచున్నది.

నన్నయ నీతి

నన్నయభట్టారకుఁడు రాజరాజనరేంద్రునకు 'కులబ్రాహ్మణుఁడు, అనురక్తుఁడు'. కాని 'అవిరళజపహోమతత్పరుఁ'డనుటచే రాజకీయములతో దానికి ప్రసక్తి లేదని తలంపరాదు; ఏలయన 'లోకజ్ఞుఁ'డనని చెప్పుకొనుచున్నాఁడు. 'సత్ప్రతిభాభియోగ్యుఁడును నిత్యసత్యవచనుఁడు' ననుటచే మరల తన రాజునకు రాజ్యము చేకూర్చు పనికి పూనుకొనెను. నాఁటి కింకను మహాకవి 'భారతసంహితారచనబంధురుఁడు' కాలేదు. రాజే నిలకడలేక దేశత్యాగిగా తిరుగుచుండ కవికి-అందును 'అనురక్తు'నికి గ్రంథము వ్రాయునంతటి ఓపికయు, వ్యవధియు నెట్లు కలుగును?

ఆ కాలమున కర్ణాటకదేశమునందు వాణసవంశస్థులైన నియోగిబ్రాహ్మణులు గొప్ప పదవులయందుండిరి. వాణసవంశస్థుఁడైన మధుసూదనయ్య "కుంతలరాజ్యలక్ష్మీలతావసంతుఁడు, దుర్మంత్రిమంత్రనిరతరిపునృపాలలక్ష్మీసమాకర్షణైకమంత్రము, సకలరాజ్యకంటకోత్పాటనప్రచండదోర్దండుఁడు,......... చాళుక్యరాజ్యభారధౌరేయుఁడు, సార్వభౌమరాజనియోగరాజధ్యక్షుఁడు, చాళుక్యచక్రేశ్వరప్రసాదాసాదితయువరాజపదవీవిరాజితుఁడు." ఇతని వంశమువారెల్ల గొప్పపదవులలో నుండిరి. కర్ణాటకచక్రవర్తియొక్క రాజ్యతంత్రమెల్ల వీరిచేతనే యుండెను. నన్నయభట్టుయొక్క సుకృతమో, లేక రాజనరేంద్రుని సుకృతమో ఈ వంశమునకు చేరిన నారాయణభట్టు నన్నయ్యకు సహాధ్యాయి. ఏ విశ్వవిద్యాలయమందుండఁగానో ఈ యిరువురకును సహాధ్యాయసౌఖ్య మేర్పడియుండవలెను. ఆ స్వాతంత్ర్యముచే నన్నయ నారాయణభట్టును చూచి అతని సహాయముచే మధుసూదనయ్యను దర్శించి మరల తన రాజుకే వేంగిసామ్రాజ్య మిప్పించియుండవలయును. మధుసూదనయ్య ప్రోద్బలముచే కర్ణాటాధీశుఁడు

సోమేశ్వరుఁడు వెంటనే అంగీకరించియుండును; చోళ రాజును రణరంగమందు జయించుటయేగాక అతని బంధువును, యుద్ధమునకే కారణభూతుఁడైన వేంగీశుఁడు రాజరాజనరేంద్రుఁడు స్వయముగానే తనకు వశుఁడగుటకు చాల సంతసించియుండును. ఈ యూహ కెల్ల నాధారము ఈ క్రిందిపద్యము:—

"పాయక పాకశాసనికి
భారతఘోరరణంబునందు నా
రాయణునట్లు వాణసథ
రామరవంశవిభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయథు
రంధరుఁడుం దన కిష్టుఁడుఁ౯ సహా
ధ్యాయుఁడునైన వాఁడభిమ
తంబుగఁ దోడయి నిర్వహింపఁగన్."

నారాయణభట్టునంతటివాఁడు 'ఉభయభాషా కావ్యరచనాభిశోభితుఁడు' భారతాంధ్రీకరణమునకు పరుల సాయ మపేక్షించుటకు కారణము పలువురు పలుతెగలుగా నభిప్రాయపడిరి. ఇందు సువ్యక్తమగునట్టి విషయ మేమనఁగా నారాయణభట్టు 'వాఙ్మయధురంధరుఁడే' గాక 'దన కిష్టుఁడుఁ౯ సహాధ్యాయియూ నైన వాఁడు.' అందుచే నిరువురకు పరస్పరస్నేహాతిరేక స్వాతంత్ర్యము లుండియుండును. పైఁగా నీతఁడు వాణసథరామరవంశవిభూషణుండు. 'వాణస' యను నది అతని యింటిపేరు. ఇందులకు పాఠాంతరములు 'వాసిగ' అనియు, 'దానును' అనియు గలవు. కాని శ్రీ వండిగుంట సూర్యనారాయణశాస్త్రిగారును, చదలవాడ సుందరరామశాస్త్రిగారును కలిసి ముద్రించిన ప్రతియందు 'వాణస' యను పాఠమునే ఇచ్చినారు. 'వాణస' యనుపాఠమే సాధువుగాఁ గనఁబడుచున్నది. ఏలయన, నారాయణభట్టు ఆంధ్రుఁడు కాఁడు; కర్ణాటకుఁడు. ఈతని బంధువులందఱును కర్ణాటదేశమునఁ గలరు. పైఁగా నీతఁడు ఆంధ్రదేశమున త్రైలోక్యమల్ల దేవర ప్రధానిగా వచ్చియుండెనే గాని రాజనరేంద్రుని ఆశ్రితుఁడు కాఁడు. ఈ విషయము దాక్షారామమున నారాయణభట్టు కూఁతురు కుప్పమ్మ ౧౦౫౫ లో చేయించిన దానశాసనముచే తెలియుచున్నది (S. I. I. IV 1010). త్రైలోక్యమల్ల దేవరప్రధాని యనఁగా చాళుక్యచక్రవర్తి త్రైలోక్యమల్లాహవమల్లసోమేశ్వరుఁడు పంపిన రెసిడెంట్ ఆఫీసరు. ఇందుచే మఱియొక విషయము తెలియుచున్నది. రాజరాజనరేంద్రుఁడు కర్ణాటసోమేశ్వరునికి వశుఁడై అతని ప్రధాని నొకనిని తనకడ నుంచుకొనెను అనునది.

ఇదెల్ల క్రీ. శ. ౧౦౫౧ నాఁటికి జరిగియుండవలయును. ఆ సంవత్సరము జరిగిన యుద్ధమున చోళులు పరాజయమందఁగానే రాజరాజనరేంద్రుఁడు నన్నయమూలముగా సంధిప్రయత్నములు గావించి ఆ సంవత్సరమే మరల తన సింహాసనమును సంపాదించుకొని నారాయణభట్టు తనకడ నుండుట కంగీకరించెను. ఏలయన, క్రీ. శ. ౧౦౫౦ లో తిరువయ్యారులో నుండిన రాజరాజనరేంద్రుఁడు ౧౦౫౧ లో నారాయణభట్టునకు రెండేరుల నడిమివిషయమున నందంపూండి యను గ్రామమును దానముగా నొసంగుచు నతనిని సంస్కృతాంధ్రప్రాకృతపైశాచీకర్ణాటాదిభాషలలో మహాపండితునిగా వర్ణించెను. ఈ శాసనమునకు దాత రాజనరేంద్రుఁడు; ప్రతిగ్రహీత నారాయణభట్టు; రచయిత నన్నయభట్టు (ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక I పు ౪౫; E. I. IV P 300). ఈదానమునకు కారణము పాండిత్యముమాత్రమే కాదనియు, రాజకీయమగు సంబంధమే ముఖ్యమనియు 'త్రైలోక్యమల్ల దేవరప్రధాని' యను వాక్యములచే స్పష్టము. కావున నారాయణభట్టు యొక్క పాండిత్యముమాత్రమేగాక అధికారము అతనికి గౌరవములను సంపాదించిన దని తలంపవలయును.

ఆంధ్రమహాభారతరచనాకాలము

'తన కులబ్రాహ్మణుఁడు' ప్రయోగించిన ఈ నీతిచే రాజరాజనరేంద్రుఁడు మరల తన రాజ్యమును సంపాదించుకొనుటయేగాక సోదరునివలని బాధను తప్పించుకొనెను. విష్ణువర్ధనవిజయాదిత్యుని కర్ణాటకులు శాంతిపఱచి నొలంబపాడిదేశమునకు అతనిని సామంతునిగా చేర్పాటుచేసిరి.

ఈ దెబ్బచే చోళులకు యుద్ధమునకు మొగమే లేకపోయినది. కాని వారేమో యుద్ధప్రయత్నములను మానలేదు. రాజనరేంద్రునికిమాత్రము తన జీవితమునందలి తుదిపదిసంవత్సరములు క్రీ. శ. ౧౦౫౧ మొదలు ౧౦౬౧ వఱకు శాంతి చేకూరినది. ౧౦౫౧ నాఁటికి రాజనరేంద్రుఁడు ఏఁబదియేండ్ల వృద్ధుఁడుగా నుండును. తండ్రి గతించునాఁటికి (౧౦౧౮ కి) ఇరువదియేండ్ల వాఁడుగా నుండినను నేఁటికి ఏఁబదియేండ్ల పై మాట. కాని నాఁటికే

యీతనిం దలుముఁగిల్లిన బలిష్ఠుఁడు తమ్ముఁ డుండి నందున ఇంకను పెద్దవాఁడుగ నుండును.

మరల రాజ్యమందు కుదురుకొనినవెంటనే మొదటిపనిగా నీతఁడు తన రాజధానిని వేంగీపురమునుండి రాజమహేంద్రవరమునకు మార్చుకొనియుండవలయును. 'వేంగీపురము' అనునది అంతవరకు వేంగీదేశమునకు రాజధాని యని కర్నాటకుల బిరుదులచేతను, ఇతర ప్రస్తావములచేతను తెలియుచున్నది. ఇంతవఱకు జరిగిన సంగ్రామములచే శత్రువులకు అందుబాటులో నుండినది. కృష్ణాగోదావరుల నడిమిప్రదేశమున నుండుటకన్న కొంతదూరముగా నుండఁదలఁచి యీతఁడు గోదావరికి తూర్పుతీరమున తన నామధేయముననే నూతనపురమును రాజమహేంద్రవరమును నిర్మించుకొనెననుట స్పష్టము. ఈ విషయమునే విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణిలో నిట్లు చెప్పినాఁడు: 'రాజమహేంద్ర పురస్థాత రాజనరేంద్రుఁ డెక్కువతాత యేలిభునకు'

పైఁగా రాజరాజనరేంద్రునికే రాజమహేంద్రుఁ డనియు పేరుగలదు.

"రాజకులైకభూషణుఁడు.........
.........రాజమహేంద్రుఁ డున్నతిన్"
(భారత. ఆది. 3)

అటనే ముందువచనమున 'రాజరాజనరేంద్రుండు' అనియు కలదు.

ఇట్లు శాంతియేర్పడిన యనంతరము తనతోపాటు కష్టముల ననుభవించిన 'యనురక్తునకు' తన కాలఁ డొనర్చిన సాయమునకును ఆతనియందు కృతజ్ఞత చూపువాఁడై భారతాంధ్రీకరణమునకు అనుజ్ఞ నిచ్చి యుండును. నన్నయనారాయణభట్టరాజరాజనరేంద్రులు ముగ్వురును సుఖంబుండిన ౧౦౪౧-౧౦౫౫ సంవత్సరముల నడిమికాలమున 'విద్యావిలాసగోష్ఠీ సుఖోపవిష్టుండయి యిష్టకథావినోదంబుల నుండి యొక్కనాఁడు' 'నన్నపార్యుఁ జూచి' 'వరచళుక్యాన్వయాభరణుఁడు' 'కృష్ణద్వైపాయనమునివృషభాభిహితమహాభారతబద్ధ నిరూపితార్థ మేర్పడఁ దెనుఁగున రచియింపు'మని ఆన తిచ్చియుండును. కష్టములన్నియుఁ గడచిపోయినవి గావుననే "వేంగిదేశంబునకు నాయకరత్నంబునుం బోని రాజమహేంద్రపురంబునందు మహిమతోఁ బరమానందంబున ననవరతమహామహీరాజ్యసుఖంబు లనుభవించు"చుండెను. ౧౦౫౫ సం. తర్వాత నారాయణభట్టుండెనో లేడో చెప్పుట కాధారములు లేవు. ౧౦౪౧ లోనో, లేక కొంత తర్వాతనో ప్రారంభించి భారతము నందలి తొలిమూఁడుపర్వముల నాంధ్రీకరించి నన్నయభట్ట ప్రమించియుండును. లేనిచో ౧౦౬౧ లోపల గ్రంథమును పూర్తిచేసియుండలేఁడా? లేక 'లోకజ్ఞుఁడు' గావున రాచకార్యముల నడుమ ఆమాత్రమే అవకాశము దొరకినది గావలయు. పైఁగా నీతఁడు నారాయణభట్టువంతటివాని సాయమును ఎంతవఱకు పొందెనో తెలియదుగాని తనకు సహాధ్యాయుఁడు', 'ఇష్టుఁడు'ను, సాటిపండితుఁడు నైనట్టివాఁడు చెంతనుండి, 'అభిమతంబుగ తోడయి నిర్వహింపఁగా' మీఁదుమిక్కిలి ఆతఁడు మరల వేంగీసామ్రాజ్యమును తన రాజున కిప్పించియుండఁగా ఆతని కింతమాత్రము కృతజ్ఞత చూపుటలో నాశ్చర్యమేమి? అంతవఱకును భారతాది గ్రంథములు కన్నడమున రచితములై యుండినను అవి యన్నియు జైనసాంప్రదాయానుసారులు. వైదికమత ప్రవర్తన కాదర్శమైన భారతము కావలసియుండెను. ఆయా లాతిభాషాగ్రంథార్థముల నెఱింగిన నారాయణభట్టు నారాయణునట్లు నిరంతరము ఉత్సాహమొసంగుచుండియుండును. ఆ కాలమున జైనమతమును నిర్మూలించి శైవమతము తలయెత్తుచుండెను. రాజరాజనరేంద్రుఁడు ద్రావిడసహవాసముచేతఁ గాఁబోలు నన్నయతో 'జగత్పరిపూజ్యములైన యాశ్వలాయనముల యందు నిల్పితిఁ బ్రకాశముగా హృదయంబు భక్తితోన్' అనియు, 'ఇదియేమనన్' అను పద్యమున 'పార్వతీపతి పదాబ్జధ్యానపూజామహోత్సవమున్' అనియు, తన శివపూజానిరతిని చెప్పుకొనియున్నాఁడు. ఇట్టి పరిస్థితు లేర్పడఁగా 'నానారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు తెనుంగున న్మహాభారతసంహితారచనబంధురుఁ డయ్యె జగద్ధితంబుగాన్'. భారతరణమున పాకశాసనికి నారాయణుఁడు సారథ్యమొనర్చి క్లిష్టసందర్భములలో నుపాయముల నేర్పి విజయము చేకూర్చినట్లు నన్నయకు నారాయణభట్టు ప్రోత్సాహకారకుఁడై గ్రంథరచనను నిర్వహింపించెను. సారథి నారాయణుఁడు, పోరాడినవాఁడు పాకశాసని; నారాయణభట్టు ప్రోత్సాహకుఁడు, నన్నయభట్టు రచయిత. ఇట్లీ ప్రథమాంధ్ర గ్రంథము ఆంధ్రులకు ద్రావిడదాస్యవిముక్తతాసూచక ధ్వజమై యొప్పారుచున్నది.

నాటకరంగస్థలాలలో రావలసిన మార్పులు

❀

= శ్రీ భాస్కర్ల సూర్యనారాయణమూర్తి =

ఒక జాతియొక్క ఔన్నత్యఅధఃపతనాలు దాని యొక్క కళాదర్పణంలో ప్రతిబింబిస్తా యన్న కవివాక్యం అమోఘం. తెలుగునేలలో మొదటినుండి కళారాధనం మేధావుల సొత్తుగానే ఉండిపోలేదు. పామరుడు, అర్థవిభవం లేని అభాగుడుసహితం కళలలో అభిజ్ఞత చూపుతూ సౌందర్యోపాసనలో పాల్గొంటూ వచ్చారు. లలితకళల్లో ఆంధ్రులది అందెవేసిన చేయి అని యెన్నడో స్థిరపడింది. కవిత్వం, గానంమాటటుంచి, నేడుసహితం అజంతా, ఎల్లోరా, మధురా తంజావూరులలో అమరగానం చేస్తున్న ఆంధ్రశిల్పం' కూచిపూడి భరతనాట్యం, తంజావూరిలాస్యం, తోలుబొమ్మలాటలు ఆంధ్రులకు లలితకళల్లో గురుపీఠాన్నందించాయి. కాని, నేడు మనదేశం సర్వవిధాలా అధఃపతనమైందనడంలో అతిశయోక్తి లేదు. మన పూర్వుల ఔన్నత్యం, మన సంప్రదాయాల ఉత్కృష్టతా చెప్పుకుని సంతృప్తిపడే స్థితికి వచ్చాం. అంతేగాకుండా నేటి కళలకు జీవితంతో సంబంధం లేకుండా పోయింది. మనం ఏదో బ్రతుకుతున్నాం తప్పితే జీవించడం లేదు. జీవించడంలో అనేకమహత్తరవిషయాలు యిమిడిఉన్నాయి. రాజకీయబానిసత్వం, ఆర్థిక అసహాయస్థితులు మనల్ని హాయిగా జీవించనీయడం లేదు. ఇవన్నీ ఉన్ననాడే మనం లలితకళల్ని అభివృద్ధిచేసుకోగలం. ఆ నాడే తిరిగి మనం సభ్యదేశాల్లో తలెత్తుకుని పూర్వపు ఆచార్యస్థానాన్ని అందుకోగలుగుతాం.

కళాప్రపంచం సౌందర్యమయం కాబట్టి దాని ఫలితం ఆనందం అన్నారు. అసహజం వికారం, అసభ్యత లేనిదే కళ అని నిర్వచించాడు విశ్వకవి. ప్రతిభోత్పన్నములై, భావప్రాధాన్యతతో ప్రతిభాసించే కళలలో ప్రాముఖ్యతలో సమానత్వాన్ని, కొన్నియెడల ఆధిక్యతను సహితం పొందిన నాట్యకళాకన్యకు అందాలుదిద్ది రూపకల్పన చేసినది భరతాచార్యుడు. నానా భావములతోను, అవస్థలతోను కూడుకొన్నదై లోకవ్యాపారానుకరణమైనది నాట్యమనీ, సుఖదుఃఖసమన్వితమైన లోకస్వభావం ఆంగికాద్యభినయాలతో కూడినప్పుడు నాట్యమనిపించుకుంటుందనీ భరతముని నాట్యనిర్వచనం.

ఈ నాట్యకళ మనకు వివిధరూపాల్లో కనపిస్తుంది. కాని ముఖ్యంగా యిది మన నాటకాల్లో ప్రత్యక్షమైంది. భావనాశక్తి గల కవిసృష్టిలో భావకావ్యమైనట్టి హావభావప్రకటనాధురంధరులైన నటులనిచే అభినయించబడి నాట్యమైంది. సర్వశాస్త్రసమన్వితమై, లోకవృత్తాన్ని చిత్రించే నాట్యకళ భావవ్యంజకమై, రసాత్మకమైన కావ్యసృష్టితో మేళవించబడినప్పుడే నాటకపరిణామం.

ఇట్టి నాటకాలవల్ల కలిగే ఆధ్యాత్మికానందం అటుంచి, వాటిని ప్రజల్లో విజ్ఞానం వెదజల్లే సాధనంగా ఉపయోగించారు పెద్దలు. పాశ్చాత్యులు తమ సాంఘిక పరిస్థితుల్ని, రాజకీయాలను సహితం నాటకరచనా ప్రదర్శనాలవల్ల! చాలవరకు మార్పుచేయగలిగారు.

అట్టి సర్వశక్తివంతమైన నాటకానికి ముఖ్యంగా కావలసిన లక్షణాలు, నాటకరచన, నటులు, ప్రేక్ష

కులు, విమర్శకులు, రంగస్థలం. ఇవన్నీ ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రత్యేకవిషయం.

ఆదిలోనే హంసపాదు

వీటిలో నాటకాల విజయానికి ఆయువుపట్టయిన రంగస్థలం ఆంధ్రులకు ఉందా అనేదే పెద్దసమస్య. ప్రస్తుతం తెలుగునాటకాలు ఆడే స్థలాలు రంగస్థలాలనిపించుకోవడానికి ఎంతమాత్రం తగని పశువుల దొడ్లు. చాలావరకు నాటకాలు ఆడే స్థలాలు సినిమాల కోసం కట్టబడినవేకాని వాటికి పెద్దపెద్ద పేర్లు పెట్టడం ఘోరమైన అన్యాయం.

ఆంధ్రనాట్యకళాకన్య సర్వశోభాయమానంగా ఆనందనృత్యం చేయాలంటే ఆంధ్రదేశంలో తగిన స్థలం లేదు. ఇంతమంది ధనవంతులూ, జమీందార్ల ప్రాపకమున్నప్పటికీ ఏ సంస్థా—చివరకు ఆంధ్రనాట్యకళాపరిషత్తు అయినా—ఒక ఆదర్శరంగస్థలాన్ని నిర్మించలేకపోవడం ప్రయత్నలోప మనాలి. తప్పదు. నాట్యకళాప్రపూర్ణుడు కుడితిఞంవరకు యీ కలలే కంటూ యీ సంకల్పంతోనే జీవించాడు. కాని తెలుగుదేశానికి ఆ భాగ్యం 'రాఘవ' జీవితకాలంలో పట్టలేదు. ఆయన పేరుమీద ఏవో నిర్మాణాలకు ఆలోచనలు జరుగుతున్నట్టు వింటున్నాం.

ఆదర్శరంగస్థల ఆవశ్యకత

ఆదర్శప్రాయమైన రంగస్థలం అనేసరికి అందుకోలేని దనికాని, అసాధ్యమైన దనికాని అనుకోవడానికి వీలులేదు. ఇంతవరకు దీని అవసరాన్నిగూర్చి అనేకమంది పెద్దలు చెవిని యిల్లుకట్టుకుని పోరారు. స్థలనిర్ణయం, అవనికలు, అలంకారాలు, వెలుగుజిలుగులు అటుంచి, చివరకు తెరలు దింపడానికీ, ఎత్తడానికీ పెట్టబడే మనిషికూడా రంగస్థలంలో ఒక భాగమే, నాటక విజయానికి ఒక సాధనే! నూతనరంగస్థలనిర్మాణం, సంస్కారం అత్యంతావశ్యకం.

మన దేశంలో పట్టణాలకు, పల్లెలకు బ్రహ్మాండమైన భేదం ఉంది. భారతదేశసౌభాగ్యం పల్లెలపై ఆధారపడితున్నా, దురదృష్టవశాత్తు, ధనం, విలాసాలు విద్య పట్టణాలపాలయ్యాయి. మనం పట్టణాలలోను, పల్లెలలోను ఒకేవిధమైన రంగస్థలాలు నిర్మించే స్థితిలో లేం. ప్రథమంగా పట్టణాలలో నిర్మించబడవలసిన రంగస్థలాల్ని పరిశీలిద్దాం. వీటికి కావలసిన ముఖ్యాంగాలు స్థలం, నిర్మాణంలోని సౌలభ్యం, అవనికలు, గ్రీన్ రూమ్, శబ్దము, వెలుగు, తెరలు దింపేవాడు, సూత్రధారుడు, తదితరాలు.

రంగస్థలంలో కావలసిన సంస్కరణలు

రంగస్థలం నిర్మించబడే స్థలం ప్రశాంతంగా ఉండాలి. అలజడులు, సమ్మర్దం, రాకపోకలు హెచ్చుగా ఉండకుండాఉంటే మంచిది. హాలుచుట్టూ చక్కటి పూలమొక్కలు, అందమైన చెట్లు ఉంటే నాటకం చూడ్డానికి వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

హాలులో ఏ ప్రక్క కూర్చున్నవారికైనా రంగస్థలంమీది నటకులు యావన్మందీ కనపించడానికి వీలుగా నిర్మాణం జరగాలి. ప్రస్తుతం ఉన్న వాటి నిర్మాణంలో అభిప్రాయం అదే అయియుండవచ్చును. కాని ఫలితం మరోవిధంగా తేలింది. సరియైన ఫలితం రావడానికి రంగస్థలంముందున్న ప్రదేశం అర్ధవలయాకారంగా ఉండడం చాలావరకు తోడ్పడుతుంది.

గ్రీన్ రూంవిషయంలో వివిధాభిప్రాయాలున్నాయి. దీనికోరకు సాధ్యమైనంత ఎక్కువస్థలం వదలిపెట్టబడాలనేది చాలామంది అంగీకరించిన విషయం. వివిధరకాల దుస్తులు, పరికరాలు అందులో ఉంచాలి. సాధ్యమైనంతవరకు యివన్నీ ఆ హాలువాళ్లే పెట్టాలి. సామాన్యంగా ఆడే చరిత్రాత్మకనాటకాలు, సాంఘికనాటకాలకు వీలైన దుస్తులు, పరికరాలు నాటకసంఘాలకు అందుబాటులో ఉండేటట్టు చేయాలి. ఈ నిర్మాణకార్యం ప్రత్యేకసంస్థకాని, ప్రభుత్వంకాని తీసుకుంటేకాని నిష్టయువంతం కాదు.

వీటితోబాటు విడదీయడానికి వీలులేని విషయం మేకప్(Make-up). ఇది ప్రత్యేకమైన కళ. దీనికొరకు

ప్రతిసంస్థలోను ఒక నిపుణుడు ఉండాలి. నటులకు మేకప్ తెలిసిఉండడం మంచిదేకాని నిపుణుడు ఉంటే నాటకవిజయానికి యింకా తోడ్పడతాడు.

ఇక అవనికల విషయం. వీటివిషయంలో వివిధ దృక్పథాలున్నా, నేటి మన తెరలు ఘోరంగా ఉన్నాయని అంతా అంగీకరించారు. ఉద్యానవన దృశ్యాలకు వీధులు చూపెట్టడం, యుద్ధదృశ్యాలకు గాంధర్వ కన్యలు నృత్యం చేసే తెరలు చూపెట్టడం మనకు పరిపాటి. అటువంటి ఘోరాలు చూస్తూ కూర్చోవడం దుర్భరం. అసలు తెరలు నాటకంలో ఆయాసన్నివేశాలకు అనుగుణ్యంగా ఉండి, చక్కటి వాతావరణాన్ని కల్పించడానికి ఉద్దేశించబడ్డాయి. అట్టి ఉదాత్తమైన ఆశయాన్ని మనవారు ఖూనీచేస్తున్నారు. అయితే యిప్పుడు ఎటువంటి తెరలు ఉండాలి అనేది గడ్డు సమస్య. పాశ్చాత్య దేశాలలో వాస్తవికరంగస్థలం (Realistic stage), ఊహారంగస్థలం (Featuristic stage) అని రెండువిధాల ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాని నాటకాలు సాధ్యమైనంతవరకు జీవితానికి దూరంకాకుండా ఉండాలికాబట్టి, అంతా ఊహాకే వదిలితే అందరికీ అర్థంకావడం కష్టంకాబట్టి, తెరలు వాస్తవికతకు దగ్గరగా ఉండేటట్టు చూడడం ఉత్తమం. హిమాలయాల్ని చూపించాలంటే రెండు గీతలుగీసి హిమాలయం అని ఊహించమనేకంటే మంచుకొండలతో నున్న తెరనైనా చూపడం మంచిది. ప్రస్తుతం మన కున్న బొమ్మల తెరలు ఎంతమాత్రం పనికిరావు. ఒక్కొక్క నాటకానికి ప్రత్యేకంగా తెరలు తయారుచేయబడాలి.

ప్రతినాటకానికి ఆయాసన్నివేశాలకు తగినట్టు సెట్టింగులు ఏర్పాటుచేయడానికి ఒక నిపుణుడు ఉండడం చాలా ఉత్తమం. ఇటువంటి ప్రయత్నానికి ధనం అవసరం అనేది అందరూ ఎరిగిన విషయమే. కాని ప్రభుత్వమో, ఉదారులైన ప్రజలో పూనుకోవాలని అంతా కోరేది యిటువంటి ప్రత్యేకవిషయాలతో రంగస్థలం శోభాయమానం కావాలనే సంకల్పంతోనే!

ఈ సందర్భంలో తెరలు లాగే వ్యక్తికూడా నాటకవిజయానికి చాలాముఖ్యం అని ముందే అన్నాను. తెరలు లాగేవానికి సహితం నాటకం అంతా అవగతమై యుండాలి. ఎప్పుడు తెర ఎత్తాలో, ఎప్పుడు దింపాలో తెలియకపోతే నాటకం రసాభాసవుతుంది. పాము కరచిన లోహితుడు చచ్చినట్టు నటిస్తూ యింకా తెర పడదేమని ఎదురుచూడ్డం చూస్తూనేఉన్నాం. ఈస్థితి ఎంత తొందరగా అంతరిస్తే అంత మంచిది. నాటక సంఘంలో నాటకాన్నంతా పూర్తిగా అర్థంచేసుకున్న ప్రాంప్టరు (prompter) కి ఎంత ప్రముఖస్థానం ఉందో తెరలు లాగే వ్యక్తికి అంతకంటే ఎక్కువ ప్రాముఖ్యత ఉంది.

శబ్దము-వెలుగుజిలుగులు

ఇక శబ్దం, వెలుగుజిలుగులు రంగస్థలానికి ముఖ్య అలంకారాలు. రంగస్థలంపైన నటులు నటించేటప్పుడు వారి మాటలు ప్రతిధ్వని నీయకూడదు. కాని హాలులో కూర్చున్న యావన్మందికీ నటులమాటలు వినబడాలి. దీనికొరకు కొందరు "మైక్"లు ఉపయోగిస్తున్నారు. ఆ ప్రయత్నాలు విఫలమైనవని వేరే చెప్పవలసిన పని లేదు. సాధారణంగా ప్రతిరంగస్థలంలోను పైని ధ్వనిని సభికులపైపు ప్రసరింపజేయడానికి కుండలుబోర్లించడం ఆచారం. అది చాలావరకు బాగానే పనిచేస్తుం దనాలి. అసలు హాలు అర్ధవలయాకారంగా ఉండాలన్నాం కాబట్టి ధ్వనితరంగాలు అన్నివైపులకు సరిసమానంగా చేరడానికి అవకాశం ఉంటుంది. హాలు ఏటవాలుగా ఉండడంవల్లకూడా ధ్వని అన్నిప్రక్కలకు సమానంగా వెళ్లడానికి సహాయపడుతుంది.

వెలుగుజిలుగుల విషయంలో ప్రస్తుతం కళాశాలల నటసంఘాలు, ఎమెచ్యూర్లు అవలంబిస్తున్న పద్ధతులు చాలావరకు విజయవంతంగానే ఉన్నాయి. అసలు ఏటుప్రక్క వెలుగు నటునిపై ఎటువంటినీడల నిస్తుందనే విషయం తెలిసిన నిపుణుడు చాలా అవసరం. చీకటికి, సూర్యోదయాస్తమానాలకు, మంటలు మొదలైనవాటికి రంగులు చూపించడం నిపుణతతో నిర్వ

హించగలిగి ఉండాలి. లేకపోతే వీటిమూలంగా నాటకం చెడుతుంది. మనం సాధారణంగా చూచే డొక్కుపోయిన ముఖాలు, గుంటకళ్లు, అనేక ఇతరేతర అవకతవకలు యీ వెలుగునీడల భేదాలు తెలియకపోవడం వల్లనే నని స్పష్టమైంది. ఇందుకే నిపుణుని ఆవశ్యకత.

సూత్రధారులు

సూత్రధారుడు (Stage Director) అసలు నాటకకళకే ఆయువుపట్టంటే ఇక రంగస్థలవిషయం వేరే చెప్పాలా? నాటకాన్నంతా నడిపించే బాధ్యత వీనిది. సూత్రధారుడంటే నాటకదర్శకు (Director)డని నాభావం కాదు. రంగస్థలనిర్మాణానంతరం యిక నాటకం విజయవంతంగా సాగించడం వాని విధి. నటకుల ప్రవేశ, నిష్క్రమణలతోబాటు రంగానికి కావలసిన యావత్తు సులువులూ అతడు ఏర్పాటుచేయగలిగి ఉండాలి. నేడు మన నాటకాల్లో యీ లోపం చాలా కనుపిస్తుంది. కారణం కంట్రాక్టరు, హాలువాడు, నటకుడుకూడా ధనం ముఖ్యంగా పెట్టుకుని నాటకకళని తగలవేయడం. మన కసలు స్టేజిఅనేది ఉంటేగా దానికి డైరెక్టరు ఉండడం! పైనచెప్పిన విషయాలన్నీ అదుపులో పెట్టి నాటకాలవిజయానికి సర్వవిధాలా తోడ్పడే స్టేజిడైరెక్టర్లు మనకి చాలా అవసరం.

కళాశాలల అవసరం

ప్రభుత్వం, లేక స్థానిక సంస్థలు నాటకాలూ, రంగస్థలానికి సంబంధించిన యావత్తువిషయాలనూ బోధించడానికి ప్రత్యేకకళాశాలలు నిర్మించాలి. విశ్వవిద్యాలయాలలో యీవిషయాలు బోధించడానికి ప్రయత్నం చేసేకంటే ప్రత్యేకపు ఇన్స్టిట్యూట్లు స్థాపించడం దేశానికి ఎంతో మేలుచేసినట్టు. మద్రాసురాజధానికి అటువంటి కళాసంస్థలు పట్టుమని పదిఅయినా చాలా అవసరం. ఈప్రయత్నం ఎవరో కొందరు ప్రత్యేక వ్యక్తులు చేయడానికి ఆలోచిస్తున్నారని వినడమేకాని అది కార్యరూపం దాల్చలేదు. ఇకనైనా యిటువంటి కళాక్షేత్రాలు రూపందాల్చాలి. త్వరలో ఏలూరు మునిసిపాలిటీవారు యిటువంటి కళాశాల ఒకటి స్థాపించబోతున్నారని వినడానికి చాలా సంతోషం. తెలుగుదేశంలోని స్థానికసంస్థలు యికనైనా మేల్కొని యీ ఆదర్శాన్ని అనుసరిస్తాయని ఆశ.

ప్రస్తుతం సినీమాలతో పోటీచేయవలసిన నాటకాలు ముఖ్యంగా రంగస్థలనిర్మాణవిషయంలో యీనాయ బడ్డ మెళుకువలన్నీ తెలుసుకుని అవలంబించకపోతే నిలవడం కష్టం.

౨

ఇక మన దృష్టి గ్రామాలమీదికి మరలిద్దాం. సాంఘికజీవితానికి సంబంధించిన ఏ ఉద్యమంలోనైనా మనదేశంలో గ్రామాలకు ప్రత్యేకస్థానం లేకపోతే అది పరిపూర్తిచెందదు. అందుకే కాబోలు మన పెద్దలు—ప్రస్తుతపు మహానాయకులుసహితం గ్రామోద్ధరణమీదే దృష్టి కేంద్రీకరించారు. అవిద్య అవిచ్ఛిన్నంగా తాండవించే దేశంలో విజ్ఞానవ్యాప్తికి, ధర్మప్రబోధానికి పూర్వం అనేకసాధనా లుపయోగించారు. వాటిలో నేటికీ వీధిభాగవతాలు, తోలుబొమ్మలాటలు, భరతనాట్యం, బుర్రకథలు మొదలైన అనేకవైజ్ఞానికసాధనాలు కనుపిస్తూనే ఉన్నాయి. ఇట్టి సాధనాల సహాయంతో దేశంలో ఏ ఉద్యమాన్నైనా ప్రచారంచేసుకోవచ్చు. ఎంత గొప్ప సంస్కారమైనా సులభంగా తీసుకురావచ్చు. అనేకశాసనాలు, నిర్బంధాలు, నియమాలు చేయలేని పని యీ సాధనాలద్వారా సాధించవచ్చు. ఈ సత్యాన్ని మనవాళ్లు ఎన్నడో గ్రహించారు. పూర్తిగా ఉపయోగించుకున్నారు. ఇప్పుడిప్పుడే ఆ సులువు మనదేశంలో ఉపయోగంలోకి తెచ్చుకుంటున్నాం. ఇట్టి వైజ్ఞానికసాధనాలలో ప్రథమస్థానం దృశ్యకావ్యానికే చెందుతుంది. దీని శక్తిని ప్రాక్పశ్చిమదేశాలు అర్థంచేసుకున్నాయి. పాశ్చాత్యులు తమ దేశాలకు స్వాతంత్ర్యం తెచ్చుకోవడానికికూడా నాటకాలను సాధనంగా ఉపయోగించారంటే ఇక వేరే చెప్పవలసింది లేదు. అట్టి ఆగత్యం ఎంతోహెచ్చుగా ఉన్న

భారతదేశంలో యికనైనా చిన్న నాటకాలను ప్రచార ప్రబోధాలకోసం కళాదృష్టి మరువకుండా ఉపయోగించుకోవడం ఉత్తమం.

వీటికి కావలసిన రంగస్థలం పట్టణాలలోవలె నిర్మించడానికి ధనాభావంమూలంగా వీలులేదు. కాబట్టి వీటికి ప్రత్యేకనిర్మాణం జరగాలి.

బయలు నాటకాలు

ప్రతిగ్రామంలో ఒక రంగస్థలం నిర్మించబడాలి. హాలు కట్టవలసిన పనిలేదు. ప్రజలు ఆరుబయలు (open-air) లోనే కూర్చుంటారు. నటకులు నటించడానికిమాత్రం కొంచెం ఎత్తైన దిబ్బవేసి దానిపై రంగస్థలం నిర్మించాలి. దీనికి సంబంధించినంతవరకు ఖర్చు తక్కువలో చక్కగా ఉండేటట్టు చేయాలంటే గ్రామస్థులంతా కలిసి పూనుకోవాలి.

దానికి కావలసిన పరికరాలు చాలా కొద్ది. ముఖ్యంగా కావలసినవి తెరలు. అవి అన్నిరకాల నాటకాలకూ ఉపయోగించేటట్టు తయారుచేయబడాలి. ఆయారసాలకు అనుగుణ్యంగా ఉండేటట్టు వివిధమైన సాదారంగుల (plain colours) తెరలుంటే మంచిది. విచారం చూపించాలన్నప్పుడు నలుపు, రౌద్రానికి ఎరుపు, కులాసాకు ఆకుపచ్చగాని, పసుపుగాని చూపించవచ్చు. మొత్తం నాలుగుతెరలు అన్నిపనులకూ పనికివస్తాయి. ఇవి పైకి ఎత్తేకంటే ప్రక్కలకు లాగేటట్టుండడం మంచిది. గ్రామాల్లో ముఖ్యంగా వెలుగువిషయమై యిబ్బంది వస్తుంది. విద్యుత్తు లేనిచోట పెట్రోమాక్సుదీపాలు నేర్పుగా ఉపయోగించుకోవచ్చు. ఇక మిగిలినవన్నీ నాటకసంఘాలవారే తెచ్చుకోవాలి.

సంచాలక నాటకసంఘాల అవసరం

ఈసందర్భంలో ఒక్క సూచన. సంచాలక నాటకసంఘాలను ప్రభుత్వమో, స్థానికసంస్థలో ఏర్పాటుచేయాలి. ప్రచారానికి, ప్రబోధానికి ఉపకరించే కొన్ని చిన్న నాటకాలు తయారుచేయించి, ఒక ఆరుగురు (మహా ఉంటే పదిమంది) నటకులతో ఒక సంఘాన్ని ఏర్పరచాలి. వీరే అన్ని నాటకాలూ చదివి సిద్ధంగా ఉంటారు. ఆయా నాటకాలకు కావలసిన దుస్తులూ, తదితర పరికరాలూ వాటిని స్థాపించిన సంస్థ యివ్వాలి. వీరు ప్రతిగ్రామం వెళ్లి అక్కడ ఉన్న రంగస్థలం, తెరల సహాయంతో తమ నాటకాలు ఉచితంగా ప్రదర్శించిరావాలి. గ్రామపెద్దలు యివ్వగలిగితే వారికి ఖర్చులు యీయవచ్చును కాని ఈ నటకుల్ని పోషించే బాధ్యతమాత్రం ఆసంఘాన్ని స్థాపించినవారిదే!

గ్రామపంచాయతీల బాధ్యత

ప్రతిగ్రామపంచాయతీలోను ఒక సభ్యుడు ప్రత్యేకంగా ఆ గ్రామరంగస్థలవిషయం చూడడానికి ప్రత్యేకింపబడాలి. అతడే నాటకాలు ఆడడానికి వచ్చే నటసంఘాలవారిని ఆహ్వానించడం, వారికి కావలసిన సదుపాయాలు చేయడం మొదలైన పనులు చేస్తూ ఉంటాడు.

రంగస్థలనిర్మాణం, నాటకాలకు అయ్యే కొద్ది ఖర్చులకు గ్రామపంచాయతీ కొంత విరాళం యిచ్చి, అంత సొమ్ము ప్రభుత్వంవద్దనుంచి కూడా తీసుకున్న యెడల ఎవరికీ కష్టంలేకుండా రంగస్థలనిర్మాణమూ, నిర్వహణమూ జరుగుతాయి.

ఈదృష్టితో చూస్తే భారతదేశంలో పీపుల్సు థియేటరు (People's Theatre) వారియొక్క కృషి అభినందనీయం. నేషనల్ థియేటరు (National Theatre) వారుకూడా వివిధశాఖలు లేకపోయినా బొంబాయిలో మాత్రం చక్కటి కృషి చేస్తున్నారు. వీరు మామూలు వచననాటకాలు ఆడకపోయినా, ప్రజాసామాన్యపు జీవితాలలోని కొన్నిఘట్టాలు, అనేక ప్రబోధప్రచారకవిషయాలు, నాట్యనాటకాల రూపంలో ప్రదర్శించి ప్రజలలో గొప్ప చైతన్యాన్ని కలిగిస్తున్నారు.

కాబట్టి—

భారతీయ ప్రజాజీవితానికి నాటకం దూరం కాకుండా ఉండాలంటే ఆజీవితాన్ని ప్రతిబింబింపజేసే విషయాలతో నిండిన నాటకాలు విరివిగా ప్రదర్శింపబడాలి. స్వాతంత్ర్యసంపాదనకు సహితం తోడుపడే నాటకాన్ని సరిగా ఉపయోగించుకోలేకపోతే అది మన దౌర్భాగ్యం. ప్రజలలో విజ్ఞానాన్ని వెదజల్లడానికి సంచాలక నాటక సంఘాలను పాశ్చాత్యులు సంపూర్ణంగా ఉపయోగించుతున్నారు. అవసరమైన విషయాలలో అటు ప్రాచీనత్వానికీ, యిటు ఆధునికత్వానికీకూడా అందని స్థితిలో ఉన్నాం. వైజ్ఞానికంగా, విద్యావిషయకంగా అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం, స్థానికసంస్థలు, ఉదారులైన ప్రజలు సర్వశక్తివంతమైన రంగస్థలాన్ని అందచందాలతో వెలుగొందింపజేయాలి.

ఆంధ్రనాట్యరంగస్థలం సర్వశోభాయమానంగా విలసిల్లి. కళాకేంద్రం కావడానికి పైనచెప్పినవి కొన్ని సూచనలుమాత్రమే! పిండికొద్దీ రొట్టె అన్నట్టు ప్రజల సహాయసానుభూతుల్ని బట్టి ఉంటుంది అభివృద్ధి. ఈ స్థితిలో తిరుగుడు రంగస్థలాన్ని (revolving stage) గురించి కాని, ఆరుబయలుథియేటరు (open air theatre)ను గూర్చిగాని తలిస్తే ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి ఎగిరినట్టుంటుందని ఊరుకోవలసి వచ్చింది. ఇదంతా నాటకంయొక్క సంపూర్ణత్వంలో ఒక భాగంమాత్రమే!!



చక్కని ఉత్తరాలు

— 'కామేశమ్' —

ఫ్రెంచిభాషలో ఒక కథలో వస్తుంది. మేనత్త యౌవనంవచ్చిన తన మేనకోడలికి సలహాచెబుతూ "అమ్మాయీ, ప్రేమించు; ఎంతమంది యువకులనైనా ప్రేమించు— కాగితం నలుపుచెయ్యకుండా" అంటుంది.

కాని ఆమె హృదయమెరిగి చెప్పిన వాక్యం కాదు.

కాగితం నలుపుచెయ్యని ప్రేమే లేదు. అప్రయత్నంగా సంభవిస్తుంది. ఉద్రేకంతో సొమ్మసిల్లే భావాలు కాగితంమీదకు ఒరిగిపోతాయి. ఆ వేదనతో హృదయం చిట్లి కన్నీళ్లలా ప్రవహించిపోతుంది. కంటికాటుకతో తడిసి నీలమయిపోయిన భావాలు చుక్కలుచుక్కలుగా కాగితంమీద పడి నిలిచిపోతాయి; నీలాల పంక్తులుగా.

ఇది ప్రేమలేఖల రుచి.

ఈ లేఖలు మొదటిలో విద్యాధర సుందరులు సృష్టించారు.

మ్లానవాతీతమైన దేశంలో;—హిమాలయపర్వత భూములు శివునికి నివాసం; అందుచేత పవిత్రత. పార్వతీదేవి విహరణ భూములు; అందుచేత లాలసత. ఈ రెండు భావాలూ ధాతురసంలో కలిపి విద్యాధర సుందరులు అనంగలేఖలు వ్రాస్తున్నారని కాళిదాసు ముచ్చటగా చెబుతాడు. అతని ఉద్దేశ్యమూ ఇదే. ఈ లేఖలు దేవతలే సృష్టించారు.

అంతే కాదు. భూలోకంలోకి తీసుకు వచ్చిన అమాయకురాలిని గురించికూడా కాళిదాసే చెబుతాడు—శకుంతల "చిన్ని హరిణప్రకరమ్ములతో బెరిగిన కన్య." కాని వ్యక్తత వచ్చేటప్పటికి స్వభావసిద్ధంగా ఈ లేఖలు వ్రాయడం వచ్చేసింది.

"న జానే తవ హృదయం" అని లేఖ వ్రాస్తుంది. తామరాకులో గోటిమొనతో గీకి, తన అశక్తత, అసహాయత తెలియ జేస్తుంది.

శకుంతల చిన్ననాడు పక్షులచే సంరక్షించబడిందిట. వాటికి పాలు దొరకక మధువుతో పెంచాయిట. తరువాత బ్రహ్మతేజస్వి కణ్వఋషి ఆమెను పెద్దదానిని చేశాడు. చిన్ననాటి మధువూ, తరువాతి తపోనియమమూ దుష్యంతునికి అర్పిస్తుంది శకుంతల.

శకుంతల పృథివిమీదకు తీసుకువచ్చిన ఈ లేఖలను ఎంతమంది యీనాటికీ అనురాగంతో పోషిస్తున్నారో! భూర్జపత్రాలు చూసి ఉండకపోవచ్చును; తామరాకులు దొరకకపోవచ్చును. కాని నీలినీలి సన్నని

కాగితాలు, మెరసిపోయే యౌవనపు భావాలు ఇవన్నీ వున్నాయి.

ఈ యువతీయువకుల లేఖలు అన్ని వాఙ్మయాలలోనూ ఒక పెద్ద భాగం.

ఎన్నో రకరకాల రచనలో వున్నాయి. అర్థంలేని మాటలకుకూడా యీ వ్రాతల్లో ఒక నిండుతనం కుదురుతుంది. ఎవరూ చూడని ఒక మాటకు చక్కని సొంపు వస్తుంది: స్త్రీ నీలపు కురులలో పెట్టిన ఒకటే తెల్లని నందివర్ధనపు పువ్వులాగ.

వారి కోరికలు, కోరికలు లేకపోవడం; ఆశలు, ఆశయాలు; ఆవేదనతో వుండే ఆనందం; మమత - అన్నీ చిత్రచిత్ర రూపాలలో యీ లేఖలలో వెలువడతాయి.

ఈ ప్రేమలో అనుకోని సన్నివేశాలు కలుగుతాయి. యువతీ యువకులకు భేదాభిప్రాయాలు వస్తాయి. అప్పుడు ఎవరు వ్రాసిన ఉత్తరాలు వారికి యిచ్చేసుకుంటారు. ఇది కొన్ని దేశాలలో.

మన దేశంలో అంతకన్నా మృదువుగా పంపిస్తారు. ఆశీర్వచనముతో—వీలయితే పసుపు కుంకుమతో ఆ లేఖలను సాగ నంపుతారు.

ఈ ఉత్తరాలు ఒకక్కప్పుడు విశ్వాస నిదర్శనాలు అవుతూవుంటాయి.

ఒకామె ఒకతనికి ఉత్తరాలు వ్రాస్తుంది; ఎంతో అనురాగం చూపిస్తూ. కాని కాల ప్రవాహంవలన అతను ఆమెకు దూరమయి పోతాడు. కాని ఆమెఉత్తరాలు అతనిదగ్గర ఉండిపోతాయి. ఆమెమాత్రం తన ఉత్తరాలు ఒకరిదగ్గర ఉండిపోయాయే అన్న కించ లేకుండా వర్తిస్తుంది; మాట్లాడుతుంది; జీవిస్తుంది. అతనికి అదే ఒక పెద్ద ఆనందం. చిగురుకు మిగిలిన సంతోషం. తనను ఆమె అంతగా విశ్వసించింది; విశ్వసిస్తూంది అన్న తలపు అతని నిర్వేదాన్ని కట్టిపెడుతుంది.

ఉత్తరాలు కొన్నిచోట్ల ముత్యపు పురుగులు కట్టినంత బలీయమైన అడ్డుగోడలు కట్టెయ్యగలవు.

కాని ఉత్తరాలు మనుష్యులను దగ్గరకు తీసుకువస్తాయి.

ఉత్తరాలు వ్రాస్తూవుంటే అవతలవ్యక్తి దగ్గరగా వస్తాడు. ఎదురుగా వ్యక్తికూర్చుంటే నిజమైన సాన్నిహిత్యం లేనేలేదు. మనం ఉత్తరం వ్రాస్తూవుంటే అవతలవ్యక్తి చూస్తున్నాడు. వింటున్నాడు. అతనికి ఆప్యాయతతో అన్నివిషయాలూ వ్రాయగలుగుతాము.

వారిలో కొంతమందికి ఉత్తరాలు రావాలి అన్న కోరిక వుంటుంది. వారు తిరిగి వ్రాయరు; వ్రాయలేరుకూడ. ఇలాంటివారికి ఉత్తరాలు వ్రాయడం కష్టం. ఉత్తరానికి జవాబు వస్తేనే తిరిగి వ్రాయగలము.

కాని యీ మానవత్వానికి అతీతులము అవ్వాలి. అవతలవ్యక్తి మనకు వ్రాసినా వ్రాయకపోయినా అతను మనలోనే వున్నాడనుకోవాలి. అతని మాటలు మనకి అలవాటు అవ్వాలి. అతని ఉద్వేగం మనం పంచుకోవాలి. అప్పుడే మనం చక్కని ఉత్తరాలు వ్రాయగలుగుతాము. ఆ ఉత్తరాలు వ్రాయడము ఒక భాగ్యము.

ఉత్తరాలు వ్రాయడం కొంతమందికి ఒక బాధ; వారు ఒక బాధ్యతగా భావించు కొని ఉత్తరాలు వ్రాయాలి. విద్యార్థులు యింటికి వ్రాసే ఉత్తరాలు ఈ విధమైనవే. వ్రాసితీరాలి అంటే ఉత్తరాలలో నిర్మలత్వం పోయింది. స్వేచ్ఛగా వ్రాసినవే ఉత్తరాలు; స్వచ్ఛందంగా పలుకరించే పిలుపు వుంటేనే అవి ఉత్తరాలు. లేకపోతే మరేమిటో!

ఉత్తరాల స్వాభావికత్వం ఎంతమందో చెరిచేస్తున్నారు. కొన్ని కుటుంబాలలో ఉత్తరం శుభకార్యానికో, మరొకప్పుడో కాని రాదు. మరికొంతమంది ఉత్తరాలు వ్రాయలేదు అని కేకేస్తారు. అన్నిటికన్నా—ఉత్తరాలలో తెలివితేటలు చూపిస్తారు. పద్యాలలో ఉత్తరాలు వ్రాసుకున్న మనవారు చాలామంది. శార్దూల వృత్తంలో తిట్టుకున్నవారూ వున్నారు. ఉత్తరాలలో పిల్లిమొగ్గలూ, అయిమాయిగారడీలూ చెయ్యనక్కరలేదేమో.

తలపుల్నీ, భావాల్నీ పంపడంలోనే చక్కని ఉత్తరం కుదురుతుంది. కొంతమందికి ఉత్తరాలు చేరవు— భౌతికం చేరకపోవచ్చు- అది వేరే సంగతి. కాని, కొంతమందికి ఉత్తరాలలో స్వాదుత్వం తెలియదు. వారిలో వారు జీవించడం అలవాటు అయిపోతుంది. ఇతరత్ర వచ్చే భావాలకు వారిలో చోటు లేదు. వారికి ఉత్తరాలు వ్రాసి ప్రయోజనం లేదు. ముడుచుకుపోయిన కలువపువ్వులోకి ఏ చంద్రకిరణమూ తొంగిచూడలేదు.

ఉత్తరాలు వ్రాయడానికి కూడా ఒక తపస్సు అవసరం. ఒక దీక్ష కావాలి. తనను మరచిపోవాలి. ఎవరికి ఉత్తరం వ్రాస్తున్నారో వారే మనస్సూ, హృదయమూ ఆక్రమించుకోవాలి. చక్కని ఉత్తరానికి ఇవి ఉండితీరాలి. మానవుకు తనకు ఏమవుతుందో అన్న స్పృహకన్న తనమూలాన్ని ఇతరులకు ఏమవుతుందో అన్న జిజ్ఞాస తలపుకు తెచ్చుకుంటే ప్రపంచంలో ఇంతకన్న ఆనందం ఎక్కువ వుంటుంది. ఉత్తరం వ్రాసేటప్పుడు తనను గుర్తించుకోకూడదు. ఉత్తరం చదివేవారిమీద తన భావాల వడవడి పరిశీలించుకోగలగాలి. ఎంతమందికో ఈ విషయం గోచరించదు.

కొంతమంది చక్కగా నవ్వుతారు. ఆ నవ్వు చిన్నిపువ్వులంత నిర్మలంగానూ, కోరదగినదిగానూ వుంటుంది. ఆ నవ్వు చూడడమే ఒక ఆనందం. ఒక అనుభూతి. అందరూ ఆవిధంగా నవ్వగలిగితే అందరూ చక్కని ఉత్తరాలు వ్రాయగలరు.

ఉత్తరం చదివి మనిషిని పూర్తిగా తెలుసుకోవచ్చు. "జాన్సనుఉత్తరాలు అతి గంభీరంగా వుంటాయి. ఎమిలీ బ్రాంటీ ఉత్తరాలు అతి ఉద్రేకంగా వుంటాయి." ఇలా ఎంతమందో వ్యక్తులు ఉత్తరాలలో విశిష్టత చూపించుకున్నారు. అప్రయత్నంగా, సహజంగా వారి హృదయం- సీటిమీద వెన్నెల గింతులులాగ- ఉత్తరంలో తెలిసిపోతుంది.

ఒక్కొక్క జీవితంలో ఎన్ని ఉత్తరాలు వ్రాస్తామో. అన్ని కార్యాల కోసమూ వ్రాస్తూనే వుంటాము. కాని కొన్ని ఉత్తరాలు మన మనస్సుకు హత్తుకు పోతాయి. అలాంటిది నేను మొట్టమొదట వ్రాసిన ఉత్తరం.

చాలామందికి వారు జీవితంలో మొదట వ్రాసిన ఉత్తరం జ్ఞాపకం వుండదేమో. కాని నాకు బాగా జ్ఞాపకం.

చాలా చిన్నతనంలో నన్ను మా నాన్నగారు సింహాచలం తీసుకు వెళ్లారు. నాలుగురోజులు వుండవలసివచ్చింది. ఆయన నన్ను యింటికి ఉత్తరం వ్రాయమన్నారు. మా అమ్మకు ఉత్తరం వ్రాశాను.

"సింహాచలపు మెట్లు ఎక్కగలిగేననీ, శాఖీగింజలు పోగుజేశాననీ, మాధవధారలో స్నానంచేశాననీ, చలి వేసిందికాని రొంప పట్టలేదనీ". పంక్తులు ఏటవాలుగాపోయాయి.

కాని ఆనాటి స్మృతి యీ నాటికీ పోకచెట్ల అంత అందంగా నన్ను పలుకరిస్తుంది.

ఇంకొక ఉత్తరం మరచిపోలేను. ఈ నాటిది.

ఒకతను ఆమెను పోగొట్టుకున్నాడు. అప్పుడు అతను వ్రాస్తాడు: "నాజీవితాంతంలో నన్ను కప్పివుచ్చే మన్నుకూడా 'ఆమె'కోసమై తెల్లని, చిన్న, అందమైన పువ్వులు పూస్తుంది. అవి ఆమె త్రొక్కి నడచిపోతుంది. అప్పుడే తిరిగి పునర్జన్మ-పునర్జన్మలో మళ్లీ ఉత్తరాలు...."



భాసుని నాటకశిల్పనైపుణ్యము

స్వప్నవాసవదత్తము

❀

= శ్రీ శిష్టా రామకృష్ణశాస్త్రి =

మహాకవి భాసుని కాలాన్ని గూర్చీ, అతని నాటకాలను గూర్చీ ఎట్లాంటి వివాదాలున్నా, మాళవికాగ్నిమిత్రంలో భాసుడు సౌమిల్లక కవిపుత్రాదులతో పాటు పొగడబడుటచే, ఇతడు కాళిదాసుకు పూర్వుడనీ, రాజశేఖరుడు భాసనాటకచక్రములో స్వప్నవాసవదత్తమును పేర్కొనుటచే ఈ నాటకమును భాసుడే రచించెననీగూడ స్పష్టమే. హర్ష కాళిదాసాదులుగూడ మెచ్చుకొన్న భాసుని నాటకములందు తప్పక ఏదో ఒక గొప్ప కళారహస్య ముండితీరాలి. కాన అతని కీర్తికి కారణమైన నాటకశిల్పనైపుణ్యము ఏయే విషయాలందున్నదో తెలుసుకొనుట ముఖ్యము.

సామాన్యముగా నాటకముయొక్క ప్రాశస్త్యము ఉత్కృష్టమైన పాత్రచిత్రణమందూ, చమత్కారమైన కథాకల్పనగల రసవంతమైన సన్నివేశములందూ, ఔచిత్య పోషణమందూ, రమణీయమైన సంభాషణములందూ ఇమిడి ఉంటుంది. మరియు నాటకమందలి ప్రతిపాత్రా కథావ్యాపారమున ఏదో ఒక ముఖ్యప్రయోజనముతో ప్రవేశించాలి.

స్వప్నవాసవదత్త నాటకకథ అభిరుచి ప్రేరకమైన యౌగంధరాయణుని తంత్ర మనే ఘట్టమునుండి ప్రారంభించి రసవంతముగ సాగింది. ఒక పాత్ర రంగస్థలానికి రాకపూర్వమే ఆపాత్ర ప్రవేశాన్ని ముందుగా సూచించుట సంస్కృతనాటక సంప్రదాయం. ఇంతే కాక ముందు రాబోవు పాత్రశీలముతో సామాజికులకు పరిచయము గూర్చుట ఒక కళానైపుణ్యము. షేక్స్పియరు నాటకాలందుకూడ ఈరీతి కనబడుచున్నది.

ప్రథమాంకమున కథానాయికయైన పద్మావతి రంగస్థలం మీదకు రాకపూర్వమే ఆమెగుణములను ముందే తెల్పవాడై కంచుకిచేత,

"ప్రమదారత్నము మా నృపాలసుత ధ
ర్మప్రీత, యెన్నండు సం
యములం దోర్వరు గర్వపీష, యిది సం
శాచార మాయింతికిన్."

అని కవి చెప్పిస్తాడు. పిమ్మట ఆమెపేరు వినగానే యౌగంధరాయణునికి ఆమెపై గౌరవభావమున్నా, వాసవదత్తకు సోదరీస్నేహమున్నా పొడముతుంది. తర్వాత పద్మావతిని జూడగానే వాసవదత్త ఆమెఅభిజాత్యమునకు తగిన సౌందర్యాన్ని కనుగొన్నది; వెంటనే ఆమెరూపానికి తగినట్లు మాటలు మృదుమధురంగా ఉన్నట్లు గ్రహించింది. ముందు ముందు ఆమెప్రవర్తన ఆమెరూపభాషణములకు అనురూపముగా ఉండునట్లు స్పష్టపడుతుంది. పద్మావతి యాచకుల నాహ్వానించుటచే కరుణార్ద్రహృదయయైన దాత అనీ, యౌగంధరాయణుని సోదరీన్యాసము నంగీకరించుట కష్టమనీ కంచుకిచే బోధింపబడియూ, సత్యపరిపాలనకొఱకై అందుల కంగీకరించుటవలన సత్యసంధురాలనీ, వత్సరాజు తనమీదకంటె మరణించిన అతని ప్రథమభార్యయైన వాసవదత్తమీద అధికప్రేమ జూపినందులకు స్త్రీజనసహజమగు అసూయ ఆమెహృదయాన వహింపకుండుటయూ, అవంతికే వాసవదత్త అని ఎరిగినపుడు ఆమెను క్షమార్పణ వేడికొనుట మొదలైన అనేకసుగుణాలతో నిండినదామె. ఈ విధంగా నాటక పూర్వభాగాన సూచించిన ఆమెసుగుణాలన్నీ నాట

కోత్తరభాగాన స్పష్టపడినవి. ఇదే నాటకకర్తనైపుణ్యము. పాత్రపోషణ అనగా కేవలము బాహ్యాకార వర్ణన కాక వారి మనోవాక్కాయముల ఆనుగుణ్యమును గూడ దెల్పుటే.

నాయకుడగు వత్సరాజు పాత్రపోషణమునగూడ ఈ చమత్కారమే ఉన్నది. రాజు నాటకచతుర్థాంకారంభమున రంగస్థలముమీదికి వచ్చినా అతని వ్యక్తిగత విశేషాలు మొదటి మూడంకాలందుగూడ వ్యాపించే ఉన్నవి. ఇది భాసుని పాత్రపోషణ విధానమందలి విశేషము. ప్రథమాంకమున బ్రహ్మచారి వర్ణించిన వాసవదత్తా మరణవార్తకై రాజు పడిన పరితాపాన్నిబట్టీ, అతనికి వాసవదత్తపై గల అనురాగాది కారణములనుబట్టీ, అతడెంత కరుణార్ద్ర హృదయుడో తెలుస్తుంది. ద్వితీయాంకమున రాజు బహుసౌందర్యవంతుడని వాసవదత్తవలన పద్మావతికీ, మనకూ గూడ తెల్పుతున్నాడు కవి. తృతీయాంకమున చేటిమూలాన రాజు "శరచాప విహీనుడైన సాక్షాత్తు మన్మథుడే" అని అతని అనన్యసామాన్య సౌందర్యం వర్ణింపబడింది. ఈవిధంగా రాజుపరోక్షానసే అతని సుగుణసౌందర్యాలు సామాజికులకు ముందుగా పరిచయము చేయబడ్డవి. పద్మావతి రాజును ప్రేమించి తన హృదయమును అతని. కర్పించుటకు ముఖ్యకారణము ప్రథమాంకమున బ్రహ్మచారి తెల్పిన రాజుసుగుణాలే. దీనికి అతని సౌందర్యంగూడ సాయపడింది. ఈ నాటకమందలి ప్రథమ చతుర్థాంకాలు ముఖ్యంగా నాయికానాయకుల పాత్రచిత్రణముతో నిండినవి. భాసుని పాత్రపోషణ విధానము ప్రతిమా నాటకమున మరియొకవిచిత్రరూపము దాల్చింది.

చమత్కార కథాకల్పనము

ఇక భాసమహాకవిచమత్కార కథాకల్పనమును సూచిస్తాను. సంస్కృతనాటక వాఙ్మయమున వర్ణనాశిల్పమందు కాళిదాసెంత నేర్పరో, రసపోషణమున భవభూతి ఎంత దక్షుడో, పాత్రపోషణమున శూద్రకుడెంత సమర్థుడో, చమత్కార కథాకల్పనములోని రసమయ సన్నివేశాలు కూర్చుటలో భాసుడంత ప్రతిభాశాలి. అసలీ స్వప్నవాసవదత్త నాటకము కథారామణీయకమువలన ప్రఖ్యాతమైనది. ఇందు రసోత్కృష్టతకంటే, పాత్రపోషణ వైచిత్రికంటే కథాచమత్కారమే అత్యధికము. ఈ విషయమున కవి తన నాటకవస్తువును విమర్శించువానివలె చతుర్థాంకమున రాజవిదూషకులు పద్మావతీ వాసవదత్తల శీలతారతమ్యమును సూచించిన తర్వాత పద్మావతినోట "కథాయోగము మిక్కిలి రమణీయముగా ఉన్న"దని చెప్పించును. మరియు పంచమాంకమున రాజు విదూషకునితో నిద్రపోగొట్టుటకై "ఒక కథ చెప్పు"మని అడుగును. అదీకాక పద్మావతితలనొప్పి తీసివేయుటకై వాసవదత్త కథలు చెప్పుటకు వినియోగింపబడును. రమణీయ కథాశ్రవణము నిద్రనూ, తలనొప్పినీగూడ పోగొట్టునని కవియుద్దేశమైయుండవోపు.

పంచమాంకమున పద్మావతీశిరోభారనెపమున ఆమెకై నియమింపబడిన పాన్పుపై వత్సరాజు పరుండుటయు, ఆమెను చూచునిమిత్తమున వాసవదత్త అక్కడకు వచ్చి, తలనిండ ముసుగుపెట్టుకొని పరున్న రాజును పద్మావతిగా భావించి అతని ప్రక్కనే పరుండుటయు, రాజు స్వప్నమున వాసవదత్తను కలవరింపగా ఆమె విస్మయముచెంది లేచుటయు, రాజు తమ పూర్వప్రణయకలహవృత్తాంతమునుగూర్చి కలవరింపగా ఆమె అతని నోదార్చి అతని హస్తమును స్పృశించి పరులు గనుగొందు రను భయముతో నిష్క్రమించుటయు కవి బహురమణీయముగ కూర్చినాడు. భ్రాంతిమూలకమైన ఈ సన్నివేశమున, విరహాగ్నిచే గ్రాలు ప్రేయసీప్రియులను ఏకశయ్యపై పరుండునట్లు చమత్కారకల్పనము చేసి కవి సామాజికులకు వినోదము కూర్చినాడు. ఇది సంభావ్యముగగూడ ఉన్నది. నాటకమున ఆయువుపట్టిదే. ఈ రసవత్సన్నివేశము నాశ్రయించే నాటకమునకు స్వప్నవాసవదత్త మని పేరు పెట్టినాడు కవి. ఇందలి సంభాషణము బహు రసవంతముగానున్నది. ఔచిత్యము, సభ్యత చెడగొట్టకుండ ఇటువంటి మనోహరమైన శృంగారరసమయసన్నివేశములను గూర్చుట బహుకష్టము. ఆంధ్రవాఙ్మయమందు కళాపూర్ణోదయమున సుగాత్రీశాలీనుల కథగూడ ఇట్లే నిర్వహింపబడింది.

స్వప్నవాసవదత్తమందలి ఈ రసమయసన్నివేశమునే ఆదర్శముగ గ్రహించి భవభూతిమహాకవి ఉత్తరరామచరిత్రమందు ఛాయాంకమను తృతీయాంకమున,

శ్రీరాముడు దండకారణ్యమున సీతావియోగమున దుఃఖించుచుండుటయు, సీతాదేవి భాగీరథీప్రసాదమున ఇతరులకు గనబడకుండునట్లు వరమును గొని యటకు వచ్చి రాముని విషాదావస్థను గాంచి, అతడు మూర్ఛ చెందినపుడు తన హస్తస్పర్శమున అతనికి స్పృహదెప్పింపగా సీత బ్రతికియేయున్నదని శ్రీరాముడు భావించినట్లు చిత్రించినాడు. స్వప్నవాసవదత్తా, ఉత్తరరామచరిత్ర నాటకములు రెంటియందు నాయకులు అలీక భార్యా మరణమునకై విలపించువారే. రెండు నాటకములందు నాయకులు దమ ప్రియురాండ్రను గాంచలేకున్నను, తమ దుఃఖమునుమాత్రము వారు ప్రత్యక్షముగా జూచుచునేయుండిరి. రెండు నాటకములందు నాయకులు అజ్ఞానావస్థయందు దమ ప్రియాహస్తస్పర్శలనుపొంది, వారి హస్తములనుగ్రహింపబోయి విఫలమనోరథులయ్యు, వారిని గాంచినట్లు భావించి, వారు సజీవులని తలపోయువారే. స్వప్నవాసవదత్తమున రాజు స్వప్నావస్థయందుండుటచే వాసవదత్త ఎదురుగ నున్నను చూడలేకపోయినాడు. ఉత్తరరామచరిత్రమున శ్రీరాముడు మేల్కాంచియున్నను భాగీరథీవరప్రసాదమున సీత ఎదురుగ నున్నను గాంచలేకపోయెను. ఈ కథాసంధానములు స్వప్నవాసవదత్తమున నెక్కువ చమత్కారముగను, ఉత్తరరామచరిత్రమున ఎక్కువ హృదయచలనకరముగను ఉన్నవి. షష్ఠాంకమున చిత్రపటముల మూలమున అవంతికయే వాసవదత్త యని నిరూపింపబడుటకూడ ఇటువంటి చమత్కారకల్పనమే.

ఔచిత్య పోషణము

ఇక నాటకమున కవి చేసిన ఔచిత్యపోషణమును సూచిస్తాను. కాళిదాసాదిసంస్కృతరూపకకర్తలూ, షేక్స్పియరు మొదలైన ఆంగ్ల నాటకరచయితలూ తమ నాటకములకై ప్రఖ్యాతమైన కథను వస్తువుగా ఏ పురాణమునుండో, దేశచరిత్రనుండో గ్రహించి, రసపోషణమునకు, పాత్రపోషణమునకు, ఔచిత్యపోషణమునకు మూలమునుండి కొన్ని మార్పులు చేయుదురు. భాసమహాకవి స్వప్నవాసవదత్తనాటకకథను గుణాఢ్యుని బృహత్కథనుండి గ్రహించినాడు.

బృహత్కథయందు వసంతకుడు లావాణకమున వాసవదత్తతోబాటు దగ్ధమైనట్లు కల్పించి, అతడు సోదరుడను మిషతో వారిద్దరిని యౌగంధరాయణుడు పద్మావతియొద్ద దాచినట్లున్నది. కాని పరపురుషుని కంట పడకుండ రక్షించుటకు, అజ్ఞాతకాలమున వాసవదత్తశీలమునకు సాక్షిభూతముగా నుండుటకు, ఆమెను పద్మావతియొద్ద నుంచుకాలమున, పురుషుడైన వసంతకునిగూడ ఆమెయొద్ద నుంచుట ఉచితముకాదు. విశేషించి పరపురుషుని చేర్చుకొనుటకు పద్మావతి అంగీకరింపదు. మరియు విదూషకుడైన వసంతకుడు స్త్రీపార్శ్వవర్తి యగుటకంటె రాజు ప్రక్కనేయుండి అతని కుల్లాసము గూర్చుచుండుట మేలు. లావాణకాగ్నిలో నొక్క వాసవదత్తమాత్రము దగ్ధమైనదనుట విశ్వసనీయముగా నుండదుకావున, సమర్థుడగు యౌగంధరాయణుడు వాసవదత్త దగ్ధమగుచుండగా చూచుచు నూరకుండలేడనియు, అతని ప్రయత్నము వ్యర్థమై తానుగూడ నగ్నిలో దగ్ధమయ్యెననియు, వసంతకుడు రాజుపార్శ్వముననున్నట్లును భాసమహాకవి తన నాటకమున మార్చినాడు.

మూలమున యౌగంధరాయణుడు బ్రాహ్మణరూపమున ఉద్యానవనమున నున్న పద్మావతిని గలసుకొని, తన కుమార్తెను న్యాసముగా నుంచుకొనుమని ప్రార్థించి వాసవదత్త నామెయొద్ద నుంచినట్లున్నది. కాని భటరక్షితమై, అంతఃపుర స్త్రీలకు మాత్రము నియమింపబడిన ఉద్యానమున యౌగంధరాయణుడు బ్రాహ్మణరూపముననైనను బలవంతముగా ప్రవేశించుటయు, ఆమెను న్యాసముగా పద్మావతి గ్రహించినదనుటయు సందేహాస్పదములే. అందుచే భాసుడు నాటకమున పద్మావతి తాపసిదర్శనార్థము తపోవనమునకు పోవుటయు, తపస్వులెవరైన అరణ్యమున నిశ్శంకగా ప్రవేశార్హులు గాన, అక్కడకు యౌగంధరాయణుడు తపస్వివేషమున జేరుటయు, పద్మావతి పరగృహీతల నన్వేషించుటయు, అంత యౌగంధరాయణుడు వాసవదత్తాన్యాసమును వరదానము చేయుటయు, పద్మావతి దాని నిచ్చుట కష్టమని కంచుకిచే ఉపదేశింపబడియు సత్యవాక్యపరిపాలనార్థము దానికంగీకరించుటయు అను మార్పులు చేసి ఔచిత్యము పోషించినాడు.

ఈవిధముగ మహాకవియైన భాసుడు స్వప్నవాసవదత్తమున తన నాటకశిల్పమును అమోఘముగా చిత్రించినాడు.

ఎడబాటు

[కథానిక]

▲

— శ్రీ శివకోటి సత్యనారాయణ —

పాపం, యింకా రంగస్థలవాతావరణానికి బాగా అలవాటుపడలేదు కాబోల్ను, డ్రైవరు వీరన్న, తూగుతూనే ఉన్నాడు. ఈ బర్మారంగానికి వచ్చిన దగ్గరనుంచీ నిద్రకే కరువైపోయింది పాపం!

కాని—ఈ రెండురోజుల్నించీ హాస్పిటల్ డ్యూటీ తగలడంవల్ల మునుపటికన్న ఎక్కువ విశ్రాంతి తీసుకోడానికి టైము దొరుకుతూంది. అలాగే కళ్లుమూసుకొని గడిపేస్తున్నాడు కాలాన్ని.

వచ్చిన రెండోరోజున—వీరన్నకూ, అతనితోడి డ్రైవరుకూ ఏదో సంఘర్షణ జరిగినట్టుంది— ట్రక్కును వార్డుబయట నిలిపేసి, లోనికి పోయి ఏదో గొణుక్కుంటున్నాడు తెలుగులో. ఇతరులకి తెలియని భాషలో తిట్టుకోడం అతని కదొక ఉపశాంతి!

దగ్గరలోనే, ప్రక్కగామన్న గదిలోంచి వినిపించింది "ఎందుకోయ్, అలా తిట్టుకుంటావ్" అని స్పష్టమైన తెనుగులో.

గిరుక్కున తిరిగాడు రిచ్చపోతూ! ఆ హాస్పిటలుకు వచ్చిన తరువాత యితరుల నోటినుంచి తెలుగు వినడం అదే మొదటిసారి.

ఆమెనుకూడ ఆ హాస్పిటల్లో రెండుమూడు సార్లు చూచాడుకాని ఆమెకు తెలుగు తెలుసు ననుకోలేదు.

"ఎవర్ని, అలా తిడుతున్నావ్?" మళ్లీ అడిగిందామె—కుర్చీలో కూచుని రాసుకొంటూ.

"అబ్బే, లేదండి. ఆ రెండో డ్రైవరున్నాడు పెంకిఘటం. తనకు తెలీదు; ఇతరులం చెప్తే వినడు. వాణ్ణి లక్షసార్లు హెచ్చరించాను 'ట్రక్కును వదిలి వెళ్లకురా' అని. ఒకవేళ ఎక్కడకన్నా వెళ్లాల్నంటే, ట్రక్కును నాకు వప్పగించి, చెప్పి, వెళ్లమన్నాను. అసలే గడ్డురోజులాయె! ఏనిమిషానికి ఎటువచ్చి ఎటు పోతుందో తెలియదు. అలాంటప్పుడు వీడు ఖాతరు లేకుండా ట్రక్కును ఓమూల వదిలేసి యిష్టంవచ్చినట్టు పచార్లుకొడతాడా!"

"ఎవడూ వాడు, ఆ రెండో డ్రయివరు?"

"వాడూ...పంజాబీవాడు."

"సరే, వాడి తిక్క కుదిరిపిస్తానుగాని, మీ...ది...మీదేవూరూ?" అంది తీక్షణంగా చూస్తూ.

"మాది నర్సాపురం తాలూకాలో ఒక గ్రామమండి."

"అంటే గోదావరిజిల్లాగదూ?"

"ఔనండి."

ఆమె దేవూరో తెలుసుకోవాలని వీరన్నకుకూడ కుతూహలంగానే ఉంది. కాని ఏమన్నా అనుకుంటుం దేమోనన్న భయం.

ఇంతచనువుగా మాట్లాడుతున్నప్పుడు ఈ మాత్రానికే ఏమన్నా అనుకుంటుందా అన్న సంకల్పానికి వచ్చి అడిగేశాడు.

"తమ దేవూరమ్మగారూ?"

"మాది విశాఖపట్నం. సరేగాని, నీపేరేమిటోయ్?" అని అడిగింది. వ్రాసినకాగితాన్ని మడుస్తూ.

"వీరన్నండి."

నిజంగా వీరన్నకు ఆమెతో మాట్లాడాలని ఎంతో కుతూహలంగా ఉంది. ఆ హాస్పిటల్‌లో అసలు తెలుగువాళ్లే లేరనుకున్న వీరన్న ఆమె 'తన తెలుగు గడ్డ' నుంచే వచ్చిందంటే ఆశ్చర్యపోడూ!

ఇంతలోనే బయటనుంచి ఎవరో వీరన్నను పిలిచిన కేక.

"వాడు పిలుస్తున్నాడండి. మళ్లీ యిప్పుడే వస్తాను" అంటూ బయటకుపోయాడు వీరన్న.

రెండునిమిషాలు పోయాక మళ్లీ వచ్చి, "సప్లయికి పోవాలి. మళ్లీ రేపొస్తాను లెండి" అంటూ, ఆమె చెప్పబోతున్న దేమిటోకూడ వినిపించుకోకుండా వెళ్లి పోయ్యాడు, ఆదరాబాదరగా. ట్రక్కువైపుకి.

సప్లయిలుతీసుకొని, ఆరోజు కొంచెం ప్రొద్దుపోయినతరువాత వచ్చాడు వీరన్న. అప్పటికప్పుడే క్యాంపుఅంతా మాటుమణుగుతూండడంవల్ల మళ్లీ ఆ వార్డులోకి వెళ్ల వీలుపడిందికాదు. ట్రక్కును చెట్టు చాటున నిలిపి, ఆ సీటులోనే కూచుని, స్టీరింగుచక్రం మీద బుర్రని ఆన్చుకుంటూ కునుకుతీశాడు తెల్లారే వరకూను.

యుద్ధరంగంలోని ఏ సైనికునికైనా యింతకన్నా ఎక్కువ విశ్రాంతి దొరకడం దుర్లభం.

* * * * *

మర్నాడు—పదకొండు కావస్తోంది.

వీరన్న, తాను ఉదయాన్నే చేయవలసిన డ్యూటీని పూర్తిచేసుకుని, ఆ వార్డులోకి వచ్చాడు. ఆమె అక్కడే కూచునుంది, ఏదో ఉత్తరం రాసుకొంటూ.

"ఏం వీరన్నా, చెప్తూన్న మాటన్నా వినిపించుకోకుండా వెళ్లిపోయావు నిన్నసాయంత్రం?" అంది పైకిచూస్తూ.

"అబ్బే లేదండి, బాగా చీకటిపడిపోతే సెంట్రీలూ, గార్డులూ ప్రతిచోటా ఆపి చెక్‌చేస్తారు గదాండి! లేనిపోని తిప్పలన్నీ ఎందుకూ, బాగా వెలుగుండగానే వెళ్లొచ్చేస్తే మంచిదని కాస్త విసురుగానే పోయానులెండి" అన్నాడు క్షమాపణార్థంగా.

ఒకక్షణం నిశ్శబ్దంగా గడిచిపోయాక—

"సరేకాని వీరన్నా, మిలిటరీలో చేరకముందు ఏం చేస్తూండేవాడివి?" అంది, రాత ఆపి.

"ఏదో కామందుల భూముండేది. సాగుబడి చేసుకుంటూండేవాణ్ణండి."

"అయితే, చక్కగా యింటిదగ్గర కాలం గడిచి పోతూన్నప్పుడు మిలిటరీలో ఎందుకు చేరేవు?"

"అదంతా......" కొంచెం తడబడ్డాడు. ఆ తడబాటును గ్రహించకపోలే దామె, ఓరచూపుతో.

మళ్లీ "ఏదోలెండి, అయిపోయింది. నా కీమిలిటరీలోనే స్వేచ్ఛగాఉంది. గడిగడిక్కీ గండమైనా యిక్కడే సుఖంగా ఉంది." అన్నాడేకాని, అతని మాటల్లో ఏదో వ్యథ స్పష్టంగా గోచరిస్తోంది. గోడనున్న స్టెతస్కోపుపై నిగిడించిన అతని దృష్టిలో పూర్వజీవితం అంతా సినీమా బొమ్మల్లాగ తిరిగి పోయింది!

"అయితే, వీరన్నా..." అని ఆమె వీరన్నను జాగృతినుంచి లేపేవరకూ అతడీలోకంలోనే లేడు.

"ఆఁ, ఏమండీ?" అన్నాడు ఒక్క దీర్ఘనిశ్వాసం విడిచి, బుర్ర గోక్కుంటూ.

"పాపం, పెళ్లాంపిల్లలు జ్ఞాపకం వస్తున్నట్టున్నారు" అన్నదామె సానుభూతి చూపిస్తున్నట్టు.

"అబ్బే, లేదండి"—ఇంకా ఏదో చెప్పబోదామనుకున్నాడుగాని నోరు పెగల్లేదు.

"ఏదో దాస్తున్నావ్. మనస్సులోని సుఖదుఃఖాల్ని తోటివాళ్లతో చెప్పుకుని వెళ్లగ్రక్కుకుంటే గాని మనశ్శాంతి ఉండదు చూడు. అవునా?"

ఆమె అంత కలుపుగోరుతనంగా మాట్లాడుతూండడం చూసి ఆశ్చర్యపోయాడు వీరన్న.

ఆమె—ఆఫీసర్ల హోదాలోని నర్సింగ్ సిస్టరు.

వీరన్న—మామూలు సిపాయిమాదిరిగా పరిగణింపబడే ఒక డ్రయివరు.

ఇద్దరకూ వక్కటే, నాకలోకానికీ ఉన్నంత తేడా ఉంది. అలాంటప్పుడు ఆమె అంతచనువుగా మాట్లాడుతుందేమా అని అతని ఆశ్చర్యం.

నిన్నటినుంచీ పరిచయం ఉందేకాని యింత వరకు ఆమెపేరుమాత్రం తెలుసుకోలేకపోయాడు—ఏమన్నా అనుకుంటుందేమోనని. కాని, యిప్పుడామె చూపిన కలుపుగోరుతనంతో కొంచెం ధైర్యం చిక్కింది.

"తమ పేరేంటండీ?"

"నా పేరా....నా పేరు...రమణమ్మ అని తే పరేగాని, నే నడిగిందానికి సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నావే!" అంది.

"దేన్ని గురించండి?"

"అదే, నువ్వు, యింటిదగ్గర రాజాలాగ గడిపే జీవితాన్ని కాళ్లదన్నుకొని, మిలిటరీలో ఎందుకు చేరావని."

తన పుట్టుపూర్వోత్తరాలనుగురించి ఎందు కింత పట్టుదలగా అడుగుతుందా అని ఒక్క క్షణంసేపు విచారించాడు. కాని అంత చనువుగా మాట్లాడుతున్న ఆమెతో తన కష్టసుఖాల్ని వెలిబుచ్చుకొంటూ ఒక విధంగా మనస్సంతాపాన్ని తీర్చుకోడం తప్పనిపించలేదు.

"ఏదోలెండి, అంతా అదోమాదిరిగా గడిచిపోయింది."

"ఏది ఏమాదిరిగా గడిచిపోయిందోయ్?" అంది అడ్డుప్రశ్న వేస్తూ.

ఇక తప్పించుకుందుకు మార్గం లేకపోయింది.

"ఇంట్లో కొంచెం తగాదాలు వచ్చినై లెండి" అని, అంతటితో ఆగిపోయాడు.

కాని, ఆమె వదిలిపెడుతుందా?

"ఎవరితో? 'ఆవిడ'తోనా, లేక అమ్మతోనా తగాదా?"

"ఇంకా పెళ్లి కాలేదండి. అయ్యేదేకాని......" చెప్పబోతూండగానే అడ్డువచ్చిం దామె.

"ఇంకా పెళ్లి కాలేదూ!" అని ఆశ్చర్యంగా చూడ్డం మొదలెట్టిందామె, వీరన్నను పైనుంచి క్రిందకు. చూస్తూ.

"లేదండీ. కాని......" అతడి చూపులు బరువైన సిగ్గుతో క్రిందకు దిగజారిపోయినై చిరునవ్వుతో.

ఆచూపుల్లోని అంతరార్థాన్ని గ్రహించగలిగిం దామె.

"అయితే, పెళ్లి కాకముందే, అమ్మాయిని సంపాదించి పెట్టుకున్నావన్నమాట?" అంది నవ్వుతూ.

"అంతేనండి."

అప్పుడు గ్రహించాడు, ఆకలిస్తే ప్రేగులు లెక్కచెడుతుందని.

"సరే, జరిగిన విశేషమేమిటో సాంతంగా చెప్పూ" అంది.

"చెప్పేదేముంది లెండి. ఆపిల్లా, నేనూ చాణ్ణాళ్ల బట్టి పెళ్లిచేసుకుందామనుకున్నాం. కాని వాళ్లబాబు—తనడిగినంత 'ఓలి' నేనివ్వలేనని తెలుసుకొని—ఆపిల్లను బలవంతాన్న యింకోడికి తీసుకెళ్లి కట్టబెట్టేడు. అక్కడికీ ఒకరోజున ఆపిల్లా, నేనూ దొంగతనంగా ఒకచోట కలుసుకొని, ఆమర్నాడే ఆవూరినుంచి మకాం ఎత్తేద్దా మనుకున్నాం. అనుకున్నామే గాని—సాగుబడిలో ఉన్న పొలాన్ని ఎలా వదిలేసి పోవాలో, పోతే యింటిదగ్గర అమ్మా, చిన్నితమ్ముడూ ఏమైపోతారో, ఒకవేళ పోయినా ఆతరువాత ఏం చెయ్యాలో—ఆలోచించుకోనేలేదు.

"ఈసంగ తెలా తెలిసిందో దాని మొగుడికీ, ఆమర్నాడు పొద్దున్నే దాన్ని జుట్టుపట్టుకు లాక్కొచ్చి నన్నుకూడ బైటికిలాగి, యిద్దర్నీ నిలదీసి అడగడం మొదలెట్టేడు. ప్రాణం నిజంగా చచ్చిపోయిందంటే నమ్మండి! అంతవరకూ ఎలాగో గుట్టుమట్టుగా బ్రతుకుతూవచ్చిన మాఅమ్మకుండే గౌరవంకూడా పోయింది.

ఆమట్టున ఉక్రోషాన్ని వాడూ, నేనూ తన్నుకున్నాంకూడా! అప్పణ్ణుంచీ, నన్ను ఊళ్లోవాళ్లంతా అదో మాదిరిగా చూడ్డం మొదలెట్టేరు. మా కామందుల ఇంట్లోకూడ అందరూ దూరదూరంగా ఉంటూ నన్ను అదోమాదిరి అసహ్యంగా చూడ్డంమొదలెట్టేరు. ఆ తరువాత నాకు ఊళ్లో ఉంటానికే మనసొప్పలేదు. కాని ఇంకో వూరు పోతే, కొత్తగా ఏ కామందు

కాస్తైనా పట్టుకోవాలె. అదైనా నమ్మకం లేదు. అంచేత ఏమీ తోచక, మిలిటరీ జ్ఞాపకంవచ్చి ఆ మాడోలోబారాత్రే, అమ్మతోనైనా చెప్పకుండా బెజవాడ పరుగెత్తుకొచ్చి రిక్రూటయ్యాను. అంతేనండి" అని చెప్పాడు చాలా ముక్తసరిగా.

"అయితే, ఆపిల్లా, నువ్వూ ఎంతకాలం కలిసి ఉంటూండేవాళ్లు, పెళ్లి కాకముందు!" అని చాలా ఆత్రతగా అడిగింది.

అందులోని భావాన్ని అతడు కులాసాగా గ్రహించలేకపోయాడు! కాని జవాబివ్వడం తప్పదు గదా అని—

"చిన్నప్పట్నుంచీ ఎరుగుదుం" అన్నాడు.

"ఆహా......అలాగా!" అంది ఆలోచనా పూర్వకంగా అతడి బలిసిన భుజాలమీదికి చూస్తూను.

"వెళ్తానండి. భోజనం టైమయింది."

"పాపం! చాలాసేపట్నుంచి నిలుచునే ఉండి పోయావు. మళ్లీ ఆనక వస్తావుకదూ?" అంది జవాబు కోసం ఎదురుచూస్తూ.

"అలాగే లెండి" అని వెళ్లిపోయ్యాడు.

వార్డుమలుపు తిరిగి వెళ్లిపోయేదాకా అతనివేపే చూస్తోంది. వీరన్నంటే అంత ఆత్రత ఎందుకు పుట్టి పోయిందో! ఏమిటో ఆమె ఉద్దేశ్యం!

* * * * *

ఆ గడచిన అయిదురోజుల్లోనూ ఆమెలో ఎంతో మార్పు కనిపిస్తోంది. ఆరోజువ వార్డులో నలుగు రైదుగురు పేషెంట్లుమాత్రమే ఉన్నారు. హాస్పిటల్ స్టాఫ్‌వాళ్లమాత్రం యిద్దరు ముగ్గురు అటూ యిటూ తచ్చాడుతున్నారు.

"మా అమ్మదగ్గరనుంచి ఉత్తరం వచ్చిందండో" అంటూ గదిలోకి ప్రవేశించబోయ్యాడు వీరన్న. కాని రమణమ్మ యింకెవరో వారంటాఫీసరుతో మాట్లాడుతూం డటం చూసి గతుక్కున ద్వారందగ్గరే నిలబడిపోయాడు.

"రా వీరన్నా, లోపలికి రా. స్టాఫ్‌లోనివాడేలే యితను. బెంగాలీ. మన తెలుగు తెలీదులే. కూచో ఆ బల్లమీద" అంది. వెంటనే వారంటాఫీసరువైపు తిరిగి "మా తెలుగువాడే. డ్రైవరు వీరన్న. మంచివాడు." అన్నది యింగ్లీషులో, మూలని కూచున్న వీరన్నవైపు చూసి, చిరునవ్వు నవ్వుతూ.

ఆ బెంగాలీబాబు తిరిగి ఏదో చెప్తాన్న మొదటి మాటలోనే అడ్డంవచ్చి, వీరన్నవైపు తిరిగి అడిగింది: "ఏమిటో అనుకుంటూ వస్తున్నావేమిటి?"

"మా అమ్మదగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. అందులో—" తరువాత చెప్పడానికి సంకోచించాడు.

"ఏమిటే అందులో? 'నీకు పిల్లను చూసి ఉంచాను. వచ్చి పెళ్లిచేసేసుకుని కాపరం వెలగబెట్టు' అని రాసిఉందా?" అన్నది పరిహాసం చేస్తూ.

"కాదు, ఈ నెల యింకో అయిదో పదో ఎక్కువ పంపమంది" తొందరగా చెప్పేశాడు, మూతి ముడుచుకుంటూ.

"అబ్బో, ఈ మాత్రం వేడుకోడానికే అంతగా మూతి ముడుచుకోవాలా!" అన్నది కనుబొమ్మలు పెద్దవిచేస్తూ.

ఆమెమాటల్లోని వ్యంగ్యం ఏమీ అర్థంకాలేదు వీరన్నకు.

వీళ్లిద్దరూ తెలుగుభాషలో అదేపనిగా మాట్లాడు కోడం ఆ బెంగాలీబాబుకు చిరాకు పుట్టించక పోలేదు. కుర్చీలోంచి లేచిపోయాడు ఒళ్లు విరుచు కుంటూ.

"వెళ్తాను సిస్టర్" అన్నాడు యింగ్లీషులో.

"ఓ, అలాగే" అని, తడుంకోకుండా సమాధాన మిచ్చింది. ఆ బెంగాలీబాబుని ద్వారంవరకన్నా సాగ నంపడానికి—అసలు కుర్చీలోంచి లేవనేలేదుగదా!

"పోయాడులే! అయితే, వీరన్నా, మీఅమ్మ యింకొంచెం డబ్బు పంపమని రాసిందా? సరేకాని, నీ జీతం ఎంత యిప్పుడు!"

"ఇరవై అయిదూ చిల్లరండి. అందులో అమ్మకు పదిహేను రూపాయలు 'ఎల్లాటుమెంటు' చేశాను. తక్కిందే నా సొంతఖర్చుకు"

"తక్కిన పదిరూపాయలూ నిజంగా నీ సొంత ఖర్చుకు సరిపోతాయా?"

"ఓ! మహారాజులాగ! ఈ ఫీల్డులో ఖర్చేముం దండీ?"

"నేను నమ్మను"

ఏం సమాధానం చెప్పాలో తోచిందిగాదు వీరన్నకు.

"అయితే, వీరన్నా, ఏమీ అనుకోకుండా ఉంటే ఒకమాట చెప్తాను వింటావూ? కోపం రాదుగదా!"

"కోపం ఎందుకూ? చెప్పండి"

"నిజంగా?"

"నిజంగానే"

"అయితే, తప్పకుండా వింటానని ఒట్టువెయ్" అని చెయ్యి చాపింది.

వీరన్నకంతా అయోమయంగా ఉంది. ఏం చెయ్యాలో తోచనేలేదు.

"అయితే అంతేనా" అంది చీదరించుకుంటూ.

"లేదండీ"

"అయితే ఒట్టెయ్యి" అని మళ్ళీ చెయ్యి చాపింది.

"వెంగాడనికూడా ఆలోచించకుండా ఒట్టు కోసం చెయ్యిచాపుతుందేమిటీ" అనుకున్నాడు. కాని, ఏమిటో అర్థంకాక చేతిలో చేయి వేశాడు.

"సరే చెప్తా విను. ముప్ఫయి రూపాయలిస్తాను; సగం అమ్మకు పంపించుకొని సగం ఖర్చుకు ఉంచుకో! ఏం?" అంది సొరుగులోని చిన్న పర్సును తీస్తూ.

"ముప్ఫయి రూపాయలయితే తరువాత తీర్చు కోలేనండి."

"ఏమిటీ తీర్చుకోవడం? అప్పా సప్పా యివ్వడం లేదే నేను?"

విస్తుబోయాడు ఏమీ అర్థంకాక.

మూడునోట్లనీ వీరన్న అరచేతిలో పెట్టి చేతిని ముడిచింది.

"సరేనా? యిక వెళ్ళు. మరి మాట్లాడకు. మళ్ళీ అడక్కొస్తావా లేదా?" అంటూ కుర్చీలోంచి లేచి, ద్వారంవరకూ లాక్కుపోయింది వీరన్నను. నవ్వుతూ. "పదకొండున్నరయింది. భోజనానికి వెళ్తున్నాను. అడక్కొస్తావుగదూ, తప్పకుండా" అంటూ వెళ్ళిపోయింది బైటికి.

వీరన్న చేష్టలుడక్కి చూస్తూ, అలానే నిలబడిపోయాడు ఒకనిమిషం సేపు.

ఒక డ్రయివరుతో అంతచనువుగా మాటాడుతున్నందుకు పెద్ద ఆఫీసర్లేమన్నా అనుకుంటారేమో నన్న చింత ఆమెకు కొంచెమైనా లేదు.

ఆమె చిత్తప్రవృత్తి రోజురోజుకూ, గడియ గడియకూ విచిత్రంగా పరిణమిస్తోంది.

* * * * *

మరొక నాలుగురోజులు గడిచిపోయాక—

ఆరోజున హెడ్‌క్వార్టర్సునుంచి జాగ్రత్తలో ఉండమని హెచ్చరిక వచ్చింది. ఎవరి ట్రెంచీలని వాళ్ళు భద్రంచేసుకొని, ఎప్పుడు 'అలారమ్ సిగ్నల్' వస్తుందా అని భయపడి చూస్తున్నా రందరూను.

సాయంత్రం నాలుగుగంటలకి వీరన్న రొజుకుంటూ వచ్చి—

"రవణమ్మగారూ, తొందరపడాలి, టైం ఏమాత్రం లేదు. లేవాలి" అంటూ తొందరపెట్టేశాడు.

"ఏమిటీ సంగతి? విమానాలేనా? అయితే నడు. మరి, నీ ట్రక్కును వదిలిపెట్టివచ్చేశావే!"

"నా ట్రక్కూ, నేనూ బాగానే ఉన్నాం. కాని మీరు నడండి, ట్రెంచిలోకి తొందరగా!"

ఇద్దరూ వార్డు దాటిరాకముందే సైరనులు కూత మొదలెట్టాయి.

అదృష్టవశాత్తు ఆరోజున వార్డు అంతటికీ ఒక్కడే పేషెంటు ఉన్నాడు. సైరనుకూత వినిపించగానే ఆ పేషెంటుకూడ కొంచెం ఓపికపట్టి లేచి షెల్టరును వెతుక్కుంటూ బయటకుపోయాడు. అందుచేత రవణమ్మకుగాని, లేక ఆ వార్డులోని తక్కినస్టాఫ్ వాళ్ళకు గాని పేషెంటునుగురించి అంతగా జాగ్రత్త తీసుకోవలసిన అవసరం లేకపోయింది.

వార్డుకు దగ్గరలో పొదచాటున త్రవ్విన చిన్న ట్రెంచిలోకి దిగిం దామె.

"అదుగో, నా ట్రక్కు ఆ చెట్టుక్రిందే ఉంది. గబగబా పోయి, అక్కడున్న ట్రెంచిలో దాక్కుంటాను. వెళ్తున్నా. మీరుమాత్రం జడవకండి" అంటూ ట్రక్కు ఉన్న వేపు పరుగెత్తిపోబోయాడు వీరన్న.

"వీరన్నా, ఎక్కడికెళతావ్? నీ ట్రక్కును చూస్తూ రెండో డ్రయివరున్నాడులే! నాకు భయమేస్తోందన్నా. నీవు నాకు తోడుండుగాని రా."

ఇంతలోనే ఎక్కడో ఆకాశాన విమానాలు కీటకాల్లాగ—క్రిందనుంచి 'ఢా'మ్మని గన్ పేలినశబ్దం!

రవణమ్మ బేజారైపోయి, పరుగెత్తిపోడానికి సిద్ధంగా ఉన్న వీరన్న చెయ్యిపట్టుకొని ఒక్కపట్టున లాగేసింది ట్రెంచిలోకి.

ఈసారి విమానశబ్దం స్పష్టంగా వినిపిస్తోంది. దూరాన ఎక్కడో బ్రహ్మాండమైన పిడుగు పడ్డ శబ్దం!

భయంచేనైతేనేమి, మరెందుచేనైతేనేమి ఈ సారి ఆమె వీరన్నను కౌగిలించుకోకుండా ఉండలేకపోయింది.

అల్ క్లియర్ విన్నతరువాత యిద్దరూ లేచారు ట్రెంచిలోంచి ధూళితో నిండిన బట్టలతో.

"గండం ఒకటి గడిచిందోయ్, నిజంగా!" అంది తెల్లటిడ్రస్సుమీది దుమ్మును దులుపుకుంటూ.

"అవునండి, నిజంగానే. మరి నే వెళ్తాను. ట్రక్కు దగ్గరికి వెళ్లి ఏమైందో చూసొస్తాను."

ఇద్దరి మొహాలూ కొత్తగా ఉన్నాయి.

ఆరోజునుంచీ వారిద్దరిలోనూ అదోరకమైన మార్పు!

ఇప్పుడు వీరన్న ఆమెతో మాట్లాడే ప్రతిమాట చివరా "అండీ" చేర్చటం లేదు!

వారిద్దరూ అంతచనువుగా తిరగడం, అలా మాట్లాడుకోడం హాస్పిటల్ స్టాఫ్‌లోని కొంతమంది గ్రహించి గుసగుసలాడుకోకపోలేదు; ఆమె లెక్కచేయనూలేదుకూడా!

ఒక్క డ్యూటీ టైములో తప్పించి, తక్కిన అస్తమానమూ రవణమ్మతో ఏదో మాట్లాడుతూనే ఉంటాడు వీరన్న.

ఆరోజు—తెల్లారుఝాము నాలుగుగంటలప్పుడే పిడుగులవర్షం ప్రారంభమయింది. క్రిందనుంచి ఫిరంగులూ, పైనుంచి విమానాలూ! చాలా బీభత్సంగా ఉంది. బాగా తెల్లారినతరువాతకాని ఆల్‌క్లియరు రాలేదు.

నీరసంగా లేచింది రవణమ్మ ట్రెంచిలోంచి, మరియిద్దరు నర్సులతోకూడ. ఆమె కారోజున ఏదో చెప్పలేని అదురు, భయం అంకురించాయి. కాలకృత్యాలు తీర్చుకొని వేవేగంగా వచ్చింది హాస్పిటల్‌కి.

అప్పుడప్పుడే దెబ్బలుతగిలినవాళ్లని తీసుకొచ్చి దిగబెట్టిపోతున్నయి ఆంబులెన్సులు. ఆవార్డు డాక్టరూ, రవణమ్మా యిద్దరూ ఒక్కొక్క పేషెంటుదగ్గరికీ వెళ్లి జాగ్రత్తగా పరీక్షిస్తున్నారు.

"ఆఁ......వీరన్న!" ఇరవై రెండో బెడ్ దగ్గరికి వచ్చేటప్పటికి తుళ్లిపడింది రవణమ్మ. బెడ్‌లో స్పృహతప్పిపడిఉన్న మొహంకేసి చూస్తూ అలా ఎంతసేపు కొయ్యబారిపోయిందో తెలియదు.

అవును, వీరన్నే, అభాగ్యుడు! ఆరాత్రి చాలా పొద్దుపోయాకకాని రాలేకపోయాడు. కాని లైనుల దగ్గరున్న సెంట్రీలు అతన్ని ముందుకు పోనీలేదు. వెనకాల వస్తూన్న మరిరెండు ట్రక్కులకుగూడ యిదే గతి పట్టింది. అక్కడికీ వీరన్న తన మిలిటరీగుర్తులన్నీ చూపిస్తూ, ఆసెంట్రీలని చాలా వేడుకున్నాడు. దారి విడిచిపెట్టమని. కాని వాళ్లుమాత్రం 'ససేమిరా' అన్నారు.

"సాయంత్రం ఆరుగంటలలోగా మీమీ కంపెనీలకి వెళ్లిపోవలసిందని హుకుం వచ్చినప్పుడు ఎందుకు వెళ్లిపోయారుకారు! రోజూ ఉండే రాస్తా ఈ సాయంత్రంతో బందయిపోయింది. ఇంకో కొత్తరాస్తా ఉందికాని, దానిమీది వంతెనలు చాలా అల్పంగా ఉన్నాయి. మూడుటన్నుల ట్రక్కులూ, అయిదుటన్నుల ట్రక్కులూ యింకా ఆ కొత్తరాస్తాని వెళ్లడానికి వీల్లేదు. రేపొద్దున ఆ వంతెనల్ని గట్టిపరిచాక తెరుస్తారు. అందాకా మీమూడు ట్రక్కుల్నీ ఆపొదక్రిందో, లేక చెట్లక్రిందో దాచుకోండి." అన్నారు సెంట్రీలు.

ఇక తప్పనిసరిగా వెనక్కు పోతూ, దగ్గరలోనే ఉన్న పెద్దపెద్ద తుప్పలచాటున ట్రక్కుల్నీ నిలిపి, రైఫిల్సునికూడ అమర్చిపెట్టుకొని, స్టీరింగుల మీద తల మోపుకుంటూ కునుకుతీయడం ప్రారంభించారు.

తెల్లారుఝాము నాలుగుగంటలకి దూరాన ఎక్కడో సైరను కూసిందిగాని, ఆ మగతనిద్రలో స్పష్టంగా వినిపించకపోవడంవల్ల ఆ డ్రయివర్లలో ఒక్కరూకూడ తెలివి తెచ్చుకోలేకపోయారు.

ఫర్లాంగుదూరంలోని 'ధా'మ్మన్న శబ్దంతో త్రుళ్లిపడ్డారు. కాని కళ్లునులుపుకొని ట్రక్కులోంచి క్రిందకు గెంతి ఏదుబ్బులోనో దాక్కుని, ప్రాణరక్షణ చేసుకుందుకు ప్రయత్నించడానికైనా చాలినంత సమయమేదీ?

ఉత్తరక్షణాన్నే కొన్ని గజాలదూరంలోనే బ్రహ్మాండమైన మరొక శబ్దం! పెద్దఎత్తున లేచిన దుమ్మూ, ధూళీ ఆ మసకచీకటినికూడా పూర్తిగా కమ్మేశాయ్!

ఆల్ క్లియరు వచ్చేటప్పటికి బాగా తెల్లారిపోయింది. దెబ్బతగిలిన ప్రదేశాలవైపు పరిగెత్తుతూ పోతున్నారు అంబులెన్సు సిపాయిలు స్ట్రెచర్లతో. నిర్భాగ్యుల్ని మోసుకుంటూ వస్తూన్నాయి మెల్లిగా అంబులెన్సుకార్లు హాస్పిటలు వేపు.

అవును పాపం, వీరన్నకూడ నిర్భాగ్యుడే! వీపుకి ఎడంవైపున గట్టి కవుకుదెబ్బ తిన్నాడు. స్పృహ లేదు. శ్వాసకూడ కష్టంగా వస్తూపోతూంది. కాని, రవణమ్మకు మాత్రం వీరన్న తప్పకుండా బతుకుతాడని ఆశ కలిగింది.

వార్డులోని పేషెంట్లదగ్గిరికి టెంపరేచరు తీసుకోటానికి, బలవంతాన మందులు మింగించడానికి రవణమ్మ వచ్చేటప్పుడు, వీరన్న బెడ్ మీద కూచుని చాలాసేపు ఏవో మాటలు చెపుతూండేది. వీరన్నకూడా అప్పుడప్పుడూ చిరునవ్వు నవ్వుతూండేవాడు. కాని గట్టిగా మాట్లాడలేడు, ఆయాసం!

ఒక పేషెంటుబెడ్ మీద మరొకరు వచ్చి కూర్చోడం హాస్పిటల్ రూల్సుకు వ్యతిరిక్తమైన పని. అయినా ఆమె అట్టే లెక్క చేసేదికాదు.

ఆరోజున ఆమె హఠాత్తుగా వచ్చింది, వీరన్న బెడ్ దగ్గిరికి, టైముగాని టైములో. ఆమెకళ్లు కొంచెం ఎఱ్ఱబడున్నాయి. మధ్యమధ్య కన్నీరుకూడ గిఱ్ఱున తిరుగుతూందేమో! అప్పటికి వీరన్న సుషుప్తిలో ఉన్నాడు.

"వీరన్నా" అంది మెల్లిగా, వణుకుతూన్న కంఠంతో.

కళ్లు విప్పాడు, మెల్లిగా నవ్వుతూ.

"వీరన్నా!"—ఈసారి కంఠం రుద్ధమైపోయింది. కన్నీటిబొట్లు నాలుగు జారినై.

అర్థంకాని చూపులతో ఆమెకళ్లల్లోకే దృష్టి నిగిడించాడు వీరన్న. కనుబొమ్మలు ముడుస్తూ.

అరనిమిషంసేపు వీరన్న కళ్లల్లోకే చూస్తూ ఉండిపోయింది.

"వీరన్నా, నాకు ప్రమోషను వచ్చింది. కాని......" రెండోవైపు తల తిప్పేసుకుంది, కన్నీటిబొట్లు తుడుచుకుంటూ.

ఆత్రతగా చూస్తున్నాడు వీరన్న తరువాతి మాటకోసం.

మరొక అరనిమిషంసేపు తీక్షణంగా అతని మొహంలోకి చూసిన తరువాత తల ఒక పెడకు తిప్పుకొని "కాని, నర్సింగ్ కేడెట్ గా ట్రైనింగుకు ఈ మధ్యాహ్నమే పోవలసిందని ఆర్డరువచ్చింది. విధి! ట్రైనింగు అయిన తరువాత మరింకేదేశం వెళ్లవలసి ఉంటుందో ఏమో!"

సగం తెఱచుకొన్న నోరుతో అలానే విస్తుపోయి చూస్తున్నాడు వీరన్న. ఈసారి కొంచెం పెద్ద గొంతుకలో చెప్పింది. "నాతరువాత వచ్చే సిస్టరుతో నిన్ను జాగ్రత్తగా చూస్తూండమని చెప్పానులే! అధైర్యపడకు! ట్రైనింగు సెంటరుకు వెళ్లగానే ఉత్తరం రాస్తాలే. నువ్వుకూడా అప్పుడప్పుడు రాస్తూండు.

"పాపం! డబ్బుగురించి చిక్కుపడతావేమో! ఈ అరవైరూపాయలూ అట్టేపెట్టుకో. జాగ్రత్తగా! ఇక్కడకు రావడం యిదే ఆఖరుసారి. అదృష్టం ఉంటే, మళ్లీ తప్పకుండా కలుసుకోగలం. కాని, రవణమ్మను మాత్రం మరిచిపోకుసుమా!"

రూపాయినోట్లు తలగడక్రింద పెట్టి కన్నీళ్లు తుడుచుకొంటూ సన్నగొంతుకలో వీరన్న చెబుతున్నదేమిటో కొంచెమైనా వినిపించుకోకుండా గిరుక్కున తిరిగి వార్డుమలుపు దాటిపోయింది.

రామరాజ్యము

= శ్రీ భమిడిపాటి శివరామకృష్ణశర్మ =

ప్రపంచము స్థాణువు కాదు. కాలచక్ర భ్రమణమునకు విశ్రాంతి లేదు. సృష్టికి అంతమూ లేదు.

ఈ అనంతయాత్రాపథమందు కొంతకాలము వరకు ప్రపంచము సమగతిని పయనించినది. అంత వివిధ దేశములమధ్య వాణిజ్యవిప్లవ మారంభమైనది. అదే కార్మిక విప్లవమునకు మూలబీజము. కార్మిక విప్లవములో యంత్రయుగ మారంభమైనది. నాటినుండి ఒక వినూత్న పరిణామము ప్రాపంచిక దృక్పథములో రూపొందినది. ఒక వినూత్న చైతన్యము మానవహృదయములలో చొచ్చుకొన్నది. తన పూర్వ మందగమనము నుజ్జగించి ప్రపంచగతి వాయుగమనము నేర్చుకొన్నది. భయదసాంద్ర జలతరంగాలపై విలాసనృత్యములు సల్పినది. దూరశ్రవణమున కలవాటుపడినది. విద్యుత్కాంతి దీప్తులలో ధగద్ధగాయమానముగ ప్రజ్వరిల్లుచున్నది. కాలవ్యవధులు సంకుచితము చేయబడినవి. పూర్వము ప్రకృతి మనలను శాసించినది. ఇపుడు మనము ప్రకృతిని శాసించుచున్నాము.

నాటి చైతన్యము ప్రపంచమునందు తరతరముల నుండి గాఢముగ నాటుకొనియున్న రాజకీయ మతార్థిక విషయముల నొక్కమారుగ నుజ్జాత లూగించినది. ఆ ప్రళయకాల ఝంఝూమారుతమునకు తాళుకొనలేని నియమములు నేలమట్టమయినవి. బలీయమైన యంత్రాగార చక్రములక్రింద బడి సకలమానవ సమైక్యతాదృష్టి నలిగి చూర్ణమై రూపమే లేకుండపోయినది. నాటినుండి సాంఘికజీవ నిర్మాణము ధనికులు, పేదవారు; పెట్టుబడిదారులు, కార్మికులు; అధికారులు, ఉద్యోగులు అను నీ రెండు శిబిరములక్రింద చీల్చబడినది. అధికోత్పత్తితో ఆకలి పెచ్చుపెరిగినది. అధికవిజ్ఞానముతో దృఢనిశ్చయము దూరమయినది. యుక్తివాదములతో ఆత్మవిశ్వాసము అడుగంటినది. అధికార ప్రాపకముతో అసంతృప్తి అధికమైనది. శాస్త్ర పురోగమనముతో అణుబాంబులు ఆవిర్భవించినవి. ఎక్కడ చూచినను సవర్ణాభిమానము. ఎక్కడ చూచినను స్వమతాభిమానము. ఎక్కడ చూచినను స్వదేశాభిమానము. ఎక్కడ చూచినను స్వాభిమానము! దానితో ప్రపంచమం దేమూలను శాంతిభద్రతలు తొంగిచూచుటకైన వ్యవధి లేకుండపోయినది. ఇది నేటి నాగరికతా, సభ్యతల యొక్క సారము.

ఇదిగో, దూరదర్శినీయంత్రము. ఇం దొకమారు మీ దృష్టులను కేంద్రీకరించి పరికింపుడు. మధ్య గోచరించు మిట్టపల్లములను సరకుగొనకుడు. అదిగో, అల్లంతదవ్వుల కనబడుచున్నదే, ఆ పల్లెయే మనము చూడదలచినది. దానిలోని కేగి పరిశీలింతమా? రండు, ఒక్కింత ఓపిక నిలుపుకొనుడు.

ఆహా, ఈ శీతలతరుచ్ఛాయలక్రింది పర్ణకుటీరములు ఉత్తమతపోవనవాసములను తలపించుచున్నవి. ఇం దన్నియు చిన్నగృహములే. చంద్రకాంతులను ప్రతిఫలింపజేసెడి నిర్మలములైన వీధులు. ప్రతియింటి చుట్టును విశాలమైన ఆవరణలు. ఇంటిముంగిళ్లలో చక్కని ముగ్గులు. పసుపుకుంకుమలతో అలంకరించిన ద్వారములు. ఎంత నిరాడంబరము? ఏమి రామణీయకత?

ఇచ్చట ప్రజలలో హెచ్చుతగ్గులు లేవు. ఇందు ధనవంతులు లేరు. ఆకలితో అలమటించువారును లేరు. వారిలో వివేకమే కాని వివాదములు లేవు. ప్రతి వ్యక్తికిని స్వాతంత్ర్య మున్నది. కాని, స్వార్థపరత్వ

మెవరికిని లేదు. ఇం కెవరికిని పరాధీనత్వము లేదు. కాని, అన్యోన్యసహాకారభావ మున్నది. ఇచట సోమరిపోతులు లేరు. అందరును సమానముగ కష్టపడు వారే. ఒకరి వృత్తికి యింకొకరు పోటీచేసికొనరు. ఇచట అన్ని వృత్తులకును సమానమైన గౌరవస్థాన మున్నది. వీరికి సత్యము, అహింస వెన్నప్రాణ.

ఇది స్వయంసమృద్ధమైన పల్లె. వీరికి వలయు సమస్తపదార్థములు ఇచటనే పండును. ఇచట యంత్రములు లేవు. కాని, ప్రతిగృహమును ఒక కర్మాగారమే. వానిలో నిత్యకృత్యములకు వలయు సమస్త వస్తువులును తయారగును.

ప్రతిగృహమును తగినంత గాలి, వెలుతురులను అనుభవించుచున్నవి. ప్రతి యింటను ఒకటిరెండు గోవులు, ఒకటిరెండు రాట్నములు తప్పవు. ఇంటి ముంగలి ఆవరణలో చల్లని నీడలనిచ్చు ఫలవృక్షములు నాటబడియున్నవి. దొడ్డిగుమ్మము వెనుకనే తులసివన మున్నది. విశాలమైన దొడ్డిఆవరణ అంతయు నాలుగు భాగములక్రింద విభజింపబడినది. ఒకభాగమందు పూల వనము; ఒకదానియందు మందుల మొక్కలు; యింకొకదానియందు సుగంధద్రవ్యములు, రంగులు, అలంకరణములు తయారుచేయుటకు వినియోగించు మొక్కలు; కడమదానియందు కాయగూరలు, దుంపలు నాటబడియున్నవి.

ఇచట స్త్రీలు బానిసలు కారు. మగవానితో సమానమైన గౌరవప్రతిపత్తుల ననుభవింతురు. మగవాడు బయటకేగి పనిచేసిన, ఆడుది గృహకర్మాగారమందు పనిచేయును. ఆ ఐక్యతాదృష్టి నలవరచుకొన్న దాంపత్యము వారిది. వారి హక్కులలో హెచ్చుతగ్గులెటు లుండును?

ఇచటి గ్రామాధికారి, గ్రామపంచాయతీసభ్యులు సర్వసమర్థులు. ప్రజలందరి విశ్వాసమునకు పాత్రులయిన వారు. ఆ పదవులు వంశపారంపర్యముగ సంక్రమింపవు. స్వశక్తిసామర్థ్యములవల్ల ప్రజాహృదయములను చూరగొన్నవారికే అవి లభ్యమగును.

ఇది విద్యాలయము. ఇచట నందరకు ఉచితముగ విద్య గఱపుదురు. ప్రతిబాలుడును విధిగ విద్య నభ్యసింపవలసినదే. ప్రతియువకుని స్వయంపోషణకు సమర్థునిగ తయారుచేయుదురు. ఇచట విజ్ఞానము విజ్ఞానముకొరకుమాత్రమే కాదు. కంటకరహితమైన నిత్య సుఖజీవనకు సహాకారభూతమైన విజ్ఞానమునకే ప్రాధాన్యము. సంఘమునందు వ్యక్తిగతశౌచిత్యములను గణింపని ఉత్తమనాగరికులక్రింద తయారుచేయుటే వీరి ముఖ్యలక్ష్యము. శాస్త్రవిజ్ఞానముతోపాటు ఆత్మవిశ్వాసమునుకూడ పెంపొందజేయుదురు.

ఇది బాలికల విద్యామందిరము. ఇచట బాలికలను ఉత్తమగృహిణులక్రింద తయారుచేయుదురు. అలంకరణములు, సుగంధద్రవ్యములు, కుట్టుపని, వివిధ పదార్థపచనము మొదలగు గృహకృత్యములందు ఆరితేరినవారిగా నొనర్తురు. ఇదిగాక శిశుపోషణ, ఆరోగ్యము, పరిశుభ్రత మున్నగు శాస్త్రవిషయములనుగూడ విపులముగ గఱపుదురు.

ఇది ఆటస్థలము. ఇచట బాలురెల్లరు వివిధములైన ఆటలలోను, వ్యాయామములలోను, ఆసనవిన్యాసములలోను మిక్కిలి ఉత్సాహముతో పాల్గొని శరీరదార్ఢ్యమును పెంపొందింపజేసుకొందురు. ఆట నొక భాగమందు బాలికలుకూడ వారి కనుగుణ్యమైన ఆటలందు, వ్యాయామములందు పాల్గొనుచుందురు.

అది ఉచితగ్రంథాలయము. అచటికేగి ఎవరికి వలయు విషయములను వారు చదువుకొనుటకు అందరికిని అధికార మున్నది.

అది పండితగోష్ఠిమంటపము. అట పండితు లందరు కలసికూడి సుఖప్రదమైన నిత్యజీవనమునకు తోహదమిచ్చు మార్గములు, అధికోత్పత్తిని సాధించుటకు వలయు విధానములు, సాంఘికపురోభివృద్ధికి అనువగు తెఱంగులు విపులముగ ఎప్పటికప్పుడు చర్చింతురు.

అది సత్రము. అచట విదేశములనుండి వచ్చు మార్గికులకు, అశక్తులకు ఉచితముగ అన్న, పాన, శయనాదులను కల్పింతురు.

ఇది వైద్యాలయము. తగినంత ప్రమాదకరమైన పరిస్థితులు సంభవించిననేకాని ఇచటి కెవ్వరును రారు.

సామాన్యమైన అనారోగ్యములకు, వ్యాధులకు ఎవరింటికడ వారే చికిత్సను చేసికొనగలరు.

అది పశువైద్యశాల. అచట రోగగ్రస్తమైన జంతువులకు ఉచితముగనే చికిత్స చేయుదురు. ఇచటి ప్రజల హృదయవైశాల్యము సర్వమానవసమానత్వ మంగీకరించుటతోడనే నిలిచిపోలేదు. సమస్తప్రాణుల యందును సమానత్వమునే కనుచున్నది. 'ఆత్మవత్ సర్వభూతాని' అన్న ముఖ్యసూత్రాచరణమే వీరి జీవిత రహస్యము.

ఇది కళామందిరము. ఇచట బాలబాలికలకు నృత్య, వాద్య, సంగీత, నాటకాది లలితకళలను నేర్పుదురు.

అదిగో—ఆ కనిపించు ఎత్తైన గోపురము—అదే దేవాలయము. ఆ ప్రక్కనే కనిపించుచున్నదే, అదే మసీదు. ఇచటి తురకలకు గోవులను చంపుటే మతము కాదు. ఇచటి హిందువులకు విగ్రహములను నిలుపుటే మతము కాదు. ఇచట హిందువులు, మహమ్మదీయులు నిజమైన పారమార్థికజ్ఞానమును జీర్ణముచేసుకొని, అన్నదమ్ములట్లు సంఘీభావముతో మెలగుదురు.

ఇది న్యాయసభాంగణము. ఇచట ప్రజలలో కలిగిన వివాదులను నిష్పాక్షికబుద్ధితో పరిష్కరింతురు. ఇచటి ప్రజలు ఒకరితో నొకరు కలహింపరుకదా, ఇచట జారచోరత్వములు ఊహింపరానివికదా, ఇచట మాయామర్మములు తెలియనివికదా—ఇక నిచట వివాదము లేముండునని మనకు సందేహము కలుగవచ్చును.

అదిగో, మన అదృష్టవశమున, న్యాయము గోరి యిపుడే యిరువురు ఇచటికి వచ్చుచున్నారు. వారు చెప్పుకొన బోవునది విందము రండు—అందొకడు చెంతనున్న చిట్టడవినుండి ఒక తుమ్మమ్రాను నింటికి దీసికొని పోవుచు, మార్గమధ్యమున దప్పిగొని, ఆ మ్రాను నచటనే డించి, ప్రక్కనున్న బావికడ నీరు త్రాగుట కేగెనట. ఇంతలో ఆ రెండవవాడు కుండతో జలము కొనిపోవుచు, ఆ మ్రాను కాలికి తగిలి తూలుటచే, ఆ భాండము క్రిందపడి బ్రద్దలయినదట. ఇంతలో మొదటి వాడు వచ్చి, కుండ బ్రద్దలగుట చూచి "అయ్యో, నే నీ మ్రానును దారిలో వదలిపోవుటచేత నేకదా, కుండ పగిలినది. అందుచే దాని ఖరీదును నేనే భరించెద"నని నాడట. దానికి రెండవవాడు "ఇందులో నీతప్పేమియు లేదు. నేను దారిని తిన్నగ చూచుకొనకుండ గ్రుడ్డిగ వచ్చుచుండుటచేత నేకదా యీ మ్రాను కాలికి తగిలినది. అందుచే నేనే దీని ఖరీదు భరించెద"నని సమాధాన మిచ్చినాడట. వారిలోవారు భాండము విలువ నెవరు భరించవలెనో నిర్ణయించుకొనలేక యిచటికి కేతెంచినారట. ఔరా, ఏమి వారి జీవనము! ఎట్టి ధార్మికబుద్ధి!

ఈయూర నెల్లపుడు కల్యాణములే, ఎల్లపుడును కలకలలాడు మోములే కనిపించుచుండును. ఇట నెటు చూచినను ప్రశాంతతయే, ఎటు చూచినను సంతృప్తియే, ఎటుచూచినను పచ్చనిజీవితమే తాండవించుచుండును.

అది భూతలస్వర్గము. అదే రామరాజ్యము.



కళ్యాణి

[నాటకం]

— శ్రీ సోమంచి యజ్ఞన్నశాస్త్రి —

మూడో అంకం

[భీమసింగు భవనంలో ఒక గది. భీమసింగ్, జ్ఞానసింగ్, సర్దారులు ఇద్దరూ వున్నారు.]

భీమ — మీకు, నాభార్యకి, అందరికీ లొంగిపోయాను. నోరు విప్పలేదు. ధారాళంగా వూపిరన్నా తియ్యలేదు. మీరు నాచేత నీచపువ్యాపారం చేయించారు. మీప్రాణాలు నిలుపుకోడానికి తిండి నేను కొనిపెట్టవలసొచ్చింది. ఈ ధాన్యానికీ, ఈ పశువులకీ ఇంత ఘోరత్యాగం అవసరమా అని ఎవరూ ఆలోచించలేదు. త్యాగం చెయ్యవలసినది మీరు కాదు కాబట్టి మీ కా బాధే లేకపోయింది. మీకడుపు నిండింది. నాకు జరిగిన అవమానానికి ఇహ నే ప్రతీకారం చేసితీరాలి.

జ్ఞాన — నీ ఉద్దేశమేమిటో నాకు తెలియదు. ఇలాటి మహాదుఃఖ సమయాల్లో ఇతరులు సలహా యివ్వకూడదు. మాటలు నీ దుఃఖం ఉపశమింప చెయ్యలేవు. ఈ నగరప్రజల సంతోషానందాలు నీదుఃఖం పోగొట్టడానికిబదులు అతిశయింపచేస్తాయని నాకు తెలుసు. నగరరక్షణ జరిగింది. ఇంత దుఃఖం నీకు కలిగించవలసొచ్చినందుకు నాకు చాలా విచారంగానే వుంది. త్యాగమంతా నువ్వే చెయ్యవలసొచ్చింది. కాని నిన్నటి పరిస్థితే తిరిగి ఈనాడూ సంభవిస్తే, తిరిగి నిన్నటి విధంగానే ఈనాడూ ప్రవర్తిద్దును. ఆ అన్యాయానికే ఒడిగట్టుకుందును. న్యాయమార్గాన్నే ప్రవర్తించాలని కంకణం కట్టుకున్న ప్రతివ్యక్తికీ, జీవితంలో అనేకమాట్లు, రెండు మూడు కొంచెం హెచ్చుతగ్గ అన్యాయ మార్గాల్లో ఒకమార్గం అవలంబించవలసిన అవసరం ఏర్పడుతుంది. నీ కేవిధంగా నచ్చచెప్పగలనో తెలియడం లేదు. ఒకప్పుడు నామాటలు నీ కెంతో రుచించేవి. ఆఖరిమాటు, ఒక్కమాటు నామాటలు నీహృదయంలో చొరనియ్యి. నీ ప్రథమకోపానికీ, దుఃఖానికీ గుడ్డిగా లొంగిపోవొద్దు. విషయం పూర్తిగా వినికాని నీ మనసు నిశ్చయం చేసుకోకు. నీభార్య కొంచెం సేపటిలో తిరిగిరావాలి. తొందరపడకు. తరవాత విచారించవలసిన పనేమీ చెయ్యకు. ఈ మహాదుఃఖసమయంలో వేసిన ముడి విప్పడానికి వీలుండదు. కళ్యాణి, విచారంతో, ఆనందంతో తిరిగొస్తుంది. నిందించకు. కఠినంగా ప్రవర్తించకు. నీ సహజధోరణిలో మాట్లాడేటందుకు నీకు శక్తి చాలదని తోస్తే కొన్నాళ్లదాకా ఆవిడతో అసలు మాటలే వొద్దు. ప్రకృతిచేతిలో మనం కీలుబొమ్మలం. మనలో అగాధమయిన దయాదాక్షిణ్యాలు, న్యాయం, ఓర్పు వున్నాయికాని దుఃఖాతిరేకంచేత జ్ఞాననేత్రం మూసుకుపోయినప్పుడు పైకి రావు. విషయం పూర్తిగా అర్థమయి, క్షమించి, తిరిగి ప్రేమించడం మొదలెట్టిన తరవాత ఏమాటలు ఉపయోగిస్తామో, ఆ మాటల కోసమే ఈనాడు ప్రయత్నించాలి.

భీమసింగ్ — అయిందా నీ ఉపన్యాసం! తేనెపలుకుల కిది సమయం కాదు. నీమాటలు ఈనాడెవరినీ మోసపుచ్చలేవు కూడాను. నువ్వు నాకు బోధించే కర్తవ్యమేదో అర్థమయింది. ఓర్పు వహించు. జరిగినదేదో జరిగిపోయింది. మరిచిపో. క్షమించు అని నీ సలహా! మాటలు నా అవమానం పోగొట్టలేవు. ప్రతాపవర్మ నా కళ్యాణిని అపహరించాడు. అతని కంఠంలో ప్రాణముండగా నాకు శాంతి లేదు. నేను కళ్యాణిని

క్షమించాను. ఆవిడని మోసంచేసి తప్పుత్రోవని మీరు తిప్పారు. కాని ఆవిడప్రవర్తనలో ఔదార్యం, వీరత్వమున్నా వున్నాయి. జరిగిన అన్యాయం మరిచి పోవడ మసాధ్యమయినా, ప్రేమలో కాలగర్భాన మాయమవుతుంది. ఈ లోకంలో ఒక్క వ్యక్తిని మాత్రం ద్వేషించకుండా వుండలేను. ఓ మహోజ్వల సౌఖ్యానికి నాకు దారిచూపి, అండగా నిలిచి, నన్ను రక్షించవలసిన వ్యక్తి నాకు పరమశత్రువుగా మారి పోయాడు. నాసౌఖ్యం నాశనంచేశాడు. మీ అందరి సమక్షంలోనూ ఈనాడు ఒక భయంకర న్యాయ నిర్ణయం జరుగుతుంది. ఒక కొడుకు తన తండ్రినే మర్యాకోల్లంఘనం చేసినందుకు విచారించి, ఏవగించి, ద్వేషించి, శిక్షించడం మీరు చూస్తారు.

జ్ఞాన — నన్ను శిక్షించు. ఆమెనిమాత్రం క్షమించు. ఇంతమందికి ప్రాణదానం చేసిన వీర త్వంలో క్షమానర్హమయిన లోపముంటే, వీరత్వమంతా ఆమెది. లోపమంతా నాది! నీద్వేషమంతా నా మీదవేసనీ, కళ్యాణికి పొంతుమిగలలేదనీ మాత్రం నాకు చెప్పు.

(జ్ఞానసింహుని చివరిమాటల్లోనే దూరంనించి "కళ్యాణికీ జై "అన్న ధ్వని వినిపిస్తుంది. ధ్వని అంత కంతకి దగ్గిరపడి, స్పష్టంగా వినిపిస్తుంది.)

జ్ఞాన—(డాబామీదికి ఉరికి) అదిగో కళ్యాణి! తిరిగొస్తోంది. ప్రజలు స్వాగతమిస్తున్నారు. విను.

(సర్దార్లిద్దరూ జ్ఞానసింహుణ్ణి అనుసరిస్తారు. భీమసింగ్ ఒక్కడూ స్తంభాన్ని ఆనుకుని, శూన్య దృష్టితో వుండిపోతాడు.)

జ్ఞాన—చూడు. వీధులు, కిటికీలు, మేడలు ప్రజలతో నిండిపోతున్నాయి....కళ్యాణి ఏదీ? సమ యానికి ఉపయోగించక నానేత్రాలు నన్ను మోస పుచ్చాయి. ముసలితనం, ఆమీద ఆనందబాష్పాలు. నాకళ్లు కనిపించడంలేదు. ఏవ్యక్తికోసం పరితపిస్తు న్నానో ఆవ్యక్తినే చూడలేకుండావున్నాను. ఎక్క డుంది? కలుసుకోడానికి ఎక్కడికి వెళ్లాలి?

మొదటిసర్దారు—(వెనక్కి పెట్టి పట్టుకుంటూ) వొద్దు..కిందికి దిగొద్దు. ప్రజాసమూహం కట్టుతప్పి పోయింది. లాభం లేదు. అదుగో. అక్కడుంది. తలె త్తింది. మన్ని చూసింది. చిరునవ్వుతో త్వరితంగా అడుగులేస్తోంది.

జ్ఞాన—నాకు కనిపించడం లేదు. పాడుకళ్లు! ఏదీ స్పష్టంగా చూడనివ్వడం లేదు. వయస్సు మల్లి నందుకు మొదటిమాటు విచారిస్తున్నాను. నా కెంతో జ్ఞానమిచ్చిన వయస్సు వ న్నీనాడు అంధుణ్ణి చేసింది. కళ్యాణి నీకు కనిపిస్తోందా? చెప్పు, ఎలా వుందో! మొహం కనిపిస్తోందా?

మొ. సర్దా—ఆమె తేజఃకిరణాలు ప్రజలమీద ప్రకాశిస్తున్నాయా అనిపిస్తోంది.

రెండో సర్దారు — పక్కని నడుస్తున్న మని షెవరు?

మొ. సర్దా—నాకు తెలీదు. నే నెప్పుడూ చూ డలేదు. మొహం దాచుకుంటున్నాడు.

జ్ఞాన—ఎలా అరుస్తున్నారో విను. పుష్పాలు తేమంతేట రాలుతున్నాయి స్వాగత మివ్వడానికి. ఆఁ. కొంచెం స్పష్టంగా కనిపిస్తోంది. ద్వారందగ్గిర కొ చ్చారు. సమూహం విడిపోతోంది.

మొ. సర్దా—అవును. ప్రేమతో దారితీస్తు న్నారు. దారిలో పువ్వులు చల్లుతున్నారు. ఒక్క మారు స్పృశించి, ఆశీర్వదించేనిమిత్తం తల్లులు తమ బిడ్డల్ని దేవికి అందిస్తున్నారు...మనకి చాలా సమీ పంలో కొచ్చేశారు. ఈ మెట్లదాకా వొస్తే, ఆ మహా ప్రవాహంలో మనమూ కొట్టుకుపోతాము. అమ్మయ్య! సైనికులు అడ్డుతున్నారు. ద్వారం మూసి, ప్రజల్ని బయటికి పంపించెయ్యమని ఆజ్ఞయిస్తా!

జ్ఞాన—వొద్దు. ప్రజల ప్రేమాతిశయమే ఈ ఉద్రేకానికి కారణం. వారి హృదయాల్లోలాగే ఇక్కడ కూడా ఆనందం వెల్లివిరియనీ. అపారకష్టాలనుభవించారు. ఈనాడు వారి కష్టాలు కడతేరాయి కనక, కృతజ్ఞత తెలుపుకోనీ! ప్రజలతోబాటు నేనూ ఆనందంతో,

మత్తెక్కిపోయి, గొంతెత్తి అరుస్తాను. తల్లీ! కళ్యాణీ!! నిన్నే నా మెట్లమీద చూస్తున్నది!

(పరుగెత్తబోతూవుంటే సర్దారులిద్దరూ పట్టుకుంటారు.)

కళ్యాణీ! రా! నాదగ్గిరగా రా! నన్ను కదల నివ్వకుండా బంధించారు. ఈమహోత్తరానందం చూస్తే భయమేస్తోంది వీళ్లకి. రా! (పువ్వులు కోసి కింద పారేస్తూ) స్వాగతమివ్వడానికి నాదగ్గిరా వున్నాయి పుష్పాలు!

(ధ్వని ఎక్కువవుతుంది. కళ్యాణీ, ప్రతాపవర్మ మెట్లమీద కనిపిస్తారు. కళ్యాణి జ్ఞానసింహుకి చేతుల్లో. ఇల్లంతా జనం. కాని, గౌరవంగా, కొంతదూరంలో నించుంటారు.)

కళ్యాణి—తండ్రీ! చాలా ఆనందంగా వుంది.

జ్ఞాన—నిన్ను చూడ్డం నాకూ చాలా ఆనందంగా వుంది. తిన్నగా నా ఆనందబాష్పాల్లోనించి నిన్ను చూడనీ! అప్సరసల్ని ధిక్కరించే దివ్యతేజంతో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నావు. ఆ క్రూరశత్రువు నీ కంటికాంతి, నీ పెదిమలచిరునవ్వు దొంగిలించలేకపోయాడు.

కళ్యా—అసలుకథ చెబుతా...ఆయనేరీ?... వారే మెట్టమొందట వినాలి మనశ్శాంతికోసం!

జ్ఞాన—ఇదుగో! ఇక్కడున్నాడు. రా! నన్ను ద్వేషించినా నిన్ను క్షమించాడు.

(భీమసింగ్ ముందరికొస్తాడు. కళ్యాణి కంఠానికి చేతులు వేసేసి, మాట్లాడ్డానికి ప్రయత్నిస్తుంది. విదిలించుకుని తోసేస్తాడు. ప్రజలని చూసి.)

భీమ—పొండి...అందరూ...!

కళ్యా—వొద్దు. ఆగనీ...మీతో చెప్పాలి. అందరితోటీ చెప్పాలి. వినండి.

భీమ—(ఆపి, వెనక్కి తోసేస్తూ, కోపంతో గొంతెత్తి) దగ్గిరకి రాకు. ముట్టుకోకు. (ప్రజలవైపుకి తిరిగి)వినిపించడం లేదూ, పొమ్మంటేను? పొండి, మీయిళ్లల్లో మీరు యజమానులు. ఇక్కడ నాకు ఎదురులేదు. అర్థమయింది నాకంతా! కడుపు చల్లబడింది, ఇహ నేత్రపర్వం చేసుకుందా మనుకుంటున్నారు. అందరికీ చాలిన భోజనసామగ్రి నన్ను బలిచ్చి తెచ్చుకున్నారు. చాలదూ? వెళ్లండి, చెబుతున్నా!

(ప్రజలు మెల్లిగా వెళ్లిపోతారు)

ఇక్కడ ఆగడానికి ఎవరూ ధైర్యంచెయ్యొద్దు.

(జ్ఞానసింహుణ్ణి చేత్తో పట్టుకుని) అందరికంటే నువ్వే ముందుగా పో, తప్పంతా నీదేకనక! నా కన్నీళ్లు నువ్వు చూడ్డానికి వీల్లేదు. నా అవమానగాథ వినడానికి నే వొంటరిగానే వుంటాను. (కదలని ప్రతాపవర్మని చూసి) నువ్వు? శిలావిగ్రహంలా, కదలకుండా, ఎవరు నువ్వు? మూర్తీభవించిన అవమానదేవతవా, మృత్యుదేవతవా? వెళ్లమని చెప్పినప్పుడు అర్థంకాలేదూ? (సైనికుడి చేతిలోనించి లాఠీ లాగుకుంటూ) తరిమెయ్యాలా? కత్తి ముట్టుకుంటున్నావే? నాదగ్గిరా వుంది. కాని దాని ఉపయోగం వేరేవుందిలే!... ఈకల్లేమిటి? పగటివేషాలు చూసి ఆనందించే స్థితిలో లేను. జవాబు చెప్పవేం? నువ్వు ఎవరవని అడుగుతున్నాను.

(దగ్గిరికి వెళ్లి కట్లు విప్పెయ్యాలని ప్రయత్నిస్తాడు. కళ్యాణి ఇద్దరిమధ్యకీ పరుగెత్తికొచ్చి)

కళ్యా—అతన్ని ముట్టుకోకు!

భీమ—కళ్యాణీ! నువ్వే? అకస్మాత్తుగా నీకీ శక్తి ఎక్కడిది?

కళ్యా—ఇతనే నన్ను రక్షించినది!

భీమ—రక్షించాడా? అంతా అయిపోయిన తరవాత! గొప్పపనే!

కళ్యా—(ఉద్రేకంతో) చెప్పనీండి. ఋణిమాలుకుంటాను. ఒక్కమాట చెప్పనీండి. ఇతను నన్ను రక్షించాడు. గౌరవించాడు. నా మానం పోలేదు. ఇక్కడికి నాతోటి నారక్షణకింద వొచ్చాడు. మన ఉభయులతరఫునా అభయమిచ్చాను. మీకు కోపంగా వుంది. కాని ఒక్కమాట వినండి!

భీమ—ఎవరిది?

కళ్యా—ప్రతాపవర్మ!

భీమ—ఎవరూ? ఏమిటే? వాడా?

కళ్యా—అవునవును. ఇప్పుడు మీ అతిథి. స్వయంగా మీఅధీనంలో కొస్తున్నాడు. ఇతనే నన్ను రక్షించింది.

భీమ—(ఒక్కనిమిషం పూరుకుని, ఆశ్చర్యంతో, గుక్క తిప్పుకోకుండా) ఆఁ, కళ్యాణీ! అమృతబిందువులు వర్షించావు. ఎంత హృదయానందకరమైన వార్త......అవునవును...నువ్వు చేసినది చాలా బాగుంది. అతన్ని అక్కడే హత్యచేసే మానవతులున్నారు. కాని అతని అపచారాని కాశిక్ష చాలదు. ఎక్కువ కసితీర్చుకోవాలి. అందుచేత ఇక్కడికే తీసుకొచ్చావు! అతన్ని బాధితుల దగ్గరకే తీసుకొచ్చావు! వాళ్లిప్పుడు అతన్ని ఉరితీస్తారు!! ఓహో! ఎంతటి దిగ్విజయం!! తప్పటడుగు వేసుకుంటూ నీవెంట వొచ్చేశాడు!. నీముద్దులన్నీ ద్వేషపూరితాలని అనుమానించలేదు. ఇక్కడ బోనులో చిక్కకున్నాడు. నువ్వు చేసినదే చాలా బాగుంది! అతని ఘోరపాపానికి, ఒంటరిగా చూసి హత్యచేస్తే చాలదు. ఇలాంటి నీచత్వాని కొడిగట్టుకున్నందుకు అనుభవించవలసిన శిక్ష అందరికీ తెలియాలి. కాని ఎలా చేశావిది? ఇదివరకు ఏస్త్రీ సాధించని విజయం సాధించావు! నువ్వే, నీకోటితోనే, అందరికీ చెబుదువుగాని!

(డాబామీదికి పరుగెత్తుకెళ్లి)

మన శత్రువు ఇక్కడున్నాడు! నా అధీనంలో వున్నాడు!!

కళ్యాణి—(అడ్డుతగిలి, అతన్ని ఆపడానికి ప్రయత్నిస్తూ) కాదు. కాదు. నామాట వినండి. మిమ్మల్ని బతిమాలుకుంటాను. దురభిప్రాయపడుతున్నారు.

భీమ—(విదుల్చుకుని, పెద్దగొంతుకతో) వొదులు నన్ను! ఈసంగతి అందరికీ తెలియాలి...... అందరికీ...... (అరస్తూ) తిరిగిరండి అందరూ... అందరూ...ఊఁ...అందరూ రావొచ్చు. వొచ్చితీరాలి. వాన్నా, నువ్వుకూడా! స్తంభాల చాటున నక్కక్కేరు. రా! ఇదీ ఆనందం!! సిగ్గుపడవలసిన అవసరం లేని పవిత్రుల్లో పరమపవిత్రుణ్ణి నే నిప్పుడు! ఇప్పుడు నాకళ్యాణికి స్వాగతమివ్వొచ్చును. మీఅందరితోబాటు, మీ అందరికంటే ఎక్కువగా నేనూ స్వాగతమిస్తాను. (ప్రజలని హాలులోకి లాక్కొస్తాడు.) ఇప్పుడు చూడ్డురుగాని, న్యాయమంటూ వుంది! నాకు తెలుసు. కాని ఇంత త్వరలోనే న్యాయం జరుగుతుందని నమ్మలేక పోయాను. నాశత్రువుని, కొండల్లో, అడవుల్లో, పట్టణాల్లో గాలిస్తూ, సంవత్సరాలు గడపాలనుకున్నా. హఠాత్తుగా ఈగదిలో మనయెదుట సాక్షాత్కరించాడు. కళ్యాణి సాధించింది ఈకార్యం. ఎలా సాధించిందో మనం విందాం!

(జ్ఞానసింహుని చేత్తో పట్టుకుని)

వాణ్ణి చూశావా?

భీమ—నీ పాతస్నేహితుడు! ఇదివరకు చూసి మాట్లాడావు. దూత్యం నడిపావు.

జ్ఞాన—ప్రతాపవర్మ?

భీమ—అవును. అతనే. సందేహం లేదు. దగ్గిరికి రా! బాగా చూడు. ముట్టుకో. మరెవరికైనా రాయబారం పంపుతాడేమో కనుక్కో. అధికారగర్వంచేత మత్తెక్కిన పూర్వపు ప్రతాపవర్మకాదు! నాదగ్గిరనించి నేను ఇవ్వలేని అమూల్యవస్తువుని, మోసంచేసి, నీచంగా లాగాడు. తిరిగి నాదగ్గిరికే వొచ్చాడు. న్యాయధర్మాలే అతన్ని బంధించి ఇక్కడికి తెచ్చాయి.. దగ్గిరకి రా...ఇంకా... భయంలేదు...పారిపోలేడు... అయినా, ఎందుకయినా మంచిది, తలుపులు మూసెయ్యమను. ఒక్కమాటే అతనికి శిక్ష విధించము. అతనికి సౌఖ్యాలు తంపర తంపరగా కూర్చాలి. (ప్రజాసమూహంతో) మీరూ ఇతనివల్ల బాధలు అనుభవించారు. కాని నాబాధలో ఎన్నోవంతు? వీడు నాదగ్గిరనించి నాకళ్యాణిని అపహరించాడు. నేను నిస్సహాయుణ్ణి. ఏమీ చెయ్యలేకపోయాను. మీ క్షేమంకోసం ఆవిడ మానం బలిచ్చారు...మీమీద నా కిప్పుడు కక్షలేదు జరిగిందేదో జరిగిపోయింది. అవమానంతో కుంగిపోయిన నేను మళ్లీ తలెత్తుకోడానికి తగిన అవకాశం కలిగించింది నాకళ్యాణి. మన కసి తీర్చుకునే నిమిత్తమే,

కళ్యాణి, ఏడీని, ఈ యజ్ఞపశువుని, సజీవంగా తీసుకొచ్చి, మనకే అప్పగించింది. ఇది ఎంత దుష్కరకార్యమో తెలుసునా? ఇది ఎలా సాధించిందీ కళ్యాణి ఇప్పుడు వర్ణిస్తుంది.

కళ్యా—అవును. వర్ణిస్తా...కాని అదంతా వేరేకథ!

భీమ—(మీద చేతులు వేస్తూ) అందరియెదుటా ముందు నిన్ను ముద్దుపెట్టుకోనీ!

కళ్యా—(వెనక్కి తోసేస్తూ) మీరు ఇప్పుడు నామాట వినకపోతే ఈజన్మలో నాతో మాట్లాడొద్దు. మీకు ఆంధత్వం కలిగిస్తున్న గౌరవ మర్యాదలకంటే సత్యమైన గౌరవమర్యాదలనిగురించీ, మీకు తెలిసిన సౌఖ్యంకంటే ఉత్తమమైన ఆనందాన్ని గురించీ మీకు చెప్పాలి. ప్రజలందరూ తిరిగొచ్చారని సంతోషంగానే వుంది. ప్రజలే మీకంటే ముందుగా విని అర్థం చేసుకుంటారేమో. పూర్తిగా విన్నదాకా నన్ను ముట్టుకోకండి.

భీమ—(ప్రయత్నిస్తూ) అవునవును ... నాకు తెలుసు ... కాని ముందర నేను.........

కళ్యా—నేను ఎప్పుడూ అబద్ధమాడి ఎరగను. మన జీవితం అటో యిటో నిర్ణయించేసే పరమసత్యం ఈనాడు చెబుతున్నా. నన్ను తిన్నగా చూడండి. ఈ ఒక్క గడియలోనే, నేకోరినట్టు నన్ను ప్రేమించడానికి అవకాశ ముంది. మన ప్రేమానుబంధాన్ని బట్టి, సాధారణంగా విశ్వసించడానికి వీలులేని విషయాలు కూడా నమ్మడానికి సిద్ధంగా వుండాలి. ఇతను నా దగ్గరకి రాలేదు. నన్ను స్పృశించలేదు. నా పుట్టినింటినించి వొచ్చినంత నిర్మలంగానూ, నిష్కళంకంగానూ ఇతని శిబిరంనించీ వొచ్చాను.

భీమ—ఎందుచేత?

కళ్యా—నన్ను ప్రేమిస్తున్నాడు కనక!

భీమ—ఆఁ. ఇదా చెప్పేది నువ్వు? ఇదే కాబోలు ఆశ్చర్యకరమైన సంగతి? అవునవును. మొదటి మాటలోనే ఏదో తమాషా వుందని కనిపెట్టాను. లక్ష్యపెట్టలేదు. మళ్లీ ఆ సంగతి మరిచిపోయాను...ఆ విషయం పూర్తిగా పరీక్ష చెయ్యాలన్నమాట? అయితే, నీదగ్గిరకి రాలేదు......నిన్ను ముట్టుకోలేదు?

కళ్యా—లేదు.

భీమ—నిన్ను చివరికి ముద్దయినా పెట్టుకోలేదు?

కళ్యా—లేదు!

భీమ—నా కేసి చూసి ధైర్యంగా చెప్పగలవా ఆమాట? కళ్యాణీ, ఈ భయంకర కాళరాత్రి నీ మతిభ్రమ కలిగించింది.

కళ్యా—నిజం చెబుతున్నా!

భీమ—నిజం! భగవంతుడా, నిజం తెలుసుకోవాలనే నా ఆత్రుతాను! కాని మనుష్యులు నమ్మడానికి వీలుగా వుండాలి. తన దేశానికి ద్రోహంచేసీ, లోకాన్నంతటినీ ప్రతిఘటించి నిన్ను తన శిబిరానికి రప్పించుకున్న మనిషి నిన్నేమీ కోరలేదు. మమ్మల్ని నమ్మించడానికి నీ వెంట వొచ్చాడు. కాదు కాదు. మనం న్యాయ మాలోచించాలి. నిన్ను ఏమీ కోరకనే పోతే, ప్రజలందరికీ ఎందుకిన్ని కష్టాలు కలిగించినట్లు; నన్నెందుకింత దుఃఖసాగరంలో ముంచినట్టు... తెలూపుతున్నావు...న్యాయం విచారించి ప్రజలే జవాబు చెబుతారులే! (ప్రజలవైపు తిరిగి) విన్నారా మీరందరూ? ఎందుకు ఈ విధంగా మాట్లాడుతోందో తెలియడం లేదు. చెప్పిందేదో చెప్పింది. మీరే నిర్ణయిద్దురుగాని న్యాయం! మిమ్మల్ని రక్షించిందికనక ఒక వేళ మీరు నమ్ముతారేమో!! నమ్మితే?...నమ్మేవాళ్లు బయటికి రండి. పైకొచ్చి ధైర్యం చేసి చెప్పండి. నమ్మినవాళ్లంతా రండి. ఎలాటిరకమో చూడాలని కుతూహలంగా వుంది.

(జ్ఞానసింహుడు ఒక్కడూ పైకొస్తాడు. దూరాన గొణుగుడు.)

జ్ఞాన—నేను నమ్ముతున్నాను!

భీమ—నువ్వా? తోడిదొంగవి!...ఇంకా ఎవరు విశ్వసిస్తున్నది?

(బయట గొణుగుడు)

చూశావా, నువ్వు రక్షించిన ప్రజలే నీమాటలు నమ్మటంలేదు.

కళ్యా—వాళ్లకి నన్ను నమ్మవలసిన అవసరం లేదు. కాని నన్ను ప్రేమించిన మీరు......

భీమ — ప్రేమించాను కనక, నీమోసానికి లోబడాలీ? కాదుకాదు...నామాట విను. నాకు కోపం పోయింది. శాంతంగా మాట్లాడుతున్నాను. భరించలేని దుఃఖం అనుభవించాను. అకస్మాత్తుగా వృద్ధాప్యం దాపరిస్తోంది...విషయం తెలుసుకోక మునుపు ప్రజలందరినీ పిలవడం నాతప్పు. ఈక్రూరుడు చేసిన అవమానం అందరి సమక్షంలోనూ ఒప్పుకోడం నీకు ఎంత తలవంపో జ్ఞాపకముంచుకోవలసింది. అవును, మనం ఏకాంతంగా వుండే సమయంకోసం నిరీక్షించి వుండవలసింది. అప్పుడు ఆ దారుణసత్యం అంగీకరించి వుందువు! కాని ఈ సంగతి నాకు తెలుసు. అందరికీ తెలుసు. కాచి ప్రయోజన మేమిటి? నువ్వుకూడా అర్థంచేసుకోవాలి. ఇలాంటి సమయాల్లో బుద్ధి......

కళ్యా—చూడండి నాకేసి. నావిశ్వాసం, శక్తి, సత్యసంధత, అన్నీ నాకళ్లలో కొచ్చాయి. నేను చెబుతున్నది నిజం. నమ్మండి. నన్ను స్పృశించలేదు.

భీమ—బాగుంది. చాలా బాగుంది. మహో ప్రశస్తంగా వుంది!! విషయమంతా తెలుసుకున్నా. అవును. ఇదే నిజం. కాదు. ప్రేమ. వాణ్ణి రక్షించాలని చూస్తున్నావు. నే ప్రేమించిన స్త్రీ ఇంతత్వరలో మారిపోగలుగుతుందని కలలోనైనా అనుకోలేదు. ఈ విధంగా వాణ్ణి రక్షించలేదు. (గొంతెత్తి) అందరూ వినండి. ఆపుకోడానికి మనుష్యాతీతమైన శక్తి కావాలి. నామీద నాపట్టు సడలిపోతోంది. కడసారి యత్నం చేస్తున్నాను. అందరూ వినగలుగుతున్నారా? కంఠం బలహీనమయి పోలేదుగదా? దగ్గరకి రండి...దగ్గరకి... ఈ స్త్రీని చూశారా? ఆమనిషిని......పరస్పరం ప్రేమించుకుంటున్నారు. సరే. కీళ్లిద్దరూ నాదగ్గర నించి నాఆటంకం ఏమీ లేకుండా, నా ఆశీర్వాదంతో వెళ్ళిపోవొచ్చును. కావలసినవన్నీ తీసుకుపోవొచ్చును. మీకు ఇష్టమయితే వారు నడిచే బాటమీద పువ్వులు విరజల్లండి. నే కోరుతున్నది ఒక్కటే ... నాతో నిజం చెప్పాలి. జరగడానికి అవకాశమున్న నిజం. నమ్మడానికి వీలైన నిజం!! నేను ఆవిడ కిచ్చే స్వేచ్ఛకి బదులు నిజం చెప్పమని మాత్రం కోరుతున్నాను. అర్థమయిందా నీకు? ఒక్కమాట చెబితే చాలు......

కళ్యా—నేను నిజమే చెప్పాను. నన్ను ముట్టుకోలేదు.

జ్ఞాన—సరే. నువ్వు మాట్లాడేశావు. ఇహ చెయ్యదగిన దేదీ లేదు. (సైనికులతో) అతన్ని బంధించి కింద చీకటికొట్టులో పెట్టండి. మీతో నేనూ వొస్తాను. (కళ్యాణితో) నువ్వు మళ్లీ చూడవు. అంతిమ సందేశం నే చెబుతాను లే!

కళ్యా—(సైనికులమధ్య నిలబడి, ఉద్రేకంతో) కాదుకాదు. నే అబద్ధమాడాను. అవును. అబద్ధమే చెప్పాను. అవునవును. మీరు చెప్పినదే నిజం. (కాపలావాళ్లని తోసేస్తూ) ఇతను నాసొత్తు. ఇతరు లెవరూ ముట్టుకోకూడదు.........ఈ పిరికిపంద......

ప్రతాప—(కళ్యాణిమాటలు వినిపించకుండా చెయ్యాలన్న యత్నంతో) నన్ను రక్షించేనిమిత్తం అబద్ధమాడుతోంది. నమ్మకండి.

కళ్యాణి—వూరుకో. మాట్లాడకు. (ప్రజలవైపు తిరిగి) భయపడుతున్నాడు. సంకెళ్లు నాచేతి కివ్వండి. నాద్వేషం ప్రకటించడానికి ధైర్య మిచ్చిందికనక, అతన్ని నేనే బంధించి శిక్షించాలి. (చేతులుకడుతూ, అతని చెవిలో) మాట్లాడకు. నన్ను రక్షించాడు. నిన్ను రక్షిస్తాను. కలిసి ఎక్కడికయినా వెళ్ళిపోదాం. (పైకి) మాట్లాడకు. (ప్రజలవైపు తిరిగి) దయాభిక్షం పెట్టమంటున్నాడు. (కట్టు విప్పి మొహంచూపిస్తూ) చూడండి ఆదెబ్బ. నే చేసిన గాయమే అది. ఈ పెనుభూతాన్ని, పిరికిపందని...(సైనికులు ప్రతాపవర్మని తీసుకుపోడానికి ప్రయత్నిస్తారు) వొద్దొద్దు. నాకు వొదిలిపెట్టండి. ఇతను నా యజ్ఞపశువు.

భీమ—ఎందు కొచ్చాడు ఇక్కడికి? నువ్వు నాతో అబద్ధ మెందుకు చెప్పావు?

కళ్యా—(ఒక్కొక్కమాటే తడుముకుంటూ) ఎందుకు అబద్ధమాడానా?...నాకే తెలీదు. చెప్ప

కుండా వుందామనుకున్నా! ఇప్పుడు నిజం చెప్పెయ్య వలసొచ్చింది. మీ దుఃఖమే నన్ను కలత పెట్టేసింది. పూర్తిగా చెబుతా...(శాంతంగా) మీరు అనుకున్నట్టు అందరి సమక్షంలోనూ కసితీర్చుకుందామని ఇక్కడికి తీసుకురాలేదు. రహస్యంగా కసితీర్చుకోవా లనుకున్నాను. క్రమక్రమంగా అతని ప్రాణాలు తియ్యాలి. అర్థమయిందా? బొట్టుబొట్టుగా అతని రక్తం అతను చేసిన ఘోరపాపాన్ని కడగాలి. మీకు ఈ రహస్యం తెలిసేది కాదు...తెలివితక్కువగా ప్రవర్తించాను... నాకు తెలుసు. నే చెప్పినది మీరు నమ్మతారనుకోడం మతిభ్రమే. ఇప్పుడు నిజం తెలుసుకోండి. (ప్రజలవైపు తిరిగి) అంతా విని న్యాయం చెప్పండి. నేను మీ అందరిమీదా ప్రేమచేత అబద్ధమాడాను. నేను ఇతన్ని చంపడానికి ప్రయత్నించాను. గాయపరిచాను. మీకు గాయం కనిపించడం లేదూ? కాని నన్ను నిరాయుధను చేశాడు. అప్పుడు కసితీర్చుకోడానికి మరోమార్గం తట్టింది. చిరునవ్వు నవ్వాను. ఈ తెలివితక్కువదద్దమ్మ లొంగిపోయాడు. నా చిరునవ్వు సత్యమని విశ్వసించాడు. నన్ను నమ్మాడు. నా ముద్దులన్నీ నిజమనుకున్నాడు. నేను చెప్పగానే, మేకపిల్లలాగ వెంబడించాడు. ఇప్పుడు నా చేతుల్లో ఇరికించుకున్నా! దయాదాక్షిణ్యం లేకుండా నలిపేస్తాను.

భీమ—(సమీపిస్తూ) కళ్యాణీ!...

కళ్యా—'నిన్ను నే ప్రేమిస్తున్నా' అని చెప్పగానే నమ్మిన బుద్ధిహీను డితను. నరకంలోకికూడా నన్ను వెంబడించడానికి జంకలేదు. దైవసాక్షిగా, అందరి సమక్షంలోనూ చెబుతున్నా. ఇతను నావాడు. (పడబోతూ స్తంభాన్ని ఆనుకుని) జాగర్తగా వుండండి. నే తీర్చుకోబోయే కసి తలుచుకున్నప్పుడు ఆనందం ఉబికిపోతోంది. (జ్ఞానసింగ్‌తో) నాకు తిరిగి బలం చేకూరేదాకా మీకు అప్పగిస్తున్నా. ఎవరూ చొరలేని ఖైదులో పెట్టి తాళంచెవి నా చేతి కివ్వాలి. తక్షణమే కావాలి. ఇతను నా వాడు. నేనే అతన్ని శిక్షిస్తాను. మీరు అతని క్షేమానికి జవాబుదారీ. తెలిసిందా? (ప్రతాపవర్మతో) తిరిగి కలుసుకుందాంలే!

(ప్రతాపవర్మని సైనికులు తీసుకువెళుతూవుంటే) కళ్యాణి సొమ్మసిలిపోతుంది. పడకుండా జ్ఞానసింహుడు పట్టుకుంటాడు.)

జ్ఞాన—(మెల్లిగా చెవిలో) నువ్వు చెప్పిన అబద్ధం నాకు అర్థమయింది కళ్యాణీ! ఎవరూ సాధించలేని కార్యం నిర్వహించావు. మన ప్రతిచేష్టలోనూ లాగే దీనిలోనూ న్యాయాన్యాయాలు రెండూ వున్నాయి. ఏనాటికయినా ప్రాణరక్షణకి మించినది లేదు. ధైర్యం తెచ్చుకో. నిన్ను నమ్మడంలేదు కనక ఇంకా అబద్ధాలు చెప్పాలి. (భీమసింగ్‌తో) నీ కోసం పరితపిస్తోంది...

భీమ—(పరిగెత్తుకొచ్చి) కళ్యాణీ! మళ్లీ చెప్పు. నిన్ను ఎప్పుడూ సందేహించనేలేదు అసలు. జరిగినది పూర్తిగా మరిచిపోదాం! మన ప్రతీకారంలో అంతా తుడుచుకుపోతుంది. ఇదంతా పీడకల.

కళ్యా—(కళ్లు తెరుస్తూ) ఏడీ? ఎక్కడున్నాడు? ఆ, జ్ఞాపకముంది. తాళం నాచేతి కివ్వండి. నే తప్ప మరెవ్వరూ...

భీమ—సైనికులు రాగానే నీకే యిస్తారు. అంతా నువ్వు కోరినట్టే జరుగుతుంది.

కళ్యా—నాకే కావాలి...మరెవరూ ... నాకు పూర్తిగా నమ్మకం కలిగేటందుకు...అవును. ఇదంతా పీడకలే. కాని శుభస్వప్నం ప్రారంభమవుతుంది... శుభస్వప్నం... ప్రారంభమవుతుంది ... (బలహీనమయి స్తంభానికి చేరబడుతుంది.)

[తెర]

ప్రాచీన భారతీయుల దీర్ఘాయుర్దాయము

❁

= శ్రీ కొడాలి లక్ష్మీనారాయణ =

భారతీయులలో సగటున ఈ నాటి ఆయుర్దాయము ౨౬ సంవత్సరములేనని తెలిసిన మన కెంతయో చింత గల్గును. ప్రతిఆంగ్లేయుని ఆయుర్దాయము సగటున ౬౨ సంవత్సరము లుండ, అమెరికావాని ఆయుర్దాయము ౬౪ సంవత్సరము లుండ కాయకల్పచికిత్స నేకాలమునకో నేర్పిన భారతీయులు మాత్రము దీర్ఘకాలము జీవించనోచుకొనరారైరి. శిశుమరణములు సైతము నానాటికిని వృద్ధియగుచున్నవి. ప్రతి వేయికి భారతభూమిలో ౧౬౮ శిశుమరణములు గాన్పించుచుండ, ఇంగ్లండు, అమెరికాలలో ౫౨ న, ౪౭ యును గాన్పించుచున్నవి. భారతీయుల ఆరోగ్యభాగ్యము క్రమక్రమముగా క్షీణించిపోవుచున్నదని వేఱుగా చెప్ప నక్కఱలేదు. ౧౫౦ ఏండ్ల బ్రిటిషుపాలన భారతీయుల ఆరోగ్యభాగ్యమును కొంచెముగా వృద్ధిచేయజాలక పోయినది.

ప్రాచీనకాలములోని హైందవులు దీర్ఘకాలము జీవించియుండెడివారనుట కాధారములు పెక్కులు గలవు. వేదములు, బ్రాహ్మణములు, ఉపనిషత్తులలో ననేక చోట్ల ౧౦౦ సంవత్సరములు జీవించగోరు మను అర్థమిచ్చు మంత్రములు పెక్కులు గలవు. క్రీ. పూ. ౩౯౦ లోని పర్షియా ఆస్థానవైద్యుడు 'టేసియస్' (Ktesias) అనునతడు భారతీయులు తలనొప్పిగాని, పంటినొప్పిగాని, నోటిపుండ్లుగాని, శరీరముమీద పెచటను వ్రణములుగాని లేకుండ ఉండురనియు, వారు ౧౨౦, ౧౩౦, ౧౫౦ ఏండ్లవరకు జీవించెదరనియు, వృద్ధులు ౨౦౦ ఏండ్లవరకుకూడ జీవించెదరనియు వ్రాసియుండెను.

పై లేఖకుడే ఇంకొకచోటసైతము హైందవులు న్యాయవంతులనియు, మనుష్యులందఱిలో దీర్ఘాయుర్దాయవంతులనియు, ౧౮౦ఏండ్లు, కొందఱు ౨౦౦ ఏండ్లవఱకుగూడ జీవించెదరనియు వ్రాసియుండెను. మఱియొకతావున భారతభూమియొగువభూమినుండువారిలో కొందఱు ౧౩ మూరల ఎత్తుండురనియు, ౨౦౦ ఏండ్లవఱకు జీవించెదరనియు వ్రాసియుండెను.

'అలెగ్జాండరు' అను యవనభూపతితో వచ్చిన 'నియార్కసు' అను లేఖకుడు భారతీయు లారోగ్యవంతులనియు, రుగ్మతలేనివారనియు, అల్పాయుర్దాయము లేక వార్ధక్యమువఱకు జీవించెదరనియు వ్రాసియుండెను. 'అనిసిక్రిటసు' అను మఱియొక అలెగ్జాండరు లేఖకుడు భారతీయుల సగటుఆయుర్దాయము ౧౩౦ ఏండ్లని వ్రాసియుండెను.

గ్రీసు చారిత్రిక జనకుడగు 'హిరోడోటసు' అనునతడు హైందవులు దీర్ఘాయుర్దాయవంతులనియు, ౧౩౦ లేక ౧౪౦ ఏండ్లవఱకు జీవించెదరనియు, కొన్ని సమయములలో ౨౦౦ ఏండ్లవఱకు జీవింతురనియు, అట్లు దీర్ఘాయుర్దాయవంతు లగుటకు కారణము ప్రకృతిలో నివసించుటయేననియు, ఎవరును ఏజబ్బుతోను బాధపడుచుండుటలేదనియు వ్రాసియుండెను. (క్రీ. పూ. ౫ శతా)

చంద్రగుప్తుని కాలమున వచ్చిన 'మెగస్థనీసు' అను యవనరాయబారి భారతీయుల నిరాడంబరత్వమును, సుఖజీవనమును బ్రశంసించక పోలేదు. భారతవర్షము అనేక వనమూలికల నొసగుచుండెను. ఈ మూలికలనేకములు వైద్యమున కుపయోగించునట్టి వేయని, ప్రాణ

హానిని గల్గించు పాముకాటునుగూడ మాన్పునని, 'ఏలియను' అను గ్రీకు లేఖకుడు వ్రాసియుండెను. పుణ్యమైన భారతావని అనేకవనమూలికలకు ప్రసిద్ధియని వేఱుగా జెప్పనక్కరలేదు. అనేకచోట్ల భారతీయులు ప్రకృతిదాయకమగు ఆహారమునే గైకొనుచుండిరి. అందుచే నేవ్యాధియు లేక ఆరోగ్యభాగ్యమును గల్గియుండిరి.

'ఫాహియాను' అను చైనీయ పరివ్రాజకుడు కూడ ప్రాచీనకాలములోని మనుష్యులు బహుదీర్ఘకాలము జీవించుచుండిరని వ్రాసియుండెను. 'హుయాన్‌సాంగు' అను చైనీయలేఖకుడుకూడ రుగ్మత గల ప్రతివాడు వారమురోజులు పస్తుండునని, ఈ వారములో రోగికి నయమగునని, అట్లు వ్యాధి కుదురనిచో ఔషధసేవ చేయునని, భారతీయు లారోగ్యవంతులని వ్రాసియుండెను.

క్రీ. శ. ౭-వ శతాబ్దిలో భారతభూమికి వచ్చిన 'ఇత్సింగు' అను చైనీయ లేఖకుడు లాటదేశములోని జనులు జబ్బుపడినచో మాసము, లేక పక్షము రోజులు పస్తుందురని, మధ్యభారత వర్షములో వారమురోజు లుపవసింతురని, భారతీయులు ఉల్లిపాయలు తినరని వ్రాసియుండెను.

ప్రాచీన భారతీయు లుపవాస చికిత్సను బాగుగా నెఱిగియుండిరని దీనినిబట్టి విదితమగుచున్నది. బుద్ధదేవుడుకూడ నొకసారి అధికపర్యాయములు భుజించు పద్ధతిని నిరసించెను. ముమ్మారు భుజించిన రోగి యని, రెండుసార్లు భుజించిన భోగి యని, ఒకమారు భుజించిన యోగి యని ఆయన నుడివియుండెను. అజీర్ణము, మలబద్ధకము మున్నగాగల వ్యాధులకు కారణము నియమము లేకుండ భుజించుటయే.

'ఇత్సింగు' ఈలాగున వ్రాసెను: "భారతవర్షములోని పంచఖండములలోని యేమనుష్యులున్ను ఉల్లిపాయలుగాని, పచ్చికూరగాయలుగాని తినరు. అందుచేత వారెన్నడును అజీర్ణముచేత బాధపడరు. గర్భము, పేగులు ఆరోగ్యముగా నుండును. ఏ విధముగాను వారు బాధపడుటలేదు." ప్రాచీనభారతీయు లే విధమైన జబ్బునకైన 'శాంతంగు' (Santeng) అను మాత్రలను వాడుచుండిరని ఇత్సింగు వ్రాసెను. హరీతకీ (కరక్కాయ)పేడు, శొంఠి, పంచదార సమభాగములుగా గలిపి, నూరి, మాత్రలుచేసి, పుచ్చుకొనుచుండెడివారు. ౧౦ మాత్రలుదయము తినెడివారు. కరక్కాయయొక్క ఉపయోగము నీనాడు భారతీయులు మఱచియుండిరి. క్రీ. శ. ౧౪-వ శతాబ్దిలోని 'నిత్యనాథసిద్ధుడు' తన 'రసరత్నాకరము'లో రాజుగారి దర్శనార్థ మేగునపుడు హరీతకీఫలముతో బోవలయునని చెప్పియుండెను. దీనివలన కరక్కాయయొక్క శ్రేష్ఠత్వము బోధపడుచున్నది. త్రిఫలములలో కరక్కాయ, ఉసిరిక, తాడికాయలు గలవు. వీని సుగుణము లాయుర్వేదవైద్యులెల్ల రెఱిగినవే. ఆకాలపు భారతీయులు కరక్కాయను, సర్వేంద్రియములను శోధించు శొంఠిని వాడుచుండుటచేత వారు దీర్ఘాయుర్దాయవంతులైరని వేఱుగా జెప్పనక్కరలేదు. ప్రతిదినము కరక్కాయపేడును గోరికి తిన్నచో, మనిషి జీవితకాలమంతయు, రోగము లేకుండ, పరిపూర్ణారోగ్యముతో నుండునని 'ఇత్సింగు' వ్రాసియుండెను. ఇట్లే 'ఉపవాసము'కూడనని పై లేఖకుడు వ్రాసెను.

ప్రాచీనభారతీయులకు దీర్ఘాయుర్దాయము గల్గుటకు మఱియొక కారణము ప్రకృతిదాయకమైన ఆహారమే గాకుండ నేయి, నూనె, పాలు, వెన్న సమృద్ధిగా వాడుచుండుటయే. ఆ కాలపు భారతావనిలో పాడిపంటలకు గొదువలేదు. పాలు, పెరుగు, నేయి మనుష్యులకేగాక కుక్కలు, పిల్లులు మున్నగు జంతుజాలములకుగూడ సమృద్ధిగా నొసగబడుచుండెనని కౌటిలీయార్థశాస్త్రమును బట్టి తెలియుచున్నది.

కాకతీయుల కాలమున వచ్చిన 'మార్కోపోలో' అను విదేశీయయాత్రికుడు భారతీయయోగులు ౧౫౦, లేక ౨౦౦ ఏండ్లవరకు జీవించెదరని, గంధకము, పాదరసము గలిపిన ద్రావకమును వారు త్రాగుచుండిరని, మాసమునకు రెండుమార్లు వారు దీనిని వాడుచుండిరని, అందుచే దీర్ఘాయుర్దాయము గల్గుచుండునని, ఆయనకు యోగులు చెప్పిన విషయమును వర్ణించియుండెను.

అనేక వైద్యశాస్త్రములలో కాయకల్ప చికిత్సలనేకములు గాన్పించుచున్నవి. అష్టాంగహృదయము,

రసరత్నాకరము మున్నగు వైద్య గ్రంథములలో నివి లెక్కకు మిక్కుటముగా నున్నవి. ఈమధ్య మదన మోహన మాళవ్యాకు జరిపిన కాయకల్పచికిత్స ఆయుర్వేద వైద్యశాస్త్రములోనిదే.

ప్రాచీన సాంప్రదాయములు నశించిపోవు చున్నవి. ఆయుర్వేదవైద్య ప్రాశస్త్యమును గుర్తించువారు లేరు. ప్రతివారు చీటికి మాటికి రాజవైద్యుల చెంతకు పరుగిడుచున్నారు. మూలికావైద్యము నేడు మాయమై పోవుచున్నది. తక్షశిలా, నాలందా విద్యాలయములలో నాయుర్వేదము ప్రధానవిషయముగా బోధింపబడుచుండెను. బుద్ధునికి చికిత్సచేసిన జీవకుడు తక్షశిలావిద్యాలయములో శస్త్రచికిత్సకూడ నేర్చియుండెను.

మజ్జిగ విశేషముగా త్రాగి, ప్రాచీన భారతీయులు ౨౦౦ ఏండ్లవరకు జీవించుచుండిరని 'హంటర్ సాంగు' వ్రాసియుండెను. ప్రాచీన గ్రంథజాలములు, విదేశీయలేఖకుల వ్రాతలను జూచినచో, ప్రాచీన భారతీయులు దీర్ఘాయుర్దాయవంతు లగుటకెట్టి ప్రయత్నములు జేయుచుండిరో తెలిసికొనవగును. స్నానమునుగూర్చి వ్రాయుచు, చరకుడు స్నానము శరీరమును పరిశుద్ధమొనర్చునని, ఆయుర్వృద్ధిని జేయునని, అలసటను బోగొట్టునని వ్రాసియుండెను. చరకుడు కనిష్కుని ఆస్థాన విద్వాంసుడు. క్రీ. శ. ౧౫౦-వ సంవత్సర ప్రాంతములోనివాడు.

సుశ్రుతుడుకూడ ఆరోగ్యసూత్రముల ననేకముల్లేఖించెను. పండ్లుతోముట, కండ్లు, నోరు కడుగుట, తల దువ్వుట, శరీరమర్దనము చేయుట, శరీర పరిశ్రమ చేయుట మున్నగువానిని హెచ్చుగా వర్ణించెను. పాదరక్షలు లేకుండ నడచుట శరీరమునకు, ఆరోగ్యమునకు హానికరమని సుశ్రుతుడు వ్రాసియుండెను. పరిశుభ్రమైన దుస్తులు ధరించుడని, చేతులు కాళ్లు కడుగకుండ భుజించరాదని, యితరుల గిన్నెలు, దుస్తులు, పాదరక్షలు, గొడుగు, ఆభరణములు మున్నగువానిని వేనిని వాడరాదని సుశ్రుతుడు వ్రాసెను. దీర్ఘాయుర్దాయమునకు బ్రహ్మచర్యము అవసరమని ప్రాచీన భారతీయు లెఱిగియుండిరి. ఈనాటి భారతవర్ష పతనమునకు కారణము బ్రహ్మచర్యము లేకుండుటయేనని పలువురు విద్వాంసులు వ్రాసిరి. ఆయురారోగ్యము లేనిచో మానవుడు సాధించు పురుషార్థమే లేదు. కాన ప్రాచీన విధానములను గుర్తెరిగి ప్రతిభారతీయుడు దీర్ఘాయుర్దాయవంతు డగుటకు గడగవలయును.



మృత్యువు

శ్రీ దండిపల్లి వెంకట సుబ్బాశాస్త్రి

ఈ మహానంతవిశ్వసంసృష్టియందు
ఒక మహాశ్చర్య, మొక చిత్ర, మొక విశేష,
మొక యనిర్వాచ్యలక్ష్యంబు నున్న; దదియె
భయద మృత్యుదేవీనాట్య భంగిమంబు.

అసలు సృష్టికి కారణం బరయలేము—
ఈ స్వయంఘాతుకత్వాన కేమి గలదొ ?
ఎవరు చేయమనిరి సృష్టి? ఎందు కీ ల
యప్రసక్తి? దేవున కీ ప్రయాస లేల?

ఓసి మృత్యు! సకల మానవోన్నతాత్మ
భావనాసంపదకు గిరవాటువేసి
నీ వినీలాలకలను విప్పి నిజకరాళ
రదనములనుండి మంటల గ్రక్కు టేల?

ఇది యపథ్య, మసంభావ్య మిది యటంచు
తర్కపద్ధతి బూనక తపనతోడ
ప్రాణసూత్రముల హరించి వల్లకాట
దాల్తు వేటికి నిశ్చలధ్యానముద్ర?

పుణ్యులని కరుణ తనలో బోల్చుకొనదు,
పాపులని హీనభావమ్ము చూప దెపుడు;
పుణ్యపాపుల నొకరీతి బ్రోవజూచు
అమితసౌభ్రాత్ర మా మృత్యువందు కలదు!

యౌవనవసంతసుకుమారమైన కలికి
లేతకనుబొమలందు నర్తించుచుండు
జీవకళికయా తిలకమ్ము చెఱపివైచి
వికటనృత్యమ్ము సేయు నా విలయరాజ్ఞి.

యోగమార్గానుయాయులై యుపనిషత్ప్ర
పంచమున ప్రవృత్తి, నివృత్తిభావములను
తర్కమొనరించు హానిబృందమ్మునైన
సత్కరింతువు విషమయోచ్ఛ్వాసములను.


వలపు తడియారని నునుకౌగిళులయందు
ప్రేమరసమును ద్రావెడు ప్రేమికునకు
నిజసతీవియోగము గూర్చి నిస్తరింతు
వేల? మాయామయీ! యిది యేటి వృత్తి?

నిఖిలభావోదయశ్రీల నిత్యనూత్న
వాఙ్మయస్థభాండారమ్ము భద్రపఱచి,
మానవావళిపై మత్తుమందు జల్లు
కవివతంసుల రసనకు కాంతుపడక
మృత్యుదేవీ! గ్రసింప గమింతు వేల?

ఏ యరుంతుద ఘాతుకభృతులకైన,
నిత్యహింసా రిరంసావినీతమతుల
కైన ప్రాణాపహరణ ప్రయాసచింత
కలుగజేయగలవు నీవు గరళహృదయ!

వివిధలోకమహోపద్రవేయములగు
భిన్నశక్తులతో గూడి విశ్వమందు
హుంకుము నిటు చలాయింతువె?ఓసిమృత్యూ!
ఈ విలయవిద్య నేర్చినా వెవనియొద్ద?

విశ్వవిఖ్యాతమైన కాలిఫోర్నియా విజ్ఞానకేంద్రము




౧. గ్రిఫిత్ అబ్జర్వేటరీ అనే పేర లాస్ ఏంజలిస్‌లో ఉన్న ఖగోళ వేధశాల





౨. లాస్ ఏంజలిసుకు సమీపంలో హాలీవుడ్డు కొండల్లో తొలిచినట్లు కట్టిన అద్భుతోత్తర నాట్య-గానమందిరం

విశ్వవిఖ్యాతమైన కాలిఫోర్నియా విజ్ఞానకేంద్రము



3. పాతకొత్త యుగాలకుచేరిన పెద్దపెద్ద చిత్రకారుల ఉత్తమచిత్రాలతో నిండియున్న హంటింగ్టన్ కళామందిరం





౫. ఖగోళరహస్యాలను కరతలామలకంగా చూపెట్టగల ౨౦౦ అంగుళాల దూరదర్శిని'ను, బహుళశక్తివంత మయిన ప్రతిఫలముకురములోను జ్యోతిర్వేత్తలను అపారంగా ఆకర్షిస్తున్న మౌంట్ పాలోమర్ గుమ్మటం



శాంతిశ్రీ

[గేయనాటిక]

— 'దేశిరాట్ విరాట్' —

శాంతికన్యక కొన్నాళ్లనుండీ కనిపించడం మానేసింది. యుద్ధానికి తననిచ్చి పెళ్లి చేస్తామన్న మాట వినడమే ఆమె అర్ధరాత్రివేళ అనంతవాయువుల్లోకి పారిపోయింది. శాంతికన్యక అంతర్ధానం జీవజగత్తులో గగ్గోలు పుట్టించింది. పోయిన శాంతికన్యక తనతో 'సుఖజీవనా'న్ని కూడా తీసుకుపోయింది. జగత్కుటుంబం ఆమె ఎత్తుకుపోయిన సొత్తు లేక పోతే మలమల మాడి చచ్చిఊరుకుంటుంది. ఎట్లానైనా ఆమెజాడ నన్వేషించి, సుఖజీవనంతో కూడా ఆమెని పట్టి తిరిగీ తీసుకురావాలని బహుళప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎన్నిప్రయత్నాలు జరుగుతూవున్నా జాడమాత్రం దొరక్కుండావుంది.

తృణ మిక్కడ నిల్వనివ్వంటే
యుద్ధంతో నా కుద్వాహం,
నాజీవితలహరీగ్రీష్మం
జరుగక తప్పదు : రాక తప్పదూ !
అంతా తన పొట్టలోనికే
అనుకొను స్వార్థం ఈసంబంధం
నాకోరికకే వ్యతిరిక్తంగా
కుదురుస్తుందా ! చెదరిస్తుందా ?—
విషవాయువినిష్ఠురనిశ్వాసం,
అగ్నిజ్వాలాతీక్ష్ణదృక్కులూ,
రక్తరాగఘూర్ణితనేత్రాలూ,
కుఠారభయదం,
కఠోరహృదయం,
వికారవేషం,
అకారణంగా—
కరకర నమిలే బ్రహ్మరాక్షసికి
ధారుణదంష్ట్రావికటకుటిలకట
కటుగర్జాధ్వనిమహోట్టహాసం
నీయుద్ధానికి
జత చేస్తారా ?—బలి చేస్తారా ?
తృణ మిక్కడ నిల్వనకుండా
ఏ గుహలో, ఏ గహనములో
నా మధుఋతుసౌందర్యశ్రీ
ప్రచ్ఛన్నము చేసికొందునా ?
విచ్ఛిన్నము కాకయుందునా ?

(అంతర్హిత అవుతుంది)

జగత్కుటుంబం

ప్రతిప్రత్యగ్వస్తుపారార్ద్రి వాయువులలో,
శాంతికన్యా గ్రీష్మ శైత్యకన్యామన్యా,
శయనకాలాస్వర్ణ చంద్రకాలావీథి
వినిపించు వేదాలు
వీణానినాదాలు
వినబడియెనా మీకు ?
వినిపించెనా నీకు ?
సుఖజీవనమ్ముతో

సురిగిపోయిన కాంతి
అడుగుల, తొడవుల జాడలు
—కనబడలేదా?
ఘణుఘణు ఘణుఘణు ఘణువులు
—వినబడలేదా!
పరువులు పెట్టిన తెరువులు
—తెలిపేవారే లేరా!
ఆగిన, దాగిన చోటుల
—నరసినవారా?

స్వార్థం

యుద్ధం!
ఓ యుద్ధం !! యుద్ధం !!!
నీ క్రీడామనుకున్న కన్యకా
లోకానికి కాంతిరేఖికా
మా 'శాంతం' ఏమయ్యిందో !
ఇల్లంతా వెతికిచూచినా,
కాసంతా కనపడకుండోయ్ !
ఈ పుంతా, ఇక్కడి కంతా,
ఆ సంతా, అక్కడి చెంతా,
అన్నిటికీ వెదకగవెళ్లాం,
మళ్లా మాఇళ్లకు మళ్లాం,
కాబోయే నీ ముసిముసి పెళ్లాం
కనబడకుండోయ్ !
నీ కంతో పుణ్యం సుమ్మా!
మా శాంతిని పట్టుకు రమ్మా
వేగంగా
వెదకగపోర్దూ !
మాశాంతిని
కైకొనివద్దూ?

యుద్ధం

నువ్వేమిటి అంటున్నావ్ ?
శాంతెక్కడికో పోయిందంటావ్ ?
నీ పాతాళపు, హృదయపు లోతుల
కూకటివ్రేళ్ల
పెకలిస్తున్నా.........
తొంగరివంగా
దాచిన శాంతిని
చూపిస్తావా ?
తెస్తావా ? లేవా?
ఈయకపోతే, మారుపల్కితే
శాతఖడ్గధారాధవళిమలకు
నీ మాంసలగళనిర్మలశోణిత
గంధము పూస్తా......స్కంధము కోస్తా...
వెళ్తున్నావా.?
వెళ్లావా ? లేదా ?

(దుముకుతాడు)

తృష్ణ
(ప్రవేశించి)

నారాజ! రణరాజ!
రాజులకు రేరాజ!
వలపుసౌందర్యమ్ము
తెలిసిపోలేవట్టి
కుర్రవెంగలి శాంతి
కోరుటేమిటి రాజా......నారాజ...
నేను రాగిలి ఇచ్చు
వలపుకౌగిలిలోను
అరచేతి స్వర్గమ్ము
అందుకోబోరాద ?......నారాజ......
స్వార్థమేమో నీకు
చక్కన్ని కన్నియను
అందిచ్చువని బ్రమసి
అడియాసపడదగున ?......నారాజ......

(ముందుకు పోయి)

రణరాజా ! రణరాజా !
కదనరాజ ! కదనరాజ !
కదనరాజ ! ఖదమ్రొక్కు
ఖదమ్రొక్కు కదనరాజ !
నీకు హిమానీ నిర్మల
నేత్రాల్లో నీలమేఘ
వలయా లున్న వదేలా ?
విలయచిహ్నా లవి యేలా?.........

(దగ్గరికి వెళుతుంది)

యుద్ధం

ఇంకా ఇక్కడే నిలుచున్నావా?
వసంతవనిలో
ప్రశాంత మణిమయ
నిశాంతమున సుఖ
నిద్రను పొందే
శాంతిని దాచిన చోటులు తెలుపవ్? -
శాంతిచరణ మంజీరకింకిణీ
ఝుమ్ ఝుమ్ శబ్దం వినబడదంటావ్?

(పాన్థాన్ని వెంటతరుముతాడు. తృష్ణ ప్రక్కకుపోయి నిలుచుంటుంది.)

(యుద్ధనాట్యప్రారంభం)

కృష్ణకబరి శిఖిపింఛవల్లికా!
తృష్ణా! కవోష్ణ గాఢాలింగన
మియ్యవ్? ఇయ్యవ్?
యుద్ధసహచరీ
ముగ్ధఖేచరీ
మధురమధురవభ్రమరమంజరీ............
విమల కమలమాలాతిసుందరీ............

(ఇరువురూ కౌగిలించుకుంటారు)

తృష్ణ

యుద్ధవిషాశ్లేష. తృషా
శీర్ణం, రుగ్ణం, దగ్ధం దేహం
ప్రళయకాలహాలాహలకీలలు!
కీలలు! కీలలు! జ్వాలలు! జ్వాలలు!
హతోస్మి చచ్చాక్
మృతోస్మి మండాక్
శీర్ణం, దేహం, చూర్ణం, చూర్ణం
విషపుమంటలలో, వేడిసెగలలో,
శిరోస్థి భస్మం!
పరాగనృత్యం!!

(పడి చస్తుంది)

యుద్ధం

తృష్ణావచస్సులోపలి కమ్మని
ప్రణయామృతపాథేయం పోయెం.
మృగతృష్ణాప్రణయాసహ్యవిష
ప్రవాహఫణాభరకృష్ణసర్పములు
ఒడలినిండుగా పరువిడుచున్నవి
ప్రాకుచున్నవీ, కరచుచున్నవీ......
విషాన్ని క్రిందికి దింపే వైద్యులు
విషాన్ని పిండే పాములవాళ్లూ,
ఎవరేనా రండోయ్.
ఈ విషబాధను
ఎవరు తీర్చినా
వేలూ, లక్షలు, కోట్లూ
కానుకలు!!

(పరువిడుతాడు)

నౌక

(పరిచారిక. ఎదురుగా వస్తుంది)

కృత్తిమనుష్యుల రక్తశిరస్సులు
ప్రభుల మృదులపాదాలకింద బడి
నలుగుచున్నవి, చిదుగుచున్నవి
ఝంఝూసమీర జవనాశ్వంపై
శబ్దంకన్నా త్వరగా, త్వరగా,
పరువిడిపోయెద రెచ్చటికో
తృష్ణను వలచిన కృష్ణమూర్తులూ,
ప్రభువులు దేవులు
యుద్ధదేవతా సుందర పురుషులు!!

యుద్ధం

వైమానికుడా! వైద్యం తెలుసా?
నాడి పరీక్షిస్తావా నాకా?
తృష్ణాలింగన సౌరభ్యంతో
శరీరమంతా అల్లుకుపోయిన
విషాన్ని తీసే మంత్రం మీలో
ఎవరేనా వేస్తారా?
బాధను తగ్గించేవారికివో
మొహర్లు, కాసులు, రతనాల్, ముత్యాల్
వందలకొద్దీ బహుమానాల్!!

వైమానికుడు

(పరిచారకుడు)

మంత్రిస్తున్నా నిదిగో రాజా!
హుంహ్రాం హ్రాంహ్రాం! హుంహ్రాం హ్రాంహ్రాం

హ్రాం, హ్రీం, హ్రూం, హ్రైం, హ్రౌం, క్లీం
క్లిక్, క్లిక్, క్లిక్, క్లిక్ క్లిక్లిక్కు,
విషం తగ్గిందా?
బాధ తీరిందా?
శరీరమంతా చల్లబడ్డదా?

యు ద్ధం

తృష్ణాశ్లేష విషాగ్ని కీలికలు
శాంతి కన్యకా వపుస్స్పర్శలో
ప్రణయహిమానీకంపిత గాత్రం
ప్రాతిపదికగా అణగు నేమిటో
శాంతిని కనుగొని వస్తారా?
శాంతిని ఇచటికి తెస్తారా?
తృష్ణా విషంకి
శాంతే మంత్రం
శాంతి ఔషధం—
తృష్ణకి శాంతే
ఈశ్వర వేరూ?

(వైమానికుడూ, సాకా పోతారు)

(తెర)

౨

ప్ర చా ర ణ

పెళ్లికొడుకు యుద్ధంగారూ
తృష్ణాప్రేయసి పెళ్లాడారూ
విషజ్వరంతో పెనగుచున్నారు!
తప్పిపోయిన కళత్రంకోసం
తాపత్రయాన్ని పడుతున్నారూ
శాంతిని తెచ్చి ఇచ్చేవారికి
లాలువేలూ, దుశ్శాలువలూ.

జ గ త్కు టుం బ ం

శాంతి పోయినది ఏనాడో
విడిచిపోయినవి ఆనాడే
సౌభాగ్యం, కుటుంబసర్వం ఆరోగ్యం,
ఎపుడు శాంతి కనిపింపకుండెనో
అపుడే మమ్మల నావరించెనూ
దౌర్భాగ్యం, పరిస్థితుల దౌర్భాగ్యం.

మళ్లా మా గృహం ముంగిటికి
శాంతిని చేర్చే దారులు లేరా?

యు ద్ధం

శాంతి శాంతి! దివ్యశాంతి!
సహచరిష్ణు! సహచరిష్ణు!
విషబాధా వినివారిణీ!
స్వాగతాలు! స్వాగతాలు.

(నౌక వస్తుంది)

శాంతిజాడ కనబడెనా?
శాంతి కూడ వచ్చెదునా?
శాంతి ఏది? ఏది?

నౌ క

జలధిప ప్తరం
అధోమృత్తికలు
సర్వస్వాన్నీ
గాలించినగానీ,
నవద్వీపములు
దిశాసలిలములు
అఖాతపథములు
సింధుశాఖలూ
శోధించినగానీ
దాసోహం, దాసోహం!
శాంతికన్య జాడలేదు.

యు ద్ధం

(వైమానికుడు ఒస్తాడు)

వైమానిక! వైమానిక!
కనబడెనా శాంతి నీకు?
శాంతిజాడ దొరికినదా?
శాంతిఏది? శాంతిఏది?

వై మా ని కు డు

అనంతవాయువు
తారామార్గమూ,
మేఘవీథికలు
చంద్రమండలం

ఇలికి వచ్చినా,
గిరిశిఖరాలూ
నీరంధ్రవనాల్
నగరాగారాల్
భూమి సర్వమూ
చూచివచ్చినా
శాంతిజాడ దొరకలేదు!
శాంతిముఖము కానరాదు!
దాసోహం, దాసోహం!!

యుద్ధం

విషాన్ని హృదయం మింగేసింది
హృదయం విషాన్ని తాగేసింది
బుద్ధీ విషాన్ని బుక్కేసింది
విషపు కోరపై కాలుపడింది
విషం తగ్గదూ, బాధ తీరదూ
విషభారంతో బ్రతకను బ్రతకను!
తృష్ణా! నన్నూ చంపేశావ్
తృష్ణా! నన్నూ కాల్చేశావ్
చచ్చితి చచ్చితి చచ్చిపోతినీ—
తృష్ణాదేవీ ప్రణయచుంబనం
విధురసదిగ్ధం మృగతృష్ణా!

(గతజీవుడయి కూలపడతాడు)

3

[కళాతపస్వి శాంతినికేతనం. తపస్వి కళారాధనలో నిమగ్నుడయి వుంటాడు. పూసజ్జలో శాంతి. మధురాలంకృత]

కళాతపస్వి

నీవు పున్నమ యరుణ్యోత్స్నా?............ఓసఖీ...
నీవు వెన్నెల యరుణ్యోత్స్నా?
నిడుదచీకటి క్రమ్మ
నిరుపేద నా బ్రతుకు
పర్ణశాలా రంధ్ర
భానుకిరణావళులు............నీవు......
వర్ష ధారాబిందు
శైతల్యభరములో
వాలువారే యింట
కాల్చు ఆకలిమంట..........నీవు......

శాంతి శ్రీ

పారివచ్చినానోయ్.........బాధా
కోరి వలచినానోయ్—
బ్రతుకువెన్నెలా
పాలవెన్నెలా
చూచివచ్చినానోయ్..........బాధా
వలచివచ్చినానోయ్—
చల్లన్ని మననూ
చక్కన్ని తపనూ
తొణికిల్లు సొగనూ
అరసి వచ్చినానోయ్..........బాధా......
మురిసి వచ్చినానోయ్—

ప్రచురణ

విషజ్వరంతో యుద్ధం చచ్చెను
తృష్ణాప్రేయసి నను గమించెనూ
పెళ్లికి వచ్చిన సానాయిమేళం
బాజాలన్నీ ఎత్తుకపోయెను
యుద్ధం చెల్లి ఫిరంగికురంగి
నేత్రకోటికి కాళం పడెనూ
నిగూఢజగతీ నేపథ్యంలో
ప్రచ్ఛన్నంగా కాలంగడిచే
శాంతీ! శాంతీ! శాంతీ! శాంతీ!
శాంతీ! శాంతీ! బయటికి రా!!
శాంతీ! శాంతీ! ఇంటికి రా!!!
ఏ గుహాలోపల దాగున్నావే?
ఏ గహనములో పొంచున్నావే?
ఏ మొయిళులలో నక్కియుంటివే?
ఏ చీకటిలో నిల్చియుంటివే?
శాంతీ! శాంతీ! బయటికి రా!......

కళాతపస్వి

విడిచిపోతావేమొ,...ప్రేయసీ......
విడలిపోతావేమొ,...ప్రేయసీ......

కదలిపోయేనాడు
వదలిపోకే నన్ను
మెదలె చిమ్మెట రొదల
కడలి పగిలిన ఎడద......విడిచి......
తెరువు తెలియని బ్రతుకు
తెల తెలను వెలిగించి
వెలుగైన యింతటను
దివియలను ఆర్పి......విడిచి......
బూజుపట్టిన బుద్ధి
ముంగిటను పరిదిద్ది
ముత్యాల ముగ్గులను
బొటన వ్రేలను చెరిపి, ...విడిచి......
వీడిపోయేముందు
పిలుచుకొని పొమ్మందు
తోడుగా నైనాను
త్రోవలో నుంటాను......విడిచి......

శాంతి

నేను పోలేనోయి......నా నాథా......
విడిచి వెళ్ళగలేను......నా నాథా......

నిన్ను వలచినవాడై
నీవాడ నైనాను
నీపైని నాఆశ
నిలుపుకొని యున్నాను......నేను......
లోతైన నీమనసు
పాతాళమైనాను
నీతోనె, బ్రతికేది
నిముష మనుకొన్నాను......నేను......

(ప్రణతి మరణించి)

పెళ్ళికుమారుడు యుద్ధంగారూ
పల్లకిమీదా వేంచేశారా?
చనిపోయారా? పాపం! పాపం!!
పెళ్ళికుదిర్చిన జ్యోత్స్నాదేవీ,
మేనగోడలికి మృత్యువు! మృత్యువు!!
స్వార్థంగారూ చావగలేదూ?
స్వార్థంముక్కున ప్రాణముండగా
శాంతిపాదనఖ చంద్రరోచులా
కుంతి వ్రాలవూ, తిరిగి చూడవూ?

[తెర]



మద్రాసు ప్రభుత్వంవారి ఆదాయ వ్యయ పట్టిక

(1946-47)

✽

= శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య =

మద్రాసురాష్ట్రమునకు ప్రధానమంత్రియు, ఆదాయవ్యయశాఖాధ్యక్షులును అను గౌరవనీయులైన టంగుటూరు ప్రకాశంపంతులుగారు ఆగస్టు 1-వ తేదీన ప్రభుత్వముయొక్క ఆదాయవ్యయపట్టికను శాసనసభకు సమర్పించారు. దీనిపై రెండుపర్యాయాలు కొన్నిదినములకాలము చర్చజరిగినది. మద్యపాననిషేధము విషయమైమాత్రము ఈ చర్చలమూలముననూ, కాంగ్రెసుపక్షమువారి అభిప్రాయముమూలముననూ కొంతమార్పు జరిగినది. తక్కిన అంశములలో ప్రధానమంత్రియొక్క పట్టికను శాసనసభవారామోదించిరి. ఇందులోని విశేషము లేవియో కొంతవరకు ఇచట వివరింపబడును.

1946 ఏప్రిలు 1-వ తేదీతో ప్రారంభం అయి 1947 మార్చి 31-వ తేదీతో అంత్యం అయ్యే ఈసంవత్సరంలో ప్రభుత్వంవారికి ఏయేపద్దులనుండి ఎంతెంత ఆదాయం వచ్చేది, ఈ ఆదాయాన్ని వారేయేపనులకు ఎంతెంతవరకు ఖర్చుపెట్టేది ఈ పట్టికలో సవిస్తరంగా చెప్పబడియున్నది. వివరముల నన్నిటిని శాసనసభాసభ్యులకు తెలియపరచే ఉద్దేశంతో అయిదుసంపుటముల గ్రంథమును ప్రభుత్వంవారు ముద్రించి సభ్యులందరికి పంచిపెట్టియున్నారు. ఈ సంపుటములలో అరటావుసైజు పేజీలు 958 ఉన్నవి. దీని నంతను చదివినయెడల పట్టికలోని విశేషములన్నియు పూర్తిగ బోధపడగలవు. కాని ఈ చదవడం సులభమైన పని కాదు. అంతా అంకెలమయం. ఎంతో ఓర్పు ఉంటేనేగాని ఎవరూ ఈ పని చేయలేరు. ఓర్పు ఉన్నా, ఆ అంకెలను అర్థంచేసుకోవడం కష్టసాధ్యం. శాసనసభాసభ్యులు కొందరు చర్చలలో పాల్గొని అనేక ఉపన్యాసాలు చేసినమాట వాస్తవమే. కాని అందరికీ పట్టికలోని అంకెలు అర్థమయిందని చెప్పుటకు వీలులేదు. ఆ కారణంచేత వారు చేసిన విమర్శలు స్థూలంగా ఉండినవేకాని అంకెలకు సంబంధించియుండలేదు. శాసనసభలో జరిగే చర్చల ఉద్దేశం ఇంతే.

ఆదాయపు పద్దులు

ప్రభుత్వంవారికి 31 పద్దులనుండి ఆదాయం లభించుచున్నది. వీటిలో 28 పద్దులకు సాధారణములనియు, తక్కిన 3 పద్దులకు అసాధారణములనియు పేర్లు. యుద్ధానంతరపునర్నిర్మాణమునకై కేంద్రప్రభుత్వంవారు మద్రాసుప్రభుత్వమునకు ఇయ్య నిశ్చయించుకొన్న $4\frac{1}{2}$ కోట్లరూపాయలు, ఇదివరకు మద్రాసుప్రభుత్వంవారు నిలవచేసుకొన్న మొత్తంనుండి ఈఫసలీ ఖర్చులకుగాను తీసుకొన్న సుమారు 9 కోట్ల రూపాయలు ఈ అసాధారణపద్దులలో ప్రధానములైనవి. ఇవి ఏటేట లభించు పద్దులు కాకపోవుటచేత వీటికి ఈపేరు పెట్టడమైనది.

సాధారణములైన పద్దుల నన్నిటిని ఇచ్చట వివరించుటకు వీలులేదు. వాటిలో పన్నులు, రుసుములు, ఆదాయకరములగు జలాధారములు, పరిశ్రమలు, వర్తక వ్యాపారములు ప్రధానములైనవి. ఇవిగాక ప్రభుత్వము వారు నడుపుచుండు పాఠశాలలు, ఆసుపత్రులు, జైల్లు వ్యవసాయశాఖ, ఆరోగ్యశాఖ, సహకారశాఖ మొదలగువాటినుండి కొంత ఆదాయము వచ్చుచున్నను ఈసంస్థలను, శాఖలను నడుపుటకై చేయబడు ఖర్చు ఎంతో అధికముగా ఉండుటచేత ఆదాయమును విమర్శించుసందర్భములో వీటికి అంత ప్రాధాన్యము లేదు. లెక్కలు సమగ్రంగా ఉండు సందర్భంలో మాత్రమే వీటినిగురించి ఆలోచింపవలసియున్నది.

మద్రాసుప్రభుత్వంవారు విధించే పన్నులలో (1) భూమిపన్ను; (2) త్రాగుడుపన్ను; (3) అమ్మకపుపన్ను; (4) స్టాంపుపన్ను; (5) మోటారుపన్ను ప్రధానములైనవి. 1945-46, 1946-47 లలో ఈపన్నుల నుండి వచ్చిన ఆదాయం ఈక్రిందివిధమున అంచనా వేయబడినది:

		(1945-1946)	(1946-1947)
భూమిపన్ను	రు.	7,97,28,758	8,41,11,000
త్రాగుడుపన్ను	,,	16,81,78,742	11,15,11,900
అమ్మకపుపన్ను	,,	6,02,71,873	5,64,50,000
స్టాంపుపన్ను	,,	2,64,92,387	2,24,86,000
మోటారుపన్ను	,,	97,97,369	90,19,000

రుసుములలో కోర్టుఫీజులు, రిజిస్ట్రేషన్ ఫీజులు ప్రధానములైనవి. ఈ రెంటిమూలమున 1945-46 లో 74 లక్షలు వచ్చినవి; 1946-47 లో 73 లక్షలు రాగలవని అంచనా. జలాధారములు మొదలైనవాటినుండి వచ్చు ఆదాయంఅంచనా ఈక్రిందివిధముగా నున్నది:

	(1945-46)	(1946-47)
జలాధారములు	1,63,16,700	1,76,20,600
పరిశ్రమలు	56,67,192	64,01,300
విద్యుచ్ఛక్తిపరిశ్రమలు	1,17,54,000	1,25,95,000

ఈ అంకెలనుబట్టి పన్నులమూలంగా సుమారు ముప్పైకోట్లరూపాయల ఆదాయం ప్రభుత్వంవారికి వచ్చుచున్నట్లు స్పష్టంకాగలదు. మొత్తముపైన 28 పద్దులనుండి వచ్చు ఆదాయము ఈ క్రిందివిధముగ నున్నది:

	(1945-46)	(1946-47)
అన్నిపద్దులనుండి + కేంద్రప్రభుత్వపువిరాళం	478640000	484892000

ఈ 28 పద్దులలో ఒకదానినిగురించి ప్రత్యేకముగ చెప్పవలసిఉన్నది. కేంద్రప్రభుత్వంవారు విధించే రాబడిపన్నులో (Income-tax) కొంత భాగాన్ని ఏటేట రాష్ట్రప్రభుత్వానికి ఇయ్యవలసియున్నది. దీనిమూలాన 1945-46 లో 4,31,25,000 రూపాయలు వచ్చినవి. 1946-47 లో 4,85,85,000 రూపాయలు రానున్నవి.

పైన చెప్పబడ్డ 31 పద్దులనుండి 1946-47 లో ప్రభుత్వమువారికి రానున్న ఆదాయము రూ. 57,42,92000 లు; గతసంవత్సరమున వారికి రూ, 47,86,40000 వచ్చినవి. నిలవలోనుండి తొమ్మిదికోట్ల ఆదాయం ఈ సంవత్సరం వాడడంచేత ఈ వ్యత్యాసం కలిగింది.

ఆదాయాన్నిగురించి విమర్శించుటలో రెండు విషయములు గమనించతగియున్నవి. త్రాగుడుపన్ను వలన ఈ సంవత్సరం రానున్న ఆదాయం గతసంవత్సరపు ఆదాయంకంటే 5 కోట్లు పైగా తగ్గిపోయేటట్లు అంచనా వేయబడ్డది. దీనికి కారణం రాష్ట్రంలోని 8 జిల్లాలలో మద్యపానాన్ని ప్రభుత్వంవారు అక్టోబరు నుండి నిషేధించుటయే. క్రమక్రమంగా ఒకటిరెండు సంవత్సరములలో జిల్లాలన్నిటియందును మద్యపానాన్ని నిషేధించవలసినదని కాంగ్రెసుపక్షమువారియొక్కయు, ఇతరులయొక్కయు అభిప్రాయము. అది జరిగినయెడల రెండుసంవత్సరములనాటికి సుమారు 17 కోట్ల ఆదాయము తగ్గిపోవును. ఈ పన్నునంతను ప్రస్తుతము కల్లుసారాయీలను త్రాగువారిచ్చుచున్నారు. ఇకమీదట ఇంతటి ఆదాయం ప్రభుత్వంవారు సంపాదించగోరినయెడల మరేదైన పన్నులను విధింపవలసియున్నది. 1937-39 లో మద్యపాననిషేధమును ప్రవేశపెట్టినప్పుడు

దానిమూలమున కలిగిన నష్టమును భర్తీచేయుటకు అమ్మకపుపన్నును విధించిరి. దీనిమూలమున 6 కోట్ల రూపాయలుమాత్రమే లభించుచున్నవి. 17 కోట్ల నష్టమును పూర్తిచేయవలెననిన, అమ్మకపుపన్నురేటును మూడింతలు చేయుటయో, లేక మరేదైన పన్నును విధించుటయో జరుగవలెను. అమ్మకపు పన్నును రూపాయకు రెండుపైసలనుండి మూడుపైసలకు పెంచుటకును, గొప్పభూస్వాములపై వ్యవసాయపుపన్నును క్రొత్తగా విధించుటకును ఆలోచనలు జరుగుచున్నవి. ఈ రెండుమార్పులు వచ్చినప్పటికికూడ 17 కోట్ల నష్టము పూర్తియగునని చెప్పుటకు వీలులేదు. మద్యపాననిషేధమును వెంటనే రాష్ట్రమందంతట ప్రవేశపెట్టవలెనని ఆందోళన చేసినవారు ఈవిషయమునుగురించి పూర్తిగ ఆలోచించినట్లు అగుపడదు. ఏది ఎట్లు జరిగినను మొత్తముమీద 1947-48 లో ఎక్కువపన్నులను భరించుటకు రాష్ట్రములోని ప్రజలు సిద్ధపడియుండవలెను. మద్యపాననిషేధముయొక్క ఫలిత మిదే. ఆ పన్నులు ఎట్టివిగ నుండవలెనో ఇప్పటినుంచి అందరు ఆలోచించవలసియున్నది.

ఖర్చు పద్దులు

ఇక ప్రభుత్వమువారి వ్యయమునుగురించి వివరింపవలసియున్నది. వ్యయవిషయములో రాష్ట్రప్రభుత్వమునకును, కేంద్ర ప్రభుత్వమునకును ఒకగొప్ప భేద మున్నది. దేశమును పరాయివారినుండి రక్షించు బాధ్యత అంతయు కేంద్ర ప్రభుత్వమువారిది అగుటచేతను, అందుకై ఈకాలమున కోట్లకొలది రూపాయలు అవసరమగుటచేతను కేంద్ర ప్రభుత్వముయొక్క వ్యయములో ఎక్కువభాగము సైన్యమునకును, దేశరక్షణకు కావలసిన ఇతరసాధనములకును ఖర్చుపెట్టవలసియున్నది. రాష్ట్రప్రభుత్వమునకు ఈబాధ్యత లేకపోవుటచేత దానివ్యయములో చాలభాగము ప్రజల సౌకర్యములకై వినియోగించుటకు వీలగుచున్నది.

పోలీసు

ఈభేద మున్నను రాష్ట్రములో శాంతిభద్రతలను నెలకొల్పుటకు కావలసిన పోలీసుసిబ్బందికిగాను 1946-47 లో రూ. 3,81,78000 లు ఖర్చుకానున్నది. గత సంవత్సరము ఇందు నిమిత్తమై రూ. 2,95,74,000 ఖర్చయ్యెను. గతసంవత్సరముకంటె ఈసంవత్సరములో పోలీసు సిబ్బందికై సుమారు 86 లక్షల రూపాయలు ఎక్కువ ఖర్చుకానున్నది. పోలీసువారి జీతాలు, కరవు బత్యాలు అధికమగుటచేతను, వారికై ఎక్కువమోటారు లారీలు, తుపాకులు, ఇతర ఆయుధాలు కొనవలసిన అవసరము కలుగుటచేతను, చెన్నపట్టణమందును, మరికొన్ని ప్రదేశములందును పోలీసు ఉద్యోగస్థుల సంఖ్య వృద్ధియగుట చేతను ఈ వ్యయము పెరగవలసివచ్చినది. ఈ ఖర్చులో గ్రామసంరక్షణార్థము నియమింపబడిన తలారుల జీతములు చేరియుండలేదు. మన రాష్ట్రములో సుమారు ౬కోట్ల ప్రజలున్నారు. వీరిని రక్షించుటకుగాను 4 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి పోలీసువారిని ఏర్పాటు చేయవలసియున్నది. ఈఖర్చు తగ్గు సూచనలు కనుపించుటలేదు. బహుశా రానురాను ఇంకను పెరుగునేమో అను సందేహము కలుగుచున్నది. హిందూ మహమ్మదీయసమస్య పరిష్కారముకాక మతకలహములు తీవ్రరూపము ధరించవచ్చును. కూలివాండ్ర సమ్మెలు, వాటిమూలమున అల్లరులు హెచ్చుకావచ్చును.

ఇతర పద్దులు

పోలీసుసిబ్బందికాక రాష్ట్రవ్యయమునకు సంబంధించిన పద్దులు 39 ఉన్నవి. పన్నులను వసూలుచేయుటకై ఏర్పరచబడిన శాఖలన్నియు—అనగా భూమిపన్నుశాఖ, త్రాగుడుపన్నుశాఖ, స్టాంపుపన్నుశాఖ, అమ్మకపుపన్నుశాఖ మొదలైనవి—ఇందులో చేరియున్నవి. ఇవిగాక అడవులశాఖ, రిజస్ట్రేషన్, జలాధారములు, జిల్లాపరిపాలన, న్యాయపరిపాలన, జైళ్లు, విద్య, ఆరోగ్యము, వ్యవసాయము, పశుచికిత్స, సహకారము, పరిశ్రమలు, చేపలశాఖ, రోడ్లు, విద్యుచ్ఛక్తి, క్షామనివారణ మొదలైనవన్నియు ఈపద్దులలో చేరియున్నవి. వీటిలో ఏయేశాఖలకు ఎంత ద్రవ్యము ఖర్చుపెట్టుచున్నారో తెలుసుకొనినయెడల ప్రభుత్వమువారి దృష్టిలో ఏశాఖలు ప్రధానములో, ఏవి అప్రధానములో నిర్ణయించుటకు వీలగును.

1945-46, 1946-47 లలో కొన్నిశాఖలకై నిర్ణయింపబడ్డ వ్యయముయొక్క అంచనా ఈ క్రింది అంకెల వలన స్పష్టముకాగలదు:

	(1945-46)	(1946-47)
భూమిశిస్తువసూలుకు	26.01 లక్షలు	27.94 లక్షలు
త్రాగుడుపన్ను ,,	51.58 ,,	51.98 ,,
స్టాంపు ,, ,,	13.75 ,,	12.32 ,,
అమ్మకపు ,, ,,	48.41 ,,	60.70 ,,
మోటారుపన్నుఖర్చు	68.07 ,,	94.13 ,,
అడవులు	77.04 ,,	81.11 ,,
రిజిస్ట్రేషన్	38.56 ,,	41.18 ,,
జలాధారాలు	89.43 ,,	93.41 ,,
న్యాయస్థానములు	128.78 ,,	137.33 ,,
జైళ్లు	61.46 ,,	62.97 ,,
పోలీసు	295.74 ,,	381.78 ,,
విద్య	459.50 ,,	658.97 ,,
ఔషధము	179.72 ,,	189.63 ,,
ఆరోగ్యము	52.94 ,,	111.67 ,,
పశురక్షణ	23.87 ,,	31.28 ,,
సహకారము	30.93 ,,	53.76 ,,
పరిశ్రమలు	70.28 ,,	132.61 ,,
రోడ్లు, ఇతరకట్టడాలు	187.09 ,,	575.41 ,,
క్షామనివారణ	4.41 ,,	106.01 ,,
పరిపాలన	427.86 ,,	454.50 ,,
విద్యుచ్ఛక్తి	69.90 ,,	253.93 ,,

ఈ అంకెలనుబట్టి విద్య అగ్రస్థానమును వహించుచున్న దనియు, రోడ్లు, పరిపాలన మొదలైనవి ప్రధాన శాఖలనియు, పశురక్షణ, సహకారము వెనుకబడియున్న వనియు స్పష్టముకాగలదు.

ప్రజాసౌకర్యము వృద్ధియగుటలో ప్రధానముగ ఉపచరించు శాఖలు ఈ క్రింద సూచింపబడినవని చెప్పవచ్చును. వీటికై ఎంతద్రవ్యము ఖర్చుపెట్టినయెడల అంత ఎక్కువగ ప్రజల స్థితిగతులు చక్కబడును. నాగరికత గాంచిన ఇంగ్లండు, ఫ్రాన్సు, అమెరికా మొదలైన దేశములన్నిటియందును ఈ శాఖలకొరకే ఎక్కువ ద్రవ్యము ఖర్చుపెట్టబడుచున్నది. మన రాష్ట్రములో గత అయిదుసంవత్సరములమధ్యన ఈశాఖలకై ఈక్రింది విధముగ ఖర్చుపెట్టబడెను. (చూ : పుట అడుగుపట్టీ).

1941-42కు, ఇప్పటికీ మధ్యన ఈశాఖలపై చేయబడిన వ్యయము మూడురెట్లు పెరుగుట శుభసూచకమే. ఇదిగాక గతసంవత్సరానికంటె ఈసంవత్సరములో వీటికిగాను ఆరుకోట్ల రూపాయలు ఎక్కువగా ఖర్చుపెట్టుటకు ప్రభుత్వమువారు సిద్ధపడుట ప్రశంసనీయము.

వ్యయ విమర్శ

ప్రభుత్వముయొక్క వ్యయవిధానమును విమర్శించుటలో గమనించవలసిన ప్రధానవిషయ మొకటి కలదు. ప్రజల సౌకర్యానికి పైశాఖలన్నియు అవసరములే. వీటిని అభివృద్ధిచేయడానికి ఎంత అవకాశమైనా ఉన్నది. ఎంతటి ద్రవ్యము వీటిక్రింద ఖర్చు

	(1941-42)	(1942-43)	(1943-44)	(1944-45)	(1945-46)	(1946-47)
విద్య	287.36 లక్షలు	299.08	318.71	366.16	459.50	658.97
ఔషధము	102.65 ,,	110.50	130.10	152.62	179.72	189.63
ఆరోగ్యము	33.24 ,,	34.74	28.69	41.94	52.94	111.67
జలాధారములు	32.94 ,,	40.11	66.18	94.19	93.82	251.81
వ్యవసాయము	22.49 ,,	32.78	38.29	48.11	77.40	169.34
పశురక్షణ	12.54 ,,	12.80	15.70	20.08	23.87	31.28
సహకారము	14.68 ,,	16.01	17.54	22.04	30.93	53.76
పరిశ్రమలు	29.58 ,,	52.92	47.55	65.14	70.28	132.61
మొత్తం	535.48 ,,	598.94	662.76	810.28	988.46	1,5990.7

పెట్టినను ఇంకనూ ఖర్చుపెట్టవలసినదేయుండును. కాని ప్రభుత్వమువారు కుబేరులు కారు. వారి ఆదాయము మితమైనది. దీనిని అన్నిశాఖలపై వారు సర్దవలసియున్నది. విద్యకై ఎక్కువ ఖర్చుపెట్టినయెడల ఆరోగ్యమునకై ఖర్చుపెట్టతగిన ద్రవ్యము తగ్గిపోవును; ఆరోగ్యమునకై ఎక్కువ ఖర్చుపెట్టినయెడల విద్యకు కావలసిన ద్రవ్యము తగ్గిపోవును. శాసనసభలోనివారు వ్యయపట్టికను విమర్శించినపుడు ఈ విషయమును చక్కగ గమనించియుండలేదు. కొందరు ఆరోగ్యానికి, మరికొందరు విద్యకు, కొందరు వ్యవసాయానికి, కొందరు పశురక్షణకు ప్రాధాన్యం కల్పించినారు. కొందరు ప్రభుత్వపు ఉద్యోగస్థులలో తక్కువజీతములను పుచ్చుకొనుచుండువారికి ఎక్కువజీతము లియ్యవలసిన దని సూచించిరి. దీనివలన ఒక విషయముమాత్రము స్పష్టమగుచున్నది. వ్యయవిధానములో దేనికి ఎక్కువ అవసరమో, దేనికి తక్కువఅవసరమో నిర్ణయించుట సులభసాధ్యము కాదు.

ఈ సంవత్సరము ప్రభుత్వమువారు నిర్ణయించుకొన్న వ్యయవిధానములో కొన్ని విశేషములు కనబడుచున్నవి. ఆహారపదార్థములు సంపూర్ణముగ లభించక పోవుటచేత ప్రజలు అపరిమితముగ బాధపడుచుండుట అందరికి తెలిసిన విషయమే. ఈ బాధను తగ్గించుటకుగాను తాత్కాలికఉపాయములను కొన్నిటిని, శాశ్వత ఉపాయములను కొన్నిటిని ప్రభుత్వమువారు కల్పించినారు. విదేశములనుండియు, ఇతర రాష్ట్రములనుండియు ఆహారపదార్థములను కొనుగోలుచేసి మన రాష్ట్రమునకు తెచ్చుటకు ద్రవ్యమును ఖర్చుపెట్టుచున్నారు. ఇందుకుగాను సుమారు రూ. 689.19 లక్షలు ప్రత్యేకింపబడ్డవి. లభించిన ధాన్యాదులను సక్రమమైన ధరలకు అమ్ముటకుగాను 120 లక్షల రూపాయలు ఖర్చుపెట్టి కావలసిన సిబ్బందిని ఏర్పాటుచేసినారు. వెంటవెంటనే కొన్ని పంటలను వృద్ధిచేయుటకును, పండిన పంటలను దాచుకొనక రాష్ట్రములోని ప్రజలందరి అందుబడిలోనికి వచ్చునట్లు చేయుటకును రైతులకు విరాళములు, బహుమానములు ఇచ్చు ఉద్దేశముతో కొన్నిలక్షల ద్రవ్యమును ఖర్చుపెట్టుచున్నారు. ఇవన్నియు తాత్కాలిక ఉపాయములు. కాని ఇంతమాత్రముతో మనరాష్ట్రపు ఆహారసమస్య పరిష్కారముకాజాలదు. ఎక్కువభూములు సాగులోకి రావలసియున్నది; ప్రతిఎకరానుండియు ఎక్కువపంటలు పండవలసియున్నది. ఈ యుద్దేశములు నెరవేరుటకై కొన్నిలక్షల రూపాయలను రైతులకిచ్చి వారిచేత క్రొత్త నూతులను త్రవ్వించిరి; పాతనూతుల మరామత్తు జరిపిరి. ఎరువులను ఉచితముగ సరఫరా చేయుటకు ఏర్పాటులు గావించుచున్నారు. ఇదిగాక రాయలసీమలోను, మరికొన్ని జిల్లాలయందును క్షామబాధను నివారించుటకు కోటిరూపాయలకుపైగా ఖర్చుపెట్టుచున్నారు.

రెండవ విశేష మేమనగా-గ్రామములను ఆహార విషయములోను, బట్టలవిషయములోను స్వయంపోషకముగ చేయుటకై 4 కోట్ల రూపాయలను ఖర్చుపెట్టుట. ఏ గ్రామంలో కావలసిన ఆహారమును అచ్చటే పండించుటయు, అక్కడ కావలసిన బట్టలను అచ్చటనే తయారుచేయుటయు స్వయంపోషకత్వమునకు లక్షణము. ప్రస్తుతము అన్నముతోపాటు గుడ్డకుకూడ కరవు వచ్చియున్నది. మిల్లులనుండి తయారగు బట్టలుగాని, మిల్లునూలును ఉపయోగించి చేమగ్గములమీద నేయబడు బట్టలుగాని చాలినంతవరకు దొరుకుట లేదు. ఇట్టి సందర్భములో ఎవరికి కావలసిన బట్టను వారే తయారుచేసుకొనుటకు సిద్ధపడుట అత్యావశ్యకము. ఈ సూత్రమనుసరించి ఇది ఎంతవరకు ఆచరణయోగ్యమో స్పష్టపరచుటకు ఒక్కొక జిల్లాలో ఒక్కొక ఫిర్కాలోని గ్రామము లన్నిటియందును ఖద్దరు ప్రజలకు కావలసినంతమట్టుకూ తయారుచేయుటకుగాను ఈ 4 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టబడును. ఈ ఖద్దరువిధానములో ఫిర్కా గ్రామములందలి ప్రతికుటుంబములోను అధమపక్షం ఒకరైన నూలువడకవలసియుండును. ఫిర్కాలోని చేనేతగాండ్రందరు ఈ నూలునే వాడవలెను. మిల్లునూలువారికి దొరకకుండ ప్రభుత్వమువారు చట్టము చేయుదురు. ఇదిగాక ఆ గ్రామములకు మిల్లుబట్టలు రాకుండ నిషేధింపబడును. ఈ పరిస్థితులలో ప్రతికుటుంబమూ నిర్బంధముగ నూలు వడకవలసియుండును. వడకుటకు తెలియనియెడల దానిని నేర్పుటకు ప్రభుత్వము

వారు ఏర్పాటుచేయుదురు. పత్తిని, ఏకులను, ఇతరపరికరములను, రాట్నములను ప్రభుత్వమువారు సరఫరా చేయుదురు. తయారైన నూలును నేయుటకు ఏర్పాట్లు చేసెదరు. ఈ నిర్బంధవిధానము ఎంతవరకు కొనసాగునో, ఇందుకై 4 కోట్లరూపాయలను ఖర్చుపెట్టుట లాభకారియా అను విషయములనుగురించి తీవ్రమైన అభిప్రాయభేదము లున్నవి.

వ్యయపట్టికలో మూడవ విశేషము హరిజనుల ఉద్ధరణమునకుగాను ప్రత్యేకముగ ఒకకోటిరూపాయలు ఖర్చుపెట్టుట. దీనిని ఏవిధముగ ఖర్చుపెట్టెదరో ప్రభుత్వమువారు వివరించియుండలేదు. హరిజనోద్ధరణమునకై ప్రత్యేకముగ ద్రవ్యమును ఖర్చుపెట్టు విషయములో అభిప్రాయభేద ముండదు. కాని ఈ మొత్తమును ఎట్లు ఖర్చుపెట్టిన బాగుండునో అన్న విషయమై అభిప్రాయభేదము తప్పదు. హరిజనుల వాడలను శుభ్రముగ ఉంచుటకని కొందరు, వారికి ఇండ్లు కట్టించుటకని కొందరు, వారికి భూముల నిచ్చుటకని మరికొందరు వారివారి అభిప్రాయములను వ్యక్తపరచియున్నారు. ఇందులో ఏఉద్దేశము నెరవేరినను హరిజనులు మంచిస్థితికి రాగలరు. ఏటేట ఇందుకై కోటిరూపాయలు ఖర్చుపెట్టుటకు ప్రభుత్వమువారు సిద్ధపడుట మంచిది.

విద్యాశాఖకై గతసంవత్సరముకంటె ఈసంవత్సరమున 2 కోట్ల రూపాయలు ఎక్కువగ ఖర్చుపెట్టుట నాల్గవ విశేషము. ఇందులో 30 లక్షలు రాష్ట్రములోని విశ్వకళాపరిషత్తులకును, ఉన్నతకళాశాలల అభివృద్ధికిని, క్రొత్తఇంజనీయరింగు మెడికల్ కాలేజీల స్థాపనమునకును ప్రత్యేకింపబడినది. ప్రాథమికవిద్యను నిర్బంధముగను, ఉచితముగను మరికొన్ని గ్రామములలో నేర్పుటకును, ప్రాథమికపాఠశాలలలోని ఉపాధ్యాయుల జీతములు కరవుబత్తెములు హెచ్చించుటకును, పిల్లల మధ్యాహ్నభోజనమునకును, ఈలాటి ఇతరవిషయములకును ఒకకోటిరూపాయలు ఈసంవత్సరము ఎక్కువగా ఖర్చుపెట్టబడును. ఇంత చేసినను విద్యావిషయములో ఇంకను ఎంతో చేయవలసియున్నది. విద్యాలయములలోని ఉపాధ్యాయుల జీతములు ప్రస్తుతము మిక్కిలి స్వల్పములుగ నున్నవి. కొన్ని ప్రభుత్వశాఖలలోని బంట్రోతులజీతములు ఇంతకంటె ఎక్కువ. ఈ విపరీతపరిస్థితులు మారినగాని ఉపాధ్యాయులు తృప్తికరముగ పనిచేయలేరు. ఇందుకై ఎక్కువద్రవ్యము ఖర్చుపెట్టవలసియున్నది.

ప్రజల ఆరోగ్యము చక్కబడుటకై మామూలుకంటె ఎక్కువద్రవ్యమును ఈసంవత్సరము ప్రభుత్వమువారు ఖర్చుపెట్టుట అయిదవ విశేషము. త్రాగుటకు కూడ నీళ్లుదొరకని ప్రదేశములలో నీటివసతులను కల్పించుట, 200 క్రొత్తఆసుపత్రులను కట్టుట, అంటువ్యాధుల నివారణమునకై ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయుట, ఆహారలోపమువలన కలుగు రోగముల మూలమున బాధపడువారికి చికిత్సచేయుట, తర్ఫీదు పొందిన మంత్రసానుల సంఖ్యను వృద్ధిచేయుట— ఈలాటి పనులకై ఎక్కువద్రవ్యము ఈ సంవత్సరమున ఖర్చుపెట్టబడును.

వ్యవసాయాభివృద్ధికై ఒకకోటిరూపాయలు ఎక్కువగ ఖర్చుకానున్నది. ఇందులో 28 లక్షలు మలబారుదక్షిణకన్నడజిల్లాలలోని రైతులకు ఎరువులు ఉచితముగ పంచిపెట్టుటకును, 40 లక్షలు స్వల్పకాలములో పండు పంటలను పండించుటలో రైతులకు ప్రోత్సాహము కలిగించుటకును ఉపయోగింపబడును.

రోడ్లకుగాను గతసంవత్సరముకంటె ఈ సంవత్సరమున 3 కోట్ల రూపాయలు ఎక్కువగా ఖర్చుపెట్టబడును. ఇదివరకు జిల్లాబోర్డుల అధీనములో ఉన్న రోడ్లను అనేకములను ప్రస్తుతము రాష్ట్రప్రభుత్వమువారు స్వాధీనపరచుకొని, వాటి నన్నిటిని మంచి స్థితిలో ఉంచుటకు నిశ్చయించినారు. ఇందుకుగాను సిబ్బంది ఎక్కువకావలసియున్నది; క్రొత్త పనిముట్లు, ఇతరపరికరములు కొనవలసియున్నది.

దీనినిబట్టి ప్రజాసౌకర్యము వృద్ధియగుటకు కావలసిన విషయము లనేకములలో కాంగ్రెసుమంత్రివర్గమువారు మామూలుకంటె ఎక్కువద్రవ్యమును ఖర్చుపెట్టుటకు సంసిద్ధులైయున్నారని స్పష్టమగుచున్నది.

కాని, వ్యయపట్టికను విమర్శించువారు మంత్రి వర్గమువారిని కొన్ని ప్రశ్నలు అడుగుచున్నారు. వాటికి సక్రమమైన జవాబుల నియ్యవలసియున్నది. ఈ ప్రశ్నలలో ప్రధానములైనవి రెండు—(1) ఖర్చుకు తగిన ప్రయోజనము ప్రతి పరిపాలనశాఖయందును లభించుచున్నదా? విద్యాశాఖకుగాను ఏటేట 6 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టుచుండుట వాస్తవమే; కాని 6 కోట్లకు తగిన ప్రయోజనము కలుగుచున్నదా? ఇతర శాఖలను—రోడ్లు, ఆరోగ్యము, ఆసుపత్రులు మొదలైనవి—గురించికూడ ఇట్టి ప్రశ్ననే వారు వేయుచున్నారు. (2) ప్రజల సౌఖ్యము వృద్ధియగుటకును రాష్ట్రములోని ప్రతివ్యక్తికిని కడుపునిండ అన్నము, కట్టుకొనుటకు బట్ట, తలదాచుకొనుటకు ఇల్లు, ఆరోగ్యము, ప్రాథమికవిద్య—ఇవి లభించుటకును ఎంతో సొమ్ము కావలసియున్నదికదా? ఇంత సొమ్మును సంపాదించుటకు వారేమైన సాధనములను కల్పించుకొనుచున్నారా? ఎట్టి పరిశ్రమలను స్థాపించియున్నారు?


మొదటిప్రశ్న చాలా క్లిష్టమైనది. ప్రాథమికవిద్యవిషయమై మన మీదృష్టితో కొంత ఆలోచించినయెడల ఈ క్లిష్టత ఎందులో ఉన్నదో స్పష్టము కాగలదు. పాఠశాలకు వచ్చు పిల్లలకు విద్య నేర్పుటయేకదా ప్రాథమికవిద్యకై పెట్టబడు ఖర్చుయొక్క ఉద్దేశము? ఈ ఉద్దేశము నెరవేరుటకు ప్రధానసాధనము చక్కగా తర్ఫీదుపొంది కష్టపడి పనిచేయగల ఉపాధ్యాయుడు. భవనములు, పుస్తకములు, ఇతర పరికరములు అవసరములు కావని ఎవరూ చెప్పరు. కాని ఉపాధ్యాయుడు చక్కగా పనిచేయనివాడు ఈ పరికరము లన్నియు నిష్ఫలములు. అతడు చక్కగా పనిచేయువాడైనయెడల పరికరములు లేకపోయినను విస్తారనష్ట ముండదు. ప్రాథమికవిద్యకై ప్రభుత్వము వారు చేయు ఖర్చుమూలమున తగిన ప్రయోజనము సిద్ధించుటకు కష్టపడి పనిచేయు ఉపాధ్యాయు లుండుట మొదటి అవసరము. కాని ఈకాలములో నెలకు 14, 16 రూపాయల జీతమిచ్చినయెడల అట్టి ఉపాధ్యాయులు లభించగలరా? ఇంత స్వల్పజీతములకు లభించు ఉపాధ్యాయులు కష్టపడి పనిచేయ సిద్ధపడియుందురా? గనుక ఉపాధ్యాయుల జీతములను హెచ్చించవలసియున్నది. ఇదిగాక ఉపాధ్యాయులు చక్కగాపనిచేయుచున్నారో లేదో విచారించుటకుగాను నియమింపబడ్డ అధికారులలో పైమెట్టున నుండువారు వందలకొద్ది జీతములను పుచ్చుకొనువారు. అంత ఎక్కువ జీతములు వారికి అవసరమా? వారి జీతములను తగ్గించి, ఉపాధ్యాయుల జీతములను అధికముచేయుట ఎక్కువ ప్రయోజనకారి గదా? ఈలాటి ప్రశ్నలు ప్రతిశాఖయందును ప్రస్తుతము బయలుదేరుచున్నవి. తక్కువజీతములను పుచ్చుకొని రాత్రింబగళ్లు పనిచేయు గుమాస్తాలు తమకు జీతములు చాలవనియు, తమ జీతములను ఎక్కువ చేయనియెడల సమ్మెకట్టెదమనియు బెదరించుచున్నారు. వారు చక్కగా పనిచేయనియెడల వ్యవహారము బాగుగ నడవదు. బాధ్యత వహించినట్టియు, పైవిచారణ చేయునట్టియు గొప్ప ఉద్యోగస్థులు ప్రతి శాఖయందును ఉండవలసిన అవసర మున్నది. కాని కడుపునిండ అన్నముకూడ దొరకక క్రింది ఉద్యోగస్థులు కష్టపడుచుండుటయు, పై ఉద్యోగస్థులు వందలకొద్ది, వేలకొద్ది జీతములను పుచ్చుకొని అగర్భశ్రీమంతులవలె కాలక్షేపముచేయుచుండుటయు ప్రమాదకరము. వ్యయమునకు తగ్గ ప్రయోజనము అనేక పరిపాలనశాఖలలో ప్రస్తుతము లభించుట లేదనుటకు ఇది యొక నిదర్శనము. దీనిని సవరించవలసి యున్నది.

రెండవప్రశ్నకూడ ఇంతటి క్లిష్టమైనదే. ఇప్పటికంటె అయిదారురెట్లు ఎక్కువగ ప్రభుత్వమువారు ద్రవ్యమును ఖర్చుపెట్టుటకు సంసిద్ధులైనగాని ప్రజల స్థితిగతులు చక్కబడజాలవు. ఈ సంవత్సరము 58 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టుచున్నారు. బహుశః 300 కోట్ల రూపాయలు ఏటేట ఖర్చుపెట్టుటకు కావలసిన పరిస్థితులు ఏర్పడినప్పుడే ప్రభుత్వమువారు వారి విధిని నిర్వర్తించినవారు కాగలరు. ఇంతటి ద్రవ్యమును వారు సంపాదించుటకు వీలున్నదా? ధనికులుగ నుండువారి వద్దనుండి ఇంతటి ధనమును పన్నులమూలముగ వసూలు చేసినయెడల ప్రజలలో ఎంతటి ఆందోళన కలుగునో ఎవరు చెప్పగలరు? కాని అట్లు చేసినప్పుడే ప్రజల సౌఖ్యము వృద్ధియగుట కవకాశ మేర్పడును.

ఈ రెండుప్రశ్నలకు రాబోవు సంవత్సరమున మంత్రివర్గమువారు ఎట్టి సమాధానముల నిచ్చెదరో చూడవలసియున్నది.

ప్రభుత్వపు ఋణము

చేయవలసిన ఖర్చులకు తగిన ఆదాయము లభించనప్పుడు ఋణముచేయుట సహజము. ప్రభుత్వమువారు కూడ కొన్నిసందర్భములలో ఋణము చేయుచుందురు. కాని ఆ సందర్భము లేవో గుర్తించవలసియున్నది. ఋణము చేసినపుడు దానిపై ఏ రేటు వడ్డీచెల్లించుటకును, క్రమేణ అసలు తీర్చివేయుటకును ప్రభుత్వము వారికి వశము లుండవలెను. చేసిన ఋణమును జలాధారములు, విద్యుచ్ఛక్తి, ఇతరపరిశ్రమలు మొదలైనవాటి కొరకై ఖర్చుపెట్టినయెడల కొంతకాలమునకు వీటి నుండి ఆదాయము లభించుటయు, ఆ ఆదాయముతో వడ్డీని, అసలును చెల్లించుటయు సులభమగును. యుద్ధకాలములో యుద్ధము చేయుటకుతప్ప సాధారణముగ ఆదాయకరములగు పనులలో పెట్టుబడిపెట్టుటకే ప్రభుత్వమువారు ఋణముచేయుట మామూలు. ఈవిధముగ మద్రాసుప్రభుత్వమువారు 20 కోట్ల రూపాయలఋణమును ఇదివరకు చేసియున్నారు. దీనినంతను జలాధారములకు, విద్యుచ్ఛక్తికి, ఇతరపరిశ్రమలకు వినియోగించియున్నారు. ఈసంవత్సరమునకూడ 4 కోట్ల ఋణమును చేయుటకు నిశ్చయించియున్నారు. దీనినికూడ ఇట్టి ఆదాయకరములగు పనులకు ఉపయోగించెదరు.



యథార్థగాథలు

బ్రాహ్మణగురువుకు మహమ్మదీయసుల్తాను గురుదక్షిణ

'పోపూరి'

కరివెన అనేది కర్నూలుజిల్లా నందికొట్కూరు తాలూకా ఆత్మకూరుశివారులో ఒక బ్రాహ్మణ అగ్రహారం. ఆ ఊళ్లో సుమారు యాభై బ్రాహ్మణయిండ్లు ఉంటాయ్. చదువుకున్న శిష్టబ్రాహ్మణు లిప్పటికీ ఆఊళ్లో ఉన్నారు. ఆఊరుకు సంబంధించిన చారిత్రిక గాథ యిది.

కర్నూలులో నవాబు రాజ్యంచేసే కాలంలో ఈ గ్రామం ఆ నవాబుక్రింద ఉండేది. అతిఖర్చు దారైన ఆ నవాబు పచ్చపచ్చగా ఉన్నారుగదా అని వీళ్లమీద రొక్కపన్నులు వేశాడు. మే 'ఇవ్వలేము' అని ఎదురుతిరిగారు. ఆపాట ఆనవాబు బ్రాహ్మల నందర్నీ "మీపని యిలా ఉందా"అని సిద్ధాపురంజైలు ఖానాలో పడేశాడు. వాళ్లంతా 'అల్లోలక్ష్మణా!'అని ఆ జైలుఖానాలో పడి అఘోరిస్తూ అష్టకష్టాలూ పడుతున్నారు.

ఇలా కొన్నాళ్లు గడిచాయ్. ఆజైలుఅధికారిగా ఒక సింగు ఉండేవాడు. పాపం, అతడు ఈబ్రాహ్మల అవస్థ చూడలేక ఇట్లని చెప్పాడు: "ఏమయ్యా! నే నేమో మీఅవస్థ చూడలేకుండా ఉన్నాను. మిమ్మల్ని విడిచేసేనేమో నా కంఠం పోతుంది. అంచేత మీలో రొకణ్ణయినా ఒకణ్ణి విడుస్తాను. అతడు వెళ్లి ఏఉపాయం చేసైనా తక్కినవాళ్లను విడిపించే షరతుమీద"అని చెప్పాడు.

ఆ మాట వినీవినడంతోనే వెంకటశాస్త్రిగారనే ఆయన "నేను"అన్నారు. అన్నమాటప్రకారం ఆజైలుఅధికారి అతణ్ణి విడిచిపెట్టాడు. ఆయన పూర్తి పేరు నిడసనమెట్ల వెంకటశాస్త్రిగారు. ప్రస్తుతం ఈ వంశంవారిని "పెద్దయ్యగారివారు"అని పిలుస్తారు. ఈ వెంకటశాస్త్రిగారు నాలుగుశాస్త్రాల్లో మహానిపుణులు. అఖండమేధావులు. వారు చెప్పిన మాటప్రకారం (సిద్ధాపురం కరివెనకు సుమారు పదిమైళ్లు) యింటికిగూడా పోకుండా, కట్టుగుడ్డలతో బయల్దేరారు ఢిల్లీపట్టణానికి, అందరినీ విడిపించే ప్రయత్నంలో.

అప్పుడు షాఆలంచక్రవర్తి ఢిల్లీపాదుషాగా ఉండేవాడు. మన శాస్త్రిగారు కాలినడకమీద ఆరు మాసాలకు ఢిల్లీ చేరుకున్నారు. వీరికి బాగా గడ్డం పెరిగింది ఢిల్లీనగరం చేరుకొనేసరికి. గుండు కొట్టించారు. జంధ్యం బొడ్లో దోపారు. ఒక గళ్లలుంగీ కట్టారు. ఒక నల్లనిచొక్కా మోకాళ్లవరకూ తొడిగారు. ఫకత్ ఫకీరులాగా తయారయిపోయ్యారు. ఢిల్లీలో బజార్లవెంట మహమ్మదీయమతప్రచారం ఆరంభించారు.

వీరు మరి ఆ ఖురాన్ ఎప్పుడు చదువుకున్నారో, ఆ మహమ్మదీయసంప్రదాయా లెలా అలవఱచుకున్నారో నిజంగా ఆశ్చర్యకరమైన విషయం. ఆరుమాసాలు గడిచేసరికి శాస్త్రిగారు ఢిల్లీలో ఆమతం వారికేమిటి, ఈమతంవారికేమిటి మహమ్మదీయమతప్రవక్త నిజంగా మహమ్మదా, ఈయనా అనిపించారు. అంతేగాదు. "అల్లాఅంటూ ఒకడుంటే ఆయన ఈయనే అయివుండాలి. మానవుడే అయితే ఈ ప్రతిభేమిటి! ఈ ప్రచారమేమిటి ?" అని అక్కజపడనివారు లే రామహాపట్టణంలో.

మన శాస్త్రిగారి మతప్రచారం చేసే విధం ఒక విశిష్టపంథాలో నడిచింది. వీరు మహమ్మదీయమత ప్రచారం చేయడంలోనే హిందూమతానికీ, మహమ్మదీయమతానికీ సామరస్యం సమకూరుస్తూ ప్రచారం

ప్రారంభించారు. ఈపంథా ఆరోజుల్లో శాస్త్రిగారి కొక ప్రత్యేకతను చేకూర్చింది. అటు తురకల నోళ్లలో శాస్త్రిగారే కబీరు, శాస్త్రిగారే మహమ్మదు, శాస్త్రిగారే అల్లా. ఇటు హిందువులనోళ్లలో శాస్త్రిగారె శంకరుడు, శాస్త్రిగారే రాముడు, శాస్త్రిగారే కృష్ణుడు. ఇంతెందుకు? తురకలకేం, హిందువులకేం అందరికీ శాస్త్రిగారే లోకం అయిపోయివారు.

ఈస్థితిలో మహారాణీగారొక్కసారి తమ దర్శనభాగ్యం కోరుతున్నారనీ, తమ ఉపదేశామృతం అపేక్షిస్తున్నారనీ శాస్త్రిమహాశయులకు కోటలో నుంచీ కబురువచ్చింది. శాస్త్రిగారు కోటలోకి వెళ్లారు. మహారాణీగారి యిష్టానుసారం దర్శనభాగ్యం కలగజేశారు. ఉపదేశామృతం ఇచ్చారు. మహారాణీగారికి ఐహికవాసనలే తప్పిపోయినయ్. ఆవిడ యీప్రపంచానికే దూరమైపోతున్నది శాస్త్రిగారిఉపదేశామృతంతో. క్రమక్రమంగా యోగినీచిహ్నాలే కనిపిస్తున్నయ్ ఆమెలో. కోటలోకి శాస్త్రిగారి రాకపోకలు బాహాటంగానే జరుగుతున్నయ్. జనానా జనానా అంతా యోగినులుగా తయారయిపోతున్నారు.

ఒక నెలరోజుల్లో ఈమార్పంతా చక్రవర్తికి గోచరించింది. చూచాడు ఏమిరా యిదీ అని. ఎవరో ఒక మతప్రవక్త కోటలోకి రావడం పోవడం మొదలైన విషయమంతా తెలిసింది. ఆశ్చర్యపడ్డాడు. "పిలవం డాఫకీర్ని" అని ఆజ్ఞాపించాడు.

అప్పటప్పటికే ఢిల్లీపట్టణం పట్టణమంతా, పరగణా పరగణా అంతా మార్మోగిపోతున్నది శాస్త్రిగారి ప్రతిభ. ప్రజలందరి దృష్టిలో శాస్త్రిగారు కేవలం ఆ 'అల్లా' స్థానాన్నే ఆక్రమించుకూర్చున్నారు. షా అలంచక్రవర్తి ఆహ్వానాన్ని తిరస్కరించారు. గత్యంతరం లేక చక్రవర్తే శాస్త్రిగారి బసకు వెళ్లాడు.

చూచాడు చక్రవర్తి శాస్త్రిగారి ముఖం. సగం ఉద్ధృతం తగ్గింది. తమ బోధ వినవలెనని వచ్చానని వినయంగా అడిగాడు. శాస్త్రిగారేవో నాలుగుముక్కలు చెప్పారు. చక్రవర్తి యిప్పుడు తనలో తాను లేడు. శాస్త్రిగారి ముందు కూర్చున్న ఆ చక్రవర్తి భూచక్రవర్తి అయి కూర్చున్నాడు. ఇలా శాస్త్రిగారితో చక్రవర్తి నెలరోజులు కాలక్షేపం చేశాడు. పూర్తిగా పరివర్తనం పొందాడు. సంపూర్ణంగా ఆయనకు అంతేవాసి అయిపోయి "ఆత్మసమర్పణం చేస్తున్నాను గురుదేవా! నా కిహనుంచీ ఈ రాజ్యం త్యాజ్యం; ఈ భోగం రోగం; నా సర్వస్వంకూడా తమ కిక గురుదక్షిణగా సమర్పిస్తున్నాను, స్వీకరించం"డని ప్రార్థించాడు.

అంతట శాస్త్రిగారు చక్రవర్తికి నచ్చచెప్పి, కర్మసన్యాసం కూడదని బోధించి, అప్పుడప్పుడే ప్రబలుతూ ఉన్న అన్యరాజ్యప్రాబల్యంలో ఆ మాత్రమైనా ధర్మపరిపాలకుడైన చక్రవర్తి లేకపోతే ప్రజలకు కలిగే బాధలు వివరించి తిరిగి రాజ్యస్వీకారానికి ఒప్పించారు.

అంతట రాజు ఏదో ఒకటి గురుదక్షిణగా కోరవలసినదని అభ్యర్థించినమీదట శాస్త్రిగారు సిద్ధాపురం జైలులో ఉండే బ్రాహ్మలనందర్నీ విడిపించడమే గురుదక్షిణగా కోరారు. మేధాశాలియైన చక్రవర్తి యిందు కేదో కారణం ఉండాలి అని ఊహించి తమ వాగ్దానం ప్రకారం అందర్నీ విడుస్తూ ఉత్తరువుచేసి, ఈ కోరిక కోరడంలోని యాథార్థ్యాన్ని చెప్పవలసిందిగా శాస్త్రిగారిని ప్రార్థించాడు.

అందుమీదట శాస్త్రిగారు పాదుషాను అభయం అడిగి తమ్ము కందనూరునవాబు జైలులో నిర్బంధించడం మొదలైన విషయాలన్నీ సవిస్తరంగా చెప్పివేశారు.

ధర్మపక్షపాతియైన షాఅలంచక్రవర్తి వాళ్ల అవస్థకు జాలిపడడమే కాకుండా శాస్త్రులవారి రాజనీతిదక్షతకూ, మేధావిత్వమునకూ చాలా అక్కజపడి వారికి మరేనవాబులవల్ల గాని, మరేయితరపరిపాలకుల వల్లగాని యిలాటి బాధ లెప్పుడూ కలుగకుండా ఉండను. అందులకు సివిలు క్రిమినలు అధికారములతోసహా కరివెణగ్రామమును వారికి ధారాదత్తము చేసివేశాడు. ఆ అధికారాలు వారికి కలవనడానికి సూచకంగా తాను నిత్యమూ మొలలో ధరించే పెద్దకత్తిని వారికి బహూకరించాడు.

నేటికీ కరివెణలో షాఅలంచక్రవర్తి బంగారు నీటి మొహరుతో యిచ్చిన ఆ పెద్దపట్టాకాకితము ఉర్దూభాషలో సమస్తవివరములతోనూ ఉన్నది. తరతరములా వారి సంతతివారికిగూడా ఆ అధికారాలు చెల్లేటట్లే అందులో వ్రాయబడియున్నది.

మనమూ, మన ప్రపంచమూను

❀

= శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ =

రోజూ మనం ఎన్నెన్నో వస్తువులు చూస్తూవుంటాము; ఎన్నెన్నో సంగతులు వింటూవుంటాము; ఎన్నెన్నో పనులు చేస్తూ వుంటాము. అవి మనకు అలవాటయిపోతే మనకు కొత్త అనిపించదు; అవి మన మనస్సునీ, దృష్టినీ ఆకర్షించనే ఆకర్షించవు. మన యింట్లో నిత్యమూ కనబడే వస్తువుల వంటివే అయిపోతవి. సూర్యుడు రోజూ ఉదయించడం మానేసి కొంతకాలం ఏ యిరవై యేసి రోజులకో, నెల్లాళ్లకో ఒక మాటు ఉదయిస్తా డనుకోండి, అప్పుడు అంతా ఆశ్చర్యమే, అంతా ఆవిషయాన్నిగురించే మాటాడుతారు; అంతా విస్తారంగానే వుంటుంది. సూర్యుడు ఇరవైరోజులకూ ముప్ఫయిరోజులకూ ఒకతడవ ఉదయిస్తూ వుండడమే అసలు పరిపాటి అనుకోండి. అప్పుడూ ఎవరూ ఆశ్చర్యపడరు; అనుకోనైనా అనుకోరు దానినిగుఱించి; ఎందుచేత —అది పరిపాటిగనుక, అలవాటయిపోయిన విషయం గనుక. పరిపాటయిన విషయాన్ని గురించి, అలవాటయిపోయిన విషయాన్ని గురించి- అది ఎంత ఆశ్చర్యకరమైనదైనా— మనం ఆలోచించం.

మనం ఎన్నిటినో చూస్తున్నాం— రైలు, టెలిఫోను, రేడియోయంత్రం, తంతి (టెలిగ్రాఫ్) తీగలు- ఎన్నో నిత్యమూ చూస్తాం. ఎలెక్ట్రిక్కుదీపాలు చూస్తాం. రైలు ఎట్లా నడుస్తున్నది? టెలిఫోనులో మాటాడితే ఎట్లా వినబడుతున్నది? ఎక్కడో పాడితే ఆ పాట మన యింటిలో కూర్చుని రేడియోద్వారా ఎట్లా వింటున్నాం? వినగలుగుతున్నాం? టెలిగ్రాఫ్ తీగలద్వారా టెలిగ్రాం ఎట్లా వెడుతుంది? ఇవన్నీ ఆశ్చర్యకరమైన విషయాలే - ఇంద్రజాలంవంటివి. కాని, నిజం ఆలోచిస్తే ఇవేవీ మనకు ఆశ్చర్యం కలిగించటంలేదు. చెట్టునీ చేమనీ, పుట్టనీ గట్టునీ చూసినట్లే వీటినీ ప్రతిదినమూ చూడడమూ వినడమూ అలవాటూ, పరిపాటీ అయిపోయింది. అతిచనవూ అతివాడుకా అయిపోయి, చివరికి వాటిమీద మనకు ఆదరం ఉందో లేదో తెలియనంతటి స్థితి ఏర్పడింది. అన్నిటినీ చూసినట్టే వాటినీ చూస్తాం. వాటిలో విశేషం ఏమీ మనకు తట్టనంత ఎక్కువగా వాటికి మనమూ, మనకు అవీ అలవాటయిపోయినవి.

వాటి మాట ఎందుకు, మనం తినే ఆహారం ఏమిటి, ఎక్కడినుంచి వస్తున్న దనేనా ఆలోచిస్తున్నామా? ఆహారం తినివేశాక అది ఏమవుతున్నది? అంతదాకా ఎందుకు, మన స్వవిషయం తీసుకోండి. మనం ఎవరం? ఏమిటి ఈ శరీరం? మనిషి అనే ఈ యంత్రం విచిత్రంగా పనిచేస్తున్నదే, ఎట్లా పనిచేస్తున్నది? ఈ శరీరం ఎట్లా నిర్మాణం అయింది? ఎట్లా చేయబడ్డాము మనం

అనికూడా ఆలోచించం. ఇందులో చిత్రం ఉందనే భావనకూడా తట్టదు. అసలు ఈ ప్రశ్నే రాదు. ఆలోచన రేపే విషయం కాదేదీ నిజానికి? ఏ చిన్నపిల్లవాడయినా తన వొంటిని చూపిస్తూ ఏ చల్లని వెన్నెల రాత్రిలోనో పడుకొన్నప్పుడు "ఏమి టిది నాన్నా, ఎట్లా చేశారు?" అని అడుగుతాడనుకోండి. ఇటువంటి జిజ్ఞాస చిన్నపిల్లలోనే ఎక్కువ; పెద్దవాళ్లకి వేమీ పట్టవు. ఎక్కడైనా ఏ పిల్లవాడైనా ఇటువంటి వడుగుతాడా అని ఆశ్చర్యపడనక్కరలేదు; చిన్నపిల్లల కక్కరలేని విషయం లేదు. అక్కరలేని ప్రశ్న లేదు. అందులో ఇప్పటి పిల్లలు మరీ గడుగ్గాయలు. ఒకవేళ అట్టి ప్రశ్న వేస్తే ఏమని జవాబు చెప్పడం? "ఈ చర్మం ఎట్లా తయారైంది, దేనితో చేశా"రంటే, ఇదేమన్నా లేబరేటరీ (పరిశోధనశాల)లో ఒక చిన్న శోధకనాళం (టెస్ట్‌ట్యూబు)లో వేసి పరిశోధనచేసి చూపెద్దామంటే ఏదయినా తెల్లపొడివంటిది గనుకనా యిది? అటువంటిదయితే శోధకనాళంలో వేసి నీళ్లలో కరిగించో, కాచో ఏదో ఒకవిధంగా పరిశోధనచేసి సుద్దపొడో, ఉప్పుపొడో, మరొకపొడో తేలికగా ఇట్టే చెప్పవచ్చు. అటువంటిది కాదే యిది? ఈ చర్మం ఏమిటంటే ఏమని చెప్పడం, ఎట్లా చెప్పడం? ఫ్యాక్టరీలలో తయారైన సరకు గనుకనా యిది? ఈ బాపతు ఇది, ఈ యీదినుసులు అన్నీ చేరిస్తే యిది తయారయిందనడానికి. మన రక్తమూ, ఎముకలూ లాగే ఇదీ క్రమంగా పొడమి పెరిగిందే. ఏ వేదవేదాంగేతిహాసాలు చదువుకొన్న మహాపండితుడి దగ్గరకయినా వెళ్లి నన్ను ఎట్లా చేశారు, నేను దేనితో చేయబడ్డాను అని అడిగితే, పాపం, అంతటి పండితుడూ తెల్లబోతాడు కాని జవాబు చెప్పలేడు. "అసలు ఏం ప్రశ్న యిది" అని విసుక్కుంటాడు. కోపం వస్తుందేమోకూడాను. ఈ పద్ధతిని మన జిజ్ఞాసా, ఆలోచనా ఎప్పుడూ ఇదివరకు పోలేదుగనుక.

కాని, కొంచెం ఆలోచించి చూడండి. మనం పాలు తాగుతాం. మనం బలహీనంగా ఉంటే డాక్టర్లు అంటారుకదా "పాలు తాగండి రోజూ ఒకశేరైనా" అని. పాలు తాగితే మాంసము, ఎముక, రక్తము— శరీరపోషణానికి ఆవశ్యకమైన వన్నీ వాటిలోనే ఉన్న వంటారు డాక్టర్లు. మన శరీరాన్ని ఇన్నివిధాల పోషించే పాలు ఆవు ఇస్తూవుంది. దానికీ పాలు ఎక్కడినుంచి వస్తున్నవి? పచ్చగడ్డి తిని ఆవు పాలిస్తూవుంది. ఆ గడ్డి ఎట్లా పుట్టి పెరుగుతూవుంది? సూర్యుని ప్రకాశంవల్లా, గాలివల్లా, తన వేళ్లద్వారా నీటితోకూడా నేలలో వుండే లోహాలు తనలోకి తీసుకొని ఆ లోహాలవల్లా ఆ గడ్డి పుట్టి పెరుగుతూవుంది. ఈ పద్ధతిని బట్టి చూస్తే మనకూ, జంతువులకూ చివరికి పోషణ ప్రధానంగా ఖనిజాలవల్ల జరుగుతున్నదన్నమాట; అంటే జీవం గల జంతువులు జీవంలేని జంతువులమీద- పదార్థాలమీద బతుకుతున్నా యన్నమాట. ఖనిజాలనుబట్టి ఓషధులు బతుకుతూవుంటే ఓషధులను ఆధారం చేసుకొని జంతువులు బతుకుతున్నవి అని తేలింది. ఆ ఖనిజాలు- లోహాలు ఎట్లా కలుగుతున్నవంటే సూర్యుడి వెలుగూ, వేడీ ఈ భూలోకంలోని సమస్తానికీ ఆధారం. మనం తినే ఆహారంవల్ల మనం తయారవుతున్నాం. మన

ఆహారమే మనలను 'చేస్తూవుంది.' మన ఆహారం ఖనిజాలమూలకంగా వస్తున్నది. అందువల్ల మనం ఖనిజాలవల్ల చేయబడ్డ మన్నమాట కాదూ?

ఇది నిజమా, అబద్ధమా? ఈ సంగతి తేలాలంటే లేబరేటరీలో పరిశోధన చేయాలి. పరిశోధకులలో రసాయనశాస్త్రవేత్త ఘటికుడు. ఇంద్రజాలం తెలిసినవా డతను— కనుకట్టు, టక్కు, టమార, గజకర్ణ, గోకర్ణ విద్యలేమీ లేవు కానయితే అతడివద్ద. అయినా ఇంద్రజాలికుడే అతను. అతనికి సుద్దపొడి ఇస్తామనుకోండి. దాని నతడు టెస్టుట్యూబులో వేసి వేడిచేశో, ద్రావకాలుపోశో, ఎట్లాగో ఒకలాగ శోధిస్తాడు. తిమ్మిని బమ్మి, బమ్మిని తిమ్మి చేస్తాడు. చివరికి దానిని సున్నంకిందా, కార్బన్ డైయాక్సైడ్ కిందా విడదీస్తాడు. అంతటితో ఊరుకుంటాడా అతను? ఊహూఁ- ఊరుకోడే. సున్నాన్ని ఇంకా శోధిస్తాడు. దానిని కాల్షియమ్కిందా, ఆక్సిజెన్ కిందా విడగొట్టి, ఈ రెండూ కలిసి సున్నమైందంటాడు. ఆ విధంగానే కార్బన్ డైయాక్సైడును కార్బనుకిందా, ఆక్సిజెనుకిందా విడదీస్తాడు. అప్పటికి అతను ఎంతదూరం పోగలడో విడదీయడంలో అంత దూరమూ పోయా డన్నమాట. చివరికి అంటాడుకదా అతను- "కాల్షియము, కార్బను, ఆక్సిజెను- ఈ మూడు వస్తువులు కలిసి నీ విచ్చిన సుద్దపొడి అయింది; ఈ మూడు వస్తువులూ ఉండి, వాటిని కలిపే పాళ్లు తెలిస్తే సుద్ద చేయవచ్చు" అని; అంటే సుద్ద అనే వస్తునిర్మాణంలో కావలసిన వస్తువులివి. ఇంతకంటె వీటిని విడదీయలేము; విడదీయదలచినా అది సాధ్యమూ కాదు. ఇటువంటివాటిని ధాతువులు- ఎలిమెంట్స్- అంటారు.

ఈ విధంగానే మన శరీరాన్ని మనం పరిశోధిస్తా మనుకోండి. ఏం తేలుతుంది? మన శరీరంలో ఎక్కువపాలు నీరు కనిపిస్తుంది. స్థూలకాయం గలవా డెవడైనా బరువు తెలిపే యంత్రంమీద నిలబడి తూకం వేసుకొన్నా డనుకోండి. వేసుకుంటే- మాటవరుసకు- ముప్ఫయిపౌనులు తూగా డనుకోండి. ఈ ముప్ఫయిపౌనులూ కండా మాంసమూ కాదుసుమండీ. దీనిలో ఏ పదిపౌనులో చేవ- మిగిలిన దంతా నీరే. ఏమిటి, ఇంత నీరేమి టంటారా?

అసలు జీవజంతువులు- జీవజంతువు లనవద్దు, జీవరాసు లందాం- ప్రపంచంలో పుట్టింది మొదట నీటిలోనే. ఇట్లా ఎన్నో లక్షలకొద్ది ఏళ్లు గడచేదాకా, అంటే ప్రపంచం ఇంకా పసితనంలో ఉన్నకాలంలో జలాశయాలలోను, నదులలోను, సరస్సులలోను, సముద్రంలోను తప్పితే జీవజంతువే ఉండేది కాదు. ఇట్లా వందలకొద్దీ, వేలకొద్దీ, లక్షలకొద్దీ ఏళ్లు గడచినవి. అప్పటికి జీవజంతువులు కొన్ని ఒడ్డుకి వచ్చి నేలమీద పాకి గాలిలో బతకడం నేర్చాయి; అంటే మత్స్యయుగం గడిచి సరీసృపాల(రెప్టయిల్స)యుగం వచ్చింది. జంతువులు కొత్తపరిస్థితులకూ, కొత్త వాతావరణానికీ, తాము అలవాటుపరుచుకొని బతకాలనే ఇచ్ఛాప్రయత్నంలో వాటిలో కొత్తకొత్త పరిణామాలు కలిగి కొత్తరూపాలు కలుగుతూవచ్చాయి. లక్షల్లూ, కోట్లూ సంవత్సరాలు గడవగా గడవగా ఈ సరీసృపాలలోనుంచే పరిణామం కలిగి అంతకంతకు ఎక్కువవీ, విచిత్రమైనవీ

రూపాలు గల జంతువులు ఆవిష్కారం పొంది చివరికి మనిషి ఆవిర్భవించాడు. అందువల్ల ఒకవిధంగా చూస్తే మనిషికూడా ఇతరజంతువులలాగే నీటినుంచి పుట్టాడనే చెప్పవచ్చు. లక్షలకొద్దీ, కోట్లకొద్దీ సంవత్సరాలకు పూర్వం మనం పాలసంద్రంలో పవ్వళించిన మహావిష్ణువులాగ సముద్రపు కెరటాల డోలికలలో ఉయ్యాలలూగాం. మన శరీరానికి సముద్రపు ఉప్పు తగలక పోతే, ఉప్పు లేకపోతే మనం చచ్చిపోతాం. మన శరీరంలో నీరు ఎక్కువ ఉండంటే ఆశ్చర్యపడనక్కరలేదు. ఏతావతా తేలిందేమిటంటే, మనం చాలావరకు నీటితో చేయబడ్డా మన్నమాట.

నీరు ఎట్లా అయింది? హైడ్రోజన్ అనేది ఒక వాయువిశేషం. ఆక్సిజన్ అనేది మరొక వాయువిశేషం. రెండూ రెండువిధాలయిన గాలులు- మరుత్తు లందాం. ఈ రెండువిధాలయిన మరుత్తులనూ విద్యుత్కణంద్వారా (అంటే మెరుపుశక్తి- దీపాలు వెలిగించే ఎలెక్ట్రిసిటీశక్తి) కలిపితే నీరవుతుంది. రెండు రకాలైన గాలి కలిస్తే నీరు పుడుతుందన్న మాట.

మన శరీరంలో ఇతరవిధాలైన మరుత్తులుకూడా ఉన్నవి. ఎటువంటి వంటే అవి వాటిని ఒకదానితో ఒకటి కలిపితే నీరు పుట్టదు—ద్రవపదార్థం కాదు సరికదా ఘన పదార్థమూ కాదు. మనం గాలి లేకపోతే చచ్చిపోతాం. గాలి పీల్చకుండా ఉండ లేము. హైడ్రోజన్, ఆక్సిజన్‌లవంటిదే నైట్రోజన్- మరోరకమైన గాలి. మనం పీల్చే గాలిలో ఆక్సిజనూ ఉంది; నైట్రోజనూ ఉంది. ఈ రెండూ కలిసిన మిశ్రమ వాయువును మనం పీలుస్తాం. ఈ పీల్చిన గాలి మన ఊపిరితిత్తులలోకి పోతుంది. ఈ గాలిలోని ఆక్సిజను మన శరీరంలో వున్న రక్తంలోని మాలిన్యాన్ని పోగొట్టి దానిని శుభ్రపరుస్తుంది. అప్పు డది కార్బన్‌డైయాక్సైడ్ అయి వెలుపలికి వస్తుంది. మనం ఊపిరి విడిచే గాలి యిదే. కొన్ని మరుత్తులు మన రక్తంలోనే ఇంకిపోతవి. మనం లోపలికి పీల్చే గాలిలోని నైట్రోజెను మన రక్తంలో ఇంకుతుంది-కలిసిపోతుంది.

మన శరీరంలో నీరూ, గాలీమాత్రమే కాకుండా కొన్ని ఘనపదార్థాలూ ఉన్నవి. ఈ ఘనపదార్థాలనుగురించి చెప్పడం అంత తేలికపని కాదు. ఎముకలు తీసికొందాం. ఇవి కాల్షియం ఫాస్ఫేట్ అనే గట్టిపదార్థంతో చేసినవి. కాల్షియం, ఫాస్ఫరస్, ఆక్సిజన్ అనే మూడుధాతువులు కలిసి కాల్షియం ఫాస్ఫేటు అయింది.

ఇక మన శరీరంలోని మాంసము, గుండె, కడుపు, కాలేయము, చర్మము ఈ మొదలైనవాటినిగురించి చెప్పడం చాలా కష్టం. వీటిలో ఒక్కొక్కదానిలో ఏయే ద్రవ్యాలు ఉన్నవో కనుక్కోవడానికి ప్రయత్నించినపుడు మనం తికమకలై పోతాం; ఎంచేతనంటారా, వాటిలో ఉన్నది ఒక్క ద్రవ్యం కాదు, ఒక్కరకమూ కాదు, ఒక్కపోలికదీ కాదు; భిన్నభిన్నాలైన ద్రవ్యాలు ఎన్నో ఉన్నవి. మన శరీరంలోని ఏయే భాగం ఎట్లెట్లా పనిచేస్తుందో తెలుసుకోవడానికి డాక్టర్లు సంవత్సరాలకొద్దీ చదువుతారు. ఎంతోబాగా చదివినవాళ్లూకూడా, ఎంత బాగా తెలిసినవాళ్లూకూడా మనలో ఉండే లోతుపాతులూ, కిందుమీదులూ,

గుట్టుమట్టులూ ఇంకా తెలిసికోనే లేక పోతున్నారు. అయినప్పటికీ చూశారూ ఈచిత్రం, చాలా చిక్కయిన, విచిత్రమయిన ఈ మానవయంత్రనిర్మాణంలో ఉపయోగపడ్డ ధాతువుల పేర్లు రసాయనశాస్త్రవేత్త ఏకరువుపెట్టివేస్తాడు.

మనిషి అనే యంత్రాన్ని తయారుచేసిన ధాతువులు అపూర్వమైనవీ కాదు, అరుదైనవీ కాదు. చాలా సామాన్యమైనవి; మనకు బాగా తెలిసినవీ, పరిచయమైనవీ కూడాను. అవేమిటంటే, కార్బను, ఆక్సిజెను, హైడ్రోజెను, నైట్రోజెను, ఫాస్ఫరసు, గంధకము—ఇవీ ముఖ్యమైనవి. ఉన్నవన్నీ ఇవే కాదు—ముఖ్యమైన వివి అని చెప్పానుకాదూ. ఇవికాక, మన శరీరంలో కొద్దిగా సోడియము ఉంది; క్లోరిను ఉంది;—ఈ రెండుధాతువులూ కలిస్తే ఉప్పవుతుంది—, పొటాసియము ఉంది; ఫ్లోరిను ఉంది. ఇంతే అనుకొన్నారా ఏమిటి, కాదు; మన వంట్లో ఇనుముకూడా ఉంది. ఈ యినుమునుబట్టే మన రక్తానికి ఎర్రదనం వచ్చింది. మెగ్నీషియము ఉంది; అయోడిను ఉంది; లిథియము ఉంది; దేవుడు మరి మేలుచేస్తే—సిలికన్‌కూడా ఉంది. ఇంతే కాదు, అతి స్వల్పంగా సీసం వుంది, రాగి వుంది; మేంగనీస్ వుంది. ఇవన్నీ చూస్తే అబ్బా, ఎన్ని వున్నవో అనుకొంటాము. కాని, నిజానికి ఈపట్టిక పెద్దదికాదు కానైతే.

నేటివరకు మనకు తెలిసిన ధాతువులు తొంభైరెండు ఉన్నవి. వీటిలో చాలా ధాతువులు చాలా అరుదుగా దొరకుతవి. ఇంకొక రెండు ఉండాలని శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు; కాని ఇంతవఱకు కనిపెట్ట లేదు. వీటిలో చాలా సామాన్యమైనవి ప్రతిఅయిదింటికీ ఒక్కొక్క ధాతువుచొప్పున మనలను తయారుచేయడంలో ఉపయోగపడ్డవి.

మన శరీరనిర్మాణంలో ఉపయోగపడ్డ ధాతువు ఏదేది ఎంతెంత ఉన్నదీ బాగా తెలియాలంటే ఆలివర్ వెండెల్ హోమ్స్ అనే అమెరికాదేశీయుడు చెప్పినది చెపితే చాలు. ఆత డన్న దిది:

"కొన్ని గాలనుల నీళ్లు, కొన్ని పౌనుల కార్బను, సున్నము, కొన్ని ఘనపుటడుగుల గాలి, ఒకటో రెండో ఔన్సుల ఫాస్ఫరసు, కొద్దిడ్రాముల ఇనుము, ఉప్పు, ఒక చిటికెడు గంధకం, అనేకము లితరద్రవ్యాలు ఎక్కువ అవసరమైనవి—ఒక్కొక్కటి ఒక గ్రెయినుచొప్పునో, అంతకు కొంచెం ఎక్కువగనో—ఇవన్నీ ఉంటే మనిషి తయారవుతాడు" అని.

డాక్టరు రొనాల్డ్ మేక్‌ఫీ ఇంతకంటె మనకు బాగా అర్థమయ్యేటట్టు చక్కని పట్టిక ఇచ్చి తెలిపాడు; ఎట్లా అంటే, అతడు చెప్పాడుకదా (మగవాడికంటె చిన్నదైన) ఒక స్త్రీశరీరంలో—

- ౯ గాలనుల నీరు,
- ౮౦౯ గాలనుసీసాల ఆక్సిజెను,
- ౯,౦౦౦ ల సీసపు పెన్సిళ్లు తయారు చేయుటకు సరిపోయిన కార్బను,
- ౮,౦౦౦ ల పెట్టెల అగ్గిపుల్లలు తయారు చేయుటకుసరిపోయినఫాస్ఫరస్,
- ఒక గాలిగుమ్మటాన్ని స్నోడన్ పర్వత శిఖరానికంటా ఎగిరేటట్టు

చేయడానికి నింపవలసినంత హైడ్రొజెను,
అయిదు చిన్న మేకులు తయారు చేయుటకు సరిపోయేటంత ఇనుము,
సాధారణమైన ఉప్పుగడులు (Salt cellars) ఆరింటిని నింపడానికి సరిపోయేటంత ఉప్పు,
అయిదుపౌనుల నైట్రొజెను

ఉంటవట. చూశారా ఈపట్టిక. దీనిని చూస్తే తెలియటం లేదూ మనం మన చుట్టుపట్ల ఉండే ద్రవ్యానికి ఏమాత్రమూ భిన్నలమూ, విలక్షణమైనవాళ్లమూ కామని. సీసపు పెన్సిళ్లు, మేకులు, అగ్గిపుల్లలు ఏధాతువులతో, ఏ ద్రవ్యాలతో తయారవుతున్నవో ఆ ధాతువులతోనే, ఆ ద్రవ్యాలతోనే మనమూ తయారవుతున్నాము; అనగా చివరకు తేలింది ఇది: వస్తుతః మనమూ, మన ప్రపంచమూ ఒకటే. ఇంకొకటి ఏం తెలుస్తుందంటే యథార్థంగా చూస్తే సామాన్యద్రవ్యా లనుకొనేవి చాలా విచిత్రమైన వనికూడా బోధపడుతుంది; ఎందుచేత నంటారా, ఈ సామాన్యద్రవ్యాలతో తయారైన మనిషి ఆ ద్రవ్యాలను గురించే పరిశోధనచేసి ఎన్నో సంగతులు తెలుసుకొన్నాడు; ఇప్పటికీ తెలుసుకొంటున్నాడుకూడాను.

అసలు జీవరాసుల ఉత్పత్తి ఎప్పుడో, ఏవిధంగానో తెలిసికొని మనిషి ఈ విశ్వంలో జీవకణం ఆవిష్కారం పొందిన అంతటి మహాప్రాచీనకాలంనుంచి, అనగా లక్షలకొద్దీ, కోట్లకొద్దీ ఏండ్లక్రితంనుంచి ఇప్పటిదాకా తన పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకొన్నాడు; తన ప్రాచీనచరిత్ర తవ్వాడు; తాను నివసించే ప్రపంచాన్ని, గ్రహాలను, సూర్యుణ్ని, ఆఖరుకు ఎంతో దవ్వుల నున్న నక్షత్రాలనుకూడా తక్కెడా త్రాసూ లేకుండా తూచాడు. ఈ విశాలావకాశంలో ఇవన్నీ ఎట్లా సంచరిస్తున్నవో, దేనితో చేసినవో, వేడివో చల్లనివో—ఈ సంగతులన్నీ శోధించి తెలుసుకొన్నాడు; తన రోడ్లతో, కాలువలతో, వంతెనలతో, ఆనకట్టలతో, వ్యవసాయంతో ఈ భూతలస్వరూపమే మార్చివేశాడు; బొగ్గు, జలపాతాలు, విద్యుచ్ఛక్తి, ఇంకా లక్ష ఇతరవిషయాలు ఉపయోగించే విధం కనిపెట్టాడు; తెలుసుకొన్నాడు; కనురెప్పపాటుకాలంలో ఒక సందేశాన్ని ఈ భూప్రపంచంచుట్టూ ప్రసారంచేయగలడు; దూరశ్రవణమూ, దూరదృష్టి సంపాదించాడు; వేలకొద్దిమైళ్ల దూరాన ఉన్న వారితో మాటాడుతాడు; వారి ఛాయాచిత్రాలు తీస్తాడు; శ్రవణానందకరమైన దివ్యగానం చేస్తాడు; నేత్రపర్వమైన చిత్రాలు చిత్రిస్తాడు; వివేకమహితములైన గ్రంథాలు వ్రాస్తాడు; అణువులణువూ చీల్చి చూస్తున్నాడు: ప్రళయభీకరమైన ఆటంబాంబు కనిపెట్టాడు; మనిషిమహత్తు ఎంతటిది? సామాన్యుడు మనిషి చేసే అద్భుతాలకూ, ఇంద్రజాలానికీ అంతు వుందా? "అణో రణీయాన్ మహతో మహీయాన్" అన్నది ఇతనిపట్ల సత్యం కాదూ? ఏమి సృష్టి యిది బ్రహ్మసృష్టి? ఏమి దివ్యలీల యిది మానవలీల? మనిషికి సంతోషం కలిగిందా, జగత్తు ఆనందసాగరవీచికలలో ఉయ్యాలలూగుతుంది; మనిషి క్రోధావేశంతో రుద్రమూర్తి అయ్యాడా విధ్వంసకాయుధప్రయోగంతో

జగత్తు సర్వనాశనంఅవుతుంది—ఎంతటివాడు మనిషి! మనిషే దేవుడా?

ఇంతా చేస్తే ఏమిటి ఈమనిషి? అతి సామాన్యములైన పంథొమ్మిది ధాతువులతో తయారైన విచిత్రయంత్రం. ఇట్టి సామాన్యాతిసామాన్యధాతుసంభూతుడైన మనిషి ఇంతటి ఇంద్రజాలమహేంద్రజాలాలు చేయడం వింతలలో వింత కాదూ? మనిషి ఎంతకైనా సమర్థుడు; తలచుకోకనేపోవాలి కాని పూర్తిగా తలచుకొంటే అతను చేయలేనిది లేదు; అతనికి అసాధ్యమైనదీ లేదు. మనిషి పూజ్యుడు, గౌరవనీయుడు.

థియోడార్ డ్రీజియరూ, అతని శేముషీవిశేషాలూ

= శ్రీ శిష్ట్లా ఉమామహేశ్వరరావు =

"నా జీవితంలో ఎప్పుడూ ఎవరో ఒకరు 'ఇంకి మీరవాకు, పైకి పోవాకు, దీన్ని గురించి మాటాడవద్దు, దాన్ని గురించి మాటాడవద్దు, ఉన్న చోటే ఉండు, కదలవెదలవద్దు!' అంటూనే ఉండేవారు." ఈ డ్రీజియరుమాటలే అతని తత్వాన్ని వెల్లడిస్తాయి. ఈతను గడచిన సంవత్సరం చివరన హాలీవుడ్‌లో చనిపోయేంతవరకూ ఇలాగే జీవించాడు... హాలీవుడ్ అనగా ఇతను పూర్ణముగా ఇష్టపడేవాడు—పూర్ణముగా ఏవగించుకునేవాడు.

సహజంగా కోపధాటితనమూ, తొందరా ఉండడంచేత డ్రీజియరుకు చాలామంది విరోధులు ఏర్పడ్డారు. అందుచేత వారు అతని రచనలను అల్పదృష్టితో చూచేవారు. అతని అద్వితీయగుణాలను త్రోసివేసేవారు. కొన్నివిషయాల్లో అతని జన్మభూమియైన అమెరికాలోకన్న ఇంగ్లాండులో అతనిని హెచ్చుగా మెచ్చుకున్నారు. ఆర్నాల్డు బెన్నెట్టు అతనిని అమెరికాలోని అమోఘమైన గ్రంథకర్త అన్నాడు. హెచ్. జి. వెల్సు అతనిని విపరీతప్రతిభావంతుడన్నాడు. రాజకీయంలోనేగాక సాహిత్యంలోకూడ చక్కని అభిరుచులున్న చర్చిలు ఇతని గ్రంథాలమీద ప్రీతిచే ఇతను ౧౯౨౬లో ఇంగ్లాండు వెళ్లినప్పుడు ఇతన్ని భోజనానికి ఆహ్వానించాడు.

ఈ థియొడార్ డ్రీజియరు అమెరికా దేశమున ఇండియానా స్టేటులో టెర్రెహోటువందు ౧౮౭౧ ఆగస్టు ౨౭-వ తారీఖున జన్మించాడు. ఇతని కుటుంబము జర్మనుజాతిది. మతమున క్యాథలిక్కులు. అతిబీదవారు. ఇతను పదుముగ్గురు పిల్లల్లో పన్నెండవవాడు. ఇతని తండ్రి 'కాన్‌స్క్రిప్షన్' తప్పించుకుందామని అమెరికా వచ్చినవాడు; నేతపనివాడు. ఈయనకు ఒక చిన్న మిల్లు ఉండేది. అది తగులబడిపోవడంతో కుటుంబానికి సుస్థిరత్వంకూడా లేకుండాపోయింది.

దృక్పథంలోనేమి, ప్రకృతిలోనేమి తండ్రికీ కుమారునికీ భేదమున్నా తండ్రిమీద డ్రీజియరుకు ఒకరకమైన మక్కువ ఉండేది. డ్రీజియరు తన సహజమైన నిర్మొగమాటంతో తండ్రిని గురించి ఇట్లా వర్ణించాడు: "మతవిషయంలో ఆయనకన్నా అల్పదృష్టి, పట్టుదలా గలవారిని నేను చూడలేదు—అయితే ఆయనకన్నా మార్దవమైనవాణ్ణీ, ప్రేమపరుణ్ణీకూడ చూడలేదు." ఆతర్వాత కొంతకాలానికి ఈవిధంగాకూడా ఒప్పుకున్నాడు: "విచారంగా ఉన్నప్పుడూ, కోసుపోకుండా వున్నప్పుడూ ఆ ప్రకృతి నన్ను చాలాకాలం వదిలేది కాదు. ఈ విషయంలో అచ్చంగా మా నాయనవంటి వాణ్ణే నేను. అందుకనే ఆయనంటే చాలా దగ్గరసంబంధంగా భావిస్తాను."

సౌందర్యంమీద ఇతని కున్న ప్రేమ తల్లినుంచి వచ్చినట్లు తెలుస్తుంది. "ఆశ్చర్యయుక్తతా, స్వప్నత్వమూ, బాహాటమూ ముఖ్యలక్షణాలుగా ఉండేవి మా అమ్మకు" అని ఒకచోట వ్రాశాడు. "కథలనూ, దేవతలనూ ప్రేమించేది. వాటిపై నమ్మకంగూడా ఉండేది. చెట్లనూ చేమలనూ పూలనూ ప్రేమించేది. మేఘాలన్నా, వాయుస్వనాన్నా ఇష్టం. బీదరికం అను పడితే ఎంత అవిసిపోయేదో అంత అవిసిపోయేది బీదరికాన్ని గురించి కథలువిన్నా! నిజంగా మా తల్లివంటి వారు సకృత్తు."

ఇట్టి తల్లి ఇంట్లో ఉన్నా ఆ యింట్లోనే అధికమైన బీదరికం ఉండడంచేత డ్రీజయరుయవ్వనావస్థ దుఃఖభాజన మయింది. అందులోనూ ఇతను చాలా సున్నితత్వమూ, సిగ్గులేనమూ, బెదరూ గలిగిఉండేవాడు. అయినా అతిబాల్యంలోనే పదిడబ్బులు తెచ్చుకోవలసిన అవసరం పట్టింది. ఇంట్లో బీదరికాన్ని తగ్గించడానికి ఏ పనికిమాలిన పనిచే ఆర్జించినా అదే అమోఘంగా ఉండేది.

విధిదేవత ఎప్పుడూ ఒక్కమాదిరే చూడదు. ఒకరోజున డ్రీజయరుకు అదృష్టం ఆరంభించింది. ఇతను చిన్నతనంలో ఎలిమెంటరీ స్కూలులో చదువుకున్నప్పుడు విద్యచెప్పిన మిస్ ఫీల్డింగు ఇతని తెలివితేటలకప్పుడే ఆశ్చర్యపడింది. కొంతకాలానికామె ఆ స్కూలుకు ప్రధానోపాధ్యాయురా లయింది. అప్పుడితనికి ఉత్తరంవ్రాసి పిలిపించి ఇండియానా స్టేటు యూనివర్సిటీకి పంపించింది. కనక ౧౭ వ యేట ఇతని అసలైన విద్యాభ్యాసం ఆరంభమైంది.

డ్రీజయరు పెద్ద పట్టుదలలతోనూ, గొప్ప ఆశయాలతోనూ యూనివర్సిటీని వదిలిపెట్టాడు. ముందుకు పోదామని ఆగని జ్వాలవంటి కోరిక ఇతనిలో గాఢమయింది.

ఆరంభంలో అన్నిపనులలోనూ చొరుచుకుపోయాడు. కంచాలుకడిగాడు. పొలంపని చేశాడు. "చాకలి" కుర్రాడుగా చేరాడు. ఫోటోగ్రాఫర్ అసిస్టెంటుగా పనిచేశాడు. చివరకు విలేఖరిగా కుదిరాడు. ఏ పనిలోనూ ఎక్కిరాలేదుగాని విలేఖరిగా విజృంభించాడు. సంపాదకీయోద్యోగం "అసహ్యకరమయినదీ—బురదనుచిందింపజేసేదీ" అని ఇతను అన్నా అనేకరకాల మనుష్యులతో పరిచయం చేసుకోడానికీ, అనేకవిధాల జీవితసమస్యలను అర్థంచేసుకోడానికీ, ఉద్వేగపడడానికీ పత్రికాప్రక్రియే సరియైనదని ఇత నందు కిష్టపడేవాడు.

౧౯౦౦ సం.లో ఇతని 'సిస్టర్ కేరీ' ప్రచురణమయింది. ఒక [illegible]పతితయైన యువతినిగురించి యథార్థతతోనూ, కదలికతోనూ కల్పించిన నవల 'సిస్టర్ కేరీ'. చివర కాయువతి 'స్టే'మీద జీవితాశయం నెరవేర్చుకుంటుంది.

అయితే యీగ్రంథంలో మరవరాని అంశం ఏమిటంటే: ఆయువతివిటకాడు నానాటికీ ఏరీతి అధోగతియైనదీ ఆరీతినిగురించి దారుణంగా కనబడే ఆ మానసికావస్థను, ఆ శరీరావస్థను కన్నులకుకట్టేటట్టు వర్ణించడం!

ఏగ్రంథకర్త వ్రాసినవాటిలోనూ మొదటిగ్రంథం ఇంత జనాకర్షణను పొందలేదు. దీనికే ఆర్నాల్డు బెన్నెట్టు కొనియాడింది. అయినా యీగ్రంథాన్ని అమెరికాకు సిగ్గుతెస్తున్నదని చాలాపత్రికలు దూషించడంతో చివరకు ఆ పుస్తకాన్ని వాపసుచేసుకోవాల్సి వచ్చింది. తన గ్రంథం చాలా ఉత్కృష్టమయినదని డ్రీజయరుకు తెలుసు. కాని ఇట్ల[illegible]పరికి ఇతనికి అతి అసహ్యంగానూ, అతివిచారమూ తోచింది.

తన విచారమును మనసులోనే కలకవేసుకుంటూ ౧౧ సంవత్సరాలు డ్రీజయ రూరకున్నాడు. ఈ కాలంలో సంపాదకీయోద్యోగంలో కుదిరిపోయాడు. న్యూయార్కులో ఉన్న బట్టరిక్ ప్రచురణల సంస్థకు ప్రధానసంపాదకు డైనాడు. ఈసమయంలోనే జాతీయశిశుసంరక్షణ అనే పనిని సంస్థాపరిచి సాంఘికంగా చాలా గొప్పసేవ చేశాడు.

౧౯౧౧లో ఇతని రెండోనవల 'జెన్నీ గెరహార్టు' అనే పేరుతో ప్రచురణ అయింది.

ఇంగ్లాండులో థామస్ హార్డీ అనే జగద్విఖ్యాత గ్రంథకర్త ఉండేవాడు. ఆయన 'టెస్ ఆఫ్ డర్బరవిల్సు'గుండెలు కదలవేసే గొప్ప గ్రంథం. డ్రీజయర్ వ్రాసిన 'జెన్నీ' అమెరికన్ 'టెస్సు'అని అనేకులు కొనియాడారు. ఈ గ్రంథమందు చాలా సౌకుమార్యమూ, చాలా సున్నితత్వమూ, మార్దవమూ చూపబడ్డాయి. ఇతని సహజగుణాలయిన పెడసరమూ, నిర్మొగమాటమూ, [illegible]త్వమూ ఇవేవీ అందులో లేవు. అందుచే విమర్శకులు చాలా సంతోషించారు. బహుధా ప్రశంసించారు.

జెన్నీ గెర్‌హార్టుకు వచ్చిన పెద్ద పేరువలన డ్రీజియరు పూర్ణముగా సాహిత్యమందే కృషి చేయడానికి ఉత్సాహపడ్డాడు. తన ప్రధానసంపాదకపదవిని వదులుకుని యూరప్ అంతా ప్రయాణంచేశాడు. అన్నిచోట్ల కన్నా ఇంగ్లాండులోనే ఇతనికి స్వంతఇల్లల్లే అనిపించింది. ఆ దేశంయందుండే నిదానానికి, నిబ్బరానికి ఇతను సంతోషించాడు. "ఇంగ్లాండులోనే కలుపుగోలుతనమూ, కుటుంబాల కామాయితీ కనబడతాయి. జీవిత విషయాలు ఎంత చెడ్డగా కనబడ్డా ధైర్యవంతమైన ముఖము చూపాలి అని గ్రహిస్తాము. శుభ్రత, బాధ్యతాయుక్తత, భక్తియుక్తత, జాతీయైక్యత, కుటుంబైక్యత యీ దేశంలో మామూలుగా అగుపిస్తాయి." అని ఇంగ్లాండునుగురించి ఇతడన్నాడు. అన్నిటికన్నా థామసుహార్డీ ఇతనికి నచ్చాడు. "హార్డీ ఇంగ్లాండులో ఒక కానుమాయితీ" అన్నాడు.

అమెరికాకు తిరిగివచ్చిన తరువాత 'ది ఫినాన్షియర్' అనీ, 'ది టైటాన్' అనీ రెండు నవలలు ప్రచురించాడు. చార్లెస్ టి. ఎర్కిన్స అనే ఒక మహావర్తకుని ఆశ్చర్యకరమైన జీవితం ఆధారంగా వ్రాసిన నవలలివి! విమర్శకులీ రెండుగ్రంథాలూ చదివి భగ్నమానసులైనారు. అయితే వారు తమ అభిప్రాయ మీసారి మర్యాదగనే వెలిబుచ్చారు. ౧౯౧౫ సం.లో 'ది జీనియస్' అనే నవలను ప్రచురించినప్పుడుమాత్రం చాలా తీవ్రత చూపించారు. ఈ నవల గర్భితంగా వ్రాసిన తన జీవితచరిత్రే. ఇది పూర్తినిర్మొగమాటంతో వ్రాసిన పుస్తకం.

'సిస్టర్ కేరీ' అనే పుస్తకం ప్రచురణమయిన తర్వాత కలిగిన దురవమానముకన్న మించిన దీగ్రంథ ప్రచురణమయినతర్వాత కలిగింది. ఏమనగా: దుశ్శీల విముక్తతాసమాజ మనే ఒక సంస్థ యీగ్రంథమును జనబాహుళ్యమున కందకేయకుండా వాపసుచేసుకోక పోతే దావా వేస్తామని ఆ గ్రంథప్రకాశకులను బెదిరించింది. ౪౭౦ మంది అమెరికా గ్రంథకర్తలున్నూ, ఇంగ్లాండు గ్రంథకారులైన వెల్సు, బెన్నెట్టు, వాల్పోలు మొదలైనవారున్నూ సంతకాలుచేసి డ్రీజియరు పక్షాన ఆ గ్రంథప్రచురణకొరకై ప్రచారంచేశారు.

అప్పుడు అయిదుగురు న్యాయనిర్ణేత లేర్పడ్డారు. ఆ గ్రంథము మంచిదా, గొప్పదా, లేక అసహ్యకరమైన చిత్తుదా అని తేల్చడానికి పరిశీలనచేశారు. ఆఖరు నిర్ణయమే అమలుచేశారు.

౧౯౨౫ సం.లో 'ఏన్ అమెరికన్ ట్రాజడీ' అనే గ్రంథం రచించాడు డ్రీజియరు. ఇదివర కితడు ప్రచురించిన రచనలకన్న భయానకమైన కథ ఇది... ౧౯౦౬ లో హెర్కిమర్ కవుంటీలో న్యూయార్కునందు ఛస్టర్‌గిల్లెటు అనే కార్మికయువకుడు తన ప్రియురాలైన ఒక కార్మికయువతి గ్రేస్‌బ్రవున్ అనే ఆమెను వేరే ఒక ధనికురాలిని పెండ్లాడుదా మనే మోహాన హత్యగావించాడు. ఆకేసు జరుగుతున్నప్పుడు అదంతా డ్రీజియరుమనస్సున నాటిపోయింది. ముఖ్యంగా గ్రేసు ప్రియునికి వ్రాసిన లేఖలలో "నీ కిష్టం లేకపోయినా దయచేసి ఉత్తరం వ్రాయుము" అన్న వాక్యం అతని జ్ఞాపకంలో అతుక్కుపోయింది. ఆ దుఃఖజనకచరిత్రనంతా తూచాతప్పకుండా అణుమాత్రవిషయంగూడా విడవకుండా యథావత్తుగా పై పేర్కొన్న పుస్తకంలో పొందుపరిచాడు.

ఇతని పేరుకు అంతులేని వ్యాప్తి వచ్చింది. డ్రీజియరు చాలా గొప్ప నవలారచకుడు అని అందరనుకున్నారు. ఎంత పెద్దపుస్తకమైనా, నిర్మొగమాటమైన ఎంత యథార్థత్వం ఉన్నా ఆపుస్తకం బాగా అమ్ముడుపోయింది. విశేషమేమంటే 'సిస్టర్ కేరీ' కన్నా, 'జీనియసు'కన్నా అతిసాహసం చూపుతూ వ్రాసిన గ్రంథ మది.

ఈగ్రంథం వ్రాసినఅనంతరం డ్రీజియరు అమెరికనుజాతీయతను చూపిన గ్రంథకారు డయినాడు. అప్పుడే సోవియటుప్రభుత్వం ఇతనిని ఆహ్వానించింది. ఇతను రష్యాపోయాడు. అక్కడ స్త్రీపురుషసమస్యలు చాలా సరసంగా చర్చించుకోవడం చూపి సంతోషించాడు. అయితే యేవిధమైన రాజకీయనిర్బంధమూ అతనికి రుచించే విషయం కాదు. "నేను వ్యక్తిత్వాన్ని ఆమోదించేసంఘంలో అభిపట్టుదల గలవాడను." అని ఇతను స్వేచ్ఛగా చెప్పాడు. కాని రష్యాలోని నాయకుల ఉదాత్తత్వమునకు ఉత్కర్ష చూపాడు.

చాలామందితో సంభాషించాడు. అన్నింటికన్న ఆదేశపు మిలిటరీబలానికి ఆశ్చర్యపోయాడు, జోస్యంగా రీతిగా ఆదేశముపై దాడిపోయేవారిగతి యేమవుతుందో అప్పుడే ఊహించాడు.

రష్యానుంచి స్వదేశం తిరిగివచ్చినతరువాత రష్యా 'బ్యాలెట్' ననుకరిస్తూ 'ఫిల్మ్ఆర్టుగిల్డు'అనే దాన్ని తయారుచేశాడు. కళలో హాలీవుడ్డువారు చూపే వర్తకత్వాన్ని ఉల్లంఘించుదామని ఈతని ఉద్దేశం. ఈసమయాన్నే యీతని అమెరికన్ట్రాజడీని హాలీవుడ్డువారు ఫిల్ము తీశారు. పుస్తకానికీ,ఫిల్ముకూ ఆట్టే సంబంధం లేకపోవడం చూసి ఇతను మండి పడ్డాడు. తానుగొప్పగ్రంథం వ్రాశానన్న గర్వాన్ని మింగుకోవలసివచ్చింది. పారమౌంటుపిక్చర్సువారిమీద దావావేసి భగ్నుడైనాడు.

కొన్ని సంవత్సరాలైనతర్వాత వెనకటివంటిదే ఒకహత్య జరిగితే ఆ కేసు వినడానికి కోర్టుకు పోయాడు డ్రీజియరు. కోర్టులో ఇతను జూరీని నిరసనదృష్టితో చూచాడని జడ్జి తేలికగా తూలనాడాడు. అందరూ ఆశ్చర్యపోయేట్టు అప్పట్నుంచీ ఇతను వ్రాయడం మానేశాడు. బహుశా చాలాభగ్నాలను చూచి అనుభవించడంలో ఆ విరక్తి కలిగిందేమో! "ఎవరూగూడా బయటపడ్డ జీవితసత్యాన్ని ఎల్లప్పుడూ తాకలేదు" అని ఒకసారన్నాడు.

ముసలితనంవరకూ ఎదగడం డ్రీజియరుకు అయిష్టం. ఇతను చాలా యవ్వనరూపంలో ఉండే వాడు. ఆకర్షణీయమైన వర్చస్సు. కళ్లు తీరుగా లేక పోయినా, ముఖం మొరటుదైనా ఇతని ఆకారంలో అదోమాదిరి వశీకరణ ఉండేది. చాలాసార్లు హఠాత్తుగా ఆవేశాలు చూపించేవాడు. అట్టి సమయాలల్లో ఇతని చేతులు వణికేవి. ముఖం కందబారేది. ఒకప్పుడు ఒక ప్రచురకుడు దయారహితుడనీ, పిసినారియనీ అనుకుని కాఫీకప్పులోని కాఫీని అతని ముఖాన విసిరికొట్టాడు.

ఒకసారి సింక్లెయిరు లివిస్ అనే గ్రంథకారుడు ఇతను పరరచనాపహారకుడనేటప్పటికి ఇతడు అతన్ని నడివీథిలో ముఖాన ఫెళ్లుమని కొట్టాడు. యూరపులో సెకండు ప్రపంచయుద్ధం ప్రారంభించడంలో దేనిని అవతలికి జరిపారని విన్నప్పుడు ఇంగ్లీషువారిని "స్వార్థులుచేస్తూ చూస్తూండే దొరలని" నిందించాడు. కాని ఇతని కోపము బుద్బుదప్రాయం. అప్పటికప్పుడే అంతరించేది. చూచే వారికిమాత్రం అరోచకంగా కనబడేది. ఈ ఎక్కువ తాపత్రయం ఇతని అనారోగ్యంవల్ల కావచ్చు. ఇతనికి నిద్ర సరీగా పట్టేది కాదు. విశ్రమింపగలిగేవాడు కాదు. అందుచే ఏదైనా క్రిందుమీదు చేద్దామనే భావనతో ఉండేవాడు. ఇతను క్రిందుమీదుచేద్దామనుకునేది మాత్రం ఇతనిచుట్టూ ఇతను చూచే సంఘదుర్నీతులను గూర్చిమాత్రమే!

ఇతను యథార్థత్వమును చూపుతూ రచనలను వ్రాసినా ముఖ్యంగా ఉదాత్తతాపురుషుడు. పైమనిషి, క్రిందిమనిషి అనేచోట క్రిందిమనిషిపక్షం అవలంబించే వాడు.

ఏ మంచివిషయమందూ ఇతను చాలా ఉత్సాహం చూపేవాడు. ఈ ప్రపంచంలో ఉండే ఆదర్శాలు నిజములనీ, వాటిని సమర్థించేవాడు తానేననీ అనుకునే వాడు. ఇతని అతిదుఃఖభాజనములైన నవలలలోగూడా మనుష్యులలో ఒకరిపై ఒకరికి సౌహార్దత్వమూ, పరస్పర అవగాహనమూ కలిగిఉండాలనే సూత్రాన్ని ముఖ్యంగా తెలియపరుస్తూ దానినే దృక్పథంలో ఉంచుకునే వాడు. అందుకనే ఇతని రచనలు అమెరికాలో అమోఘమయిన వని పేరుపొందాయి.



పాలపొంగు

[కథానిక]

✿

= శ్రీ నెల్లూరి కేశవస్వామి =

ఇంట్లో కాలుపెట్టగానే "అమ్మా! అమ్మా!" అంటూ కేక వేశాడు మూర్తి.

ఆ కేకకి అదిరిపడి వంటింట్లో వున్న తల్లి ఒక్క పరుగున గుమ్మంలోకొచ్చింది "ఏమిట్రా?—ఏమిట్రా?" అంటూ. కాని కొడుకు నవ్వుమొహం చూసి మనసు కుదుటపడ్డది. "ఆ గావుకేక లేయకపోతేయేం నాయనా?" అంది.

అది వినిపించుకోకుండానే కొడుకు "అమ్మా! ఇవ్వాళేం జరిగిందనుకున్నావ్?" అన్నాడు.

"ఆఁ?"—మళ్లీ ఆదుర్దా హెచ్చింది తల్లికి.

"ఆశ్చర్యం, నీ కింకా తెలీదూ? వూళ్లో అంతా గోలగా వుంటేనూ!"

"ఏమిటేమిటి?"—ఆమె కళ్లు మరీ పెద్దవైనై.

"ఇవ్వాళ హర్తాల్ అమ్మా! వూళ్లో దుకాణాలన్నీ మూసేశారు. స్కూళ్లన్నీ బందు."

"ఏఁ?"

"స్ట్రయిక్ (సమ్మె) చేశాం"

"ఎందుకూ?"

"నీ కింకా తెలీనేలేదా? గాంధీజీ అరెస్టయానమ్మా!"

"అయితే?"

మూర్తి ఒక్కసారి చప్పబడ్డాడు! అంతేనా? గాంధీజీ అరెస్టుకావడం అంటే అంతేనా?....."కాంగ్రెసునాయకులంతా అరెస్టయారమ్మా!"

"మరి మీరు స్ట్రయికుచేయటం దేనికిరా?"

బావుంది! దేశనాయకులంతా జైలుకు పోతూంటే, తాము స్ట్రయికు చేయటం దేనికట! ఏమైనా అర్థంవుందీ? తల్లి అమాయకత, అవివేకం చూసి మూర్తికి ఆశ్చర్యం, కోపం, జాలీకూడా ఒక్కసారి పుట్టుకొచ్చాయి. ఈతల్లి కొడుకేనా తాను?

"వాళ్లంతా జైలుకుపోవటం మీకు సంతోషమే నేంరా?"

"ఎవరన్నారు?"

"మరి మీరు పాఠాలు ఎగ్గొట్టం దేనికి?"

ఎంత అవివేకం! ఆవాళ స్ట్రయిక్ చేయటం పాఠాలు ఎగ్గొట్టానికా?

"అబ్బ! నీకు తెలీదులేవే, వూరుకో" అన్నాడు మొహం చిట్లించుకుంటూ. "అసలుసంగతి వినవేం? ఇవాళ మాస్కూల్లో బలే గమ్మత్తు జరిగింది"—మళ్లీ వుత్సాహాన్ని పురస్కరించుకుంటూ అన్నాడు.

"మరి తొందరగా కానీ, అవతలనాకు పనుంది."

"వంటేకదూ? అబ్బ! నీ కెప్పుడూ వంటేనే. వూళ్లకు వూళ్లు తగలడిపోతూన్నా, నీవంటే వంట!"

కొడుకుచీకాకుకి తల్లికి నవ్వొచ్చింది. "నాన్నా! అనుకుంటేనే అన్నీ నోయ్"

"ఏంట్రా అన్నయ్యా! ఏం చెబుతున్నావ్!" అంటూ పరుగెత్తుకొచ్చింది, ఎనిమిదేళ్ల ఇందు. ఆ వెనకాలే అయిదేళ్ల సూర్యం "నాకూ చెప్పాలి... నాకూ చెప్పాలి" అంటూ వచ్చాడు.

"అబ్బ! వుండండ్రా, మీగోలేవిటి!" అంటూ, "కూర్చోవే అమ్మా" అని తల్లిని కుర్చీలో కూలేసి, అందుకున్నాడు:

"ప్రొద్దున స్కూలు కెళ్లానా అమ్మా! తోవలోనే తెలిసిందే అరెస్టులసంగతీ. దుకాణాలన్నీ మూసి వని మూసినట్టుగానే వుండిపోయినై. స్కూలుపిల్లలంతా 'ఇవాళ వెళ్లొద్దు, వెళ్లొద్దు' అంటూ తోడ్లంబడి తిరగటం మొదలెట్టారు. నన్నూ ఆపారు. కాని అసలు మా స్కూలుసంగతి ఎల్లా వుందో తెలుసుకుందామని వాళ్లనంతా తప్పించుకుని వెళ్లాను. స్కూలు చేరగానే పిల్లలంతా గుంపులుగుంపులుగా వుంటం చూసి, నాకెక్కడలేని సంతోషం కలిగింది. అప్పటికింకా బెల్లు కొలా. నేను వెళ్లగానే నాచేతిలో ఒక కాగితం పెట్టి సంతకం చెయ్యమన్నారు. మారుమాట్లాడకుండా ముందు సంతకం పెట్టి, తర్వాత చదివాను. ఇవాళొక్కరోజుకోసం బడి మూసేయించమని హెడ్‌మాస్టర్ని కోరారు అందులో. అంతే. ఇంతలోకి హెడ్‌మాస్టరుకూడా వచ్చాడు. వచ్చీరావటమే మమ్మల్ని చూసి వుగ్రుడై పోయాడు. "ఇక్కడేం చేస్తున్నారు? క్లాసుల్లోకి పోరేం?" అంటూ గదమాయించాడు. దాంతో ఇందాకా ఎంతో ధైర్యంతో మాట్లాడుతూన్న పిల్లలంతా ఒఖ్ఖసారి పిల్లికూనలైనారు. ఎవరిమట్టుకు వారు జారుకోటం మొదలెట్టారు. హెడ్‌మాస్టర్ గూడా ఆఫీసులోకి వెళ్లిపోయాడు. వెనకాలే మా మానీటరూ, ఇంకోఅబ్బాయీ అప్లికేషన్ తీసుకునివెళ్లారు. దాంతో అతను మరీ వుగ్రుడైపోయి, ఆ అప్లికేషన్ పూర్తిగా చదవకుండానే చించిపారేసి, నానా చీవాట్లూ పెట్టాట్ట. తనూ వెంటనే బెత్తం చేతపుచ్చుకుని బయలుదేరేసరికి ఎక్కడివారక్కడ క్లాసుల్లోకి మాయమయ్యారు. నేనూ క్లాసులోకి వెళ్లిపోయా. హెడ్‌మాస్టర్ వొక్కొక్క క్లాసే తిరుగుతూ, ఇల్లాంటి ఆటలు తన దగ్గర సాగవనీ, ఎవరేనా తన కెదురుతిరిగారా వెంటనే స్కూలునించి డిస్మిస్ చేయటమేకాకుండా పోలీసు వాళ్ల చేత బాగా తన్నిస్తాననీ అంటూ మహోగ్రుడుగా లెక్చర్లు దంచటం మొదలెట్టాడు. దాంతో మాకు పెద్ద వుద్రేకం కలిగినా ఏమీ చేయలేక, ఒకరిమొహాలొకరం చూసుకుంటూ వూరుకున్నాం. అతను వెళ్లిపోగానే మళ్లీ గుసగుసలు బయలుదేరినై. అవి కాస్తా పెరిగి చర్చల్లోకి దిగాయి. మాస్టర్లు వేడుకున్నారు. బెదిరించారు. రిపోర్టు చేస్తామన్నారు. కాని ఎవరు వింటారూ? ఇంతలో రిపోర్టులమీద రిపోర్టులు వస్తునై — అన్ని స్కూళ్లూ, కాలేజీల పిల్లలంతా కలిసి ఒక్కొక్క స్కూలే తిరుగుతున్నారనీ, ఇక్కడికీ ఇవాళ వస్తారనీ. ఇది వినగానే మాకు ఎక్కడలేని వుత్సాహం పుట్టుకొచ్చింది. హెడ్‌మాస్టరుక్కూడా ఈ సంగతి తెలిసిందిగామాలున్ను, వెంటనే స్కూలుగేటు మూయించేసి, తాళం వేయించాడు. ఈ సంగతి తెలియగానే మాకు మరీ మండుకొచ్చింది. నిజంగా అమ్మా! అప్పుడు మేమంతా శత్రుకోటలో బంధింపబడివున్న ఖైదీల్లాగానూ, ఆ వచ్చే సోదరవిద్యార్థులు ఈ కోటను ముట్టడించి మమ్మల్ని విడిపించుకుపోయే మిత్రసైన్యాలాగానూ అనిపించిందంటే నమ్ము. ఎప్పుడెప్పుడా అని కూర్చున్నాం. క్షణంగడవటం కష్టమైపోయింది. మాలో కొంతమంది చెట్లెక్కి కూర్చున్నారు వాళ్ల రాక కెదురుచూస్తూ. గేటుదగ్గిరా, వరండాలోనూ మేష్టర్లూ, ప్యూన్లూ కాపలాకాస్తున్నారు హెడ్‌మాస్టర్ ఆజ్ఞ ప్రకారం. ఇంతలోకి "వస్తున్నారు!...వస్తున్నారు!" అంటూ కేకలేశారు చెట్టుపైన వున్నవాళ్లు. అప్పుడే స్కూలుకాంపౌండుఅవల్నించి "గాంధీకీ జై! కాంగ్రెస్‌కీ జై!" అన్న అరుపులు వినిపించాయి. దాంతో, లోపలవున్న మా వుద్రేకమూ కట్టతెగి ప్రవహించింది. ప్రతికంఠం ఎలుగెత్తి అరిచింది. "గాంధీకీ జై! కాంగ్రెస్‌కీ జై!" అని. క్లాసుల్లో ఒక్కరూ వుండకుండా అందరూ గేటువేపు పరుగెత్తారు అరుస్తూ. మేష్టర్లు ఏమీ చేయలేక చూస్తూ నిలుచుండిపోయారు. ప్యూన్లకి ధైర్యం చాలక మూలలకి నక్కారు. ఒక్క హెడ్‌మాస్టర్ మాత్రం చేతిలో బెత్తంతో కాలుకాలిన పిల్లి-గా

అటూ ఇటూ తిరుగుతూ, మేష్టర్లనీ, ప్యూన్లనీ, పిల్లల్నీ తిడుతూ, చేతికందినవాడినల్లా బెత్తంతో బాదుతున్నాడు. నేను గేటుదగ్గర కొచ్చేసరికి, ఓ పిల్లవాడు తాళం విరకొట్టటానికి ప్రయత్నంచేస్తున్నాడు. హెడ్‌మాస్టర్ తన కసికొద్దీ ఆ పిల్లాడివీపుమీద బెత్తంతో బాదుతున్నాడు. అయినా ఆ అబ్బాయి చలించకుండా తనపని తను చేస్తూనేవున్నాడు. అమ్మా! ఆ దృశ్యం ఇప్పటికీ కళ్లకు కట్టినట్టుగా వుంది. అందరూ భయాశ్చర్యాల్తో చూస్తూ నిల్చున్నారు. ఒక్కరికీ ధైర్య మాగలా. ఆ దృశ్యం చూసేసరికి నా కళ్లల్లోకి నెత్తురు దుమికింది. నన్ను నేనే మరిచిపోయా. ఒక్క దూకులో వెళ్లి హెడ్‌మాస్టర్ని తోసేసి, ఆయనచేతిలోంచి బెత్తం లాక్కుని దాన్ని తునకతునకలుచేసి పారేశా, నా కసంతా దానిపైనే తీరుస్తూ. నేను ముందంజ వేయగానే అందరిలోనూ ఒక్కసారి చలనం కలిగింది. కాని అది కనిపెట్టి హెడ్‌మాస్టర్ వెంటనే ఆఫీసులోకి పరుగు తీసి, లోపల్నుంచి గడియవేసుకున్నాడు. ఇంతలోకి గేటుతాళం వూడతీశారు. ఆవలున్న జనప్రవాహమంతా ఒక్కసారి లోపలికి కొట్టుకొచ్చింది. అంతా కలిసి జై జై రావాలు చేస్తూ ఆఫీసుకేసి పరుగెత్తారు. ఒక్క తన్నుకి తలుపు వూడిపడ్డది. లోపల ఫోన్ దగ్గర వున్నాడు హెడ్‌మాస్టర్. వెళ్లి కాలర్ పట్టుకు ఈవలికి లాక్కొచ్చారు. అతని మొహం చూడగానే నా కోపం మరీ హెచ్చింది. నా బలంకొద్దీ ఒక్క లెంపకాయ వెయ్యాలని చేయెత్తాను. కాని నా చేయి నెవరో అట్టానే పట్టుకున్నారు. వెనక్కు తిరిగి చూస్తే ఓ ఖద్దర్ యువకుడు కనిపించాడు వొద్దని నన్ను వారిస్తూ. అమ్మా! అత నెంత మంచివాడనుకున్నావ్! పేరు అబ్దుల్లాట; లా కాలేజీ విద్యార్థట. పఠానబ్బాయిలా గున్నాడు. అతను ముందుకొచ్చి హెడ్‌మాస్టర్ చేయి పట్టుకోగానే గజగజ వణికిపోయాడు హెడ్‌మాస్టర్. 'కొట్టండి, తన్నండి' అన్న గోల మరీ ఎక్కువైంది. కాని అబ్దుల్లా చేయెత్తగానే అంతటా నిశ్శబ్దం! అతనే మా కంతా నాయకుడని నేనప్పుడే తెలుసుకున్నాను. "ఆ అబ్బాయి నెందు కల్లా కొట్టావ్ ?" అని శాంతంగానే అడిగాడు అబ్దుల్లా. హెడ్‌మాస్టర్ నోట మాట లేదు. "ఆ అబ్బాయిని క్షమాపణ వేడుకో" అన్నాడు 'హుకుం' ఇస్తూన్నట్టుగా అబ్దుల్లా. దానికి హెడ్‌మాస్టర్ తటపటాయించటం మొదలెట్టాడు. "ఊఁ కానీవేం ?...నేనింకెప్పుడూ అల్లా చెయ్యనని చెంపలు వేసుకో" అని గర్జించాడు అబ్దుల్లా."

"వేసుకున్నాడా ?" అంది తల్లి ఆదుర్దాగా.

"ఆ, వేసుకోక గత్యంతరం వుందీ? తర్వాత మూడుసార్లు 'గాంధీకీ జై! కాంగ్రెస్‌కీ జై!' అనమని ఆజ్ఞాపించాడు అబ్దుల్లా."

"అన్నాడా ?" అంది తల్లి కళ్లు పెద్దవిచేస్తూ.

"ఆ, అనకపోతే వూరుకుంటామా? అన్నాకే మరి వదిలిపెట్టి ఈవలకొచ్చేసింది."

తల్లివొళ్లో కూచున్న సూర్యం 'గాంధీకీ జై! గాంధీకీ జై!' అంటూ చప్పట్లుచరవటం మొదలెట్టాడు.

"మీది మరీ దౌర్జన్యంరా అబ్బాయి" అంది తల్లి.

"ఏమిటే దౌర్జన్యం ?"

"మీ రాయన్నట్టా ఏడిపిస్తారూ ?"

"ఆ కుఱ్ఱాణ్ణట్టా కొడ్తాడూ ? అది దౌర్జన్యం కాదేం ?"

"ఎంతైనా వాళ్లు పెద్దవాళ్లు, మీరు చిన్నవాళ్లు"

"అమ్మా! పెద్దవాళ్లు పెత్తనం నిలబెట్టుకోనప్పుడు చిన్నవాళ్లు చిన్నతనం మీరితే అది చిన్నవాళ్ల తప్పేనా? మేము పొద్దున సవినయంగా అడిగినప్పుడు స్కూలు మూసేసివుంటేదేం?"

"ఏమోరా అబ్బాయ్! మీ పోకళ్లు నాకేం అర్థంకావు. సరేగాని కాఫీ తాగుతావా ?"

"ఆ, మరందుకేగా వచ్చిందీ? ఏమేనా ఫలహారంకూడా వుంటే పెట్టవే, ఆకలేస్తోందీ. మధ్యాహ్నం హోటల్‌కికూడా వెళ్లలేకపోయాను......ఊఁ, త్వరగా"

"ఇంకా ఎక్కడికేనా వెళ్లాలా యేం ?"

"అయ్యో, తిన్నగా అడుగుతున్నావూ, ఇప్పుడు పార్కులో పెద్ద మీటింగు జరగబోతూంటేనూ!

విద్యార్థిబృందమంతా ఈ పాటికి చేరే వుంటుంది. మహా గొప్పసభ అమ్మా! అబ్దుల్లా, శర్మా, నరేందర్, కామ్రేడ్ సావిత్రి, ఇంకా ఇంకా ఎంతోమంది లెక్చరర్లు వస్తారటమ్మా! నే నెన్నడూ వాళ్లని చూడనేలేదే..."

"కాని మీ నాన్నగారు వచ్చే వేళ అయింది గదరా?"

"వస్తేరేం?" అన్నాడు ధీమాగా మూర్తి.

—"ఒరే మూర్తీ!!!"

మూర్తివళ్లు ఝల్లుమంది! తండ్రికంఠంలో అంత కఠినత్వం వుందని తా నెన్నడూ అనుకోలేదు. తల్లీ, కొడుకూ ఒకరిమొహాలు ఒకరు చూస్తూ నిలుచుని పోయారు.

ఇంతసేపూ నిశ్శబ్దంగా వింటూన్న ఇందు, "నాన్నోయ్! ఏం జరిగిందంటేనూ......" అంటూ లేచింది.

"ఒసే నీకెందుకే?" అంటూ ఆపబోయింది తల్లి. కాని తల్లిమాట విని చచ్చారూ ఎవరేనా? "నాన్నోయ్! ఇవ్వాళ అన్నయ్యబళ్లోనే..." అంటూ నాన్నదగ్గరికి పరుగెత్తింది. కాని "ఛీ, పో"అన్న గదమాయింపు వినబడగానే అమ్మగారి దిమ్మ తిరిగింది. మళ్ళీ తా నేంనేరం చేసిందో అర్థంకాక కళ్లల్లో నీళ్లు నుక్కుకుంటూ మెల్లిగా జారుకుంది. సూర్యం చంకదిగి, "నాన్నోయ్! గాంధీకి జై! నాన్నోయ్! గాంధీకి జై!"అంటూ తండ్రిదగ్గర కెళ్లి గంతులెయ్యటం మొదలెట్టాడు. కాని ఫెళ్లుమని చెంప వాగ్గానే బావురుమని రాగం తీశాడు. తల్లి వెళ్లి కొడుకు నెత్తుకుని—భర్త నిప్పు లేమన్నా ప్రమాదమేనని గ్రహించుకుని—బుజ్జగించటం మొదలెట్టింది.

ఇదంతా గమనిస్తూన్న మూర్తికి హడలెత్తిపోయింది. నాన్న కంతా తెలిసిపోయిందా?

"ఒరే, రావేం?"అన్న గర్జన వినబడగానే గుండె గుభేలుమంది. ముందుకు సాగలేక సాగలేక అడుగులో అడుగు వేసుకుంటూ, వెనక్కి తిరిగితిరిగి తల్లికేసి దీనంగా చూస్తూ వెళ్లి తండ్రిఎదట తలవంచుకుని నిలుచున్నాడు.

తండ్రి అసహ్యాన్నీ, కోపాన్నీ వెలిగ్రక్కే దృక్కుల్తో కొడుకుని ఎగాదిగా చూసి "వెధవా" అన్నాడు. తన చేతిలో వున్న వుత్తరం అందిస్తూ 'చూడు' అన్నాడు అధికారస్వరంతో. భయపడ్తూ భయపడ్తూ, వడికే చేతుల్తో ఆవుత్తరం అందుకున్నాడు మూర్తి. అది హెడ్‌మాస్టర్ తన తండ్రికి రాసినవుత్తరం. అందులో తా నారోజు చేసినవన్నీ ఒకటికి నాలుగు పెంచిరాస్తూ "మీ మొహం చూసి వూరుకున్నాను. లేకుంటే ఈపాటికి మూడేండ్లవరకు రెస్టిక్రేట్ చేయించేసివుందును. ఇప్పటికేనా వెంటనే అపాలజీ(క్షమాపణ)రాకపోతే రిపోర్టుచేయకతప్పదు" అని వుంది. వళ్లుమండింది మూర్తికి. వెళ్లి హెడ్‌మాస్టర్ని చావతన్నాలన్నంత బుద్ధిపుట్టింది. కాని ఎదట తండ్రివుగ్రస్వరూపం కనిపించగానే కోపమంతా నీర్గైపోయింది.

"కూర్చో"అన్నాడు తండ్రి కఠినంగానే. కూర్చున్నాడు.

డెస్కులోంచి రైటింగ్‌పాడ్ తీసి మూర్తి ముందుకు విసిరి, "ఊఁ, రాయి"అన్నాడు తండ్రి. ఏమిటి? అపాలజీయే!? ముచ్చెమట్లు కమ్మాయ్ మూర్తికి. ఒక్కసారి చురుకు పుట్టుకొచ్చింది. "కాని, నాన్నా..." అంటూ ఏదో సంజాయిషీ ఇవ్వబోయాడు.

తండ్రి గుడ్లెఱ్ఱజేస్తూ "ఛీ, నోర్ముయ్. ఇంకా మాట్లాడుతున్నావ్ నోరెట్టుకుని! నే చెప్పినట్టుగా రాయ్"అన్నాడు.

తల వంచేసుకున్నాడు మూర్తి. "ఏమిటీ అన్యాయం? విచారణ లేకుండానే శిక్ష?—ఇంగ్లీషు వాళ్లకి మల్లేనే! ఎదురుతిరగమని కోరింది హృదయం. సాహసించవద్దని హెచ్చరించింది బుద్ధి. మరుమాటాడకుండా రాస్తున్నాడు......తాను చేసిన పనికి విచారిస్తూన్నాననీ, ఇక నెప్పుడూ అల్లా చెయ్యననీ, చేస్తే మీ ఇష్టం వచ్చిన శిక్ష విధించవచ్చుననీ, ఇప్పుడు ఒకసారిమాత్రం క్షమించవలసిందనీ, అల్పశిక్షేదేనా ఇస్తే స్వీకరిస్తాననీ వేడుకుంటూన్నట్టు రాస్తున్నాడు...... కలాన్ని తన రక్తనాళాల్లో ముంచి, తన హృదయ

ఫలకంమీద ఒక్కొక్క అక్షరమే చెక్కుతూన్నట్టుగా బాధపడుతూన్నాడు మూర్తి. ఇది క్షమాపణపత్రమేనా? తానేనా రాసేది? కాదని ఎట్లా అనుకోటం, కళ్లారా చూస్తూనే? రేపు తా నేమొహం పెట్టుకు తిరుగుతాడు? తోటివిద్యార్థులకు అపాలజీసంగతి తెలిశాక తా నిక బతగ్గలడా......ఛీ! ఏం బతు కీపాడు బతుకు?......ఈ కలం విరిగిపోదేం? కాగితం చిరిగిపోదేం?...తా నింకా బతికేవున్నాడేం?...కలాన్ని విసిరి తండ్రిమొహాన కొట్టి, కాగితం చించిపారేసి, పెద్దపెట్టున యేడవాలనిపించింది!......కాని అదేమీ జరక్కుండానే పత్రం పూర్తైంది.

సంతకం పెట్టబోయేముందు మళ్లీ ఒఖ్ఖపాలి కోపం పొంగుకొచ్చింది. కాని ఆపొంగు వెంటనే చల్లారిందికూడాను. రెక్కల్లేని పక్షిలా రెపరెపలాడి ఊరుకుంది హృదయం.

వడికే చేత్తో, తనకే కొత్తగా కనిపించే అక్షరాల్లో గబగబా సంతకం గీకేసి, ఇహ అక్కడొక్క క్షణంకూడా నిలవలేక తన గదిలోకి పరుగెత్తుకెళ్లి మంచంపైన దభాలున పడిపోయాడు, వెక్కివెక్కి ఏడుస్తూ.

కోపం, అసహాయతా కలిస్తే, దుఃఖమేగా ఫలితం!



శబ్దవేధి

[నాటిక]

= శ్రీ నోరి నరసింహశాస్త్రి =

[కాలము : త్రేతాయుగము. ఉదయము రెండవ ముహూర్తములో ప్రారంభించి ఆరాత్రి రెండవ ముహూర్తములో పూర్తి అవుతుంది.]

మొదటి రంగము

[తెరలో కలకలము. పాటలు. వేటకాళ్ల కేకలు. కుక్కల అరపులు. గుర్రముల సకిలింతలు. రథస్వనము.]

(తెరల్లో వేటకాడు)

గజఘట కెల్లెడ కలగిపోరు నీ
గర్జన మేదే గజమదభైరవి!

(తెరలో కుక్క)

భౌ! భౌ! భౌ! భౌ!

(తెరలో వేటకాడు)

వరాహతండము వడవడ వడకే
ఘీంకారం కెరె వరాహభైరవి!

(తెరలో కుక్క)

భౌ! భౌ! భౌ! భౌ!

(తెరలో వేటకాడు)

సింహఖడ్గములుం చెదరి కెదరు నీ
క్ష్వేడము చూపవె శరభభైరవీ!

(తెరలో కుక్క)

భౌ! భౌ! భౌ! భౌ!

(ప్రవేశము రథములో సవ్యపార్శ్వమునుంచి సుమంతుడు; వెంటనే అపసవ్యముగా జాబాలి)

జాబాలి—ఈ ఆయుధపేటిక పూజ్యాతిపూజ్య స్థానములో రథముపైన భద్రపరచమని యువరాజు పంపినాడు.

సుమంతుడు—ఆయుష్మంతు డేడీ?

జాబాలి—తల్లిదండ్రుల దీవనలు పొంది వారివద్ద సెలవుతీసుకోడానికి వెళ్లినాడు. ఈ పేటిక త్వరగా పదిలముచేయి!

సుమంతుడు—ఏ మంత తొందర?

జాబాలి—నేను దీని భారము ధరించలేకుండా ఉన్నాను.

సుమంతుడు—(చిరునవ్వుతో) ఇంత బలశాలికి ఆ చిన్న పేటిక బరువవుతున్నదా?

జాబాలి—దాని మహత్త్వ మట్టిది!

సుమంతుడు—దివ్యాయుధము లంత పదిలంగా, కంటికి కనపడకుండా దాస్తారా?...అందులో ఆ రౌద ఏమిటి?

జాబాలి—ఇదా?...శబ్దవేధి!

సుమంతుడు—(నిర్వేదముతో) ఆఁ!...ఆఁ!

జాబాలి—(చిరునవ్వుతో)మీరుని కంత సంభ్రమ మెందుకు?

సుమంతుడు— శబ్దవేధి అంటే నాకేమో బాగా తెలియలేదు. ఆ రహస్యమైన పేటికా, అందులోని శివారవమూ, దానిపేరూ నాకేమీ బాగా లేవు.

జాబాలి—దాని మహత్త్వముకు అందువల్ల ఏమీ లోటు రాదులే! త్వరగా దీనిని రథముమీద ఉంచు!

సుమంతుడు—దాని స్వరూపము తెలియనిది అది ఆయుష్మంతుని రథముమీద పెట్టను. దానిని కుళకోశములో ఎందుకని పెట్టలేదు?

జాబాలి—నీ కన్నీ జవాబులు చెప్పేదాకా దీనిని భరించలేకుండా ఉన్నాను. నేనే తగినచోట రథముమీద భద్రపరుస్తాను. (రెండడుగులు రథమువైపు వేస్తాడు)

సుమంతుడు—(కఠినంగా) ఆను! వల్ల కాదు. నీవే భరించలేనిది నేను నడిపే రథము అసలు భరించదు.

జాబాలి—నీమాట లీరోజు చిత్రంగా ఉన్నవి. వేట ముందుగానే తలకెక్కలేదుగదా!

(సుమంతుడు జవాబుచెప్పకుండా తీక్ష్ణంగా జాబాలివంక చూస్తాడు. జాబాలి జంకుతాడు.)

జాబాలి—క్షమించు! నా మోటుపరిహాసము క్షమించు. ఐతే, యువరాజు పంపిన ఈ పేటిక ఏమి చేసేది?

సుమంతుడు — దాని స్వరూపము చెప్పితే ఆలోచిస్తాను.

జాబాలి—అంటే?

సుమంతుడు—చెపుతా, విను! అది ఆయుష్మంతునికి ఎట్లా లభించిందో ముందు చెప్పు!

జాబాలి—ఒకానొక మహాయోగి ప్రసాదించినాడు.

సుమంతుడు—ఆ మహాయోగి పేరేమిటి? ఆయన గురు వెవరు? ఆయనశిష్యు లెవరు?

జాబాలి—మహాయోగులకు పేరేమిటి? అతడు స్వయంవ్యక్తుడు!

సుమంతుడు—అయితే ఆ యోగి అనామకు డన్నమాట. సంప్రదాయహీనుడు. మంచిది. ఇక అతని కులగోత్రా లేమిటి?

జాబాలి— యోగీశ్వరులకు కులగోత్రవిచారణ ఏమిటి, సుమంతా!

సుమంతుడు—జాబాలీ, జాబాలీ! నాస్తికులు మాట్లాడవలసిన పలుకు లవి. ఒకటి! సరేగాని నీవు చెప్పే ఆమహాయోగిరూప మెట్లాంటిది?

జాబాలి — కాలసర్పముకంటెది! సాక్షాత్తు ప్రమథావతారము!

సుమంతుడు—ఇక అతని మహత్వ మెట్టిది?

జాబాలి—ప్రళయభయంకర మైనది!...అబ్బా, ఇది భరించలేకున్నాను.

సుమంతుడు— ఆయుష్మంతునికి ఈ 'మహాయోగి' ఎక్కడ తటస్థపడ్డాడు?

జాబాలి—యువరాజు అశ్వపరిశ్రమ చేస్తూ ఈమధ్య సింధుభూములకు వెళ్లలేదూ! ఒకనాడు పరివారమంతా తప్పిపోయి నాతో కలిసి యువరాజు వెళుతున్నాడు. మే మొక అంతులేని ఇసుకఎడారిలో పడిపోతున్నాము. ఎక్కడా దారి కనపడదు. చెట్టు కనపడదు, నీరు లేదు. మాకు అపరిమితమైన ఆయాసమూ, దాహమూ కలిగినవి.

సుమంతుడు—అప్పుడా 'మహాయోగి' అకస్మాత్తుగా దర్శనమిచ్చి ఇది ఇచ్చినాడు, అంతేనా?

జాబాలి—తొందరపడకు! అది నిర్జనప్రదేశము. అక్కడ ఇసుక సుడిగాలికి స్తంభములు స్తంభములుగా లేస్తూ ఉంటుంది.

సుమంతుడు—ఒక ఇసుక స్తంభములోనుంచి ఆ 'మహాయోగి' మీకు దర్శనమిచ్చినాడు.

జాబాలి—అవును.

సుమంతుడు—మంచిదే! రెండు! సంప్రదాయకులగోత్రాలు లేని అనామకభయంకరయోగి,...మరుభూమిలో సమాగమము!...ఆ పైన?

జాబాలి—జలాశయమునకు దారిచూపమని నేనా యోగిని వేడినాను.

సుమంతుడు—ఆ పైన, ఆ పైన?

జాబాలి—ఆ మహాయోగి పకపకమని వికృతంగా నవ్వి 'ఈ మరుప్రదేశములో జలమేమి'టన్నాడు. 'అయితే మేము జీవించే ఉపాయ మేమి'టన్నాను....అబ్బా, ఎంత బరువు!

సుమంతుడు—మంచిది. అంత బరువుగా ఉంటే కిందపెట్టు!

జాబాలి—అమ్మో, నేలమీదనే ?...నా మాట లకు ఆ మహాయోగి చెవులొగ్గి వినమన్నాడు.

సుమంతుడు—ఏమిటి ?

జాబాలి—విను, మరి! మేము ఆలకించగా, ఎక్కడో జలజలమని ప్రవహించే నీటిధ్వని వినపడ్డది. 'అది ఎక్కడ ఉన్న'దని అడిగినాను. ఆ మహాయోగి భూమి చూపినాడు. 'భూగర్భములోనుంచి అది రావడ మెట్లా'గన్నాను. ఆ మహాయోగి మళ్లీ వికృతంగా అట్టహాసం చేసినాడు. నాకు ఒళ్లు జల్లుమన్నది, చెప్ప వద్దూ.

సుమంతుడు—బాగున్నది.

జాబాలి—నేను బ్రతిమాలగా, బ్రతిమాలగా ఆ మహాయోగి ఈ పేటికలోని మహాయుధము సంధించి ప్రయోగించి భూగర్భము భేదించినాడు. వెంటనే జల ప్రవాహ మొకటి పైకి ఉబికింది. మేము దాహము తాగి సేదదీర్చుకున్నాము.

సుమంతుడు—అంతట నీవు ఆయుష్మంతుని ప్రోద్బలముచేసి అతనిచేత ఆ ఆయుధము అర్థింపజేసి నావు.

జాబాలి—కాదు! యువరాజే ఆ మహాయోగికి తన నామము చెప్పి పాదాభివందనము చేసి అది ప్రసా దించమని ప్రార్థించినాడు. ఆ మహాయోగి ప్రసన్నుడై అంగీకరించినాడు, గాని ఒక క్లిష్టనియమము పెట్టి నాడు.

సుమంతుడు—ఏమిటది ? దాచక చెప్పు!

జాబాలి—ఏమున్నది ? ఆ మహాయోగి యువ రాజును శిఖాబంధము తొలిగించి, ఉపవీతము నివీతిగా చేసుకొని అందుకోమన్నాడు. యువరాజు నా వైపు చూచినాడు.

సుమంతుడు—'యువరాజు' వయస్యుడవైన నీవు 'యువరాజును' అందుకు ఒడబరిచినావు.

జాబాలి—ఆ స్థితిలో నీవుమాత్ర మేమని పలహా ఇచ్చేవాడివి ? వీరుడైన క్షత్రియుడు శత్రుక్షయము చేసే సాధనాలు సంపాదించడము విధికాదా ?

సుమంతుడు—జాబాలీ, నీవింకా గురుశుశ్రూష చేయవలసిఉన్నది. నేనుంటే ఎప్పటికీ ఆయుష్మంతుని అందుకు ఒప్పుకోమని ఉపదేశించిఉండను.

జాబాలి—చిత్రముగా ఉన్నదే! యువరాజు ఊర్జస్వీకావడము నీకు సమ్మతము కాదా ?

సుమంతుడు—నేను ఆయుష్మంతుని క్షేమము అర్థించేవాడ నని నీకూ తెలుసుగా!

జాబాలి—అందులో నా కేమాత్రమూ సందే హము లేదుగాని నీయుత్తరము నీతోజు చిత్రముగా ఉన్నవి.

సుమంతుడు — ఈ ఆయుధప్రయోగముకూడా శిఖాయజ్ఞోపవీతహీనముగా నేగా!

జాబాలి—అవును...ఏమి బరువు!

సుమంతుడు—నీ వాశిఖాయజ్ఞోపవీతాలు తొలి గిస్తే ఆబరువు పోతుంది. అది స్పష్టముగా అసురాయు ధము, జాబాలీ!

జాబాలి—వేటలో మృగములను, యుద్ధములో పరసైన్యములను చీల్చిచెండాడే ఆయుధాలన్నీ నీ పీ రథముపైన అమర్చలేదా ? అవి అన్నిమాత్రము, ఐతే, అసురసాధనములు కావా ?

సుమంతుడు—(తీక్ష్ణముగా) కావు! జాబాలీ, కోపించవద్దు. నీవు యుద్ధ స్వరూపమూ, అస్త్రశస్త్ర స్వరూపమూ పెద్దలవద్ద అభ్యసించవలసిఉన్నది!

జాబాలి—కావచ్చు! నీ వన్నట్లు ఆ పరమ గోప్యములు గురువులు నాకు అనుగ్రహించేదాకా, నాకు మారణాయుధాలలో దైవమనీ, అసురమనీ భేదము తెలియదు. అది నా లోపముకాదు; చెప్పని గురువులది.

సుమంతుడు—కనపడని వస్తువులనుకూడా ఈ శబ్దవేధి భేదిస్తుంటికాదా ?

జాబాలి—అవును, సుమంతా! అదే దీని మహాప్రభావము! ఇది ముఖ్యంగా వేటలో ఎంత ఉప యోగకారి! చిన్నిపొదల్లు, క్రూరమృగాలు ఏ చెట్ల మాటునో, గుట్టలమాటునో దాగిఉండి, వాని అలికిడి వినపడుతున్నా, కానుపరోగానికి లక్ష్యములు

కాకుండా తప్పించుకున్నది! అట్లాంటి సమయాలలో ఇది ఎంత ఉపయోగమో ఆలోచించు!

సుమంతుడు—దాగియున్న శత్రువును చంపడమే అధర్మముగదా, దృష్టిగోచరముకాని మృగమును చంపవచ్చునా?

జాబాలి—చంపడమే ప్రయోజనమైన వేటలోనూ, యుద్ధములోనూ ధర్మమేమిటో నా కర్థము కాదు, సుమంతా!

సుమంతుడు—నీకింకా ప్రశ్నము తప్పదా! సూక్ష్మమైన ధర్మవిచారణ వదలి లౌకికయుక్తి ఆలోచిద్దాము! అరణ్యంలో వేటాడుతూ ఆయుష్మంతుడు మృగశబ్దమనుకొని మునీశ్వరుణ్ణి ఈ శబ్దవేధితో కొట్టినాడనుకుందాము! అప్పుడు ఏమవుతుంది? మనుష్యుల అలికిడి మృగశబ్దమని ఎన్నిసార్లు భ్రమించలేదు!

జాబాలి—(నివ్వెరపోయి, క్షణ మాగి) అవును కాని అట్టి ప్రమాదము కర్తను బాధిస్తుందా?

సుమంతుడు—అట్టి భ్రమప్రమాదాలకు అవకాశమిచ్చేది ఈ శబ్దవేధి! అటువంటి సాధనము పూనడమే దోషము! ఇది మనుష్యులకి అసురసాధనము. ఇది పవిత్రగాత్రులైన రాఘవులు ధరించదగిన ఆయుధము కాదు, జాబాలీ!

జాబాలి—సుమంతూ, నీ కేవలధర్మబుద్ధి నాకు నచ్చదు. మనశత్రువుల చేతులకే ఇటువంటి ఆయుధము చిక్కితే మన మేమి కావలెనో!

సుమంతుడు—నిశ్చయముగా ధర్మము నమ్మినవారిని ధర్మమే రక్షిస్తుంది. అధర్మంగా జీవించేకంటె ధర్మంతో నిధనమైనా నయమే: పరలోకమైనా వస్తుంది.

జాబాలి—పురుషకారము లేని ఈ బూజుపట్టిన వచనాలు కట్టిపెట్టి, ఈ శబ్దవేధిని రథముమీద పదిలము చేతూ!

సుమంతుడు—(కఠినంగా) వల్ల కాదు!

జాబాలి—(కోపములో) నీ రథికుని ఆజ్ఞ ఉల్లంఘిస్తావా?

సుమంతుడు—నా రథికునికి నేను సారథిని.

జాబాలి—యువరాజాజ్ఞ నీవు ధిక్కరించడానికి సాహసిస్తావా?

సుమంతుడు—నేను మహారాజసేవకుణ్ణి!

జాబాలి—అయితే, దీన్ని ఏమిచేయమంటావు?

సుమంతుడు—ఆ ఎడారియోగినడుగు! దిగ్బంధముతో రక్షితమై పవిత్రమైన ఈ రఘుకుమారుని రథములో శివారుశాలు శబ్దిస్తున్నదానికి చోటు లేదు.

(జాబాలి వచ్చినవైపునుంచి తొందరగా దశరథుడు ప్రవేశించి)

దశరథుడు—సుమంతూ, రథము సమగ్రముగా ఉన్నదా?

సుమంతు—చిత్తము, ఆయుష్మన్! అధిరోహించవచ్చును.

దశరథుడు—(రథముకు నమస్కరించి అధిరోహించి చూచుకొని—) శబ్దవేధి ఎక్కడ పదిలపరిచినావు, జాబాలీ?...ఇంకా నీచేతిలోనే ఉన్నదే! త్వరగా ఇటు తీసుకురా!

జాబాలి—(పొంగి సుమంతునివైపు క్రీగంటి ప్రసారము చేస్తూ నొగలెక్కి అందీయబోతూ ఉంటాడు.) అయ్యో! (వెనక్కు తగ్గుతాడు.)

దశరథుడు—రావేమి! అట్లా వెనక్కు తగ్గుతావేమి?

జాబాలి—వస్నెవరో కఠినంగా వెనక్కు తోసినట్లయింది.

దశరథుడు—ఇక్కడ నిన్ను తోసేవా రెవరున్నారు? భ్రాంతి పడుతున్నావు.

జాబాలి—కాదు, ప్రభూ! నిజము. నాకక్కడ ఏదో అడ్డుపడుతున్నది. ఐనా...(మళ్లీ ప్రయత్నిస్తాడు, మళ్లీ వెనక్కు పోతాడు)

అబ్బా! నాచేతికి వజ్రపుదెబ్బ తగిలినట్లు బాహువులు చచ్చుకొని పోతున్నవి.

దశరథుడు—ఏమి టీసంభ్రమము, జాబాలీ! అయితే ఆలస్యము చేయక అది నీరథముమీదనే పదిలపరచి తీసుకురా! జాగ్రత్త!

వాతాలి—చిత్తము.

[తెరలో పాట]

అశ్వికుడు—బడబా, తొందరపడకే నీచక్కం
దిత మెరుకే, బడబా!

అశ్వము—హే, హే, టకటక్
టకటక్, హే, హే!

అశ్వికుడు—నీ ధారితకం నీ రేచితకం
తెరుకే వల్గితముస్

అశ్వము—హే, హే! టకటక్
టకటక్, హే, హే!

అశ్వికుడు—బడబా, తొందరపడకే నీఫం
ప్లుత మెరుకే, బడబా!

అశ్వము—హే, హే! టకటక్
టకటక్, హే, హే!

దశరథుడు—అందరూ సిద్ధమై ప్రయాణానికి తొందరపడుతున్నారే. వేట ఎంతవ్యసనము సుమంతూ! ...పూజ్యులైన మాతృదేవులూ, పూజ్యపాదులైన పితృదేవులూ ఇచ్చే ఆశీర్వాక్కులు వింటూంటేనే ఆలస్యమైనట్లు అనిపించింది.

సుమంతుడు—క్రూరమృగాల ధాటినుంచి ప్రజాబాధ తొలగించడానికి మనము పోయే ఈవేట వ్యసనమంటారేమి, ఆయుష్మన్!

దశరథుడు—కాదుకాని ఈరోజున నా కీఆవేగము, ఈ తమకము కేవలము మృగయోత్కంఠ కాదు!

(ఉత్సాహముతో దశరథుడు శంఖము పూరిస్తాడు. వెంటనే తెరలో ఒక్క పెట్టున కదలుతున్న రుక్కల ఘాంకారమూ..., అశ్వహేషలూ, రథనేమి స్వనమూ, వేటకాళ్ల పొలికేకలూ ఆకాశమంటుతవి.)

రెండవ రంగము

[ఆశ్రమోపాంతములో సరయూనదిలో నీలాటి రేవు. ఉషాదేవి, నిశాదేవి బిందెలూ, ఉతకవలసిన వస్త్రములూ తెచ్చి సంభాషిస్తారు. నిశాదేవి చేస్తున్నపని మాటలవల్ల సాగదు.]

నిశాదేవి—ఇవ్వాళ ఎంత చక్కగా సంతడిగా ఉన్నదే వనమంతా, ఉషా!

ఉషాదేవి—ప్రశాంతంగా ఉండే మన ఆశ్రమపదాలకు ఈ నా డేమో గోలగా ఉన్నదే!

నిశాదేవి—ఎప్పుడూ రాత్రింబవళ్లూ వేదపాఠక్రమాలూ శాస్త్రప్రసంగధ్వనులేతప్ప ఎరగని మనబోటివారికి ఈ క్రొత్తశబ్దములు ఉత్కంఠ కలిగించవుటే!

ఉషాదేవి—నా కెందుకు నాకు ఇవి విన బుద్ధే పుట్టదు.

నిశాదేవి—చక్కని అలంకారాలతో కళకళలాడే ఆ సుత్రాలు చూడడానికి ఎంత ముచ్చటగా ఉన్నవే!

ఉషాదేవి—అవును, దానికేం! అశ్వజాతిలో ఆ విరాట్పురుషుని కళ సువ్యక్తంగా ఉంటుంది!

నిశాదేవి—యువరాజు ఎక్కివచ్చిన ఆ రథము దూరాన మెరుపువలె మెరుస్తూ ఇందాక కనిపించింది. ఆ రథనేమిస్వనము ఏమి శ్రావ్యముగా వినిపించింది!

ఉషాదేవి—రథము త్రిలోకపూజ్యమైనది.

నిశాదేవి—యువరాజు విడిసింది మన ఆశ్రమానికి దూరమనుకున్నావా?

ఉషాదేవి—మరి ఎక్కడ?

నిశాదేవి—ఎక్కడోనా? మనకు పశ్చిమంగా దట్టమైన అడవిగా ఉండేదే, ఆ ప్రదేశ మప్పుడే చిన్న పట్టణంగా మారిపోయిందటే.

ఉషాదేవి—ఏమి? పట్టణంగానా?...ఎప్పుడు?

నిశాదేవి—ఎప్పుడేమిటి! నిన్న సాయంత్రానికి ఏమీ లేదు. ఇవ్వాళ మధ్యాహ్నానికి అక్కడ పట్టణం వెలిసింది.

ఉషాదేవి—ఎట్లాగో?

నిశాదేవి—రాజసేవకులు ఎవరో అర్ధరాత్రికే కరదీపికలతో వచ్చి భూమి పరీక్షచేసి పోయినారుట. రాత్రి అక్కడ వెలుతురుగా ఉంటే కార్చిచ్చేమో అనుకుంటినే!

ఉషాదేవి—ఓహో!

నిశాదేవి—తెల్లవారకముందే వృక్షతక్షకులు ఎందరో వచ్చి చెట్లు కొట్టి పొదలు తీసి సమప్రదేశము చేసినారు. తెల్లవారుతున్న సమయంలో సూత్రకారులు వచ్చి కొలతలు వేసి గుర్తులు పెట్టి పోయినారు. ఆ పైన ఖనకులు, యంత్రకులు, స్థపతులు, వర్ధకులు, కర్మాంతికులు—వీరిపైన సమర్థులైన ద్రష్టలు మధ్యాహ్నమయ్యేప్పటికి పటకుటీరాలతో చిన్న పట్టణం సిద్ధము చేశారుట.

ఉషాదేవి—ఇదుగో నే, యజ్ఞంలో చూడు, ఋత్విక్కులు, హోతృగణము, అధ్వర్యులూ, ఉద్గాతృగణము, ఉపద్రష్టా అంతా ఎవరిపని వారు సక్రమంగా చేసుకుపోతుంటారే, అట్లానే కాబోలు నే ఈ రాజసేవకులు కూడాను!

నిశాదేవి—మరికాదూ! ఇంకా విన్నావూ, అందులో చక్కని బావులూ, స్నానముచేసేందుకు వాపులు—ఈ సరయూనదిలోనుంచి ఆ పట్టణంమధ్యగా తీసిన కాలవలూ, ఏమైనా చిత్రంగా ఉన్నదనే! యువరాజు వచ్చేప్పటికల్లా అయోధ్యనుంచి అక్కడికి సమంగా రథచారయోగ్యమైన మార్గము సిద్ధమయింది. ఎంతో బాగున్నదనే.

ఉషాదేవి—నీ కెట్లా తెలిసిందీ?

నిశాదేవి—నీవు చెవిటిదానివలె నీ పనే తప్ప ఇంకొకటి వినిపించుకోవాయె! పొద్దుటినుంచీ ఇవ్వాళ మన ఆశ్రమంలో పిల్లలు చూచివస్తూ ఎప్పటికప్పుడు ఒక కొత్తవింత చెప్పుతున్నారు. వాళ్ల మాటలు వింటూ ఇవ్వాళ ఇంట్లో పని అంతా హెచ్చుతగ్గులు చేశా నమ్మా!

ఉషాదేవి—మా ఇంట్లో పరమశాంతులుగనక సరిపోయింది! మా ఇంట్లోనైతేనా?

నిశాదేవి—మనం తప్పక పోయిచూచిరావలెనే!

ఉషాదేవి—నాకు తీరిక ఎక్కడిదే!

నిశాదేవి—మళ్లీ మన కెప్పుడింత విశేషము చూడడము లభ్యమవుతుందే! మళ్లీ ఎన్నాళ్లో ఉంటారుట. రేపు మధ్యాహ్నమైనా వెళ్లుదామా?

ఉషాదేవి — సరేకాని, మరి ఎందుకో ఈ ఆగాదిడి!

నిశాదేవి—యువరాజు వేటకు వచ్చినాడుట. ఎన్నిరకాల కుక్కలనే! పక్షి వేటగాళ్లు ఉరులుతీసుకొని చిత్రచిత్రపు డేగలు తీసుకువచ్చినారుట. మృగాలు వేటాడేవాళ్లు పెద్దపెద్ద వలలూ, ఉచ్చులూ, ఏవో కొత్తకొత్త ఆయుధాలూ తీసుకువచ్చారుట. ఆ యువరాజు కవచముట — రంగులతో చెట్లూ, ఆకులూ చిత్రించి ఉంటే—చెట్లమధ్య యువరాజుకూడా ఒక చెట్లలానే కనపడతాడనే! మనము చూచిరావలసిందేనే!

ఉషాదేవి — సరేకాని, ఎందుకోనమ్మా, ఈ రాజపుత్రులు వేటలాడుతారు!...చీమవంటిది కాలికింద పడి చస్తే కష్టంగా ఉంటుందిగదా, మనబోటివాళ్లకు!

నిశాదేవి—అదేమిటి! వేట క్షత్రియధర్మము క్రూరమృగాలు ఆటవికజనాన్ని తింటూంటే రాజులు రక్షించవద్దూ!

ఉషాదేవి—మన మిట్లా వనమధ్యంలో ఉంటాముగదా, మన నీ సింహశార్దూలాలు ఏమిచేస్తున్నవి? మన ఆశ్రమంలో ఒక్కరినైనా తిన్నవా?

నిశాదేవి—మనము ఉపవాసవ్రతాలతో చిక్కి ఉంటాము గనక రక్తమాంసాలు లేవని మన శరీరాలు రుచిలేక వదిలిపెట్టుతవికాని పులులకూ, సింహాలకూ మనమీద జాలి ఆ, పక్షపాతమా! నా మీద, ఆ మధ్య, పులి పడబోలా?

ఉషాదేవి—అట్లా కాదే. త్రికరణశుద్ధిగా వాటికి అపాయము తలపెట్టనివారిని అవి ఏమీ చేయవు. ఎన్నిసార్లు, ఈ రేవులో అవతల పులి నీళ్లు తాగుతూ ఉంటే నా దారిన నా పని చేసుకొని నీళ్లు తీసుకుపోయినాను! నన్నేం చేసినవి! వాటికీ తెలుసు!... ఇంకా శాంతిలు ఉతకడమే కాలేదేం?...త్వరగా కానీ!

నిశాదేవి—నీ మాటలు మరీ చిత్రమమ్మా!

ఉషాదేవి—పోనీ గాని ఒకమాట చెప్పు! ఈ పులులూ, సింహాలూ తమకు ఆకలివేస్తేనేగదా, తమకు సహజమైన ఆహారాన్ని చంపుకుతినేది!...ఊరికే వినోదానికి అదిమాత్రము జంతువులను చంపుతవా?

నిశాదేవి—నిజమే!

ఉషాదేవి—అయితే, ఈ రాజపుత్రులకుకూడా ఆకలివేసేనా, ఈ వేటలాడడము! వాళ్ల పొట్ట కేమైనా, ఆ పులికడుపులకంటేనూ ఆ తోడేళ్లకడుపుల కంటేనూ, ఏమన్నా పెద్దవా?

నిశాదేవి—నీ వంతా తల్లకిందులుగా మాట్లాడితే ఏమి జవాబు చెప్పగలను? కాని వేటే పనికిరాదంటావా?

ఉషాదేవి—నేనేమి ధర్మశాస్త్రవేత్తనుటే? నా బుద్ధికి తోచింది అన్నాను, అమాయికపుదాన్ని! నీకల్లే మా నాన్న నాకు చదువు చెప్పలేదు. ఈ వేటాడే రాజపుత్రులు నిజంగా, క్రూరమృగాలకంటే క్రూరస్వభావం కలవాళ్లుగా కనపడతారు, నా అల్ప బుద్ధికి!

నిశాదేవి—(వెకిలినవ్వుతో) పులులూ, సింహాలూ తోడేళ్లూ, ఎలుగులూ—వీటికంటే ఈ రాజపుత్రులు క్రూరులంటావూ! ఎంత బాగున్నదే నీవు చెప్పేది! రాజపుత్రులకు వేట యజ్ఞమే! అది అధర్మమవుతుందా?

ఉషాదేవి—నేనట్లా అన్నానా? నాకు తోచింది అనేశానుకాని!...పోనీ క్రూరసత్వాలు వదిలెయ్యి!—పాపము, చెంపకు చేరెడు కళ్లతో బెదిరి బెదిరి చూస్తూ గంతులు వేసే ఆ కృష్ణసారాలను వాళ్లు వేటాడడ మెందుకే? అవి ఎవరి నేమిచేస్తవి! అడవిలో ఎవరికీ ఏమీ అపాయము చేయకుండా పచ్చిక మేసి ఏటినీరు తాగి చెట్లనీడల విశ్రమిస్తవిగదా! వాటిని బాణాలతో వీళ్లు కొట్టుతారని తలుచుకుంటేనే నా కడుపు తరుక్కుపోతుంది. మా పెంపుడు లేడికి కాస్త బాధగా ఉంటే నాకు పనే తోచదు!...సరే గాని ఎప్పటికి పూర్తిఅవుతుంది నీ పని! (నిశాదేవి వస్త్రాలుకూడా తానే ఉతుక మొదలుపెట్టుతుంది)

నిశాదేవి — ఇంత అమాయకురాలవేమమ్మా? వేట రాజులకు అవసరమనే తెలియదే నీకు? చల లక్ష్యాలు కొట్టడము సాధనచేసేది మరెట్లా? అలుపు లేకుండా చిరకాలము వ్యాయామ మలవాటులేకపోతే శత్రువులతో యుద్ధము చేయడ మెట్లా? దేహము ఎప్పుడూ ఇంట్లో కూర్చుంటే లావెక్కిపోతే చురుకుదనము ఉండవద్దూ! మా నాన్న నాకు చెప్పేవాడు!

ఉషాదేవి—కాబోలునమ్మా,! మరి!

నిశాదేవి — రాజపుత్రులైనవారికి అంతమాత్రమైనా వినోదము లేకపోతే ఎట్లా? తపస్సు చేసుకునే మనబోటివాళ్లల్లే ఒక్క వేడుకా లేకుండా అందరూ ఉంటే ఈ లోకయాత్ర నడుస్తుందా! మరి, యువరాజు విడిసిన ప్రదేశము ఎప్పుడు చూచివద్దాము?

ఉషాదేవి—ఏమున్నదే అక్కడ చూచేందుకు? ఆ కుక్కలూ, డేగలూ, ఉడుములూ, ముంగులూ, వలలూ, ఉరులూ, జిగురులూ, కత్తులూ, కఠార్లూ, డోళ్లూ, మద్దెళ్లూ, తప్పెటలూ—ఏమున్నదే చూచేందుకు! మనము ఎరగనిది ఏమున్నదమ్మా?

నిశాదేవి—నే నెన్నడూ చూడలేదే!

[పశ్చిమపు దిక్కునుండి ముమ్మారు ఘంటానాదము వినబడుతుంది.]

విను! ఆమూడుజాముల గంట ఎంత శ్రావ్యంగా ఉన్నదో! వెంటనే శుభమైన వాద్య మేదో ఎంత చెవులపండువుగా వినిపిస్తున్నదో విను!

[పశ్చిమపు దిక్కునుండి పాట.]

త్రయీస్వరూపుడు
త్రివిక్రమాకృతి
పదత్రయం బిడె జగత్త్రయిన్!

ఉషాదేవి—అవును, ఎవరో నృత్యముకూడా త్రిపదానికి అనుకూలంగా చేస్తున్నట్లున్నారు. ఆ పదలయ విను, అవును.

నిశాదేవి—రాజులదే లోకయాత్ర అంటే!... ఈ ఎర్రటి కాంతి దిక్కులంతా వ్యాపించి ఎంత కన్నుల పండువుగా ఉన్నదమ్మా, చూడు! ఏమైనా బాణసంచా కాల్చినా కల్లే ఉన్నది.

ఉషాదేవి—(పరికించి చూచి) కన్నులపండు వేమిటే! ఈ రక్తకాంతి బహు భయంకరంగా ఉన్నదే! ఈ అకాలసంధ్య దుర్నిమిత్తము. ఏదో పెద్ద ఆపత్తు రానున్నది!

నిశాదేవి—నిజంగానా?

ఉషాదేవి—సందేహ మెందుకే? విను, దూరాన కఠోరంగా మృగశబ్దాలు అరణ్యభూమి అంతా ప్రతిధ్వనిస్తున్నవి! ఆ నక్కల గోల విను!

నిశాదేవి—యువరాజు వేటాడే మృగాల అరుపులు గావుటే అవి?

ఉషాదేవి—కావు. అది భయపడి పారిపోయే మృగాల ధ్వని కాదే! ఇది మహోత్పాతమే! చిన్నదానివి నీకేమి తెలుసు!

నిశాదేవి—అదుగో, శాకునికుడు ఏదో పాడుకుంటూ అట్లా పోతున్నాడు, పిలిచేదీ?

ఉషాదేవి—ప్రత్యక్షమైనాడూ? వాడు ఎక్కడ కనబడితే అక్కడ సమీపములో ప్రమాదముండవలసిందే. పాపము, వాడి కర్మ!

నిశాదేవి—(బిగ్గరగా) శాకునికా! శాకునికా! శాకునికా!...పిలిచి లాభము లేదు. యువరాజు స్కంధావారానికి వెళ్లుతున్నట్లున్నాడు.

ఉషాదేవి—పాపము, వాడట్లా స్తబ్ధవల్లె ఉంటాడేకాని పశుపక్ష్యాదుల భావలన్నీ వచ్చునతనికి!

నిశాదేవి—వాడు పాడే పాట విను!

[ఇద్దరూ ఆలకిస్తారు. తెరలో శాకునికుని పాట]

అరణ్యభూముల నకాలసంధ్యా
పరాగరక్తము ప్రవహించెన్!
ప్రళయము సింహా, ప్రళయము వ్యాఘ్రా,
ప్రళయము గజకిరి భల్లూకా!
శబ్దవేధి యను సైంధవమరుభూ
శస్త్రము దాల్చె రఘూద్భవుడు!
గరుడ గృధ్ర బక కంక ఉలూకా
కాక కోక శుక కలరవ ప్రళయం!

ఉషాదేవి—అయ్యో! అయ్యో!...

నిశాదేవి—ఏమిటే?...మన యువరాజు ఎంత శక్తిసంపన్నుడే!

ఉషాదేవి—పాపము! మన యువరాజుకు ఇటువంటి ఆసురాయుధముమీదికి బుద్ధి పోయిందేమే? శబ్దవేధి ఏమిటే?

నిశాదేవి—నీకేమైనా మతిపోయిందా, ఉషా? శబ్దవేధి వశ్యమైతే శత్రువును ఎక్కడ ఉన్నా క్షణమాత్రంలో నిర్మూలించగలడు.

ఉషాదేవి—మతిపోయింది నాకా నీకా? ఆయుధాలంటే నీలాగా చాలా తెలియకుండా ఊరికే కనపడ్డదీ వినపడ్డదీ చంపడమేనటే! పాపము, యువరాజుకు పసితనమువల్ల తెలియకపోయిందికాని, అజమహారాజుకూ, ఇందుమతీదేవికీ తెలిస్తే, ఇటువంటి ఆయుధము చేతబట్టనిస్తారా? మనము కులపతికైనా చెప్పి యువరాజుకు ఈ శస్త్రము ఉపసంహరించమని కబురుచేయించవలె!...అట్లా, చూస్తావేం? బిందె బుజాన పెట్టు, త్వరగా!

నిశాదేవి—ఏమిటమ్మా! ఏమిటమ్మా!

ఉషాదేవి—పాపము, యువరాజుకు ప్రమాదము వస్తే మనకందరికీ ప్రమాదము వచ్చినట్లు కాదూ? ముమ్మాటికీ ఇది యువరాజుకు క్షేమము కాదే! త్వరగా వెళ్లుదాము రా! విన్నావా? అదుగో! విన్నావా?

(నిశాదేవి ఏమీ అర్థంకాక త్వరగా బిందె, శాటీలు తీసుకొని ఉషాదేవిని అనుగమిస్తుంది. తెరలో శాకునికుని పాట వారు నిష్క్రమించిన తర్వాత కూడా వినవస్తుంది.)

[తెరలో శాకునికుని పాట]

గవయాశల్యాఖడ్గలులాయా
కపిమృగవృకశశప్రళయమురా!
ప్రళయము చమరా, ప్రళయము కేకీ
ప్రళయము ఖగమృగకులములకున్!

మూడవ రంగము

[సంధ్యాకాలము అతిక్రమించుచున్న సమయము. యువరాజు స్కంధావారములో యువరాజు పటకుటీర సమీపములో రథముదగ్గరగా సుమంత్రుడు అప్పుడే సంధ్యాకృత్యము నిర్వర్తించి సుఖాసనముమీద కూర్చునిఉంటాడు. సుమంత్రుని ఎదుటికి ఇద్దరు రాజభటులు బలవంతాన శాకునికుణ్ణి ప్రవేశపెట్టుతారు.]

సుమంత్రుడు—ఇతనెవరు?

౧-వ భటుడు—ఎవరో తెలియదు, ప్రభూ!

సుమంత్రుడు—ఇక్కడికి ఎందుకు తెచ్చినారిపిచ్చివాణ్ణి?

౧-వ భటుడు—ఇతను పిచ్చివాడు మాత్రం కాదు, ప్రభూ!

సుమంతుడు—ఎందువల్ల?

౧-వ భటుడు—ఇతని చర్య అంతా అనుమానాస్పదంగా ఉన్నది. యువరాజు వచ్చినప్పటినుంచీ మన స్కంధావారంచుట్టూ కాచుకుంటున్నాడు. పొమ్మనమంటే పోడు.

సుమంతుడు—అడవికుర్రవాడు, పాపము, చూడడానికి వచ్చినాడేమో! అంతా చూడనీయక పోయినారా?

౧-వ భటుడు—ప్రభూ! ఎంతమంది మునిబాలకులు, ఆటవిక బాలకులూ వచ్చి నిర్భయంగా అంతటా తిరిగిపోయినారు? ఈ కుర్రవాడు వాళ్లవలె కాదు, ప్రభూ!

సుమంతుడు—మరి?

౧-వ భటుడు—ఈ కుర్రవాడు ఎప్పుడూ యువరాజుపటకుటీరమువద్దకే ఎంత వద్దన్నా పోబోతాడు. ఇంకొకటి చూడమన్నా చూడడు.

సుమంతుడు—పలకరించలా?

౧-వ భటుడు—పలకరిస్తే మాట్లాడడు, సరిగా.

సుమంతుడు—పాపము, మూగవాడేమో! వాణ్ణి బాధించకండి!

౨-వ భటుడు—మూగవాడు పాటలు పాడతాడా, ప్రభూ?

౧-వ భటుడు—నాకు చూడగా ఇతడెవరో గూఢచారిగా కనపడుతున్నాడు.

౩-వ భటుడు—పాటలే కాదు. అతను అరిచే అరుపులు, ప్రభూ, మరీ చిత్రము.

సుమంతుడు—అంటే?

౨-వ భటుడు—చూడు ప్రభూ!...(శాకునికుణ్ణి పలకరిస్తూ, బిగ్గరగా) ఇదుగో! సింహము అరిచే అరుపు అరూ!

(శాకునికుడు సింహగర్జన చేస్తే స్కంధావారము దద్దరిల్లుతుంది. ౧-వ భటుడు ఉలిక్కిపడితే శాకునికుడు బిగ్గరగా నవ్వి మళ్లీ గర్జిస్తాడు.)

౨-వ భటుడు—అడవిపంది ఎట్లా మీదికివస్తుంది?

(శాకునికుడు ౧-వ భటుని వీపు తట్టుతూ భయంకరమైన వరాహఘుర్ఘురధ్వని అనుకరిస్తాడు.)

౨-వ భటుడు—గరుడుని కూత ఏదీ?

(శాకునికుడు కృష్ణారావము చేస్తాడు.)

౨-వ భటుడు—కపోతకూజిత మేదీ?

(అనేకమైన పావురము లుండి, చేసిన ధ్వని శాకునికుడు అనుకరిస్తాడు.)

౩-వ భటుడు—మగగుర్రము ఎట్లా సకిలిస్తుంది?

(మదించిన గుర్రమువలె శాకునికుడు సకిలిస్తే రథమున కట్టిన ఆడుగుర్రాలు ఎదురుసకిలిస్తవి.)

సుమంతుడు—వీడు సమర్థుడే!

౧-వ భటుడు— అందువల్లనే నా కనుమానం కలిగి తమవద్దకు తెచ్చాను, ప్రభూ!

సుమంతుడు—పాపము, తన విద్య చూపడానికి వచ్చాడుకాబోలు! ఏదన్నా పారితోషికమిచ్చి పంపక పోయినారా, బీదవాడు,...ఇది అతని కిచ్చి పంపండి! (అని సువర్ణమొకటి ౧-వ భటుని చేతి కిస్తాడు.)

(౧-వ భటుడు ఇయ్యబోతే శాకునికుడు తీసుకోక నవ్వుతూ యువరాజుపటకుటీరమువైపు పోబోతాడు. అతనికి కఠినముగా అడ్డమువచ్చి—)

౧-వ భటుడు—చూచారా, ప్రభూ! ఎంతసేపటికీ ఆ పటకుటీరమువైపే వెళ్లబోతాడు.

౨-వ భటుడు—ఇంకా ఎవరేమిచ్చినా పుచ్చుకోడు, ప్రభూ! అడిగితే ఏవో పాటలు పాడతాడు గాని జవాబు చెప్పడు!

౧-వ భటుడు—అదికూడా అర్థంలేని పాటలు, ప్రభూ!

సుమంతుడు—నీ వెవరురా?

శాకునికుడు—

నేనా?

— ఊర్జిత నిర్భయ గర్జాస్ఫూర్తిని
గిరివనభూముల పరిభ్రమించే
మృగరాట్!
నేనా? ఆ,
పతంగబింబము పరిభవించుచు
వియన్నిరంతర విహారచణుడో

ఖగరాట్ !

సుమంతుడు—నీ వేమి చేస్తావు ?

శాకునికుడు—చేసా ?

శాద్వలభూముల చంగున దాటే
మృగగణములకును మృత్యువు నాదును
వృకమై !
చేసా ?
ప్రియురతికూజిత విభ్రమకరులౌ
కపోతదంపతికాలుడ నాదును
డేగై !

౨-వ భటుడు—ఇతడు పశువో, పక్షో తెలియడం లేదు ప్రభూ !

సుమంతుడు—(చిరునవ్వుతో) నీ పేరేమిరా ?

శాకునికుడు—

శార్దూలము నే ప్రథమ జన్మమున
కురంగబీజము ద్వితీయజన్మము
నిశాటనము నా తృతీయరూపము
కలరవరూపున తురీయజనిలో !

౧-వ భటుడు—ప్రభూ ! ఎన్నిసార్లు అడిగినా ఈపాటే పాడతాడు. పేరు చెప్పడు.

౨-వ భటుడు—మూరాన ఏమృగధ్వని వినబడితే ఇతే నట్లా కనబడతాడు.

సుమంతుడు— (చిరునవ్వుతో) శాకునిక ! నీ కెన్ని భాషలు వచ్చును ?

శాకునికుడు—

మేదిని తిరిగెడి మృగము లవెన్నో
వియత్పథంబున విహగము లెన్నో !

సుమంతుడు—మంచిది ! యువరాజు బాణపాతముకు పడిపోయే ఆ సింహగర్జన విన్నావా ? ఆ సింహ మేమంటుంది ?

(శాకునికుడు రౌద్రముగా ఏడుస్తాడు)

ఏమిటది ?

శాకునికుడు—

అయ్యో, ఎవ డీఅరణ్యరాజ్యము
నాక్రమించు నిటు లన్యాయంబుగ
అతనికి శర్మం బసాధ్యమయ్యో !

సుమంతుడు—మరి, ఆ పులిఏడుపు ఏమిటి ?

శాకునికుడు—

దొంగవేటుగా దుష్కర్ముడై
దురాత్ము డెవడో దూరె నరణ్యము !

సుమంతుడు—మంచిది ! (భటులతో) మీరు అవతల ఉండండి !

(భటు లిద్దరూ నిష్క్రమిస్తారు.)

ఆ ఖడ్గమృగ మేమంటుంది ?

శాకునికుడు—

ఎదటబడని ఈ ఎరుకువా డెవడు
ఎక్కడ నున్నా డెటు ప్రహరించెను ?

సుమంతుడు — ఆ వరాహము భయంకరంగా ఘుర్ఘురధ్వని చేస్తున్నది, ఏమని ?

శాకునికుడు—

ఖరఖుర గురుదుర్ధర ఝర్ఝరమై
శరావధురధరశరీర మలరెడి !

సుమంతుడు—ఆమృగాల అలజడి ఏమిటి ?

శాకునికుడు—

అయ్యో ! ఏమిది అశ్రుతపూర్వము !
ఎంత వక్రగతు లీబాణాగ్నులు !
చీమ చిటుక్కన చీల్చి వేసెడిని !

సుమంతుడు—ఆ పక్షుల కలకలమేమి ?

శాకునికుడు—

రఘుకులంబులో రాక్షసు డున్నే
పాలకడలిలో హాలాహలమటు !
ఇతని శస్త్రహతి నిహపరములు మన
కింక లక్షింపవు !...ఇంత యధర్మమె !
ధర్మబోద్ధలున్ దరిచేరా, ఈ
దర్పితజనునకు దయ మంత్రింపగ ?

సుమంతుడు—ఆఁ! ఆఁ!...ఎవడురా అక్కడ?

౧-వ భటుడు—(ప్రవేశించి) చిత్తము. ఏమి సెలవు ?

సుమంతుడు—జాబాలి ఎక్కడ నున్నాడో తెలుసునా ?

౧-వ భటుడు—ఆయుష్మంతుడు యువరాజు తనవెంట తీసుకొనిపోయినాడు.

సుమంతుడు—మంచిది! (౧వ భటుడు నిష్క్రమించును.)

శాకునికా! ఆ భయంకరమైన మృగపక్షిఘోషల కేమిటి?...అయ్యో!

శాకునికుడు—

బ్రదుకందలచిన పక్షుల్లారా
మెదలకుండుడీ, నిశ్శబ్దం!
కలస్వనంబులు కట్టిపెట్టుడీ
అయ్యో! చస్తిని, నిశ్శబ్దం!
చప్పుడుచేసిన చావు సిద్ధమో
సకలవన్యమృగసంఘములారా,
నిలువుం డరవక నిశ్శబ్దం!
అయ్యో! చస్తిని, నిశ్శబ్దం!

(ఒక్కసారిగా అరణ్యములో మృగపక్షికలకల మాగిపోతుంది.)

సుమంతుడు—ఎంత అద్భుత మీ మృగపక్షి సంఘములోని పాలనక్రమము!

(తెరలో) ౧వ భటుడు—ప్రభూ, ఇద్దరు మునిబాలకులు యువరాజుదర్శనార్థము వేచియున్నారు.

సుమంతుడు—త్వరగా రమ్మను!

[ఇద్దరు బ్రహ్మచారులు ప్రవేశింతురు. నార చీరలు, ఎదిగిన పంచశిఖలు, మౌంజి, మేఖల, శిరః ప్రమాణపలాశదండము. బ్రహ్మవర్చస్సు అగ్నిశిఖవలె వెలుగుతూ కనిపిస్తారు. వారిని చూచి శాకునికుడు పక్కకు బెదురుతూ తొలగుతాడు. మునిబాలకులు ఎవరితో మాట్లాడవలెనో తెలియక చూస్తూ ఉంటారు.]

సుమంతుడు—ఏమిపని బ్రహ్మజ్ఞా?

౧-వ బ్రహ్మచారి—మా కులపతులు ఇక్కడ వేట చాలించమని యువరాజుకు తెలుపమన్నారు.

సుమంతుడు—మంచిది!

౨-వ బ్రహ్మచారి—ఆశ్రమానికి ఇంత సమీపములో ఈ వేట ఏమిటి? అందులో ఈ వేట ఆసురంగా ఉన్నది. వెంటనే వేట చాలించమని మా కులపతులు శాసించినారు.

సుమంతుడు—చిత్తము! యువరాజుకు తెలియ చేస్తాను!

(బ్రహ్మచారులు నిష్క్రమిస్తారు)

శాకునికా, ఆ నీటిలో గజము అంత చప్పుడు చేస్తున్నది, ఏమంటుంది!

(శాకునికుడు మాట్లాడడు. వినిపించుకోనట్లు ఉంటాడు.)

త్వరగా చెప్పు. గజభాష నీకు రాదా?

(శాకునికుడు మాట్లాడక వినిపించుకోనట్లు ఉంటాడు.)

అది గజమే కాదా ఏమి?

[దూరాన దెబ్బతిన్నవాని గొంతు తెరలో]

అయ్యో! చస్తిని...అమ్మా, నీకు ఎవరు దాహము తీసుకుపోతారు?...అబ్బా! తండ్రీ, నీ కెవరు ఉపచారము చేస్తారు?...ఆఁ!

జాబాలి—(ఆతురతతో ప్రవేశించి) యువరా జెక్కడ?...ఎక్కడ?

సుమంతుడు | నీవు ఆయుష్మంతునివెంట లేవా? ...ఆ ఆర్త స్వరము విన్నావుకదా! నా కేదో భయము కలుగుతున్నది. ఈ వేట వెంటనే చాలించమని ఇక్కడి ఆశ్రమకులపతులు శాసించినారు... ఈరథము వదల లేక ఉన్నాను...నీవు ఆయుష్మంతునివద్ద లేవా మరి?

జాబాలి—నన్ను యువరాజు దారిలో వదలి వేసి, శబ్దవేధి పట్టుకొని అరణ్యమధ్యానికి ఒంటరిగా వెళ్లినాడు.

సుమంతుడు — ఆయుష్మంతుని ఒంటరిగా అరణ్యమధ్యములోకి పోనిచ్చినావా? శబ్దవేధితో కూడానా?...అయ్యో! జాబాలీ, ఇది యువరాజు వయస్యుడు చేయదగిన పనేనా?

జాబాలి—(తలవంచుకొని) సుమంతూ, ఏమి చేసేది? యువరాజు వేగాన్ని అనుగమించలేకపోయినాను.

సుమంతుడు—ఇంతవరకూ మృగములూ పక్షులూ చేసిన కోలాహలమూ, ఇప్పటి నిశ్శబ్దతా గమనించినావా?

జాబాలి—ఆఁ! వాహా ఆశ్చర్యంగా ఉన్నదే. ఇంత మహారణ్యములోనూ భయంకరమైన నిశ్శబ్దత! చిత్రమే!

సుమంతుడు—ఆ శాకునికుణ్ణి అడుగు!...అదంతా ఆ శబ్దవేధిమహత్త్వము!...విను, అది ఆయుష్మంతుని కంఠము కాదూ?

[తెరలో దశరథుని కంఠము]

ఎంత ప్రమాదము! అయ్యో! బ్రహ్మహత్య చేసినానా? పాపిష్ఠిని!

జాబాలి—నీరసమైన మరి ఒక కంఠము విను!

[తెరలో మునిబాలకుని కంఠము]

నేను ద్విజబాలకుణ్ణి కాను! నా తల్లిదండ్రులు ఇక్కడికి ఉత్తరంగా ఆ కనపడే మర్రికింద ఉన్నారు. వారు అంధులు, వృద్ధులు. ముందు వారికి దాహమిచ్చి ఇది చెప్పు...లేకపోతే శపిస్తారుసుమా ... ఏమిటిది, గుండువలె గుచ్చుకున్నది. బాణము కాదల్లే ఉన్నదే!—ఇది లాగి నన్ను బాధలోనుంచి ముక్తుణ్ణి చేయి!... అబ్బా!

సుమంతుడు—మనము వెంటనే వెళ్లి ఆయుష్మంతుని కలుసుకోవలె. ముందు వేట చాలించమని కులపతిశాసనము ప్రకటించవలె!...ఎవడురా అక్కడ?

౧-వ భటుడు—(ప్రవేశించి) చిత్తము!

సుమంతుడు—వెంటనే వేట చాలించమని కులపతుల శాసనమైనదని ప్రకటన చేయించి ఆయుష్మంతునివద్దకు తీసుకుపోయే జాగిలాలను విడిపించు!

౧-వ భటుడు—చిత్తము! (నిష్క్రమిస్తాడు)

సుమంతుడు—జాబాలీ! నా కెంతో సిగ్గుగా ఉన్నది! మనము వెంటనుండికూడా ఆయుష్మంతునికింత ప్రమాదము రానిచ్చినాము.

జాబాలి—సుమంతూ, బుద్ధిమంతుడివి. నీ కింత వృథాసంభ్రమ మెందుకు? ఇప్పుడు యువరాజుకు వచ్చిన ప్రమాదమేమి?

సుమంతుడు—జాబాలీ, మనము మానవజన్మమెత్తినాము!...ఆ శాకునికుడు పశుపక్షిభాషలలో నిష్ణాత! వన్యసత్త్వాలు, శబ్దవేధినీ, దాని ప్రయోక్తనూ ఏమేమని నిందించినవో వింటే మనము ఆ పశుపక్షుల కంటే హీనులమైనామని తెలుస్తుంది.

జాబాలి—సుమంతూ! నీమాట లీరోజు ఉదయమునుంచీ బహుచిత్రంగా ఉన్నవి!

సుమంతుడు—శాకునికా, ఏ మనుకొని గుసగుసలాడుకుంటున్న వా మృగపక్షులు?

శాకునికుడు—

కదలకు మెదలకు కలకలలాడకు
బ్రదుకదలచితే నిశ్శబ్దం!
శబ్దవేధిచే నమసిన దుర్గతి,
చావదలచినా నిశ్శబ్దం!
తమస్సు పుట్టుక, తమస్సు లక్ష్యము,
తమస్స్వరూపము, నిశ్శబ్దం!
క్షీరాంభోనిధి శ్వేతం బున్నది,
రఘుకులంబులో రాక్షసు—

(అర్ధోక్తిలో సుమంతుని ముఖము చూచి తప్పుకొని)

నిశ్శబ్దం!

జాబాలి—సుమంత్రా, వీణ్ణి శిక్షించక చూస్తావేమీ!

సుమంతుడు—బుద్ధిమంతుడివి! వాడు కేవలము వన్యసత్త్వాల పలుకులు అనువదిస్తున్నాడు!

[తెరలో ఆర్తస్వరము]

రాజపుత్రా, మా ఏకైకపుత్రుణ్ణి యమలోకానికి పంపిన పుణ్యాత్ముడివి—ఇక మాకు జీవితంతో పనిలేదు—మాకు కూడా ఆ పుణ్యహస్తాలతో చితి పేర్చు!—నీవూ మావలె పుత్రశోకంతోనే "అయ్యో రామచంద్రా, అలో లక్ష్మణా!" అంటూ దేహము చాలిస్తే!—రాజపుత్రులకు వినోదము, తపస్వులకు ప్రమాదము!

సుమంతుడు—జాబాలీ! విన్నావా శబ్దవేధి ఫలం!

[తెరలో ప్రకటన]

"ఓహో! వేటాడేవాళ్లందరూ వినండి, ఓహో! వెంటనే అంతా వేట చాలించమని కులపతుల ఆజ్ఞ

అయిందని సుమంతులవారు ప్రకటించమన్నారోహో! అందరూ వేట చాలించండి!—ఓహోయ్!"

జాబాలి—ప్రమాదం, దురదృష్టం!

సుమంతుడు—ధర్మభ్రంశము!

[తెరలో కుక్కల సందడి, పాట]

వేటకాడు—

ప్రభువువారి పద పద్మసౌరభము
ప్రాపింతువె వడి పద్మగంధీ!
కుక్క—భౌ! భౌ! భౌ! భౌ!

(సుమంతుడు రథమును నమస్కరించి జాబాలితో ఉపక్రమిస్తాడు. రథమూ, పటకుటీరములూ కన పడవు. వనమంతా యథాప్రకారము మృగపక్షిరవము లతో మనోహరంగా ఉంటుంది. వెనక్కు తిరిగి దూరాన ఉన్న శాకునికునితో—)

సుమంతుడు—శాకునికా, ఏమిటిది!

శాకునికుడు—

కొండల గుట్టల గుహాంతరములను
కునుకులిడెడి ఘనమృగముల్,
తమస్సు విరిసెను మేల్కొనుడీ!
చెట్టుల పుట్టల చెదరి నీడములు
చేరలే కొదుగు శకునములారా,
ఎరకలు విదిర్చి ఎగురండీ!

(దశరథుడు ప్రవేశము. వెంటనే శాకునికుడు తొలిగి నిష్క్రమిస్తాడు.)

జాబాలి—రాజపుత్రా! నీ చేతిలో శబ్దవేధి ఏది?

దశరథుడు—ఆ అంధతపస్వుల చితాగ్నిలో నిక్షేపించినాను!

సుమంతుడు—జయము! రాజపుత్రా, జయము!

[ప్రవేశము ఉషాదేవి, నిశాదేవి]

ఉషాదేవి — ఆయుష్మన్! వెంటనే వేట చాలించి కులపతుల ఆజ్ఞ పాలించినందుకు సంతోషించి మా కులపతులు తమ ఆశీస్సులు పంపినారు.

(ఉషాదేవి, నిశాదేవి పుష్పాక్షతలు చల్లి మంగళహారతి ఇస్తారు.)

పండితుల కైనాను భ్రమ తప్పదే, తల్లి!
భ్రమలు తొలిగింపవే, భ్రమరాంబికా!
మాయాస్వరూపిణీ మాయమ్మ మంగళం
మంగళం ప్రభువులకు మంగళం ప్రజకు!

[తెర]

కాలగమనంపై

విశ్వవిఖ్యాతమైన
కాలిఫోర్నియా విజ్ఞానకేంద్రము

అమెరికా సంయుక్తరాష్ట్రాలలో పసిఫిక్ తీరాన ఉన్న దక్షిణ కాలిఫోర్నియా ఆ దేశములోని—ఆ దేశములోనే అని యేల, యావత్ప్రపంచములోని ముఖ్యవిజ్ఞానకేంద్రములలో నొక ముఖ్యకేంద్రమై వెలయుచున్నది. ఇటీవల కొన్ని సంవత్సరాలబట్టి చాల మంది రచయితలు, చిత్రకారులు, శిల్పులు, గాయకులు మొదలైన రకరకాల కళావేత్తలు ఆ ప్రాంతములో ఒక పెద్దకాలనీని ఏర్పాటుచేసుకొన్నారు. మొన్నటి ద్వితీయ ప్రపంచసంగ్రామము ఆరంభించినది మొదలు వారి సంఖ్య మరీ పెరిగినది.

కాలిఫోర్నియా ప్రాంతము సృష్ట్యాత్మకమైన క్రియాకలాపములకు చక్కని ఉత్తేజకమయిన ప్రదేశమనుట సర్వసమ్మతమైన సంగతి. పెక్కుమంది యూరోపియులు లాస్ ఏంజలిస్, హాలీవుడ్డు పరిసరాలలో తమ నివాసములనే ఏర్పాటుచేసుకొన్నారు. జర్మన్ గ్రంథకర్తయైన థామస్ మాన్, ఫ్రెంచినటుడైన జీన్ గేబిన్, వియెన్నా ఆర్కెస్ట్రాకండక్టరైన బ్రూనో వాల్టరు, జర్మన్ గాయకుడైన ఆటో క్లెంపరర్, హంగరీ గణితశాస్త్రవేత్తయైన థియోడార్ వాన్ కార్మన్ మొదలైన మహామహులు వారిలో కొందరు.

ఒక్క లాస్ఏంజలిస్ సీమలోనే రష్యన్, జర్మన్, స్కాండినేవియన్, పోలిష్, ఫ్రెంచ్, డచ్, టర్కిష్ పుట్టుకగలవారు వేలాదిమంది ఉన్నారు. కలసిమెలసి ఏకసంఘముగా మెలగుచున్న ఈ వర్గాల వారి ఉత్సాహోద్వేగములు ఆ యావత్సీమలోని వైజ్ఞానికాభ్యుదయమునకును మంచి ఊత నిచ్చినది.

అనేక పరిశోధనశాలలు, పెక్కు పండితమండలులు తమ ప్రజ్ఞాపరిధవములను ఈ దక్షిణ కాలిఫోర్నియాలో కేంద్రీకరించి కృషిచేయుచున్నారు. మౌంట్ విల్సన్ అబ్జర్వేటరీ (ఏటేటా 75 వేలకు పైబడినజనము దీనిని చూచిపోవుచుందురు), కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, హంటింగ్టన్ లైబ్రరీ అండ్ ఆర్టు మ్యూజియం అనునవి ఆసంస్థలలోకెల్ల ముఖ్యముగా పేర్కొనదగినవి. ఈ విఖ్యాత కేంద్రములు ఒకటికొకటి కనుచూపుమేరలో వెలసియున్నవి.

మౌంట్‌విల్సన్ వేధశాల ప్రపంచములోని మూలమూలలనుండియు అనేకులైన ఖగోళశాస్త్రజ్ఞులను విశేషముగా ఆకర్షించుచున్నది. సాండీగో వద్దనున్న పాలోమర్ పర్వతముమీద మౌంట్ పాలోమర్ అబ్జర్వేటరీని పరిపూర్తిచేయుటతో ఈ యుద్ధానంతరము ఆ ఆకర్షణ ఇనుమడించినది. ఈ క్రొత్త వేధశాలలోని దూరదర్శిని మౌంటువిల్సన్ వేధశాలలోని రిఫ్లెక్టరు ప్రభకన్న నాలుగింతల ఎక్కువదూరము అంతరిక్షములోనికి చొచ్చుకొని పోగలిగినదై యున్నది.

ఇట్లే టెక్నాలజీ ఇన్‌స్టిట్యూటుకూడ పలువురు విజ్ఞానశాస్త్రవేత్తలకు—ముఖ్యముగా భూగర్భశాస్త్రజ్ఞులకు ఆకర్షణకేంద్రమై యొప్పుచున్నది. చరిత్రపూర్వపు జంతుజాలముల ఉనికిని గురించిన అక్కడి పరిశోధనలు అపూర్వములైనవి.

'హాలీవుడ్డుబౌలు' అనబడు సంగీతనాట్యమందిరము ప్రపంచములోకెల్ల ఉత్తమమైన శ్రావ్య-దృశ్య సంగీత-నాట్యములను వినిపించి ప్రదర్శించు కళాకేంద్రమైయున్నది. ఆ మందిరనిర్మాణముకూడ అద్భుతచాతురిని చాటుచున్నది. అక్కడి సంగీత-నాట్యసభలు ఎప్పుడు జరిగినను ఆరు బయలులోనే జరుగుచుండును. ఒక్క రంగభూమిమాత్రము ప్రత్యేక నిర్మాణము గలిగి యుండును. అక్కడ జరుగు ఏసభలో చూచినను 20 వేల మందికి తక్కువ సదస్యులు కనబడరు.

హంటింగ్టన్ లైబ్రరీవంటి గ్రంథభాండాగారము మరి 'నభూతో నభవిష్యతి' అనవచ్చును. అరుదు అరుదు లిఖితపుస్తకములు అందులో ౧ లక్షలకు పైబడి ఉన్నవి. వాటి పరిశీలనకై దేశదేశాలనుండి పండితమండ

ములు పదేపదే అక్కడికి వెళ్లివచ్చుచుందురు. అందు లో ఇంకొక విశేషముకూడ. లైబ్రరీచుట్టు ఒక పెద్ద తోట; అందులో దేశదేశాలనుండి మచ్చుకని తెచ్చిన పలువిధములైన చెట్లుచేమలు పెంచబడియున్నవి. వృక్ష శాస్త్రజ్ఞులపాలికి ఇది యొక పెద్ద విజ్ఞానకేంద్రమై యొప్పుచున్నది.

ఒక విధముగా—దక్షిణ కాలిఫోర్నియా అమెరికా సంయుక్తరాష్ట్రములలోని వైజ్ఞానికాభ్యుదయమునకు అచ్చమైన దర్పణమై అలరారుచున్నది.

(దీనికి సంబంధించిన చిత్రములు స్థలాంతరమున ప్రకటింపబడినవి.)

*   *   *



ఆటంశక్తిపరిశోధనలో పాల్గొనుటకు అమెరికా అరిగిన ఆంధ్రపుత్రుడు.

శ్రీ పెమ్మరాజు అమ్మిరాజు

వీరు రాజమహేంద్రవరం వాస్తవ్యులు. అమెరికాలో ఆటంశక్తి విషయమై జరుగుతున్న పరిశోధనలో పాల్గొనుటకు గతమాసం 23-వ తేదీన ఆ దేశం వెళ్లినారు.

కాలిఫోర్నియా యూనివర్సిటీకి చెందిన రేడియేషన్ లేబరేటరీలో వీరు పరిశోధనలు సాగిస్తారు.

అమెరికావెళ్లి ఈపని నిర్వహించటానికి తాతా ఎండోమెంటువారు వీరికి రెండు సంవత్సరాలకు 10 వేల రూపాయల లోన్ స్కాలరుషిప్పు ఇచ్చారు. ఇదికాక వీరికి హోల్కార్ ఫెలోషిప్‌కూడా లభించింది.

శ్రీ అమ్మిరాజుగారు రాజమహేంద్రవరంలో నే బి. ఎస్. సి. పరీక్ష ఇచ్చి, దరిమిలాను బెనారెస్‌లో 'Doppler Effect in Positive Rays' మీద థీసిస్ వ్రాసి ఎం. ఎస్. సి. పట్టం పొందారు. పి. హెచ్. డి. కి కృషిచేస్తుండగా ఈ అవకాశం లభించింది.

*   *   *   *

భగవద్గీత: వారన్ హేస్టింగ్సుదొర

భారతదేశమునకు మొదటి గవర్నరుజనరలైన వారన్ హేస్టింగ్సుదొరను 'బర్కు' అను నాంగ్లసునీతి విమర్శకుఁడు "మహాక్రూరరాక్షసుఁడు; పరమనిరంకుశుఁడు" అని పేర్కొనియున్నాఁడు. అట్టి వారన్ హేస్టింగ్సుదొరయే మన భగవద్గీతను మొదట నాంగ్ల భాషలోఁ బ్రకటింపఁ గారణభూతుఁడై దానికిఁ దానుపోద్ఘాతము వ్రాయుచు, నందు "బ్రిటిషుసామ్రాజ్యభానుఁడు భారతాకాశమున శాశ్వతముగా నస్తమించినను, భారతదేశము నామరూపములే లేకుండ పోయినను (పాపము శమించుఁగాక !) మహోత్కృష్టమగు గీతాగ్రంథరత్నముమాత్రము చెక్కుచెదరక నిలచి తన దివ్యదీధితిఁ బ్రసరించుచునే యుండుననుట పరమసత్య"మని వాక్రుచ్చినాఁడు. ఇందుల కీతనికిఁ గృతజ్ఞత దెలుపుచు నమెరికావాసియగు థీరోబుషి "ఈ గీతానామకమగు పవిత్రామృతజలధిలోఁ బ్రతినిత్యము పరమనిష్ఠతోఁ బ్రాతఃస్నాన మొనరించి బ్రహ్మానంద మందుచుంటి" నని చెప్పుకొన్నాఁడు. ఈ గీత మన భారతామ్నాయ మందలి యొక్క తునక !

బులుసు వేంకటేశ్వర్లు.



విమర్శనము

నా జీవితయాత్ర

శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులుగారి ఆత్మకథ. ప్రథమఖండము. ప్రకాశకులు : 'శిల్పి', ౧౦ నరసింగపురమువీధి, మౌంటురోడ్డు, మద్రాసు. వెల ౩ రూ.

ప్రకాశముపంతులుగారు స్వరాజ్య పత్రికను ఆరంభము చేసేటంతవరకున్నూ స్వీయజీవితాన్ని ఈ గ్రంథములో పొందుపరిచినారు.

ఇంతవరకూ స్వీయచరిత్రలు వ్రాసుకొన్నవారు విశేషముగా సమకాలీనులనుగురించి చెప్పి తమ విషయము క్లుప్తముగా చేసుకొన్నారు. ఆ స్వీయచరిత్రల వల్ల ఆకాలపు ఇతరుల విషయాలు ఎక్కువగా తెలుస్తవి. అసలువారి విషయము బహు కొంచెమే తెలుస్తుంది. పంతులుగారి గ్రంథములో అట్లాలేదు. వారి జీవితాంశాలకే ప్రాధాన్యము ఇచ్చినారు.

ఈగ్రంథములో న్యాపతి సుబ్బారావుపంతులుగారిని గురించి వ్రాసిన విషయమున్నూ, మోచర్ల రామచంద్రరావు పంతులుగారిని గురించిన వెక్కిరింపున్నూ మాత్రము చదువరికి ఏవగింపు కలిగించకతప్పవు. వారిని గురించి తమకు ఎటువంటి అభిప్రాయము ఉన్నప్పటికిన్నీ ఆ అభిప్రాయాన్ని చెప్పడము సరసముగాలేదు.

పంతులుగారు ఏజంకూ గొంకూ లేకుండా తమ జీవితాంశాలను ఈ గ్రంథములో చెప్పుకొన్నారు. తమది స్వభావతః నిర్లక్ష్యజన్మ అని నిర్ధారణచేసుకొన్నారు. కాని గ్రంథములో వారు పొందుపరచిన విషయాలను పట్టి వారిది నిర్లక్ష్యజన్మ అనడముకన్నా నిర్భయజన్మ అనడము సమంజసముగా ఉంటుంది. ఎదుటివారు చేసిన మేలును పంతులుగారు ఎంతగా వర్ణించినారో అందుకు వారు తిరిగి చేసిన మేలును అంత తక్కువగా చెప్పినారు. ఇందుకు నిదర్శనము పీరు ఇమ్మానేని హనుమంతరావు నాయుడుగారిని గురించి ఈ గ్రంథములో వ్రాసింది. ఈ నాయుడుగారు వీరికి మార్గోపదేష్ట. ఆయనను గురించి అనేక ఘట్టాలలో ప్రశంసించినారు. ఆ నాయుడుగారికి పంతులుగారు చేసిన ప్రత్యుపకారాన్ని రెండేరెండు పంక్తులలో చెప్పినారు.

ఈ గ్రంథము వ్యావహారికాంధ్రములో ఉంది. వీరు బహుకాలము రాజమహేంద్రవరములో ఉన్నప్పటికీ గోదావరీభాష రచనలో చాలా సకృత్తుగా కనిపించింది. తెలుగు తన అభిమానభాషగా భావించి అభ్యసించి అపారకృషి చేసి చివరకు తెలుగు-ఇంగ్లీషు నిఘంటువు రచించిన గెలిటిదొర ఒంగోలు స్టేషను మొదలు గోదావరి స్టేషనువరకూ తెలుగుజనము వ్యవహరించే తెనుగుభాష (కింగ్సు ఇంగ్లీషు అన్నట్టుగా) "కింగ్సు తెలుగు"-అంటే "రాజా తెనుగు" అన్నాడు. పంతులుగారి తెనుగు నాయుడుపేట స్టేషను లగాయతూ ఏలూరు స్టేషనువరకూ తెలుగుజనము నిత్యమూ మాట్లాడేభాషలో వ్రాసినారు. ఇదిన్నీ రాజా తెనుగే. ఈ సందర్భములో ఉండబట్ట లేక ఒక్క విషయము చెపుతున్నాను. తెనుగు వ్యవహారములో "పాసివ్ వాయిస్" (కర్మణి ప్రయోగము) లేదు. అందువల్లనే చివరకు దస్తావేజులలో సయితము "నాకు ఉండుకొన్న ఆస్తి" అని వ్రాస్తారు కాని "నాకు ఉండబడిన ఆస్తి" అని వ్రాయరు. అయితే ఈనాటి రచయితలు ఆంగ్లభాషాభ్యాసమువల్లనూ, సంస్కృతము చదివినవారు ఆ భాషామర్యాదలు మనస్సుకు పట్టినందువల్లనూ కర్మణిప్రయోగాలు చేస్తూఉంటారు. పంతులుగారి గ్రంథములో కర్మణి ప్రయోగములో "పడు" ధాతువును రెండుమారులే వాడినారు. "యొక్క" అనే షష్ఠీవిభక్తి ప్రత్యయము తెనుగువ్యవహారములో లేదు. కాని రచయితలు ఇంగ్లీషుభాషలో ఆలోచిస్తారో ఏమో-"యొక్క" ప్రత్యయము లేకుండా పది పంక్తులు వ్రాయలేరు. అయితే పంతులుగారి ౨౨౪ పేజీల గ్రంథములోనూ ఒక్కచోట కూడా "యొక్క" అనేది షష్ఠీవిభక్తి ప్రత్యయముగా కనిపించలేదు. ఇది నిజముగా చాలా గొప్ప విషయమే.

ఈ గ్రంథము ౧౮౬ పేజీల వరకున్నూ మహాజోరుగా సాగింది. రోల్సు రాయిస్ కారు తారురోడ్డు మీద పోయినట్లుగా పోయినది. కాని ౨౨౪ అధ్యా-

యమునుంచి దారి తప్పింది. ఇక్కడినుంచి వ్రాసిన దంతా పట్టులేని దావాలో అన్నరు వ్రాసినట్టుగా ఉంది. ఈ అధ్యాయము పంతులుగారి జీవయాత్రలో అతిరసకందాయపు పట్టు. ఇక్కడనే రచన కుంటుపడము ఆరంభించింది. వేలకు వేలు ప్లీడరీలో గడిస్తూ రాజకీయ రంగములోకి పంతులుగారు ఉరకడమూ, ఆ తరువాత కొద్దికాలానికే స్వరాజ్య పత్రిక పెట్టడమూ నలభయిమూడు పేజీలలో వ్రాసినారు. విషయము అతి డొంకతిరుగుడుగా వ్రాసినారు. ఈ భాగము అంతా ఒకటికి పదిసార్లు చదివి చూస్తే బాగా డబ్బు గడించిన తరువాత ఒకవిధమయిన తృప్తి కలిగి ఇక రాజకీయరంగములో వీరవిహారము చేయవలె ననే కాంక్ష కలిగిన సమయములో గాంధీఉద్యమము వచ్చినందువల్ల ఆ ఉద్యమములోకి పంతులుగారు ఉరికి నట్టూ — తాను అంతటి త్యాగముచేస్తే ఆనాటి మద్రాసు ఇంగ్లీషుపత్రికలు గమనించక పోవడమున్నూ, గాంధీజీ ఉద్యమాన్ని ఆ మద్రాసు ఇంగ్లీషుపత్రికలు చులకనచేయడమున్నూ జరిగిందని విపరీతమయిన కోప మువచ్చి స్వరాజ్యపత్రికను పెట్టినట్లున్నూ తోస్తున్నది. ఇది గ్రంథములో బంతులనుబట్టి తోచిన విషయము. ఇది యథార్థము అయినట్లయితే పంతులుగారు ద్వితీయ ముద్రణములో నయినా సూటిగా వ్రాయవలెను. ఇది నిజముకానట్లయితే తిరిగి వ్రాయవలెను.

ఈ గ్రంథములో అచ్చు తప్పులు అపారముగా దొర్లినవి. పదకొండవ అధ్యాయము ఆరంభభాగము చదువుతున్నప్పుడున్నూ, అదే అధ్యాయము ౧౩౦-వ పేజీ ౮-వ పంక్తి మొదలుచేసుకొని చదువుతున్నప్పు డున్నూ ఈ గ్రంథ సంపాదకులు తమ బాధ్యతను మరిచిపోయినా రనిపించింది.

'శాలపాణి'

* * * * *

కథానికారచన

రచయిత : మొహమ్మద్ ఖాసింఖాన్, ఎం. ఏ. హైదరాబాదాంధ్రసాహిత్యపరిషత్ ప్రచురణ. ౯౨ పుటలు. వెల ఒక రూపాయి.

పత్రికాయుగం వెలసినతర్వాత విశిష్టరూపం ధరించిన కృతివిశేషాలలో చిన్నకథ ఒకటి. దీనికి 'కథానిక' అనే పారిభాషికపదాన్ని ప్రయోగించిన విమర్శకుడు శ్రీ ఇంద్రకంటి హనుమచ్ఛాస్త్రి. కథాని కనుగురించి తెలుగులో చిన్న చిన్న వ్యాసాలు చాలా వెలువడ్డాయిగాని పుస్తకరూపంలో తుణ్ణమైన చర్చ ఇంతవరకు కనబడదు. ఈ లోపాన్ని నవరించడానికి ఖాసింఖానుగారి ఈ గ్రంథం మొదటి ప్రయత్నం.

లక్ష్యలక్షణాలలో లక్ష్యం మొదటిదీ, లక్షణం తర్వాతదీ. ఉత్తమకథానికకు లక్ష్యప్రాయమైనవి పాశ్చాత్యసాహిత్యంలో వందలకొద్దీ ఉన్నవి. కేవలం చిన్నకథలతోనే సాహిత్యశిఖరాల నందుకొన్న రచయిత లెందరో ఉన్నారు. లక్షణగ్రంథాలుకూడా సమృద్ధిగానే ఉన్నాయి. వీటిలో కొన్నింటినైనా తెలుగులోనికి తెచ్చుకుండా మనే పూనిక మనలో కన బడదు. అనువాదాలవల్ల భాషావికాసానికి హానికలు గుతుం దనుకోవడం పొరపాటు. ఇతరభాషల సాహిత్యంతో రాపిడివల్ల స్వభాషలో ఉత్తమసాహిత్యం జన్మించినట్లు ఎన్నయినా నిదర్శనాలను చూపించ వచ్చును.

"కథానికారచన" ఒక లక్షణగ్రంథం. ఇందులో కథానికకు చెందిన వివిధాంగాలు దిఙ్మాత్రంగా సూ

చించబడ్డాయి. "లక్షణం ఒక చూపుడు వేలులాంటిది. రచయిత స్వప్రతిభచేత తన దారి తాను తీసుకుంటాడు. లక్షణం అతనికి దిశ చూపిస్తుంది. ఎత్తుపల్లాలు సూచిస్తుంది......దాని సహాయంతో సాహిత్యకళాకారుడు తన మార్గం తానే తీసుకుంటాడు" అని గ్రంథకర్తగారన్నారు. అనగా ఈ పుస్తకం కథానికారచనలో సిద్ధహస్తులైనవారికోసం కాదు. కొత్తగా కథలు వ్రాయడాని కుత్సహించే రచయితలకు తోడ్పడగల ప్రాథమిక పాఠ్యగ్రంథంవంటి దిది. ఈ పరిమితును మనం గుర్తిస్తే దీని ఆవరణలో గ్రంథకర్త తన విధిని తాను సామర్థ్యంతో నిర్వహించాడని నిరభ్యంతరంగా ఒప్పుకోవచ్చును.

చిన్నకథ అంటే ఏమిటో చెబుతూ, దాని పుట్టుపూర్వోత్తరాలతో ప్రారంభించి కథావస్తువు, పాత్రపోషణ, భాష మొదలైన విషయాలను వేరువేరు ప్రకరణాలలో గ్రంథకర్తగారు చర్చించారు. మారుమూలల రచయితలనుండి ఉదాహరణలు (అవీ, చాలా కొద్దిగా) తీసుకోవడంకంటె ప్రసిద్ధుల రచనలనుండి ఒక కథను గాని, కొన్ని కథలనుగాని స్వీకరించి సవిమర్శంగా చర్చిస్తే బాగుండేది. అప్పు డీగ్రంథం ఇప్పటివలె సామాన్యచర్చగాకాక ఇంకా యెక్కువ ఉపకరించగల విశేషచర్చగా రాణించేది.

మొత్తంమీద "కథానికారచన" సాహిత్యజిజ్ఞాసువుల కాదరణీయమైన గ్రంథం.

శ్రీ. శ్రీ.

* * * * *

బాల-జన్మదిన సంచిక

పిల్లల వినోద, విజ్ఞాన, ప్రబోధాలకై సంవత్సరము క్రితము ప్రారంభమైన 'బాల' ఈ ఒక్క ఏడాదిలోనే తెలుగుసీమలో గడించుకొన్న ప్రతిష్ఠకు ఈ ఉగాదిసంచిక తార్కాణమై యున్నది. తన ఆశయసిద్ధికోసము ఈపత్రిక సర్వాత్మనా పాటుపడుచున్నందుకు మా అభినందనలు. సంచిక వెల రూపాయి.

* * * * *

ఆంధ్రశిల్పి

సరికొత్త సచిత్రమాసపత్రిక. ఆంధ్రసాహిత్యానికీ, లలితకళలకూ, సంస్కృతికీ దోహదమిచ్చే సంకల్పంతో మొన్న మొన్ననే ఆగష్టు నెలాఖరున ప్రారంభమైంది. సంపాదకులు: వి. ఆర్. చిత్రా, పి. గణపతి శాస్త్రిగార్లు. కార్యస్థానం: ౧౦, నరసింగపురం వీథి, మౌంట్ రోడ్, మద్రాస్. భారతిసైజు. ౬౦ పుటలు. వెల ౧౨ అణాలు.

గ్రంథ స్వీకారము

ఆంధ్రవిప్లవం

రచయిత: నండూరి వెంకటేశ్వరరావుగారు. ప్రకాశకులు: వెంకటేశ్వర్ అండు కో., గుంటూరు. వెల ౫. రూ.

భావార్ణవము

తృతీయ తరంగము: కర్త: వెల్లుట్ల రామకృష్ణామాత్యగారు, గరిమళ్లపల్లి, వయా వరంగల్లు. అమూల్యము.

నేతాజీబోస్

బుర్రకథ. కథకుడు: మునగపాటి విశ్వనాథశాస్త్రిగారు. ప్రకాశకులు: సుందరరాం అండ్ సన్స్, తెనాలి. వెల ౬ అ.

* * *

వాగ్దత్త

శరత్ బాబు నవల. చక్రపాణి అనువాదము. వెల రూ. ౧-౧౨-౦.

పొగడదండ

కొమ్మూరు పద్మావతీదేవిగారి కథలు. వెల ౧౨ అ.

మాహారు

శరత్ బాబు నవల. 'భార్గి' అనువాదము. వెల ౧౨ అ.

మాలో మేము

కొడవటిగంటి కృష్ణమూర్తిగారి కథలు. వెల ౧ రూ.

చుక్కలూ, గీతలూ

యం. యస్. మూర్తిగారి వివిధరచనల సంపుటి. వెల ౧ రూ.

రాజూ, మంత్రీ

యం. యస్. మూర్తిగారి కథలు. వెల ౧౨ అ.

పై అన్నిటికిని ప్రకాశకులు: యువబుక్ డిపో, ఆచారప్పన్ వీథి, మద్రాసు.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., G. T., Madras. Editor—S. Sambhu Prasad.